



# పీపుల్స్‌వార్ ప్రత్యేక సంచిక

సెప్టెంబర్ 2014

9

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

కేంద్రకమిటీ సిద్ధాంత పత్రిక

# పీపుల్స్‌వార్ ప్రత్యేక సంచిక

సెప్టెంబర్ **2014**

## విషయసూచిక


1. అమరులకు జోహార్లు 3
2. సంపాదకీయం 5
3. భారత విప్లవపు అనుభవాలు మరియు సవాళ్లు
   **- గణపతి,** ప్రధాన కార్యదర్శి, సి.పి.ఐ.(మావోయిస్టు) 11
4. పి.ఎల్.జి.ఎ. సాధించిన అభివృద్ధిపై ఆధారపడదాం!
   బలహీనతలను అధిగమిద్దాం! సవాళ్లను ఎదుర్కొందాం!
   **- బసవరాజు** 27
5. వ్యూహాత్మక లంగరుగా భారతదేశ ప్రజాయుద్ధం **- అజిత్** 48
6. విప్లవోద్యమ విజయానికి హామీనిచ్చే మూడు అద్భుతాయుధాలలో
   ఐక్యసంఘటన ఒకటి **- సోను** 56
7. విముక్తి ప్రాంతాల నిర్మాణంలో గెరిల్లా బేసుల పాత్ర **- దేవ్‌జీ** 68
8. లెనిన్ గురించి స్టాలిన్ 83
9. బోల్షివీకరణను సాధించటానికి కొన్ని మౌలిక షరతులు **- స్టాలిన్** 89
10. విప్లవకర భూసంస్కరణలను చేపట్టి నూతన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థను
    నిర్మిస్తున్న క్రాంతికారీ జనతన సర్కార్లు **- మైన** 91
11. యువజనుల కోపావేశాన్ని మహత్తర విప్లవ తరంగంగా మారుద్దాం!
    **- దీపక్** 97
12. విప్లవ ప్రచార యుద్ధానికి సంబంధించి గుర్తుంచుకోవలసిన
    కొన్ని అంశాలు **- వింధ్య** 116
13. సెంట్రల్ రీజియన్‌లో పార్టీ విద్య - ఒక నివేదిక **- గౌతమ్** 128
14. దండకారణ్య సాంస్కృతిక రంగంలో మన కృషి - ఒక నివేదిక **- లేంగ్** 137
15. ప్రజావైద్యరంగంలో చారిత్రాత్మక తొలి అడుగులు **- రఫీక్** 143
16. ఎల్ఐసిలో భాగంగా శత్రువు కొనసాగిస్తున్న మానసిక యుద్ధాన్ని
    ప్రజాయుద్ధంలోని అన్ని రంగాల ద్వారా పోరాడి ఓడిద్దాం!
    - సి.ఆర్.సి. లెటర్ 1/2014 153

# అమరులకు జోహార్లు

భారత పీడిత ప్రజల, ఐక్య కార్మికవర్గ అగ్రగామి దళమైన సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పడిన సెప్టెంబర్ 21, 2004 నుండి పార్టీ ఈ దశాబ్ద కాలంలో గొప్ప త్యాగాలతో కూడిన మహత్తర విజయాలను సాధించింది. విప్లవోద్యమం ఇంతకుముందెన్నడూ లేని ఎత్తులకు ఎదిగి గొప్ప విజయాలను సాధించింది. నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం నుండి పుట్టిన రెండు ప్రధాన విప్లవ ప్రవాహాల చారిత్రక కలయికతో ఈ దశాబ్దం మొదలైంది. ఎంతో రక్తాన్ని చిందించి వేసిన మార్గం ద్వారానే ఎంతోకాలంగా ఎదురుచూస్తుండిన ఐక్యత సాధ్యమైంది. 1967 నక్సల్బరీ పోరాటకాలంలో 11 మంది విప్లవకారుల త్యాగంతో మొదలైన విప్లవబాట దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని విజయవంతం చేసే క్రమంలో పదివేల మంది అమరవీరుల త్యాగంతో మరింత ఎరుపెక్కింది. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి ఒక విప్లవ కేంద్రం ఉండి తీరాలన్న అమరుల కల సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పడటంతో సాకారమైంది.

అమరవీరులకు మరణం లేదు. వారు భావి విప్లవకారులకు విత్తనాలు. వారు ఏ విధంగా ఎటువంటి పరిస్థితుల్లో చనిపోయినప్పటికీ వారి అమరత్వాలు నూతన విప్లవకారుల పంటను పండించే విత్తనాలే. మనిషిని జీవచ్ఛవంగా మార్చే కుళ్లు వ్యవస్థను ధ్వంసం చేయటానికి వారు మృత్యువును కూడా ఆహ్వానించారు. వారి మరణం నూతన సమాజ ఆవిర్భావానికే. వారు ప్రజలకు సేవ చేయటం కోసం జీవించారు. వారి జీవితాలను ప్రజాసేవకు అంకితం చేశారు. కమ్యూనిస్టు విప్లవకారులుగా ప్రపంచ కార్మికవర్గ విముక్తి కోసం చివరి వరకూ పోరాడారు. మహోన్నత మానవుల మంచి లక్షణాలను వారు సొంతం చేసుకున్నారు. విప్లవ విజయం తర్వాత ఏర్పడబోయే కమ్యూనిస్టు సమాజపు నూతన మానవులకు వారు నవయుగ వైతాళికులు. వారు విభిన్న వర్గాల మరియు సామాజిక సెక్షన్ల నుండి వచ్చారు. కార్మికవర్గం, రైతాంగం, మధ్యతరగతి, దళితులు, ఆదివాసీలు, మత మైనారిటీలు, మహిళలు మరియు పీడిత సెక్షన్ల నుండి కూడా వచ్చారు. వారు ఏ వర్గం నుండి వచ్చినప్పటికీ వర్గపోరాటంలో రాటుదేలి కార్మికవర్గ విలువలను స్వంతం చేసుకున్నారు. వారి గొప్ప లక్షణాలైన - దృఢసంకల్పం, అకుంఠిత దీక్ష, మృత్యువును గెలిచేసే సాహసం, నిస్వార్థపూరిత లక్షణాలు మరియు వారిలోని కార్మికవర్గ విలువలకు ప్రతిరూపంగా ఉన్న వారి ఆదర్శాలను ప్రతి విప్లవకారుడు అనుసరించవలసిందే. వారి మార్గంలో ముందుకు సాగేందుకు నిరంతరం మనలను వారు ఉత్సాహపరుస్తున్నారు. అదే ఉత్సాహంతో వారి అడుగుజాడల్లో ముందుకు సాగి కర్కశమైన వర్గపోరాటంలో అనన్య త్యాగాలతో ముందుకు సాగేలా వారు మనలను ఆదేశిస్తున్నారు.

సి.పి.ఐ.(మావోయిస్టు) పదవ స్థాపనా వార్షికోత్సవాల ఈ మహత్తర సందర్భంలో పార్టీ వ్యవస్థాపక నేతలైన కామ్రేడ్ చారు మజుందార్ మరియు కామ్రేడ్ కన్హయ్ చటర్జీలతో సహా నక్సల్బరీ నాటి నుండి నేటివరకు విప్లవోద్యమంలో అమరులైన పదివేల మంది అమరులకు వినమ్రంగా శ్రద్ధాంజలి అర్పిస్తున్నాం. ఐక్య పార్టీ ఏర్పడిన నాటి నుండి ఈ దశాబ్దంలో 2332 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వారిలో 400 కంటే ఎక్కువ మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. వీరిలో భారత విప్లవపు పది మంది ప్రముఖ నాయకులు మరియు కేంద్ర కమిటీ సభ్యులు అమరులయ్యారు. పొలిట్‌బ్యూరో సభ్యులైన కామ్రేడ్స్ షంషేర్‌సింగ్ షేరీ, చెరుకూరి రాజకుమార్, మల్లోజుల కోటేశ్వరరావు మరియు సుశీల్‌రాయ్; సి.సి. సభ్యులైన కామ్రేడ్స్ చంద్రమౌళి, అనురాధా గాంధీ, పరిమళ్‌సేన్, సందె రాజమౌళి, పటేల్ సుధాకర్, సి.పి.ఐ(ఎం.ఎల్.)నక్సల్‌బరీ మాజీ కార్యదర్శి, సీనియర్ నాయకుడైన కామ్రేడ్ రవూఫ్; 34 మంది స్టేట్ కమిటీ కామ్రేడ్స్, 9 మంది రీజినల్ కమిటీ స్థాయి కామ్రేడ్స్, 132 మంది జిల్లా కమిటీ

స్థాయి కామ్రేడ్స్, 246 మంది సబ్‌జోన్, ఏరియా కమిటీ స్థాయి కామ్రేడ్స్ మరియు వందలాది మంది ప్రాథమిక పార్టీ సభ్యులు, పి.ఎల్.జి.ఎ. సభ్యులు మరియు ఐక్యసంఘటనలోని కామ్రేడ్స్, విప్లవ ప్రజలు కూడా వందలాదిగా అమరులయ్యారు. చివరి ఒక సంవత్సరంలో 120 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, పి.ఎల్.జి.ఎ., ఐక్యసంఘటన మరియు విప్లవ ప్రజలు అనన్య త్యాగాలు చేశారు.

అమరులైన కామ్రేడ్స్‌లో ఎక్కువ మంది శత్రువుతో హోరాహోరీ పోరాడుతూ, శత్రుమూకల మీద దాడులు చేసే సందర్భాల్లోనూ మరియు శత్రుదాడుల నుండి ఉద్యమాన్ని రక్షించే క్రమంలోనూ అమరులయ్యారు. కొంతమంది కామ్రేడ్స్‌ను శత్రువు సజీవంగా పట్టుకొని హత్యచేసి ఎన్‌కౌంటర్లుగా ప్రకటించాడు. హత్య చేయక ముందు వారిని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి చంపారు. వారు చెప్పుకొనే రాజ్యాంగ న్యాయ పద్ధతులను వారు బహిరంగంగా, నిర్లజ్జగా ఉల్లంఘించారు. రాజ్య ప్రాయోజిత భూస్వామ్య సేనల దాడులలో కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. మన పోరాట ప్రాంతాలలో విప్లవ ప్రతీఘాతుక గ్యాంగుల ద్వారా కొంతమంది కామ్రేడ్స్ హత్యచేయబడ్డారు. అవి మారణకాండ రూపాలను తీసుకున్నాయి. కొంతమంది కామ్రేడ్స్ తీవ్రమైన అనారోగ్యాల వల్ల మరియు దుర్ఘటనలో చనిపోయారు. కొంతమంది కామ్రేడ్స్ జైళ్లలో సకాలంలో వైద్యం అందక, వారి పట్ల జైలు (ప్రభుత్వం) అధికారులు శ్రద్ధ తీసుకోని కారణంగా చనిపోయారు. కొంతమంది కామ్రేడ్స్ విప్లవోద్యమంలో జీవితాంతం సేవచేసి వృద్ధాప్యం కారణంగా చనిపోయారు.

సి.పి.ఐ.(మావోయిస్టు) అంతర్జాతీయ కార్మికవర్గపు ఒక డిటాచ్‌మెంటు. ఈ అమరత్వాలన్నీ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగమే. వారు కేవలం దేశాన్ని ఫ్యూడలిజం, సామ్రాజ్యవాద సంకెళ్ల నుండి విముక్తిగావించేందుకు మాత్రమే గాక దోపిడీ, పీడనలేని వర్గరహిత సమాజ స్థాపన కోసం అమరులయ్యారు. ఈ సందర్భంగా కేంద్రకమిటీ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అమరులైన వారందరికీ శ్రద్ధాంజలి అర్పిస్తోంది. ఫిలిప్పైన్స్, నేపాల్, టర్కీ, బంగ్లాదేశ్ మరియు ఇతర దేశాలలోని మావోయిస్టు పార్టీల అమరులకు, ప్రపంచవ్యాప్తంగా జాతి విముక్తి యుద్ధాలలోనూ, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలలోనూ అమరులైన వారందరికీ కేంద్రకమిటీ శ్రద్ధాంజలి చెబుతోంది. ఈ సందర్భంగా రెట్టించిన దృఢసంకల్పంతో పిడికిళ్లు బిగించి, మహత్తర త్యాగాలతో అమరులు చూపెట్టిన వెలుగు దారిలో అంతిమ విజయం కోసం ముందుకు పోతామని కేంద్రకమిటీ ప్రతిజ్ఞ చేస్తున్నది.

***

యుద్ధంలో వీరోచిత త్యాగాలను ప్రోత్సహించే విధానాలను మనం ఎలా సమర్థించగలుగుతాం? “ఆత్మరక్షణ”కు దీనికి వైరుధ్యం లేదా? లేదు. ఆత్మరక్షణ-త్యాగం ఇవి ఒకే సమయంలో వ్యతిరేకమైనవి, ఒకదానికొకటి తోడ్పడేవి. యుద్ధం అంటే రక్తపాతంతో కూడుకున్న రాజకీయాలు. ఇది త్యాగాన్ని డిమాండు చేస్తుంది. కొన్ని సందర్భాలలో విలువైన త్యాగాలనే కోరుతుంది. పాక్షికమైన, తాత్కాలికమైన త్యాగం (అంటే ఆత్మత్యాగం) శాశ్వితమైన, సాధారణమైన తనను తాను కాపాడుకొనే విధానానికి తోడ్పడుతుంది. అందువల్లే, దాడి ప్రాథమికంగా శత్రు నిర్మూలనకు మాత్రమే ఉపయోగపడుతున్నప్పటికీ తనను తాను కాపాడుకోవటానికి కూడ ఉపయోగపడుతుందని చెబుతున్నాం. అందువల్లే మనం చేయాల్సింది కేవలం ఆత్మరక్షణేకాదు, ఆత్మరక్షణ తర్వాత దాడి కూడా చేయాలి.

- మావో (దీర్ఘకాలయుద్ధం)

సంపాదకీయం

# ప్రజల పట్ల ప్రేమ, శత్రువు పట్ల కసి విజయం దిశగా ముందడుగు

ఈ సంవత్సరం మనం మన నూతన, ఐక్య సిపిఐ (మావోయిస్టు) పదవ స్థాపనా వార్షికోత్సవాలను జరుపుకుంటున్నాం. 'పీపుల్స్‌వార్' సంపాదకవర్గం మొత్తం పార్టీ శ్రేణులు, పిఎల్‌జిఎ కమాండర్లు, సైనికులు, ప్రజాసంఘాల, ఆర్పీసీల నాయకులు, కార్యకర్తలకు, మన దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ విప్లవ శిబిరంలోని ప్రతి ఒక్కరికీ ఈ పండుగ సందర్భంగా హృదయపూర్వక విప్లవాభినందనలు తెలుపుతున్నది.

1925లో భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటినుండి మన దేశంలోని విప్లవోద్యమ చరిత్ర కొన్ని ఎంతో ఉజ్వలమైన కాలవ్యవధులకు సాక్ష్యంగా నిలిచింది. వీటన్నిటిలోకీ, గత దశాబ్దం అద్వితీయమైనదిగా, నక్సల్బరీ నాటి నుండి దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో కొన్ని అత్యంత ప్రముఖమైన పరిణామాలకు సాక్షిగా నిలవడమే కాక మన దేశ వర్గపోరాటాల మొత్తం చరిత్రలో గతంలో ఎన్నడూ లేని కొన్ని నూతన పరిణామాలకు కూడా సాక్షిగా నిలిచింది.

ఈ దశాబ్దానికి ఉన్న ప్రాముఖ్యతను క్లుప్తంగా ఇలా చెప్పుకోవచ్చు.

- భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఏకైక మార్గదర్శక కేంద్రం స్థాపన
- విప్లవ విజయానికి అవసరమైన మూడు మంత్రదండాలైన పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనలు గతంకంటే శక్తివంతంగా తయారు అయ్యాయి.
- ఐక్యపార్టీ డాక్యుమెంట్లు-ఐక్యతా కాంగ్రెస్ డాక్యుమెంట్లు, పాలసీ పేపర్లు, ముఖ్యమైన తీర్మానాలు, క్రోడీకరణలు, వ్యాసాలు మొదలైనవాటి రూపంలో రాజకీయ పంథా, పాలసీలు సుసంపన్నం అయ్యాయి.
- మిలటరీ పంథాను మరింతగా అభివృద్ధిపరచడం, గెరిల్లా యుద్ధాన్ని చేయడంలో ప్రముఖమైన పురోగమనాలు సాధించాం, గతంలో ఎన్నడూ లేని విధంగా విశాల ప్రజారాశులు దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో భాగస్వామ్యం వహించడం ద్వారా అది నిజమైన ప్రజాస్వభావాన్ని సంతరించుకున్నది, అలాగే అత్యంత పాశవికమైన శత్రు

అణచివేత క్యాంపెయిన్లను ఓడించడంలో సంపన్నమైన, నూతనమైన అనుభవాలు పొందాం.

- సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికీ, నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా విశాల ప్రజానీకాన్ని సమీకరించి ప్రజాఉద్యమాలను నిర్మించడంలో, ప్రత్యేకించి, జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార్ సమస్యలపై రైతాంగాన్ని కదిలించడంలో సంపన్నమైన, నూతన అనుభవాలు గడించాం.

ప్రాథమిక స్థాయిలో ఆర్పీసీల స్థాపన రూపంలో వ్యూహాత్మక ఐక్యసంఘటనను నిర్మించడంలో సంపన్నమైన, నూతనమైన అనుభవాలు, ఎత్తుగడల ఐక్యసంఘటనల నిర్మాణంలో కొన్ని మెరుగైన, నూతనమైన అనుభవాలు గడించాం. అలాగే నేటికీ ప్రాథమిక స్థాయిలోనే ఉన్నప్పటికీ ఆర్పీసీలు పాలకవర్గాల ప్రజావ్యతిరేక అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా విజయవంతంగా ప్రయోగించదగిన ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాలుగా గుర్తింపును పొందాయి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగానూ, ప్రజాయుద్ధానికి మద్దతుగానూ కూడా భారతదేశంలోని అత్యంత వైవిధ్యభరితమైన సెక్షన్ల నుండి పోరాడుతున్న విప్లవ ప్రజానీకానికి గణనీయమైన మద్దతు లభించింది.

మావోయిస్టు శక్తుల ఐక్యతకు, ప్రాథమిక స్థాయిలో అంతర్జాతీయ సంఘీభావ, మద్దతు ఉద్యమాల నిర్మాణానికి ఒకానొక ముఖ్యమైన కేంద్రబిందువుగా భారతదేశంలోని ప్రజాయుద్ధం నిలిచింది.

శ్రీలంకలో ఎల్‌టిటిఇ ని పాశవికంగా అణచివేయడం, నేపాల్ విప్లవానికి అవకాశవాద ప్రచండ-భట్టారాయ్ ముఠా ద్రోహం చేయడం అనేవి సామ్రాజ్యవాదానికీ, దేశీయ ప్రతీఘాతుక శక్తులకూ వ్యతిరేకంగా పీడిత జాతులు, ప్రజలు చేస్తున్న పోరాటంలో ఈ దశాబ్దానికి సంబంధించిన రెండు పెద్ద సెట్‌బ్యాకులుగా ఉన్నాయి. ఇదే దశాబ్దంలో మన దేశ విప్లవం, ప్రస్తుతం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ, మున్నెన్నడూ లేని స్థాయిలో ఫాసిస్టు భారత ప్రభుత్వం సామ్రాజ్యవాదుల మద్దతుతో చేపట్టిన పాశవిక, దేశవ్యాప్త నిర్బంధాన్ని తట్టుకుని నిలబడడం ద్వారా సిపిపి నేతృత్వంలోని ఫిలిప్పీన్స్ విప్లవంతో పాటుగా భారత, ప్రపంచ పీడిత ప్రజల విప్లవాకాంక్షలను సజీవంగా ఉంచగలిగింది.

గత దశాబ్దంలోని ఈ నూతన, ప్రముఖమైన పురోగమనాలను ఉజ్వలమైన నక్సల్బరీ

సాయుధ రైతాంగ తిరుగుబాటు వల్ల ముందుకొచ్చిన నూతన సిద్ధాంతం, నూతన పంథా, నూతన పార్టీ, నూతన రాజకీయాలు, నూతన సైన్యం, నూతన ప్రజాఫ్రంటుల పునాదిగానే సాధించాం. వాటికి అంతర్జాతీయ నేపథ్యంగా మావో నాయకత్వంలోని సిపిసి నేతృత్వం వహించిన గ్రేట్ డిబేట్, మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం, 60ల చివరి కల్లోల కాలాల్లో కొన్ని మూడవ ప్రపంచ దేశాల్లో పెల్లుబుకిన ప్రజాయుద్ధాలు, అనేక పెట్టుబడిదారీ దేశాల్లో పైకెగసిన కార్మిక, విద్యార్థి వెల్లువలు ఉండినాయి.

1969లో సిపిఐ (ఎం.ఎల్.), ఎంసిసి లను మన మహత్తర నాయకులు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హాయ్ చటర్జీలు స్థాపించడానికీ, 2004లో ఐక్య సిపిఐ (మావోయిస్టు) స్థాపనకూ మధ్య వ్యవసాయ విప్లవంలో భాగంగా 35 ఏండ్ల పాటు అప్రతిహతంగా కొనసాగిన సుదీర్ఘ విప్లవాచరణ, తీవ్ర వర్గపోరాటంలో భాగంగా మన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా పరిరక్షించబడింది, పరీక్షకు గురైంది, సుసంపన్నం అయ్యింది. ఇదంతా కూడా ఎడతెరిపిలేని పాశవిక శత్రు అణచివేతలను ప్రతిఘటిస్తూనే జరిగింది. ఇదే సిపిఐ (మావోయిస్టు) రూపంలో పరాకాష్టను అందుకుని గత దశాబ్దకాల నూతనమైన, ప్రముఖమైన విజయాలకు పునాదిని కల్పించింది.

రివిజనిజానికీ/నయా రివిజనిజానికీ మధ్య స్పష్టమైన విభజన రేఖను గీయడం ద్వారానే నూతన పంథా ముందుకు వచ్చి పురోగమనానికి దారి తీసినట్టే, గత 45 ఏండ్ల విప్లవపార్టీ అభివృద్ధి కూడా ఉద్యమ కీలక మలుపుల్లో పార్టీలో తలెత్తిన అతివాద, మితవాద అవకాశవాదాలకు వ్యతిరేకంగా ఒకదాని తర్వాత ఒకటిగా తీవ్రమైన అంతర్గత పోరాటాలను చేపట్టడం ద్వారానే సాధ్యమైంది.

వర్గశత్రువులకు వ్యతిరేకంగా జరిగే వర్గపోరాటంలో కమ్యూనిస్టు విప్లవకారులూ, ప్రజలూ అనేక త్యాగాలు చేశారు, చేస్తున్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు సిద్ధాంతం వేళ్లూనుకున్నప్పటి నుండి మన దేశ విముక్తి కోసం కమ్యూనిస్టు విప్లవకారులూ, ప్రజలూ కూడా ఉజ్వలమైన త్యాగాలను చేయడం అనేది మన విప్లవోద్యమ అత్యంత ప్రముఖ లక్షణాల్లో ఒకటి. ఈ దశాబ్దం సహా గత 45 ఏండ్ల కాలంలో భారత విప్లవ అసంఖ్యాక అమరవీరులు యిటువంటి ఉజ్వలమైన త్యాగాలను చేయకపోయి ఉంటే, పైన చెప్పిన ప్రముఖమైన, నూతనమైన విజయాల్లో ఏ ఒక్కదానినీ కూడా మనం సాధించలేకపోయి ఉండేవాళ్లం.

60ల చివరిలో అనేక అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య దేశాల్లో నూతన ప్రజాస్వామిక విప్లవాలూ, వలసదేశాల్లోని జాతి విముక్తి పోరాటాలూ అనుకూల వస్తుగత, స్వీయాత్మక ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో జరగడం అనే అనుకూలతను కలిగి ఉండినాయి. కానీ 1976లో మావో మరణం తర్వాత, ప్రపంచ ప్రజలు తమ చివరి సోషలిస్టు స్థావరాన్ని కోల్పోయాక, నేటి వరకు కూడా భారత దేశ విప్లవ అభివృద్ధి అననుకూల స్వీయాత్మక ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలోనే కొనసాగుతూ వస్తోంది. గత దశాబ్దంలో భారతదేశ దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి గల ప్రాముఖ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పెరగడం అనేది యిటువంటి పరిస్థితుల్లో మన విప్లవం కొనసాగడం దృష్ట్యానే జరిగింది. అయితే అనుకూల ప్రపంచ వస్తుగత పరిస్థితి నిరంతరంగా ఉనికిలో వుండడమే కాక రోజురోజుకూ పెరుగుతోంది అనే విషయాన్ని ఎంతో ముఖ్యంగా గమనంలో ఉంచుకోవాలి.

మన దేశంలోనూ, ఇతరత్రా సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ఆధ్వర్యంలో ఆయా దేశాల పాలకవర్గాలు దూకుడుగా అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక, దేశాన్ని అమ్మివేసే విధానాలు 'బాధితుల' సంఖ్యను ఎంత వేగవంతంగా పెంచేస్తున్నాయంటే ఈ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు ప్రజలను సమీకరించడానికి గతంలో ఎన్నడూ లేనన్ని అవకాశాలు విప్లవకారుల ముందుకొస్తున్నాయి.

మనం ప్రస్తుతం నిలబడి ఉన్న కఠినమైన, గడ్డు పరిస్థితి నుండి చేయి చాస్తే అందుకునేంత దూరంలో ఉన్న ఈ బ్రహ్మాండమైన, నూతన, వైవిధ్యభరితమైన అవకాశాల ముంగిట నిలబడి మనం మన విప్లవానికీ, పార్టీకీ అత్యంత ప్రముఖంగా నిలిచిన ఈ దశాబ్దానికి వీడ్కోలు పలుకుతున్నాం.

వాటిని అందుకోవడానికి మన చేతుల్లో ఒక అత్యుత్తమమైన ఆయుధం ఉన్నది. అది మార్క్సిజం-లెనినిజం-మావోయిజం. మొత్తం ప్రపంచాన్నే గెలుచుకునే శక్తి కలిగిన అత్యంత శాస్త్రీయమైన సిద్ధాంతం మనకు మార్గదర్శకంగా ఉన్నది. మన వద్ద మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను దశాబ్దాలపాటు విజయవంతంగా అన్వయించడం ద్వారా గడించిన సుసంపన్నమైన అనుభవాలు (ప్రతికూలమైన వాటితో సహా) వున్నాయి. అలాగే పారిస్ కమ్యూన్ నుండి మొదలుకొని సమకాలీన విప్లవాలు, యితర ఉద్యమాల వరకూ ప్రపంచ విప్లవం గడించిన సానుకూల, ప్రతికూల అనుభవాలు కూడా మనకు దోహదపడే విధంగా మన వద్ద ఉన్నాయి.

అందుకని ఈ కింది విషయాలను మనం ఆచరిస్తే, అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం చేయి చాస్తే అందే ఈ దూరాన్ని దాటడానికి అంత సమయం ఏం పట్టదు.

మన మార్క్సిస్టు మహోపాధ్యాయులు నేర్పిన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాన్నీ, ఈ శాస్త్రీయమైన పద్ధతినీ లోతుగా గ్రహించి, మనలో సంలీనం చేసుకుని సరిగా, సృజనాత్మకంగా  వాటిని మన నిర్దిష్ట ఆచరణకు అన్వయించడం, మొత్తం పార్టీని బోల్షివీకరించే మన క్యాంపెయిన్‌ను విజయవంతంగా పూర్తి చేయడం

మన ప్రస్తుత గడ్డు పరిస్థితికి దారి తీసిన మన లోపాలన్నిటినీ, వాటి నుండి ఎట్టి పరిస్థితిలోనూ బైటపడే లక్ష్యంతో, అన్ని స్థాయిల్లోనూ సరిగా, నిర్దిష్టంగా గుర్తించడం, వాటిని సరిదిద్దుకోవడం

మావో మనకు బోధించిన - లక్ష్యాన్ని సాధించేంత వరకూ అలుపెరగని, పూర్ణవిరామాన్ని ఎరుగని, అత్యంత కఠినమైన అడ్డంకులను, అత్యంత కఠోరమైన కష్టాలను అధిగమించగల కమ్యూనిస్టు పనిశైలిని అలవరచుకోవడం

గ్రామస్థాయి నుండి పైస్థాయి వరకూ మన పార్టీ యూనిట్ ప్రతి ఒక్కదానినీ, పార్టీ సభ్యుల్ని ప్రతి ఒక్కరినీ నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనాన్ని అత్యంత ప్రముఖమైన కర్తవ్యంగా చేపట్టే విధంగా, ఇప్పటికే మారిన పాత పరిస్థితులపై ఆధారపడి కాకుండా, ఈ అధ్యయనం ఆధారంగా మాత్రమే పని చేసే విధంగా మోటివేట్ చేయడం

ప్రజలతో లోతుగా మమేకం కావడం, ప్రజాపునాదిని బలోపేతం చేయడం, దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో వారి క్రియాశీల భాగస్వామ్యాన్ని పెంచడం

నిర్దిష్ట పరిస్థితికి తగినట్టుగా శత్రువును ప్రతిఘటించే ఎత్తుగడలు లేదా ఆత్మరక్షణా ఎత్తుగడలను చేపట్టడం

ఎంతోమంది అమరులు తమ రక్తాన్ని చిందించడం వల్లా, విప్లవ ప్రజానీకం రోజువారీగా చేస్తున్న అసంఖ్యాక త్యాగాల ఫలితంగా మాత్రమే మనం పొందిన అనుభవాల సంశ్లేషణ నుండి మనం తీసుకున్న గుణపాఠాలను ఎన్నడూ మర్చిపోకుండా ఉండడం.

కామ్రేడ్స్,

భారత ప్రజల సిసలైన అగ్రగామి అయిన మన నూతన, ఐక్య సిపిఐ (మావోయిస్టు) దశాబ్దకాల ఉజ్వలమైన, మహత్తరమైన చరిత్రను ఎత్తిపడుతూ ఈ పదేండ్ల పార్టీ స్థాపనా

వార్షికోత్సవాలను జరుపుకుందాం. ఎందుకంటే విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదు. మన దేశంలో విప్లవాన్ని విజయవంతం చేయడానికి మొట్టమొదటి, అత్యంత ముఖ్యమైన ఆ షరతును మనం పూర్తి చేశాం. అయితే సవాళ్లను స్వీకరించే విధంగా దాన్ని మనం మరింత బలోపేతం చేస్తేనే విప్లవం పురోగమించగల్గుతుంది.

తమ ప్రాణాలనూ, సర్వస్వాన్నీ ఒడ్డి అయినా సరే తమ అగ్రగామి సంస్థను పరిరక్షించుకునే కర్తవ్యాన్ని చేపట్టేలా, ఆ అవసరాన్ని గుర్తించేలా ప్రతి ఒక్క పార్టీ మెంబరునూ, పీడిత వర్గాలకు చెందిన ప్రతి ఒక్క వ్యక్తినీ చైతన్యపరచడానికి ఈ సందర్భాన్ని వినియోగించుకుందాం. ఎందుకంటే విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదు, విప్లవం లేకుండా నిజమైన విముక్తి సాధ్యమే కాదు.

ఈ ఉత్సాహపూరితమైన, ఉజ్వలమైన సందర్భంగా మరొక్కసారి మన ప్రియతమ భారత దేశ విప్లవ, ప్రపంచ సోషలిస్టు విప్లవ అమరవీరుల కలలను సాకారం చేయడానికి ప్రతిన పూనుదాం.

అందుకు మనం - మన ప్రజలను హృదయపూర్వకంగా ప్రేమిద్దాం, లెనిన్ అద్భుతంగా చెప్పినట్టుగా, ''సమిష్టి ప్రయోజనాల కోసం పని చేయడాన్ని అలవాటుగా'' చేసుకుందాం, వాటి కోసం మాత్రమే పని చేద్దాం.

అందుకు మనం - మన పార్టీనీ, విప్లవ యుద్ధాన్నీ నాశనం చేయడం ద్వారా మన ప్రజలనూ, మన దేశాన్ని, మన ప్రపంచాన్ని, మన పర్యావరణాన్ని, మన పిల్లల భవిష్యత్తునూ నాశనం చేయాలని చూస్తున్న ప్రజాశత్రువులందర్నీ మనసారా ద్వేషిద్దాం.

అప్పుడు మన అడుగులు ఇక విప్లవ విజయం దిశగానే.

**సిపిఐ (మావోయిస్టు) వర్థిల్లాలి!**

**నూతన ప్రజాస్వామిక విప్లవం వర్థిల్లాలి!**

**ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్థిల్లాలి!**

**సామ్రాజ్యవాదం, అన్ని రకాల ప్రతీఘాతుకత్వం నశించాలి!**

**మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్థిల్లాలి!**

***

# భారత విప్లవపు అనుభవాలు మరియు సవాళ్లు

- గణపతి, ప్రధాన కార్యదర్శి, సి.పి.ఐ.(మావోయిస్టు)

పార్టీ 10వ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా ఈ పది సంవత్సరాల మొత్తం ఉద్యమాన్ని బేరీజు వేస్తూ పార్టీ కేంద్ర కమిటీ ఒక సందేశాన్ని ఇచ్చింది. మనం సాధించిన విజయాలూ, పురోగమనాలను పేర్కొంటూ, భౌతిక పరిస్థితికి సంబంధించిన అనుకూల మరియు ప్రతికూల కోణాలకు అడ్డంకిగా ఉన్న బలహీనతల, పొరపాట్ల మీద కూడా దృష్టి సారించాం. ఈ వ్యాసంలో మా కేంద్ర కమిటీ మొత్తం పార్టీ ముందు ఉంచిన సందేశంలోని కొన్ని అంశాలను బేరీజు వేస్తూ కొన్ని ముఖ్యమైన అనుభవాల మీదా, మనం అధిగమించాల్సిన సవాళ్ల మీదా కేంద్రీకరించడం జరిగింది.

2004 సెప్టెంబర్ 21న సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పాటుతో భారత విప్లవ నాయకత్వానికి ఏకైక మార్గదర్శక కేంద్రం ఏర్పడింది. భారత విప్లవోద్యమంలో ఇది ఒక గుణాత్మక గెంతు. గణనీయమైన స్థాయిలో పార్టీ అభివృద్ధి చెందింది. ముఖ్యంగా నాయకత్వమూ, పి.ఎల్.జి.ఏ., ఉద్యమ ప్రాంతాలూ, ప్రజాపునాదిలో ఈ అభివృద్ధి కనిపిస్తుంది. ఈ ఐక్యత మన దేశ ప్రజల్లోనూ, అంతర్జాతీయ విప్లవ క్యాంపులోనూ మంచి ప్రభావాన్ని వేసింది. పార్టీ నూతన కేంద్ర కమిటీ నేటి ప్రపంచం లోని విప్లవపు భౌతిక పరిస్థితినీ, పార్టీ శక్తినీ అంచనా వేసి ఉద్యమ పురోగమనానికి నూతన కర్తవ్యాలను, పథకాలను రూపొందించింది.

విలీనం తర్వాత ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ జరుపుకోవడం పెద్ద విజయం. ఈ కాంగ్రెస్ భారత విప్లవపు అనుకూల అంశాలకూ మరియు 8వ కాంగ్రెస్ వారసత్వపు కొనసాగింపుగానూ, రెండు పార్టీల ఐక్యతకు వ్యక్తీకరణగానూ ఉండింది. కాంగ్రెస్ జరుగుతున్నప్పుడే మొత్తం నాయకత్వాన్ని నిర్మూలించాలనే శత్రు పన్నాగాలను ఓడించి కాంగ్రెస్‌ని విజయవంతంగా జరుపుకోగలిగాం. ప్రపంచంలోనూ, మన దేశంలోనూ చోటుచేసుకున్న ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక మార్పుల నేపథ్యంలో నాలుగు దశాబ్దాల ప్రజాయుద్ధపు అనుభవాలను కాంగ్రెస్ సంశ్లేషించింది. కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతికి కట్టుబడి లోతుగానూ, విస్తృతంగానూ, ప్రజాస్వామికంగానూ చర్చలు జరిపి పార్టీ సైద్ధాంతిక, రాజకీయ మరియు మిలటరీ అనుభవాలను అభివృద్ధి చేసి సంఘటితం చేయటం జరిగింది. కాంగ్రెస్‌లో చర్చకు వచ్చిన కొన్ని అతివాద పెడధోరణికి చెందిన వాదనలను కాంగ్రెస్ తిరస్కరించింది. కాంగ్రెస్ ద్వారా నాయకత్వం బలోపేతమై ఐక్యత పెరిగి పార్టీ దృఢసంకల్పం, పోరాట చైతన్యం మరింత పెరిగాయి.

రెండు పార్టీల విలీనం ద్వారా నూతన పార్టీలోని ఐక్యత ఆచరణలో మరింత బలపడింది. ఈ ఐక్యతను గురించి కొన్ని మావోయిస్టు శక్తులు చేసిన వ్యాఖ్యలు స్వీయాత్మకతతో, దురభిప్రాయాలతో కూడినవని మన ఆచరణ నిరూపించింది. ఐక్యత గురించి శత్రువు కుట్రతో ప్రజలలోనూ, కార్యకర్తలలోనూ సందేహాలను సృష్టించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దేశవ్యాపిత తీవ్ర దమనకాండను దృఢసంకల్పంతో కూడిన బలిదానాలతో తిప్పికొట్టి విజయాన్ని సాధించాం. కఠిన పరిస్థితుల్లో కూడా పార్టీ పంథాకు కట్టుబడి

ఉన్నాం. నాయకత్వ కమిటీలు, నాయకత్వం నష్టపోయినప్పటికీ ధైర్యంగా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నాం. సైనిక మరియు ఐక్యసంఘటన కార్యకలాపాలకు నాయకత్వం వహించటం, సమన్వయం సాధించటంలో నష్టాల మధ్యనే సానుకూల అనుభవాన్ని పొందాం. దేశంలో కోట్లాది ప్రజలను విప్లవోద్యమం ప్రభావితం చేసింది. వారిలో విశ్వాసాన్ని పెంపొందించింది. పీడిత ప్రజలకు పార్టీ ఒక ఆశాజ్యోతిగా నిలిచింది. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో ఒక భాగంగా మన పార్టీ దేశ విప్లవ పరిస్థితులకు ఎం.ఎల్.ఎం.ను సృజనాత్మకంగా అన్వయించింది. మనం దానిని కాపాడి విస్తృతపరిచాం, రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడాం. ఎం.ఎల్.ఎం. సిద్ధాంతంతో ప్రపంచంలోనూ, దేశంలోనూ మితవాద-అతివాద అవకాశవాదాలకు, కార్మికవర్గేతర ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాం. దేశ, విదేశాల్లోని విప్లవ పోరాటాల నుండి అనుభవాలను నేర్చుకున్నాం. అంతర్జాతీయ స్థాయిలో పోరాడే ప్రజలతో సంఘీభావాన్ని నిర్మించి, విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్నాం. ఈ విధంగా మన పార్టీ అంతర్జాతీయ సోషలిస్టు విప్లవంలో అంతర్జాతీయ కార్మికవర్గ దృక్పథాన్ని ఎత్తిపట్టి మన వంతు బాధ్యతను దృఢసంకల్పంతో నెరవేర్చాలనేదానికి కట్టుబడి ఉన్నాం. ఈ ఉన్నతమైన ఆశయం కోసం 2332 మంది మన పార్టీ కార్యకర్తలు, పి.ఎల్.జి.ఎ. యోధులు మరియు ప్రజలు తమ అమూల్యమైన జీవితాలను త్యాగం చేశారు. ఐక్యపార్టీ నాయకత్వంలో విశాల గ్రామీణ ప్రాంతాల్లో పి.ఎల్.జి.ఎ. ద్వారా గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయటానికి, సంఘటితం చేయటానికి, విస్తరించటానికీ, ముఖ్యంగా మధ్య, తూర్పు భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాన్ని సాధించటానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. వివిధ స్థాయిల కమీషన్లనూ, కమాండ్లనూ, డిపార్టుమెంట్లనూ ఏర్పరచి పార్టీ వాటిని నడిపించింది. ప్లాటూన్లు, కంపెనీలు మరియు బెటాలియన్ల లాంటి ఉన్నత స్థాయి ఫార్మేషన్లను నడిపించింది. కాంగ్రెస్‌లో రూపొందించిన ప్రధాన కర్తవ్య సాధనకు పి.ఎల్.జి.ఎ. 8 రాష్ట్రాల్లో గెరిల్లా యుద్ధాన్ని నిర్వహించింది. ఇవే రాష్ట్రాల్లోని కొన్ని కొత్త ప్రాంతాలకు గెరిల్లా యుద్ధాన్ని విస్తరించడం జరిగింది. గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా మార్చే ప్రయత్నాల్లో భాగంగా కొన్ని చర్యలు చేపట్టాం. పరిస్థితులకనుగుణంగా బలగాల కేంద్రీకరణ, వికేంద్రీకరణ లాంటి అన్ని స్థాయిల్లోని విన్యాసాల్లో పి.ఎల్.జి.ఎ. మంచి అనుభవాన్ని సంపాదించింది. అనేక రకాల ఎత్తుగడల ఎదురుదాడులు, క్యాంపెయిన్‌లు నిర్వహించింది. ఈ ఎదురుదాడుల్లో సెక్షన్, ప్లాటూన్, కంపెనీ, బెటాలియన్ స్థాయి బలగాల్ని కూడా మోహరించి ప్లాటూన్ స్థాయి శత్రు బలగాలను ఎక్కువసార్లు నిర్మూలించటంతో పాటు ముకరం దాడిలో కంపెనీ స్థాయి శత్రు బలగాలను నిర్మూలించడం జరిగింది. ఆధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకొని పి.ఎల్.జి.ఎ. సాయుధంగా తనకు తాను, విప్లవ ప్రజలను బలోపేతం చేసింది. యుద్ధాన్ని చేయడం ద్వారా యుద్ధాన్ని నేర్చుకున్నది. స్వంతంగా అనుభవాన్ని సంపాదించింది.

గత దశాబ్ద కాలంగా పార్టీ నాయకత్వంలోని పి.ఎల్.జి.ఎ. విప్లవోద్యమానికి వెన్నెముకగా నిలిచింది. దేశంలో మొదటిసారిగా పీడిత ప్రజల తరపున పి.ఎల్.జి.ఎ. ప్రజాయుద్ధంలో పాల్గొని వారి మనసుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించింది. గెరిల్లా యుద్ధం తీవ్రతరమై విస్తరించటంతో రాజకీయ పోరాట, పార్టీ నిర్మాణాలలో ప్రజల పాత్ర పెరిగింది. ఈ విధంగా పి.ఎల్.జి.ఎ. సంఖ్యారీత్యా బలపడి పోరాటశక్తి పెరగటంతో పార్టీ బలపడింది. ఈ కాలంలో పార్టీ

సాధించిన ప్రతి విజయానికి పి.ఎల్.జి.ఏ. నిర్వహించిన గెరిల్లా యుద్ధమే నిర్ణయాత్మకంగానూ, మద్దతుగానూ ఉండింది. ఈ కాలంలో మన దేశ రాజకీయరంగంలో కొనసాగిన వర్గపోరాటంలో పి.ఎల్.జి.ఏ. చెరగని ముద్ర వేసింది. పి.ఎల్.జి.ఏ. సాధించిన ఈ విజయాలు రాజ్యాధికార స్వాధీనానికి విశేష ప్రాధాన్యత కలిగినవిగా ఉంటాయి.

నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసుగా ఉన్న వ్యవసాయ విప్లవ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకత్వంలోని విప్లవ సంఘాలు, ప్రజాస్వామిక సంఘాల నాయకత్వంలో జరిగిన విస్థాపన వ్యతిరేక పోరాటాలు, అణచివేత వ్యతిరేక పోరాటాలు, పాక్షిక డిమాండ్ల సాధన కోసం జరిగిన వివిధ రాజకీయ ఉద్యమాలు, పోరాటాల్లో పునాది వర్గాలు, వివిధ వర్గాల ప్రజలు పెద్దయెత్తున కదలటంతో ఈ పోరాటాలు అనేక విజయాలు సాధించాయి. గొప్ప ప్రాముఖ్యత కలిగిన లాల్‌గఢ్, నారాయణపట్న ప్రజాతిరుగుబాట్లు విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాలకు ఒక నమూనాగా విశేష గుర్తింపును పొందాయి. ఇవి ఈ దశాబ్దపు పోరాటాల విశేష నమూనాగా ఉంటాయి. వివిధ సమస్యల మీద వివిధ స్థాయిల్లో ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనలను ఏర్పరచి వాటి అనుభవాలను పొందాం. ఈ క్రమంలో మనం ప్రజల చైతన్యాన్ని పెంచి ప్రజాపునాదిని బలపర్చుకున్నాం. ప్రజాపోరాటాల్లో చురుకైన వారిని రిక్రూట్ చేసుకొని ప్రజాసంఘాల్ని బలోపేతం చేశాం. ఈ పోరాటాల్లో మిలిటెంట్‌గా ముందుకు వచ్చిన శక్తులను పార్టీలోనూ, పి.ఎల్.జి.ఏ.లోనూ సంఘటితం చేసి ప్రజాయుద్ధాన్ని మరింత అభివృద్ధి చేశాం. పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఏ. మద్దతుతో పీడిత ప్రజల అధికార అంగాలైన ఆర్.పి.సి.లను దండకారణ్య, బీహార్-ఝార్ఖండ్, ఏ.ఓ.బి.లలో సంఘటితం చేసి విస్తరించాం. ఈ దశాబ్దంలో కశ్మీర్ మరియు ఈశాన్య జాతుల పోరాటాలకు మన మద్దతును పునరుద్ఘాటించాం. మన విప్లవ పోరాటమూ, మణిపూర్ జాతి విముక్తి పోరాటమూ ఒకదానికొకటి మద్దతుగా నిలిచాయి.

సాధించిన విజయాలతో పాటు బలహీనతలను, పొరపాట్లను వీక్షిద్దాం. రూపొందించుకున్న కర్తవ్యాల, నిర్మాణం చేసిన సంస్థలన్నిటి లక్ష్యం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయటమే. మన పార్టీ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తిగా సఫలం చేసే లక్ష్యంతో పాలకవర్గాలకు వ్యతిరేకంగా పి.ఎల్.జి.ఏ.కు, ప్రజలకూ నాయకత్వం వహిస్తూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని నడిపిస్తున్నది. భారత రాజ్యాన్ని ధ్వంసం చేసి దాని స్థానంలో నూతన ప్రజా ప్రభుత్వ స్థాపన (ఆర్.పి.సి.)కు సైద్ధాంతిక, రాజకీయ, మిలటరీ, ఆర్థిక, సాంస్కృతిక మరియు మనోవైజ్ఞానిక రంగాలలో దీర్ఘకాలిక సంపూర్ణ యుద్ధం చేయాలి. బలమైన శక్తిని బలహీనమైన శక్తి ఓడించాలంటే ఈ విధమైన యుద్ధం తప్ప మరో మార్గం లేదు. విప్లవ యుద్ధాన్ని అణచివేసేందుకు పాలకవర్గాలు పైన చెప్పబడిన అన్ని రంగాలతో కూడిన ప్రతీఘాతుక యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. పార్టీని మొత్తాన్ని తుడిచిపెట్టేసే లక్ష్యంతో అది కొనసాగుతోంది. ఈ ప్రతీఘాతుక యుద్ధం పట్ల మన పార్టీకి ఒక సాధారణ అవగాహన ఉంది. ఆ అవగాహనతోనే ప్రతిఘటించి ఆచరణలో విజయాలు సాధించాము. ఈ అనుభవాలను సిద్ధాంతీకరించేందుకు సకాలంలో తగినంత శ్రద్ధ చూపెట్టలేదు. శత్రువు ప్రపంచవ్యాప్త అనుభవాలతో విప్లవ ప్రతీఘాతుక యుద్ధపు (ఎల్.ఐ.సి.) వ్యూహం-ఎత్తుగడలను రూపొందించాడు. అందువల్ల మన సిద్ధాంత రూపకల్పనలో మన అనుభవాలకే పరిమితం గాకుండా విశాల

దృష్టిని కలిగి ఉండాలి. శత్రువు ఎల్.ఐ.సి. వ్యూహం-ఎత్తుగడలకు ప్రతిగా దానిని ఎదుర్కొనేందుకు ముఖ్యాంశాల మదింపుతో కూడిన పాలసీ రూపకల్పన చేయటంలో ఆలస్యం జరిగింది. ఫలితంగా శత్రువు విప్లవ ప్రతీఘాతుక యుద్ధం చాలా తీవ్రతతోనూ, విస్తారంగానూ, నిర్దిష్టతలతోనూ మరింత సమగ్రతతో కూడిన సంపూర్ణ యుద్ధమనే అవగాహనను మొత్తం పార్టీకి ఇచ్చి దానిని సంసిద్ధం చేయటంలో ఆలస్యం జరిగింది. శత్రువు అనుసరిస్తున్న కొత్త పద్ధతులనూ, సవాళ్లనూ దీటుగా ఎదుర్కొని అనుకున్న విజయాలను సాధించడంలో మనకిదొక అడ్డంకిగా ఉండింది.

శత్రు అణచివేతలో కేంద్ర కమిటీ నుండి గ్రామ స్థాయి వరకు గణనీయమైన స్థాయిలో మన పార్టీ కామ్రేడ్స్‌ని నష్టపోయాం. నాయకత్వ నష్టాలు 2005 మే నుండే ప్రారంభమైనప్పటికీ ఐక్యతా కాంగ్రెస్ తర్వాత మరింత పెరిగి 2011 చివరికి తీవ్రమయ్యాయి. పార్టీ నాయకత్వం తనను, తన కింది శ్రేణులను కాపాడుకోవటంలో చాలావరకు వైఫల్యం చెందింది. ఈ నష్టాలు నూతన ప్రజాస్వామిక విప్లవానికి మంత్రదండాలైన పార్టీ, పి.ఎల్.జి.ఏ., ఐక్యసంఘటనలను చాలావరకు బలహీనపర్చాయి. ఇదొక తీవ్రమైన వైఫల్యం.

విప్లవంలో త్యాగాలు అనివార్యం. కాని శత్రుశక్తిని ధ్వంసం చేస్తూ తన శక్తిని పెంచుకోవటం ద్వారానే అది అంతిమంగా విజయం సాధిస్తుంది. ఈ సూత్రం దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి కూడా వర్తిస్తుంది. ప్రజలు ఆయుధాలు పట్టుకొని తిరగబడి పాలకుల నిర్మూలనకు సిద్ధపడినప్పుడు పాలకవర్గాలు మరింత క్రూరంగా అణచివేతను ప్రయోగిస్తాయి. వారు మరింత క్రూరంగా, మరింత హింసాత్మకంగా విప్లవోద్యమ నిర్మూలనకు దాడి చేస్తారు. సాయుధ విప్లవానికి నాయకత్వం వహించేవారు శత్రు ప్రతీఘాతుక దాడిని తిప్పికొట్టి నిర్మూలించేందుకు తయారుగా ఉన్నప్పుడే విజయాన్ని సాధిస్తారు. పార్టీని శత్రు అణచివేత దాడుల నుండి రక్షించటం, అతివాద, మితవాద పెడధోరణుల నుంచి కాపాడి విప్లవం వైపుకు పురోగమింపజేసే కీలకమైన బాధ్యత నాయకత్వానిదే. దీర్ఘకాల ప్రజాయుద్ధంలో శత్రుదాడులను ఓడించి, ముక్కలు ముక్కలుగా శత్రువును నిర్మూలించి మెట్టుమెట్టుగా మన శక్తిని పెంచుకోవాలి.

ప్రతిఘటించే స్వీయాత్మక బలగాల అభివృద్ధితో పాటు నాయకత్వపు కొనసాగింపు విప్లవానికి ముందు షరతుగా ఉంటుంది. "భారత విప్లవపు వ్యూహం-ఎత్తుగడలు" అనే మన డాక్యుమెంటు స్వీయాత్మక బలగాల గురించీ, పార్టీ గురించీ ఇదే రకమైన గైడెన్స్ ఇచ్చింది. గత పదేళ్ల ఆచరణలో పార్టీ గణనీయమైన అభివృద్ధిని సాధించినప్పటికీ పెద్దసంఖ్యలో కేంద్రకమిటీ సభ్యులతో సహా స్వీయాత్మక బలగాలను నష్టపోయింది. గతంలో అనేకసార్లు ఈ సమస్యను కేంద్రకమిటీ చర్చించి, గైడ్‌లైన్స్‌ను రూపొందించింది. ఇంకా ఈ సమస్యను అధిగమించాల్సి ఉంది.

నక్సల్బరీ కాలంలో కేంద్ర నాయకత్వంతో సహా పెద్దసంఖ్యలో స్వీయాత్మక బలగాలను నష్టపోవటం ఆనాడు ఉద్యమ సెట్‌బ్యాక్‌కు ప్రధాన కారణమైంది. ఆంధ్ర, తెలంగాణా ఉద్యమాల సెట్‌బ్యాక్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. పెరూ ఉద్యమం మొత్తం కేంద్ర నాయకత్వం అరెస్టు కావటంతో సెట్‌బ్యాక్‌కు గురైంది. ఈ చేదు అనుభవాలు నాయకత్వాన్నీ, స్వీయాత్మక శక్తుల్ని రక్షించుకోవటం అనే ముఖ్య విషయాన్ని అవగతపరుస్తాయి. ఈ సమస్య సైద్ధాంతిక మరియు రాజకీయపరమైనది. ఈ సమస్య ఖచ్చితంగా వ్యూహాత్మక స్థాయిలో చర్చించాల్సిందే.

ఈ సమస్య శత్రు ఎల్.ఐ.సి. వ్యూహం-ఎత్తుగడలను అర్థం చేసుకొనేదానితో ముడిపడి ఉంది. ఈ సమస్య పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనను నిర్మించి బలోపేతం చేయటమనేదానితో ముడిపడి ఉంది. ఈ విషయాల పట్ల పార్టీకి సాధారణ అవగాహన ఉన్నప్పటికీ ఆచరణలో నిర్దిష్టత లోపించటమూ మరియు ఉదారవాదం వలనా తీవ్ర నష్టాలను పొందాం. గత దశాబ్దపు అనుభవాలు ఈ బలహీనతను గుర్తింపజేస్తున్నాయి. విప్లవ పరిస్థితి చాలా అనుకూలంగా ఉన్నప్పటికీ ఒక పథకం ప్రకారం స్వీయాత్మక పరిస్థితిని అనుకూలంగా మలచుకొంటూ స్వీయాత్మక బలగాలను నిరంతరాయంగా అభివృద్ధి చేస్తూ కాపాడుకోగలిగినప్పుడే విప్లవ విజయం సిద్ధిస్తుంది. నేటి ఈ పరిస్థితిలో శత్రు అణచివేత తీవ్రంగానూ, దాని పర్యవేక్షణ మరియు నిరంతరం ఆధునికతను సంతరించుకుంటున్న చొరబాటు పద్ధతులు, దానికి దన్నుగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్న పరిస్థితుల్లో మనం కూడా తప్పనిసరిగా మన శక్తి సామర్థ్యాలను పెంచుకుంటూ రహస్య నిర్మాణాలను ఏర్పర్చుకొని స్వీయాత్మక బలగాల్ని రక్షించుకునేందుకు రహస్య పని పద్ధతులు, ఎత్తుగడలను రూపొందించి వీటిని దృఢసంకల్పంతో అమలు జరపాలి. ఈ విధంగా చేయటం ద్వారా మాత్రమే మెట్టుమెట్టుగా అభివృద్ధి చెందగలం. మన పార్టీ అనుభవాలను, మార్క్సిస్టు మహోపాధ్యాయుల బోధనలను, వివిధ దేశాల విప్లవ చరిత్రల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ దిశలో ప్రయత్నాలను చేస్తూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని అజేయంగా మార్చేందుకు పార్టీని అభివృద్ధి చేసి బలోపేతం చేయాలి.

శత్రువును ప్రతిఘటించే పోరాటంలో పి.ఎల్.జి.ఎ. కొత్త అనుభవాలను పొందినప్పటికీ దాని ఎత్తుగడల మరియు పోరాట సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. శత్రు ఎత్తుగడలలో మార్పులకు అనుగుణంగా ఉద్యమాలలో వచ్చిన ఆటుపోట్లకు, సామాజిక మార్పులకు దీటుగా మన రాజకీయ, మిలటరీ ఎత్తుగడలను మార్చుకోవటం ద్వారా మనం మరింత సమర్థవంతంగా తయారౌతాం. పి.ఎల్.జి.ఎ., ముఖ్యంగా పార్టీ, మిలటరీలో ఉన్న నాయకత్వం ఉద్యమ అవసరాలకనుగుణంగా ఎదిగి గెరిల్లా సైన్యాన్ని అభివృద్ధి చేసి రాజకీయ లక్ష్యం పట్ల స్పష్టతను కలిగి ఉండి, ఉక్కు క్రమశిక్షణను ఆచరిస్తూ యుద్ధస్థాయికీ, కర్తవ్యాల పరిపూర్తికీ మంచి శిక్షణనివ్వాలి.

ప్రజాయుద్ధపు అభివృద్ధికీ, ప్రజలలో పనికీ మధ్య సంబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. వ్యవసాయ విప్లవోద్యమంలో ఆర్.పి.సి. ప్రాంతాలలో మాత్రమే గాక ఇతర ప్రాంతాలలోని రైతాంగాన్నీ, ముఖ్యంగా వ్యవసాయ కూలీలను, పేదరైతులను సమీకరించగలిగి ఉంటే గెరిల్లా యుద్ధాన్ని మరింత అభివృద్ధి చేసి ఉండేవాళ్లం. అదే విధంగా విప్లవోద్యమంలోకి గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి వర్గాన్నీ, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజానీకాన్నీ కదిలించటంలో లోటుపాట్లు జరిగి గెరిల్లా యుద్ధ అభివృద్ధిపై నెగెటివ్ ప్రభావాన్ని వేసింది.

గత పదేళ్లలో మైదాన ప్రాంతాల్లోనూ, పట్టణ కేంద్రాల్లోనూ ఉద్యమం బలహీనపడింది. గెరిల్లాజోన్లలోని రైతాంగేతర శక్తులను సమీకరించటంలో కూడా గమనించదగిన అభివృద్ధి లేదు. ఇవి రెండూ కేంద్ర కర్తవ్యాన్ని విజయవంతంగా అమలుచేయటంలో నెగెటివ్ ప్రభావాన్ని వేశాయి. కాని దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విశాల ప్రజానీకం పాల్గొన్న నందిగ్రామ్, లాల్‌గఢ్, నారాయణపట్న లాంటి ఉద్యమాలూ, ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం, విస్థాపన వ్యతిరేక ఉద్యమాల నుండి అనుభవాలను పొందాము. ఈ కొత్త అనుభవాలను స్వంతం

చేసుకొని ఖచ్చితంగా వాటి నుండి నేర్చుకోవాల్సి ఉంది. ఈ పోరాటాల సామాజిక చలనశీలతను అర్థం చేసుకునేందుకు వీటిని లోతుగా పరీక్షించాలి. వాటిలోని నూతన లక్షణాలనూ, అవి తెచ్చిన కొత్త ప్రజాసమీకరణ రూపాలనూ, ఆ పోరాటాల్లో ముందుకొచ్చిన పురోగామి శక్తులనూ, ఉద్యమాల్లో పాల్గొన్న వర్గాల మధ్య ఏర్పడిన విశాల ఐక్యతను విస్తరించి గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు విస్తరించాలి. దేశంలోని వివిధ మైదాన ప్రాంతాల్లో మార్పులను దృష్టిలో పెట్టుకొని ఆ ప్రాంతాలలో విప్లవోద్యమ నిర్మాణానికి మన విప్లవ వ్యూహం-ఎత్తుగడల డాక్యుమెంటులో పొందుపర్చిన మౌలిక ఎత్తుగడలకు గైడ్‌లైన్లు ఈ విషయాన్నే రుజువుపర్చాయి. పట్టణ పనికి సంబంధించిన మన డాక్యుమెంటు కూడా ఉంది. ఈ రెండు ప్రాంతాల వ్యూహాత్మక ప్రాధాన్యతను ఎంత లోతుగా అర్థం చేసుకున్నామనే విషయం ఈ ప్రాధాన్యత కలిగిన పనిని ముందుకు తీసుకుపోయేదానికి ఎంత కృషి చేస్తున్నామనే విషయం ద్వారానే తెలుస్తుంది. శత్రు నిర్బంధానికి తేలికగా గురయ్యే ఈ ప్రాంతాలలో పనిచేయగలిగిన స్వీయాత్మకశక్తులకు జరిగిన నష్టం వల్ల బలహీనతలకు తోడు వైఫల్యాలు కూడా కలిగాయి. సామాజిక పరిశోధన-అధ్యయనం చేయటంలో కొనసాగుతున్న లోపం కూడా ఈ బలహీనతలకు ఒక ముఖ్య కారణం.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ మరియు ఫ్యూడల్ శక్తుల దోపిడీ, అణచివేతలకు గురవుతున్న మెజారిటీ ప్రజలు మైదాన, పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నారు. ఈ ప్రాంతాలలో అనేక ఉద్యమాలు తలెత్తుతున్నాయి. ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఈ ప్రాంతాలలోని ప్రజలను అతలాకుతలం చేస్తున్నది. సమస్య లేకుండా పూటగడవని రోజు లేదు. దీనికి పోరాటం తప్ప మరో మార్గం లేదు. ఈ ప్రాంత ప్రజల మీద ప్రజాయుద్ధం ప్రభావం బలంగా ఉంది. ఈ ప్రాంతాల్లోని భౌతిక పరిస్థితి విప్లవానికి చాలా అనుకూలంగా ఉంది. కావలసింది వివిధ వర్గాల, వివిధ సెక్షన్ల ప్రజల డిమాండ్లను నిర్దిష్ట పరిస్థితులకు స్వజనాత్మకంగా అన్వయించే నైపుణ్యం. ఆ ప్రాంతాల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న అనుభవం మనకుంది. అదే విధంగా గతం తాలూకు అనుభవం నూతన పరిస్థితుల్లో పనిచేయటానికి ఉపయోగపడుతుంది. అనుభవాలను క్రోడీకరించి, శత్రు ఎత్తుగడలకు, మారుతున్న నూతన పరిస్థితులకు అనుగుణంగా కొత్త పద్ధతులు రూపొందించుకొని సృజనాత్మకంగా ఒక పథకం ప్రకారం పనిచేయగలిగితే విశాల ప్రజలను గెరిల్లా యుద్ధంలోకి కదిలించగలిగే అవకాశాలను సృష్టించగలుగుతాము, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని విశాల ప్రాంతంలో సృష్టించగలుగుతాము.

శత్రువు మనలను ప్రజల నుండి వేరుచేసి దెబ్బతీసే అణచివేత యుద్ధాన్ని కొనసాగిస్తున్న నేటి స్థితిలో మన శక్తులను కాపాడుకొని నిలబెట్టుకునే ఎత్తుగడలను మనం తప్పనిసరిగా అనుసరించాలి. శత్రువును మరింత మెరుగ్గా దెబ్బతీసేందుకు మనల్ని మనం సంరక్షించుకోవాలి. అందువల్ల మన శక్తులను సంరక్షించుకొని పెంపొందించుకునే పద్ధతులను అనుసరిస్తూ దీర్ఘకాల ప్రజాయుద్ధపు రాజకీయ, నిర్మాణ, మిలటరీ కర్తవ్యాలను నిర్వహించి మన ప్రజాపునాదిని పెంచుకోవాలి. శత్రువు పాలసీ ఏమిటంటే ప్రజల నుండి మనల్ని వేరుచేసి దెబ్బతీయాలనేది. మన పాలసీ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లి వారితో కలిసిపోయి శత్రువును దెబ్బతీయడం. ఈ అనుకూల పరిస్థితి మనకు మంచి అవకాశాల్ని ఇస్తోంది. ఈ అవకాశాల్ని ఉపయోగించుకొని సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు గురవుతున్న విశాల ప్రజానీకాన్ని వివిధ

రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, పర్యావరణ సమస్యల మీద కదిలించాలి. ఈ పోరాటాల్లో ముందుకు వచ్చిన శక్తులను రాజకీయంగానూ, సైద్ధాంతికంగానూ చైతన్యపరిచి సంఘటితం చేయాలి. ఆ విధంగా మన ప్రజాపునాదిని, స్వీయాత్మకశక్తులను పెంచుకోవాలి. శత్రువర్గాల మధ్య గల వైరుధ్యాలను ఉపయోగించుకొని ప్రధాన శత్రువును మిగతా శత్రువులతో విడదీసి దెబ్బతీసేందుకు రాజకీయ చొరవను చూపి శత్రు నాశనాన్ని త్వరితం చేయాలి. శత్రువు గెరిల్లాజోన్లలోని గ్రామస్థాయి నుండి పైస్థాయి వరకు గల ప్రజాసంఘాల, ఐక్యసంఘటనా వేదికల నాయకత్వాలను నిర్మూలిస్తూ ఉద్యమానికి నాయకత్వం లేకుండా చేయాలని చూస్తున్నాడు. ఈ శక్తులు రహస్య పద్ధతుల్లో పనిచేసి సురక్షితంగానూ, రహస్యంగానూ ఉండేందుకు వీలుగా ఈ శక్తులను గైడ్ చేయాలి. గెరిల్లా బేస్‌లలో ఆర్.పి.సి.లున్న గ్రామాలలో ఆర్.పి.సి.లను సంఘటితం చేసే క్రమంలో వర్గపోరాటాన్ని తీవ్రతరం చేసే క్రమంలో కొన్ని భూస్వామ్య దుష్టశక్తులను కంట్రోల్ చేసే విషయంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవాలి.

మనం నిర్మించిన పోరాటాలను సంఘటితం చేసే విషయంలో ఇప్పటికీ వెనుకబడిపోతున్నాం. ప్రజాపోరాటాలను నిరంతరం కొనసాగించలేని బలహీనత కూడా దీనికి తోడైంది. దీని మూలంగా ఈ సంఘాల నాయకత్వం తగినంత అభివృద్ధి కాలేక పోతున్నది. ఈ బలహీనత వల్ల రాజకీయ పోరాటాల్లో ప్రజలను కదిలించే కృషిలో పరిమితులేర్పడుతున్నాయి. ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటన నాయకత్వాన్ని ఏర్పరిచేందుకు మరింత నైపుణ్యంతో వ్యవహరించాలి. ఈ బలహీనత వల్ల మరింత మంది కార్యకర్తలను పార్టీలోకీ, గెరిల్లా సైన్యంలోకీ రిక్రూట్ చేసుకోలేక పోతున్నాం. ఉద్యమ అవసరాలకు అనుగుణంగా మరియు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపరమైన విషయాలలో అభివృద్ధిని సాధించాలి. పార్టీ కార్యకర్తలకు ఐక్యసంఘటనా ఎత్తుగడల అవసరాల కోసం మారుతున్న పరిస్థితులకు అనుగుణమైన ఎత్తుగడలను వేయటంలో శిక్షణ నివ్వాలి.

వివిధ ప్రాంతాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ప్రజల నుండి మనల్ని వేరుచేసి దెబ్బతీయాలని ప్రభుత్వం సంస్కరణలను అమలు జరిపి ప్రజల్లో భ్రమలను సృష్టిస్తోంది. శత్రు ఎల్.ఐ.సి. ఎత్తుగడలను ఓడించేందుకు మన అనుభవాల మీద ఆధారపడి తయారుచేయబడిన పాలసీని ఆధారం చేసుకొని ఎత్తుగడల కార్యక్రమాలను రూపొందించాలి. ఎడతెరిపి లేని విధంగా కొనసాగిస్తున్న శత్రు మానసికయుద్ధ ఆపరేషన్లను పార్టీ, పి.ఎల్.జి.ఏ., ప్రజాసంఘాలు తిప్పికొట్టాలి. ప్రజల్లో మనం ఎం.ఎల్.ఎం.ని, నూతన ప్రజాస్వామిక రాజకీయాలను, మన ఉద్యమం సాధించిన విజయాలను విస్తృతంగా ప్రచారం చేయాలి.

ఈ లోటుపాట్లన్నిటికీ కారణమేమంటే సైద్ధాంతిక విషయాలలో తగినంత అవగాహన లేకపోవటం, తగినంత రాజకీయ అధ్యయన లేమి, సామాజిక అధ్యయనం సరిపడినంత చేయకపోవడం, అనుభవాలన్నిటినీ మదింపు వేసుకోవటంలో లోపం, మరియు కార్మికవర్గేతర ధోరణులను తొలగించేందుకు సరిపడినంతగా రెక్టిఫికేషన్ క్యాంపెయిన్లను కొనసాగించక పోవటం. రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌ని తీసుకున్నప్పటికీ మనం అనుకున్న ఫలితాలను సాధించలేదు. కార్మికవర్గేతర ధోరణులు పార్టీలో కొనసాగాయి, దాన్ని నష్టపరిచాయి. ప్రజాయుద్ధంలో తీసుకున్న నిర్ణయాలను దృఢంగా అమలుపరిచేందుకు అనుగుణంగా సైద్ధాంతిక, రాజకీయ స్థాయిలను పెరగనీయకుండా ఈ ధోరణులు అడ్డుపడుతున్నాయి. అదే విధంగా పార్టీని,

సైన్యాన్ని, ఐక్యసంఘటనను, ప్రజలను విప్లవోద్యమంలో మరింత చైతన్యవంతమైన పాత్రను పోషించే విధంగా విద్యగరపనీయకుండా ఈ ధోరణులు అడ్డుపడ్డాయి.

ఉక్కు క్రమశిక్షణను పాటించే విషయంలో, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలుజరిపే విషయంలో, పార్టీలో రహస్య నిర్మాణం, రహస్య పని విధానాన్ని కొనసాగించే విషయంలో నాయకత్వ పద్ధతులు, పనిశైలిలలోనూ లోటుపాట్లు కొనసాగాయి. ఆలోచనలోనూ, ఆచరణలోనూ ఐక్యతను రానీయకుండా ఇవి నష్టపరిచాయి. ఎక్కువ మంది పైస్థాయి నాయకత్వాన్నీ, స్వీయాత్మక శక్తులనూ కోల్పోవటానికి ఇవి కూడా కారణాలే.

**కామ్రేడ్స్,**

ఐక్య పార్టీ ఏర్పడిన సమయంలో భారత విప్లవోద్యమం వివిధ ప్రాంతాల్లో అసమానంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సెట్‌బ్యాక్‌కు గురైన ఉద్యమాన్ని పునరుద్ధరించేందుకు ఆ సమయంలో ప్రయత్నాలు ప్రారంభించాం. దండకారణ్యాన్ని, బి.జె.ను కేంద్రప్రాంతాలుగా పెట్టుకొని ఉన్నత లక్ష్యాలను రూపొందించుకున్నాం. బెంగాల్, ఒడిషా లాంటి ఇతర ప్రాంతాల్లో వర్గపోరాటాలను అభివృద్ధి చేసేదానిపై కేంద్రీకరించాం. మిగతా అనేక రాష్ట్రాల్లో మన ఉద్యమం ప్రాథమిక స్థాయిలో ఉండింది. అనేక పట్టణాల్లో మన కార్యక్రమాలు నడుస్తుండేవి. ఈ నిర్దిష్ట స్వీయాత్మక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఐక్యపార్టీ ఏర్పడిన తర్వాత ఎత్తుగడలు రూపొందించాం. ఐక్యత తర్వాత ఏర్పడిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఐక్యతా కాంగ్రెస్ కర్తవ్యాలను రూపొందించింది. 2010 వరకు డి.కె.-బి.జె. ఉద్యమాలను కేంద్రం చేసుకొని మిగతా ఉద్యమాలు కొనసాగాయి. ఆ ఉద్యమాల అభివృద్ధి కూడా డి.కె.-బి.జె. ఉద్యమాల అభివృద్ధికి తోడ్పడింది. 2011 నుండి వివిధ రంగాలలో విజయాలు సాధించినప్పటికీ ఐక్యత తర్వాత మొదటి ఆరేళ్ల లాగా ఆతర్వాతి పరిస్థితి లేదు. 2011 నాటికి ఉద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది.

పైన పేర్కొన్న విధంగా ప్రజాయుద్ధ క్రమంలో సానుకూల, ప్రతికూల అంశాలను కొన్నింటిని చూశాం. వీటిలో విజయాలను సూచించే పాజిటివ్ అంశాలు ప్రధానం కాగా, వైఫల్యాలకు సూచికలైన నెగెటివ్ అంశాలు ద్వితీయం. ప్రధాన అంశాలు విజయాలకు, ఉద్యమాభివృద్ధికి ప్రాతిపదికగా నిలుస్తాయి. మన విజయాలు, మన ఉద్యమం సరైన పంథాలో కష్టతరమైన పోరాటాల ద్వారా దృఢ నిశ్చయంతో పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజలు ధైర్యంగా త్యాగాలతో పోరాడిన ఫలితమే. అదే విధంగా తప్పులు, లోటుపాట్లు, ఉద్యమ నిర్మాణంలో పరిమితులు ఈ వైఫల్యాలకు, గడ్డు పరిస్థితికి సూచికలే. ఈ పరిస్థితిని ఏ దృక్పథంతో ఎదుర్కొంటామనేది ముఖ్యమైన విషయం. గతంలో సెట్‌బ్యాక్‌లను అధిగమించిన గత అనుభవాలను చూద్దాం.

ఐక్యతకు ముందు కూడా ఉద్యమం వివిధ ప్రాంతాల్లో అసమానంగా ఉన్న పరిస్థితిలో కూడా మనం విజయాలను, పురోగమనాన్ని సాధించాం. ఈనాడు కూడా ప్రతికూల పరిస్థితిని ఎదుర్కోవటం ద్వారానే ఉద్యమంలోని అసమంజస స్థితిని దాటి ముందుకు పోవాలి. మన పార్టీ చరిత్ర విప్లవోద్యమం ప్రతికూల పరిస్థితులెదుర్కొన్నప్పుడు వాటిని అధిగమించిన విషయాన్నే రుజువు చేస్తోంది. అలాగే నూతన పరిస్థితులలో విప్లవానికి అనుకూల పరిస్థితులను ఉపయోగించుకొని విప్లవ శక్తులు తీవ్రమైన కృషి చేయటం ద్వారానే బలమైన శత్రువును

ఎదుర్కొని ముందుకు పోగలం.

మన పార్టీ సైద్ధాంతిక, రాజకీయ మరియు మిలటరీ పంథా సరిగానే ఉంది. దీర్ఘకాలిక ప్రజాయుద్ధపు విజయం ఈ విషయాల మీదనే నిర్ధారించబడుతోంది. మన లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఆచరణలో పొరపాట్లు, లోటుపాట్లు జరిగి తాత్కాలిక వైఫల్యాలు, కఠిన పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ ఎం.ఎల్.ఎం. వెలుగులో రాజకీయ, నిర్మాణ, మిలటరీ కార్యకలాపాలను మన పంథాకు కట్టుబడి వాటిని సరిదిద్దుకోగలం. మరోసారి విజయం వైపు పురోగమించగలం. 1970లలో ఉద్యమం దేశవ్యాప్త సెట్‌బ్యాక్‌కి గురైన సమయంలో మన పార్టీ ఈ వైఖరినే చేపట్టింది. భిన్న దృక్పథాలను చేపట్టిన వారు భారత విప్లవ చిత్రపటం నుండి త్వరలోనే అదృశ్యమయ్యారు లేదా నామమాత్రపు ఉనికిని కలిగి ఉన్నారు. అనేక దేశాల్లోని విజయవంతమైన, ఓటమి చెందిన అనుభవాల నుండి ఈ దృక్పథం సరైందని నిరూపితమవుతున్నది. నేటి పరిస్థితులలో ఉద్యమాన్ని పురోగమింపజేయటానికి పార్టీ ముందున్న కీలకమైన కర్తవ్యమేమంటే గడ్డు పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొని దాన్ని అధిగమించేలా పార్టీనంతటినీ మలచటమే. దీనికోసం మన గత అనుభవాలను, పాఠాలను తీసుకొని అన్ని స్థాయిల్లో వాటిని చర్చించాలి. అన్ని స్థాయిల కామ్రేడ్స్ ఖచ్చితంగా వారి అనుభవాలను చర్చించి వారి తప్పులను గ్రహించి వాటినుండి బయటపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

మనం మార్క్సిస్టు మహోపాధ్యాయుల రచనలను చదవాలి. మనం విజయాలనూ, పురోగమనాన్ని మాత్రమే చూసి వైఫల్యాలనూ, కఠిన పరిస్థితులను చూడకపోయినా లేదా వైఫల్యాలనూ కఠిన పరిస్థితులను మాత్రమే చూసి విజయాన్ని, పురోగమనాన్ని చూడకపోయినా గత తప్పుల నుండి బయటపడక నిరాశావాదానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది.

ఉద్యమ గడ్డు పరిస్థితికి సంబంధించి సి.సి. చేసిన సమీక్షలు, రీజినల్ బ్యూరోలు, రాష్ట్ర కమిటీలు రూపొందించిన సమీక్షలను పార్టీ కింది స్థాయి వరకు క్యాంపెయిన్ రూపంలో తప్పనిసరిగా తీసుకుపోవాలి. ఈ పాటికే కొనసాగుతున్న ఈ ఉద్యమాన్ని గమనించాలి. మన సైద్ధాంతిక, రాజకీయ, మిలటరీ, నిర్మాణ, సాంస్కృతిక స్థాయికి జవసత్వాలను నింపటం ద్వారా ప్రస్తుత గడ్డు పరిస్థితిని అధిగమించగలం. ఈ లక్ష్యంతో చేపట్టిన బోల్షివీకరణ క్యాంపెయిన్‌కు ఈ సమీక్షలను జతచేసి శిక్షణనివ్వాలి. ఈ సందర్భంగా పార్టీ చరిత్ర, రష్యా-చైనా విప్లవాల చరిత్రలు, పెరూ, ఫిలిప్పైన్స్, నేపాల్ దేశాల విప్లవాల చరిత్రలు, ఇంకా ఇతర దేశాల విప్లవాల చరిత్రలు కేంద్రకమిటీ, రాష్ట్రకమిటీలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ప్రతి సభ్యుడూ, ప్రతి యూనిట్ పార్టీ చరిత్రను తప్పనిసరిగా చదవాలి. నాయకత్వం పై యూనిట్ నుండి కింది యూనిట్ వరకు మన పార్టీ చరిత్రను అధ్యయనం చేసేలా గైడ్ చేయాలి. మన పార్టీ విప్లవోద్యమ చరిత్రపై, ప్రపంచ విప్లవాల అనుభవాలపై నాయకత్వం శిక్షణ గరపాలి. పార్టీ నిర్మాణానికి సంబంధించిన మరొక ముఖ్యమైన కర్తవ్యమేమంటే పార్టీ క్వాలిటీని పెంచటం, కొత్తవారికి పార్టీ సభ్యత్వమిచ్చేటప్పుడు, వారిని పూర్తికాలం విప్లవకారులుగా తయారుచేసేటప్పుడు, ప్రమోషన్లను ఇచ్చేటప్పుడు మనం తప్పనిసరిగా క్వాలిటీకి ప్రాధాన్యతనివ్వాలి. ప్రజాసంఘాల నుండి చురుకైన వారిని ఎన్నుకొని వారికీ, పి.ఎల్.జి.ఎ.లో పార్టీ సభ్యులు కానివారికి పార్టీ ప్రణాళికకనుగుణంగా శిక్షణను, సభ్యత్వాన్ని ఇవ్వాలి. కొత్త సభ్యులను పార్టీలో చేర్చుకోవటం ద్వారా పార్టీని పెంచగలిగాం. పార్టీని పెంచటం మాత్రమే

గాక కొత్తవారికి అనుభవాలను అందించాలి. పార్టీ క్వాలిటీని పెంచటానికి ఎం.ఎల్.ఎం. సిద్ధాంతంపై అధ్యయనం, శిక్షణల క్యాంపెయిన్ నిర్వహించాలి. సైద్ధాంతిక, రాజకీయ కృషిని పెంచేందుకు నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేసి సృజనాత్మకంగా అన్వయించే విషయంలో చర్చలు చేయాలి. పార్టీ కమిటీల పని పద్ధతులు, పనిశైలిలను మెరుగుపర్చుకొని కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సక్రమంగా అమలు జరపాలి. ఎత్తుగడల అమలులో జరిగిన పొరపాట్లను, సైద్ధాంతిక రాజకీయ విషయాలపై కేంద్రీకరించి తప్పుడు ధోరణుల మీద విమర్శ, స్వీయ విమర్శలను జరపాలి. పార్టీ కమిటీలు ప్రతి పనిలోనూ రాజకీయాలను ఆధిపత్యంలో ఉంచాలి. వర్గపంథాను, ప్రజాపంథాను తప్పనిసరిగా అమలుజరపాలి. లక్ష్యం పట్ల స్పష్టత, ప్రవాహానికి ఎదురీదే విప్లవోత్సాహం, శత్రువు పట్ల, కార్మికవర్గ వ్యతిరేక ధోరణుల పట్ల జాగరూకత, రూపొందించుకున్న పాలసీకి కట్టుబడి పనిచేయటం, దృఢసంకల్పంతో సాహసోపేతంగా లక్ష్యసాధన కోసం పోరాడటం, నిస్వార్థంగా మెరుగైన, గొప్ప, వేగవంతమైన, తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాన్ని సాధించగలిగే పనిశైలి మొదలగు అంశాలను ప్రతి కమిటీ, ప్రతి కమిటీ మెంబరూ కర్తవ్యంగా పెట్టుకొని వీటిని సాధించేందుకు తీవ్రంగా కృషి చేయాలి. నష్టాలు పొందిన తర్వాత పార్టీ కమిటీల కాంపోజిషన్‌లో వచ్చే మార్పులను సరిదిద్దేందుకు, ఆ కమిటీల సామర్థ్యాన్ని, బలాన్ని పెంచేందుకు ప్రతి స్థాయిలోనూ సెకండరీ నాయకత్వానికి శిక్షణ నిచ్చేందుకు విశేష కృషి చేయాలి. బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా పార్టీ నిర్మాణంలో పైన వివరించిన పద్ధతులన్నీ ఖచ్చితంగా పాటించాలి. ఈ క్యాంపెయిన్‌ని విజయవంతం చేయటం ద్వారా సైద్ధాంతిక, రాజకీయ స్థాయినీ, పార్టీ నిర్మాణంలో ఐక్యతనూ పెంచుకోగలుగుతాం. దాని ద్వారా సామర్థ్యాలను పెంచుకొని ప్రజాపునాదిని పెంచుకొని పి.ఎల్.జి.ఎ.కు, ప్రజలకు సమర్థవంతంగా నాయకత్వం వహించి ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయాలి.

ఉద్యమ అభివృద్ధికి అనుకూల పరిస్థితులతో పాటు విప్లవ శక్తుల బలం కూడా తగినంతగా ఉండాలి. అయితే విప్లవ శక్తుల శక్తి తక్కువగా ఉన్నప్పుడు దృఢసంకల్పంతో సరైన రాజకీయ నిర్మాణ పద్ధతులను మనం అవలంబిస్తే ఈ అనుకూల పరిస్థితులలో స్వల్పకాలంలోనే విప్లవశక్తుల్ని పెంచుకోగలుగుతాం. మన గత అనుభవాలే దీనికి రుజువు. ఈ విషయాన్ని గమనంలోకి తీసుకోకుండా జడాత్మక దృక్పథంతో మన విప్లవ శక్తులు బలహీనంగా ఉన్నాయనే నిరాశావాదపు ఆలోచనకు గురైతే ఈ రోజు మనం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితులను అధిగమించలేము. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా బలహీనమైన శక్తి బలమైన శక్తిగానూ, బలహీనమైన ఉద్యమాలు బలమైన ఉద్యమాలుగానూ మారుతాయనే విషయాన్ని మనకు బోధిస్తుంది.

రష్యా విప్లవం విజయవంతం కాకముందు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్కుల వంటి నిజమైన విప్లవకారులు మైనారిటీగా ఉంటే రివిజనిస్టులే మెజారిటీగా ఉండేవారు. అక్టోబర్ విప్లవ విజయం రెండవ ఇంటర్నేషనల్ రివిజనిజానికి అంతం పలుకగా కమ్యూనిస్టు పార్టీలు, విప్లవాల పుట్టుకకు పెద్ద ఊపునిచ్చింది. కృశ్చేవ్ రివిజనిజం ఆవిర్భావం తర్వాత మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ పక్షాన కొన్ని పార్టీలే నిలిచాయి. సాంస్కృతిక విప్లవం తెచ్చిన శక్తివంతమైన ఊపుతో కొత్త పార్టీలు, విప్లవాలు వచ్చాయి. మన పార్టీ, కొన్ని ఇతర మావోయిస్టు పార్టీలు దాని కొనసాగింపే.

మరలా చైనాలో రివిజనిస్టు డెంగ్ అధికారం చేజిక్కించుకున్న తర్వాత కొన్ని పార్టీలు మాత్రమే వారికి వ్యతిరేకంగా నిలిచాయి. ఆ పోరాటం పెరూ, నేపాల్ విప్లవాల పుట్టుకకు దోహదపడింది. పెరూ విప్లవం సెట్‌బ్యాక్‌కు గురికాగా, నేపాల్ విప్లవం నయారివిజనిజంతో విద్రోహానికి గురైంది. ఆ పాఠాలు మన ముందు ఉండనే ఉన్నాయి. విప్లవాన్ని ముందుకు తీసుకుపోవటం ద్వారా అనుకూల పరిస్థితుల్లో పురోగామిశక్తులను ఇముడ్చుకొని సామ్రాజ్యవాదాన్నీ, ప్రతీఘాతకులనూ, వారి తోకలైన రివిజనిస్టులను ఓడించగలం. విప్లవ మార్గంలోనే దృఢంగా ముందుకు సాగిపోతూ కార్మికవర్గ సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం బలంతో విప్లవ మార్గానికి కట్టుబడి ముందుకు పోవటం ద్వారా ఎదురవుతున్న సవాళ్లను, అవరోధాల్ని అధిగమించగలం.

సామ్రాజ్యవాద వ్యవస్థలోని ఆర్థిక సంక్షోభం 2008 నుండి మరింత తీవ్రంగా కొనసాగుతోంది. పీడిత దేశాలలోని మరియు సామ్రాజ్యవాద దేశాల్లోని ప్రజలు మరలా మరలా పోరాటాలకు దిగుతున్నారు. దీర్ఘకాల ప్రజాయుద్ధాలు కొనసాగుతున్నాయి. మన నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి ప్రపంచవ్యాప్తంగా విశాల మద్దతు లభించింది. ప్రచండ, భట్టారాయ్‌ల విద్రోహాన్నీ, అవాకియనిజం విచ్ఛిన్నకరతత్వాలను అధిగమిస్తూ మావోయిస్టు శక్తుల ఐక్యత పెరుగుతోంది. ఈనాటి ప్రపంచ పరిస్థితి విప్లవాలు చెలరేగేందుకు గల శక్తివంతమైన అనుకూల పరిస్థితిని తెలియజేస్తోంది. ఈ విషయంలో కూడా మనం అనుకూల భౌతిక పరిస్థితికి వెనుకబడే ఉన్నాం. విప్లవానుకూల భౌతిక పరిస్థితికీ, మావోయిస్టు స్వీయాత్మకశక్తుల బలానికీ మధ్య పెద్ద గండి ఉంది. ఇదొక వైరుధ్యం. దీనికి మనం ప్రధానంగా విప్లవ యుద్ధాన్ని కొనసాగిస్తూ విజయానికి పురోగమించాలని ప్రపంచ విప్లవాల చరిత్ర మనకు చెబుతోంది. ఈ బృహత్తర బాధ్యత మన మీద ఉంది.

సమాజంలో జరిగే వర్గపోరాటానికి ప్రతిబింబంగా పార్టీలో అనేక అభిప్రాయాల మధ్య ఘర్షణ ఉంటుంది. సాధారణంగా ఉద్యమాలు కష్టాలను ఎదుర్కొంటున్నప్పుడు పార్టీలో అతివాద అవకాశవాదమూ, మితవాద అవకాశవాద ధోరణులు ఎక్కువగా వస్తాయని మనం గమనంలో ఉంచుకోవాలి. మనం జాగరూకతతో ఉండక ఈ ధోరణులకు వ్యతిరేకంగా సకాలంలో పోరాటం చేయకపోతే ఎక్కువ నష్టాలకు గురవుతాం. మనం విప్లవ శక్తుల బలాన్ని అతిగా అంచనా వేసుకొని శత్రుబలాన్ని తక్కువగా చూసే అతివాద తప్పుల వల్ల మనం నష్టాలకు గురవుతాం. శత్రుబలాన్ని ఎక్కువగా అంచనా వేసి మన బలాన్ని తక్కువగా అంచనా వేసే మితవాద తప్పుల వల్ల కూడా పార్టీ నష్టపోతుంది. నేడు ఈ రెండవ ధోరణే ప్రధాన ప్రమాదంగా ఉంది. మనం పార్టీలో అంతర్గతంగా సరైన పార్టీ పద్ధతుల ద్వారా ఈ రెండు ధోరణులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. పార్టీలో ఉండే ప్రతి భిన్నాభిప్రాయాన్నీ మౌలిక లేదా లైనుకు సంబంధించిన అంశంగా మనం చూసి అంతంలేని చర్చకు పూనుకోరాదు. అటువంటి అభిప్రాయాలు మన పార్టీ ప్రణాళికకు అనుగుణంగా సరైన పద్ధతుల్లో ఆయా కమిటీల్లో చర్చించాలి. ఈ పద్ధతులే పార్టీలో తలెత్తుతున్న భిన్నాభిప్రాయాలను పరిష్కరించుకునేందుకు సరైన పద్ధతి. కొంతమంది కష్టతరమైన దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో ముందుకు సాగే సంసిద్ధతనూ, త్యాగం చేయాలనే సంసిద్ధతనూ కోల్పోయారు.

శత్రుశక్తి ఎల్లకాలం బలంగా ఉంటుందనీ, ప్రజల బలం ఎల్లకాలం బలహీనంగా ఉంటుందనీ వారు అంచనా వేస్తున్నారు. వారు ఇలాంటి దివాలాకోరు వాదనలను చేస్తూ శత్రువుతో చేయి కలుపుతున్నారు. అలాంటి విద్రోహులకు వ్యతిరేకంగా మనం తీవ్రంగా పోరాడాలి.

ఇటీవలి కాలంలో కొంతమంది వ్యక్తులు మన సమాజంలో అర్ధభూస్వామ్య సంబంధాల స్థానంలో పెట్టుబడిదారీ సంబంధాలు వచ్చాయనీ, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా ఈ దేశానికి సరిపడదనే లాంటి వాదనలను తెచ్చారు. వారిలో కొందరు సార్వత్రిక తిరుగుబాటు పంథా (Insurrection)యే సరైందని అస్పష్టమైన వాదనలు చేస్తున్నారు. 30 ఏళ్ల కిందట కమ్యూనిస్టు లీగ్ ఆఫ్ ఇండియా ఇదే అవగాహనతో పంథాని రూపొందించుకుంది. ఇన్ని సంవత్సరాలుగా అది ఆచరణలో ఎటువంటి అభివృద్ధిని సాధించలేదు. ఈ ధోరణిని పూర్తిగా నిరాకరించాలి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అనేక పీడిత దేశాలలో అమెరికా నాయకత్వంలోని నయావలసవాదుల, వారి తైనాతీల ప్రయోజనాలకు అనుగుణంగా అనేక మార్పులు తెచ్చారు. అయినప్పటికీ ఈ దేశాలలో తలెత్తిన జాతి విముక్తి పోరాటాలు లేదా నూతన ప్రజాస్వామిక విప్లవాలు అన్నీ ఈ రోజుకు కూడా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలోనే సాగుతున్నాయి. ఈ దేశాల అర్ధవలస, అర్ధభూస్వామ్య స్వభావం వల, వాటిలో అవే మౌలిక వైరుధ్యాలుండటం వల్ల ఇది సాధ్యమైంది. మన దేశంలో కూడా దశాబ్దాలుగా నూతన ప్రజాస్వామిక విప్లవం కొనసాగటానికి ఇవే కారణాలుగా ఉన్నాయి. ఈ సామాజిక సంబంధాలుండటం వల్లనే ప్రజలు ఈ విప్లవాల్లో చేరుతున్నారు. 1947 తర్వాత మన దేశ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక తదితర రంగాల్లో గణనీయమైన మార్పులొచ్చాయి. అయినప్పటికీ సమాజ మౌలిక స్వభావంలో గుణాత్మమైన మార్పు రాలేదు. మన దేశపు నూతన ప్రజాస్వామిక విప్లవం ఈ చారిత్రక నిజాన్నే చాటుతోంది. అందువల్ల వాస్తవాలతో సంబంధం లేని తప్పుడు వాదనలను తిరస్కరించి వాటిని బహిర్గతం చేయాలి.

ఏ దేశంలోనైనా, సమాజంలోనైనా వర్గ వైరుధ్యాలు, వర్గపోరాటాలు ఎక్కడైతే నిరంతరం పదునెక్కుతుంటాయో అక్కడే మార్పులు కూడా కొనసాగుతాయి. మన దేశంలో కూడా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లోనే కాక విప్లవాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ట్రాన్స్‌పోర్టు, కమ్యూనికేషన్, మీడియా, టెక్నాలజీ, యుద్ధకళ, టోపోగ్రఫీ, పట్టణ గ్రామీణ జనాభా నిష్పత్తి, లెజిస్లేచర్, అధికార యంత్రాంగం, న్యాయవ్యవస్థ వంటి వాటిలో మార్పులు జరిగాయి. నూతన ఆర్థిక విధానాల కాలంలో దేశవ్యాప్తంగా అసమాన అభివృద్ధిలో భాగంగా ఈ మార్పులు అసమానంగా చోటు చేసుకున్నాయి. మనం మన రాజకీయ, మిలటరీ పంథాకు దృఢంగా కట్టుబడి మన వ్యూహం-ఎత్తుగడలకు ఈ మార్పులకు గల గతితార్కిక సంబంధాలను దృష్టిలో పెట్టుకొని ఈ మార్పులను అధ్యయనం చేయాలి. ఈ మార్పులు మన వ్యూహంలోని కొన్ని అంశాలను ప్రభావితం చేస్తున్నాయి. అందువల్లనే మన వ్యూహాన్ని సృజనాత్మకంగా అన్వయిస్తూ మన ఎత్తుగడలను అభివృద్ధి చేసుకోవాలి. మనం మన నినాదాల్లోనూ, నిర్మాణ పోరాట రూపాలలోనూ ప్రజాయుద్ధంలో విశాల ప్రజానీకం కదలటానికి ఆటంకంగా ఉన్న అంశాల మీద అవసరమైన మార్పులు చేసుకోవాలి. ఇది గతంలోనే

చేసుకోవాల్సి ఉండే. మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్న నేటి పరిస్థితిలో ఇది తప్పనిసరి అవసరం. వర్గపోరాటం భీకరంగా కొనసాగుతున్నప్పుడు పరిస్థితుల అధ్యయనమూ, పరిశోధన, దాని కనుగుణమైన ఎత్తుగడలను అభివృద్ధి చేసుకోవటమూ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది.

మన దేశం విషయంలో మరో కోణంలో కూడా ఈ మార్పులను అధ్యయనం చేయాలి. మన దేశంలో వివిధ రంగాలలో చోటు చేసుకున్న మార్పులు నయావలసవాద దోపిడీ, అణచివేత, సామ్రాజ్యవాద అదుపుల వల్ల జరిగాయని అర్థం చేసుకోవాలి. దీనిపై ఆధారపడి మన ఎత్తుగడలు ఏ దిశలో ఉండాలో నిర్ణయించుకోవడం అవసరం.

మనం వ్యూహం-ఎత్తుగడలలో చెప్పబడిన విధంగా దేశంలోనూ, ప్రపంచంలోనూ దృగ్గోచర విషయాలను నిరంతరం అధ్యయనం చేయటమూ, ఎం.ఎల్.ఎం. వెలుగులో వాటిని పరిశోధించటమూ, విశ్లేషించటమూ, వాటిని మదింపు వేసి మొత్తం పార్టీని ఎడ్యుకేట్ చేయడమూ, విశాల ప్రజారాశులను పోరాటాల్లోకి కదిలించి పోరాట రూపాలనూ, నిర్మాణ రూపాలనూ అభివృద్ధి చేసుకోవటం అత్యంత అవసరం. పరిస్థితులతో సంబంధంలేని ఎత్తుగడలను మనం అమలుజరిపితే ఆమేరకు ఉద్యమం నష్టపోతుంది. ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో అటువంటి పొరపాట్లే చేశామని గతంలోనే సమీక్షించుకున్నాం. గత దశాబ్దంలో అటువంటి కొన్ని లోపాలు చేశామని కూడా మనం గ్రహించాం.

ఎక్కడైతే మనం బలంగా ఉన్నామో అక్కడ చొరవ చూపిస్తూ, ఎక్కడైతే బలహీనపడ్డామో తిరిగి దానిని బలోపేతం చేసుకొని, తప్పులను సకాలంలో సరిదిద్దుకొని ఉద్యమాన్ని అభివృద్ధి చేయాలి. మనం ఎం.ఎల్.ఎం.ని లోతుగా అర్థం చేసుకుంటూ మన రాజకీయ మిలటరీ పంథాను సృజనాత్మకంగా అన్వయిస్తూ అభివృద్ధి చేసుకుంటూ రాజకీయ, నిర్మాణ, మిలటరీ రంగాలలో కృషి చేయటం ద్వారా మన బలహీనతల నుంచి బయటపడగలం. అటువంటి పని విధానం ద్వారా మన ఉద్యమ ప్రాంతమంతటా తిరిగి అనుకూల వాతావరణం సృష్టించబడి గడ్డు పరిస్థితిని అధిగమించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటంలో ముందుకుపోగలుగుతాం.

మన కేంద్రకమిటీ పార్లమెంటరీ ఎన్నికల తర్వాత పరిస్థితిని విశ్లేషించి అంచనా వేసింది. ఆర్.ఎస్.ఎస్. ఆధిపత్యంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం అనే ప్రమాదాన్ని సూచిస్తోంది. దీనిని ఎదుర్కొనేందుకు ఒక విశాల ప్రాతిపదికన ప్రజాపోరాటాలనూ, విప్లవ పోరాటాలనూ, ప్రజాస్వామిక సంస్థలనూ, శక్తులనూ, వ్యక్తులనూ, విశాల ప్రజలనూ కలిపి ఈ ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. మైనార్టీ మతస్థుల మీద, దళితుల మీద దాడులు పెరిగే ప్రమాదం ఉంది. ప్రగతిశీల మేధావులు, ఉద్యమాలు ప్రభుత్వదాడికి గురి కావచ్చు. మోడీ అనుకూల ముఠా అయిన కొద్దిమంది చేతుల్లోనే ప్రభుత్వ అధికారం కేంద్రీకరించబడి దూసుకు వచ్చే హిందూ ఫాసిస్టు ప్రమాదంతో పాలకవర్గాల మధ్య వైరుధ్యాలు తీవ్రతరమవుతాయి. పనికిమాలిన కుట్రపూరితమైన హిందీ-హిందూ-హిందుస్తాన్ అనే దాన్ని అన్ని జాతుల మీద బలవంతంగా రుద్దే ఈ పరిస్థితి మరింత వ్యతిరేకతను రెచ్చగొడుతోంది.

ఈ మొత్తం పరిస్థితి నూతన, వైవిధ్యపూరితమైన అవకాశాలను కలిగించి వివిధ శక్తులను ఐక్యం చేసే పోరాటానికి దారితీస్తుంది.

మోడీ ప్రభుత్వం దూకుడుగా ఎల్.పి.జి. ఎజెండాను ముందుకు తీసుకెళ్లటంతో నయావలసవాద పట్టు బిగుస్తోంది. దీనిని జాతీయవాద ముసుగుతో కప్పాలని ప్రయత్నిస్తోంది. సంఘ్ పరివార్ జాతీయవాద ముసుగు మోడీ ప్రభుత్వం టోకుగా దేశాన్ని అమ్మే విధానంతో బహిర్గతం అయ్యే అవకాశం ఉంది. నిర్దిష్టమైన, విస్తృతమైన ప్రచారంతో సామ్రాజ్యవాద అనుకూల, భూస్వామ్య అనుకూల మోడీ ఎజెండాను బహిర్గతం చేయాలి.

గ్రీన్‌హంట్ ఆపరేషన్ కొత్తదశ ప్రారంభమైంది. ప్రజాఉద్యమాల మీద, జాతి విముక్తి ఉద్యమాల మీద మోడీ ప్రభుత్వపు దాడులు పెరుగుతాయి. ఈ దాడులు దుర్మార్గపు నల్లచట్టాలతో మేళవించబడతాయి. నామమాత్రపు న్యాయం కూడ కరువౌతుంది. రాజకీయ ఖైదీల హక్కులపైనా, వారి హక్కులకోసం గొంతు విప్పే కార్యకర్తల మీదా అణచివేత పెరుగుతుంది. ఈ విషయాల్లో మనం ప్రభావయుతంగా జోక్యం చేసుకోవాలి. విశాల ప్రాతిపదికన హక్కుల ఉద్యమాలను నిర్మించి బలోపేతం చేయటానికి మంచి అవకాశాలున్నాయి. ఆ పోరాటాలను గ్రీన్‌హంట్ వ్యతిరేక ఉద్యమంతోనూ, రాజకీయ ఖైదీల హక్కుల కోసం పోరాడే ఉద్యమాలతోను జత చేర్చాలి.

మోడీ అభివృద్ధి ఎజెండాను దూకుడుగా అమలు చేయడం వల్ల భారీ స్థాయిలో విస్థాపన సమస్య ఉత్పన్నమవుతుంది. ఆదివాసీల ఉనికికే పెద్ద ప్రమాదమేర్పడుతుంది. ఈ పరిస్థితి పెద్దయెత్తున ప్రజాపోరాటాలను ముందుకు తెస్తుంది. మనం సరైన నిర్మాణరూపాలతో వీటిలో పాల్గోవటమూ కానిచో మద్దతు ఇవ్వటమో చేయాలి. ఈ పరిస్థితి వల్ల పెద్ద ప్రజాఉద్యమం తలెత్తటానికి గల అవకాశాలను మనం దృష్టిలో ఉంచుకోవాలి.

మోడీ ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలు రైతాంగం, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సెక్షన్లకు చెందిన మహిళలు, విద్యార్థులు, యువకుల కడగండ్లను మరింత తీవ్రం చేస్తాయి. వీటి మీద దృష్టి పెట్టి ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాలి.

ఈరోజు మనం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితిని అధిగమించేందుకు మన స్వీయాత్మక బలగాల్ని మనం రక్షించుకోవాలి. సంఘటితపర్చుకోవాలి. ప్రజాపునాదిని బలోపేతం చేసుకొని ప్రజాయుద్ధాన్ని శక్తివంతంగా ముందుకు నడిపించాలి. మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తలెత్తిన నూతన పరిస్థితిలో ఈ దిశలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. నిస్సందేహంగా కొన్ని కఠినమైన సవాళ్లు ఎదురవుతాయి. అలాగే కొన్ని అవకాశాలు కూడా లభిస్తాయి. మనం ధైర్యంగా వివిధ రకాల పీడిత వర్గాలు, సెక్షన్ల ప్రజల్లోకి చొచ్చుకొనిపోయి వారిని రాజకీయంగా కదిలించి పోరాటాల్లో ఐక్యం చేయాలి. ప్రజావ్యతిరేక, దేశవ్యతిరేక మోడీ ప్రభుత్వపు ప్రతి పాలసీకి వెంటనే స్పందించి నిరంతరం వాటిని బహిర్గతం చేస్తూ వాటికి వ్యతిరేకంగా ప్రజల్ని కూడగడుతూ ప్రజాయుద్ధంలో వారిని ఇముడ్చుకునేందుకు గట్టి కృషి చేయాలి. ఈ మొత్తం అవకాశాల్ని పొదివి పట్టుకునేందుకు ధైర్యంగా ముందుకు పోవాలి. *

తన సొంత పొరపాట్ల పట్ల ఒక రాజకీయ పార్టీ వైఖరి ఆ పార్టీ ఎంత చిత్తశుద్ధిగా ఉన్నదీ, తన వర్గం పట్లా, శ్రామిక ప్రజల పట్లా తన బాధ్యతలను అది ఆచరణలో ఎలా నిర్వర్తించేదీ పరీక్షించడానికి అత్యంత ముఖ్యమైన, నమ్మకమైన మార్గాలలో ఒకటి. పొరపాటును మోమాటం లేకుండా ఒప్పుకోవడమూ, దాని కారణాలను బయటపెట్టడమూ, దానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించడమూ, దానిని దిద్దుకునే మార్గాలను తెల్చుకోవడమూ - అది నిష్ఠగల పార్టీ యొక్క చిహ్నం; అదే ఆ పార్టీ తన విధులను నిర్వహించవలసిన పద్ధతి, తన వర్గాన్నీ, తర్వాత జనాలనూ బోధించి తర్ఫీదు చేయాల్సిన పద్ధతి.

- లెనిన్, ('వామపక్ష కమ్యూనిజం, ఒక బాలారిష్టం')

అల్లర్లు సృష్టించు, విఫలమవు, మళ్లీ అల్లర్లు సృష్టించి, మళ్లీ విఫలమవు...... ఇలాగే వారి వినాశన పర్యంతం ప్రజల ప్రయోజనాలతో వ్యవహరించేటప్పుడు ప్రపంచంలోని సామ్రాజ్యవాదుల, సకల అభివృద్ధి నిరోధకుల తర్కం ఇదే. ఈ తర్కానికి వ్యతిరేకంగా వారు ఎన్నడూ నడుచుకోరు. పోరాటం, వైఫల్యం, తిరిగి పోరాటం, మళ్లీ వైఫల్యం, తిరిగి పోరాటం....కడగా విజయం సాధించేదాకా; ఇది ప్రజల తర్కం. వారు కూడా ఈ తర్కానికి వ్యతిరేకంగా ఎన్నడూ నడవరు.

- మావో (భ్రమలను విడనాడండి, పోరాటానికి సంసిద్ధం కండి, మావో రచనలు 4వ సంపుటి)

చేవలేని పనికిరాని ఆలోచనలనన్నింటినీ మన శ్రేణుల నుంచి, తుడిచిపెట్టెయ్యాలి. శత్రువు బలాన్ని ఎక్కువగానూ, ప్రజల బలాన్ని తక్కువగానూ అంచనాకట్టే అభిప్రాయాలన్నీ పొరబాట్లే.

- మావో (ప్రస్తుత పరిస్థితి, మన కర్తవ్యాలు, మావో రచనలు 4వ సంపుటి)

మనం ముందుగా మన అగ్రగామి దళం యొక్క రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాలి. అలా చేయడంవల్ల వారు దృఢ నిశ్చయులై, ఎలాంటి త్యాగానికైనా జంకక, విజయసాధన కోసం ఎంతటి కష్టనష్టాలనైనా అధిగమిస్తారు.

- మావో (పర్వతాలను తొలగించిన తెలివిమాలిన వృద్ధుడు, మావో రచనలు 3వ సంపుటి)

అదృష్టం కలిసొచ్చి, తీవ్రమైన, కర్కశమైన పోరాటం లేకుండానే చెమట కార్చకుండా, నెత్తురు చిందకుండా సులభంగా విజయం లభిస్తుందనే ఆలోచనలన్నింటినీ మన కేడర్ల నుండి మనం నిశ్శేషంగా తుడిచివేయాలి.

- మావో (ఈశాన్య ప్రాంతంలో నిలకడగలిగిన స్థావరాలను నిర్మించండి, మావో రచనలు 4వ సంపుటి)

ప్రపంచ అభ్యుదయానికి సంబంధించిన వాస్తవాల పైనా, మన ముందున్న ఉజ్వలమైన భవిష్యత్తు గురించీ మనం ప్రజలలో నిరంతరం ప్రచారం చేయాలి. అప్పుడే వాళ్లకు విజయం మీద విశ్వాసం కలుగుతుంది. అదే సమయంలో, మనం ప్రజలకూ, మన కామ్రేడ్స్‌కూ మన మార్గంలో ఎన్నో మలుపులు తిరుగుళ్లూ ఉంటాయని చెప్పాలి. విప్లవబాటపై ఇంకా ఎన్నో అవరోధాలు, ఇబ్బందులు ఉన్నాయి...... కొంతమంది కామ్రేడ్స్‌కు ఇబ్బందుల గురించి ఎక్కువగా ఆలోచించడం ఇష్టం ఉండదు. కాని ఇబ్బందులున్నాయన్నది వాస్తవం; ఉన్న ఇబ్బందులన్నింటినీ గుర్తించాలేగాని, "గుర్తించకుండా ఉండే విధానాన్ని" అవలంభించగూడదు. మనం ఇబ్బందులను గుర్తించాలి, విశ్లేషించాలి. వాటితో తలపడాలి. ప్రపంచంలో సూటిగా ఉండే మార్గాలేవీ లేవు. మనం మలుపులు, మెలికలు గల మార్గాలను అనుసరించడానికి

సిద్ధపడాలే తప్ప, చవక బేరాల కోసం ఆశించకూడదు. అభివృద్ధి నిరోధకులందరూ ఒక సుముహూర్తాన స్వచ్ఛందంగా కాళ్లబేరానికి దిగొస్తారని ఊహించగూడదు. ఒక్కమాటలో చెప్పాలంటే, గమ్యం ఉజ్వలంగా ఉంది కాని, మార్గం మాత్రం మలుపులు మెలికలతో క్లిష్టంగా ఉంది. ముందు ముందు ఇంకా ఇలా ఇబ్బందులున్నాయి, వాటిని విస్మరించరాదు. యావత్ ప్రజానీకంతో సమిష్టి కృషిలో ఐక్యమయ్యేటట్లయితే, మనం ఇబ్బందులన్నింటినీ అధిగమించి విజయం ఖచ్చితంగా సాధించగలం.

- మావో (చుంకింగ్ సంప్రదింపులపై, మావో రచనలు 4వ సంపుటి)

ఉజ్వల భాగాన్ని మాత్రమే చూసి, కష్టాలు చూడని వారెవరైనా సరే పార్టీ కర్తవ్యాలను నెరవేర్చడంలో సమర్ధవంతంగా పోరాడలేరు.

- మావో (మిశ్రమ ప్రభుత్వంపై, మావో రచనలు 3వ సంపుటి)

కొత్త విషయాలు అవి పెరిగేకొద్దీ ఎల్లప్పుడూ ఇబ్బందులను, ఎదురుదెబ్బలను అనుభవించాల్సి ఉంటుంది. సోషలిజం, ఆశయం సుగమమైనా ఏ ఇబ్బందులూ, ఎదురుదెబ్బలూ లేకుండా లేదా, పెద్ద ప్రయత్నాలేవీ పెట్టకుండానే నల్లేరు మీద బండిలా సాగిపోయేదని, విజయం సులభసాధ్యమని ఊహించుకోవడమంటే పగటి కలలు కనడమే.

- మావో (ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగా పరిష్కరించడంపై, మావో రచనలు 5వ సంపుటి)

కష్టసమయాల్లో మనం విజయాలను మర్చిపోకూడదు. మనం ఉజ్వల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని ధైర్యాన్ని పుంజుకోవాలి.

- మావో (ప్రజలకు సేవ చేయండి, మావో రచనలు 3వ సంపుటి)

అభివృద్ధి నిరోధక శక్తులకూ, మనకూ, ఇద్దరికీ కూడా, ఇబ్బందులు ఉన్నాయి. కానీ అభివృద్ధి నిరోధకులు చావసిద్ధంగా ఉన్న భవిష్యత్తేమీలేని శక్తులు, కాబట్టి, వాళ్ల ఇబ్బందులు అధిగమించలేనటువంటివి. మనం నూతనమైన, ఎదుగుతున్న శక్తులం, మనకు ఉజ్వల భవిష్యత్తు ఉంది. కాబట్టి మనం ఇబ్బందులను అధిగమించగలం.

- మావో (చైనా విప్లవపు నూతన వెల్లువకు స్వాగతం పలకండి, మావో రచనలు 4వ సంపుటి)

విప్లవ పోరాటంలో కొన్ని సమయాల్లో, అనుకూల పరిస్థితుల కన్నా ఇబ్బందులే ఎక్కువ మోతాదులో ఉంటాయి. అందుచేత అవి వైరుధ్యంలో ప్రధానాంశవుతాయి. అనుకూల పరిస్థితులు ద్వితీయమైనవి అవుతాయి. కాని విప్లవకారులు తమ ప్రయత్నాల ద్వారా ఇబ్బందులను ఒకటొకటిగా అధిగమించి, అనుకూల పరిస్థితులను సాధించగలరు. ఆ విధంగా అననుకూల పరిస్థితులు తొలగి అనుకూల పరిస్థితి వస్తుంది.

- మావో (వైరుధ్యాలు, మావో రచనలు 1వ సంపుటి)

సర్వసమగ్రమైన భౌతికవాదులు నిర్భయులు; మన సహ పోరాట యోధులందరూ తమ బాధ్యతలను సాహసంతో స్వీకరిస్తారనీ, ఎటువంటి ఎదురుదెబ్బలకు గానీ, పరిహాసాలకుగానీ భయపడక తమ కమ్యూనిస్టులమైన మనల్ని విమర్శించడానికి తమ సలహాలను ఇవ్వడానికి తటపటాయించక, అన్ని ఇబ్బందులను అధిగిస్తారనీ ఆశిస్తున్నాం. "వెయ్యికత్తి వేట్లచే మరణానికి భయపడనివాడే చక్రవర్తిని గద్దెదించ సాహసిస్తాడు." సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని నిర్మించే పోరాటంలో మనకు కావలసిన నిర్భయాత్మక చైతన్యం ఇదే.

- మావో (ప్రచారపనిపై చైనా కమ్యూనిస్టుపార్టీ జాతీయ మహాసభలో ప్రసంగం, మావో రచనలు 5వ సంపుటి)

# పిఎల్‌జిఏ సాధించిన అభివృద్ధిపై ఆధారపడదాం !
# బలహీనతలను అధిగమిద్దాం !
# సవాళ్లను ఎదుర్కొందాం !

**– బసవరాజు**

**(పార్టీ 10వ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా గడచిన పదేళ్ల కాలంలో పిఎల్‌జిఏ సాధించిన పురోగతి గురించి సిపిఐ (మావోయిస్టు) సెంట్రల్ మిలటరీ కమీషన్ తరఫున రాసిన వ్యాసం)**

భారత ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో 1967 నాటి నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ వెల్లువ ఒక గొప్ప మూలమలుపు. తెలంగాణ, పునప్రా–వాయిలార్, తెభాగా వంటి వీరోచిత సాయుధ రైతాంగ పోరాటాల వారసత్వాన్ని అందుకొని సాయుధ వ్యవసాయ విప్లవాన్ని ప్రారంభించి, కొనసాగించడం సిపిఐ (మావోయిస్టు)కు గర్వకారణం. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి నక్సల్బరీ పోరాటం ఒక గెంతు. ఊడలు దిగిన రివిజనిస్టు, నయా రివిజనిస్టు నాయకత్వానికి వ్యతిరేకంగా మన పార్టీ వ్యవస్థాపక నాయకులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హయ్ చటర్జీల నాయకత్వంలో జరిగిన తీవ్ర సైద్ధాంతిక పోరాటం, తిరుగుబాట్ల ఫలితంగా ఈ గెంతు సంభవించింది.

నక్సల్బరీ నిప్పురవ్వ భారతదేశంలో శ్రీకాకుళం, సోనార్‌పూర్, కాంక్సా, ముషాహరి, దేబ్రా–గోపీవల్లభపూర్, తెరాయ్, లఖింపూర్–ఖేరీ, బీర్‌భూం వంటి పలు ప్రాంతాలకు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలోని ఇతర ప్రాంతాలకు, తమిళనాడు, కేరళం, జమ్ము–కాశ్మీర్, మహారాష్ట్ర రాష్ట్రాలకు వ్యాపించింది. పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో విప్లవోద్యమానికి గట్టి పునాది పడింది. నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవం దేశంలో ఒక తరాన్ని ఎంతగా ఉత్తేజితుల్ని చేసిందో పాలకవర్గాలను అంతగా భయపెట్టింది.

నక్సల్బరీ తదితర ఉద్యమాలలో మొట్టమొదటసారిగా శత్రు బలగాల నుంచీ, భూస్వాముల నుంచీ ఆయుధాలు గుంజుకోవడం, ప్రజాసైన్యపు పిండరూపంగా గెరిల్లా నిర్మాణాలు ఏర్పడడం జరిగింది. భూస్వాముల అధికారాన్ని ధ్వంసం చేసిన చోట విప్లవ రైతాంగ కమిటీల ఏర్పాటుతో రైతాంగ ప్రజల విప్లవాధికారం బీజరూపంలోనే అయినా దేశంలో మొట్టమొదటిసారిగా నెలకొల్పబడింది. ఇది ప్రత్యేకంగా శ్రీకాకుళం, బీర్‌భూంలలో స్పష్టంగా కనపడింది. ఆనాడు నక్సల్బరీ మార్గంలో దేశంలో పెల్లుబికిన వివిధ రైతాంగ విప్లవోద్యమాల, సోనార్‌పూర్, కాంక్సా

విప్లవ రైతాంగ ఉద్యమాల తక్షణ లక్ష్యం ఇదే.

విప్లవోద్యమ పురోగమన క్రమంలో ఆవిర్భవించిన ప్రజా గెరిల్లా శక్తులు క్రమబద్ధంగా అభివృద్ధి చెందుతూ, ఆ తర్వాతి క్రమంలో భారత విప్లవ చరిత్రలో మొట్టమొదటిసారిగా 2000 డిసెంబర్ 2న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) నిర్మాణానికి దారితీసింది. పార్టీ నాయకత్వంలో విముక్తి ప్రాంతాలను నెలకొల్పే లక్ష్యంతో ప్రతీఘాతుక రాజ్య సాయుధ బలగాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం పాటు సాయుధ వ్యవసాయ విప్లవాన్ని పురోగమింపజేయడం ద్వారా విప్లవోద్యమ చరిత్రలో పిఎల్‌జిఏ మహత్తర పాత్ర వహించింది. ఈ విధంగా దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గం సిద్ధాంత రూపంలోనే కాక పై పోరాటాల నిర్దిష్ట ఆచరణ ద్వారా కూడా ఉనికిలోకి వచ్చింది. దీర్ఘకాల ప్రజాయుద్ధ క్రమంలోనే మన పార్టీ సంఘటితమైంది, సైన్యం (పిఎల్‌జిఏ) వృద్ధి చెందింది, ప్రజాపునాది పెంపొందింది.

నక్సల్బరీ వెల్లువ వెనుకపట్టు పట్టిన తర్వాత రెండు ప్రధాన స్రవంతులు (మునుపటి పిడబ్ల్యు-పియు, ఎంసిసి) గతాన్ని సమీక్షించి గుణపాఠాలు తీసుకొని సరియైన విప్లవ పంథాను చేపట్టి ఆంధ్రప్రదేశ్-తెలంగాణా, బీహార్-ఝార్ఖండ్, పశ్చిమ బంగ్, దండకారణ్యంలలో సాయుధ వ్యవసాయ విప్లవోద్యమాన్ని పురోగమింపజేసేందుకు కృషి చేశాయి.

అవి అత్యవసర పరిస్థితి తరువాత కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకున్నాయి. దేశంలోని అనేక ప్రాంతాలలో కార్మికవర్గం, రైతాంగం, విద్యార్థి, యువజన రంగాలలో పోరాటాల వెల్లువను సృష్టించాయి. సాహితీ, సాంస్కృతిక సంస్థల ద్వారా విస్తృత విప్లవ ప్రచార క్యాంపెయిన్లను చేపట్టాయి. ఎమర్జెన్సీకి ముందూ, అది ఎత్తివేసిన వెనువెంటనేనూ పౌరహక్కుల ఉద్యమం కూడా పుంజుకుంది. ఈ కాలంలో ఈ రెండు విప్లవ స్రవంతులు చేపట్టిన ఎత్తుగడలు వివిధ సెక్షన్ ప్రజలలో విప్లవ ప్రజాపునాదిని సంఘటితం చేసి విస్తరించడం ద్వారా సాయుధ పోరాటానికి సన్నాహాలు చేసుకోవడానికి ఎంతగానో దోహదం చేశాయి. బహిరంగ, రహస్య పోరాట, నిర్మాణ రూపాలనూ అవి సమర్థవంతంగా జోడించాయి. విప్లవోద్యమానికి వ్యతిరేకంగా శత్రువు చేపట్టిన ఎత్తుగడలను తిప్పికొడుతూ ప్రజాసంఘాలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తూ సంఘటితపడ్డాయి. పార్టీ రహస్య స్వరూపాన్ని జాగ్రత్తగా కాపాడుకున్నాయి.

అవి భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వర్గ పోరాటాలలో పాల్గొన్న ప్రజలను సాయుధం చేసేందుకు కృషి చేశాయి. మొదట ప్రజా మిలీషియాకూ, ప్రజా గెరిల్లా బలగాలకూ నాయకత్వం వహిస్తూ శత్రువు నుంచి ఆయుధాలను గుంజుకుంటూ తమను తాము సాయుధం చేసుకుంటూ సాయుధ గెరిల్లా యూనిట్లను అభివృద్ధి చేశాయి. సాయుధ నిర్మాణాలు క్రమంగా బలం పుంజుకున్నాయి. శత్రు దాడిని ఎదుర్కొన్నాయి. తద్వారా ఈ మొత్తం కాలంలో సాయుధ పోరాటాన్ని అవి కొనసాగించగలిగాయి. ఈ ఆచరణ క్రమంలో వ్యవసాయ విప్లవం ఆంధ్రప్రదేశ్-తెలంగాణా, బీహార్-ఝార్ఖండ్, దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర

-మధ్యప్రదేశ్), ఒడిశా, పశ్చిమ బంగ్, కర్నాటక, తమిళనాడు, కేరళం, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, అసోం రాష్ట్రాలకు వ్యాపించింది. ఈ రాష్ట్రాలలోని కొన్నింటిలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటం కొత్త మలుపును తీసుకొచ్చింది. ఈ రెండు స్రవంతుల ప్రజాపునాది చెప్పుకోదగినంతగా అభివృద్ధి చెందింది. అవి విద్యార్థులు, యువజనులు, కార్మికులు, మహిళలు, దళితులు, మేధావులను ప్రభావితం చేశాయి. అవి ప్రచారం, ఆందోళన, వర్గ పోరాటాల ద్వారా దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని పెంపొందించాయి. రైతాంగ ప్రజలను, ముఖ్యంగా పేద, భూమిలేని రైతాంగాన్ని సమీకరించి, వారిపై ఆధారపడి గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్యానికి వ్యతిరేకంగా సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని కొనసాగించడంలోనూ, అభివృద్ధి చేయడంలోనూ అవి ఎన్నో చెప్పుకోతగ్గ విజయాలు సాధించాయి. సామ్రాజ్యవాద మద్దతుతో ప్రతీఘాతుక పాలకవర్గాలు నిరంతరాయంగా అమలు చేసిన తీవ్ర నిర్బంధాన్నీ, అనేక అణచివేత క్యాంపెయిన్లను ప్రతిఘటించి ఓడించడం ద్వారా అవి దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేశాయి. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మీద ఆధారపడి అంతర్జాతీయంగానూ, దేశంలోనూ, ఉద్యమంలోనూ చోటు చేసుకుంటున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని ఈ పార్టీలు తదనుగుణంగా ఎత్తుగడలను సరిచేసుకున్నాయి. విప్లవోద్యమ అనుకూల, ప్రతికూల అనుభవాలను సంశ్లేషించి అవి భారత విప్లవ పంథాను పెంపొందించి అభివృద్ధిపరిచాయి. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా దేశంలో విప్లవోద్యమాన్ని పురోగమింపజేశాయి. ఫలితంగా మునుపటి పిడబ్ల్యు నాయకత్వంలో పిజిఏ, మునుపటి ఎంసిసిఐ నాయకత్వంలో పిఎల్‌జిఏ, వ్యూహాత్మక ప్రాంతాలలో బీజప్రాయంలో గ్రామస్థాయిలో ప్రజల రాజకీయ అధికార అంగాలూ స్థాపించబడ్డాయి. 2004 సెప్టెంబర్ 21న ఈ రెండు విప్లవ స్రవంతులు విలీనమై సాపేక్షికంగా బలమైన పార్టీ సిపిఐ (మావోయిస్టు) ఆవిర్భవించడంతో పాటు, వాటి రెండు గెరిల్లా సైన్యాలూ ఐక్యం కావడం ద్వారా బలమైన ఐక్య పిఎల్‌జిఏ, వివిధ ప్రజాసంఘాలు ఐక్యం కావడం ద్వారా బలమైన ఐక్య ప్రజాసంఘాలు స్థాపించబడ్డాయి. సిసలైన మావోయిస్టు పార్టీల విలీనం సాధించే కృషిలో మరో మలుపుగా సిపిఐ(మావోయిస్టు), సిపిఐ(ఎం.ఎల్)నక్సల్బరీ విలీనమైనాయి. భారత విప్లవ అగ్రగామిగా సిపిఐ(మావోయిస్టు) తన పాత్రను మరింత మెరుగ్గా నెరవేర్చే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఈ ఐక్యత దోహదపడుతుంది.

దేశంలో పూర్తి స్థాయి ప్రజా విముక్తి సైన్యాన్ని నిర్మించే దిశగా, ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, బీహార్, దండకారణ్యం, ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల విశాల గ్రామీణ ప్రాంతాలలో విముక్తి ప్రాంతాలు నెలకొల్పే దిశగా పనిచేసే ఒక గెరిల్లా సైన్యాన్నీ(పిఎల్‌జిఏను), గెరిల్లాజోన్లనూ పెంపొందించడంలో మన నూతన పార్టీ విజయవంతమైంది. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణాలను చుట్టుముట్టే వ్యూహం ద్వారా వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసే దిశగా మన

పార్టీ దీర్ఘకాల ప్రజాయుద్ధానికి నాయకత్వం వహిస్తున్నది.

ఈ పదేళ్ల కాలంలో మన నూతన పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఏ. గెరిల్లాయుద్ధ నిర్వహణ, ప్రజా విముక్తి సైన్యం నిర్మాణం, విముక్తి ప్రాంతాల స్థాపన దిశగా కొనసాగించిన కృషిలో సాధించిన అభివృద్ధిని చూద్దాం :

## సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక రంగాలలో పిఎల్‌జిఏ సాధించిన అభివృద్ధి

ఈ పదేళ్ల విప్లవాచరణ క్రమంలో నూతన పరిస్థితి ఎదురైనప్పుడల్లా పార్టీ నూతన ఎత్తుగడలు రూపొందించింది. మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించుకోవడం ద్వారా, తదనంతరం సిసి, పిబి, సిఎంసి, ఆర్‌బిల సమావేశాలు, ఆయా రాష్ట్రాల ప్లీనాలు, కమిటీల సమావేశాలలో ఎప్పటికప్పుడు తన ఆచరణను సమీక్షించుకోవడం ద్వారా  అనుభవాన్ని క్రోడీకరించుకున్నది.

మన పార్టీ కేంద్రకమిటీ (సి.సి.), కేంద్ర సైనిక కమీషన్(సి.ఎం.సి.) సుసంపన్నమైన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ మౌలిక డాక్యుమెంట్లపై, అవి రూపొందించిన పాలసీ డాక్యుమెంట్లపై ఆధారపడి, రాజకీయ పంథా-మిలటరీ పంథా, మొబైల్ యుద్ధం, పిఎల్‌జిఏ కార్యాచరణ సూత్రాలు, శత్రు ఎల్ఐసికి వ్యతిరేకంగా రూపొందించిన పాలసీ డాక్యుమెంట్, సర్క్యులర్లు, లెటర్లపై ఆధారపడి పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ బలగాలకు, విప్లవ ప్రజా సంఘాలకు, ఆర్.పి.సి.లకు సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక శిక్షణ గరిపాయి. అవి కమీషన్లు-కమాండ్ల కర్తవ్యాలు-ఫంక్షనింగ్‌పై రాజకీయ-సైనిక విధానపర సర్క్యులర్ విడుదల చేశాయి. సి.ఎం.సి. ఫైర్ అండ్ మూవ్‌మెంట్, రెయిడ్, ఆంబుష్ నోట్సులు, ల్యాండ్‌మైన్స్-బూబీట్రాప్స్, ప్లాటూన్ హ్యాండ్ బుక్, కంపెనీ నిర్మాణం-డ్రిల్స్, స్నైపర్ ట్రైనింగ్, పిస్టల్ ట్రైనింగ్, నైట్ మూవ్‌మెంట్, గెరిల్లా ఎయిర్ డిఫెన్స్,  ఆర్టిలరీ, ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్స్-1, 2, ఇంప్రూవైజ్డ్ గ్రెనేడ్స్, బెటాలియన్ నిర్మాణం-డ్రిల్స్, పిఎల్‌జిఏ హ్యాండ్ బుక్, వ్యూహాత్మక ప్రాంతాల్లోకి చొరబడుతున్న శత్రువును ప్రతిఘటించే ఎత్తుగడలు వంటి అత్యంత విలువైన సైనిక పుస్తకాలను విడుదల చేశాయి. శత్రు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ వ్యూహాన్ని అర్థం చేసుకునేందుకై అవసరమైన సాహిత్యాన్ని విడుదల చేసింది. సి.సి. రాజకీయ,సైనిక ఇంటలిజెన్స్‌ను నిర్మాణం చేసి అభివృద్ధి చేసేందుకు ఆరోప్రాణం గ్రంథంతో పాటు ఇతర సాహిత్యాన్ని విడుదల చేసింది. సి.ఎం.సి. కేంద్రస్థాయిలో ఒక ఇన్‌స్ట్రక్టర్ టీమును ఏర్పాటు చేసింది. సైనిక పత్రిక అవామీ జంగ్, అవామీ జంగ్ స్టడీ సిరీస్, ఇతర సైనిక సాహిత్యాన్ని తెలుగు, హిందీ భాషల్లో తీసుకొని

వస్తున్నది. కేంద్ర, రాష్ట్ర సైనిక కమీషన్లు, రాష్ట్ర, రీజియన్, జిల్లా, ఏరియా కమాండ్లు పిఎల్‌జిఏ రాజకీయ, సైనిక స్థాయిని పెంపొందించడం కోసం రాజకీయ, సైనిక శిక్షణా క్యాంపులను, సైద్ధాంతిక, రాజకీయ క్లాసులను నిర్వహించాయి. ప్రత్యేకంగా కొన్ని మహిళా రాజకీయ, సైనిక శిక్షణా క్యాంపులు నిర్వహించాయి. కింది స్థాయిలో మిలీషియా ట్రైనింగ్ క్యాంపులు నిర్వహించాయి. సి.ఎం.సి. రాష్ట్రం నుండి కింది అవసరాలకు అనుగుణంగా శిక్షణ నిచ్చే ఉద్దేశ్యంతో మొబైల్ సైనిక స్కూల్ భావనను ప్రవేశపెట్టి, కొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసింది. మైన్‌ప్రూఫ్ వాహనాలను ధ్వంసం చేయడం, రెయిడ్లు, ఆంబుష్‌ల ద్వారా శత్రు బలగాలను నాశనం చేయడం వగైరా విషయాలపై ఒక మేరకు అధ్యయనం చేయడమైంది.

పిఎల్‌జిఏ శక్తివంతంగా పనిచేయడానికి దీనిలో భాగంగా కేంద్రస్థాయిలోనూ, వివిధ గెరిల్లా జోన్లలోనూ సాంకేతిక, సప్లై, ఇంటెలిజెన్స్, కమ్యూనికేషన్స్, ప్రెస్, విద్య, వైద్య, తదితర విభాగాలను వివిధ స్థాయిల్లో ఏర్పాటు చేసుకున్నాము.

పిఎల్‌జిఏ శత్రు బలగాలను సంహరించి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో ప్రధాన పాత్ర నిర్వహిస్తూనే శత్రు దాడుల నుండి పార్టీ నాయకత్వాన్ని, రాజకీయాధికార అంగాలను పార్టీ కాంగ్రెస్, కాన్ఫరెన్సులు, ప్లీనాలు, అధ్యయన క్యాంపులు, శిక్షణా శిబిరాలు, సమావేశాలు, టెక్నికల్, విద్య, వైద్య తదితర పార్టీ, సైనిక, ఐక్యసంఘటన కార్యకలాపాలను రక్షించే వ్యూహాత్మక కర్తవ్యాలను నెరవేర్చడంలో క్రియాశీల పాత్ర నిర్వహించింది. పిఎల్‌జిఏ అప్రమత్తంగా ఉండి శత్రుబలగాలను వీరోచితంగా ప్రతిఘటించడం వల్లనే మనం ఈ కార్యకలాపాలన్నింటినీ విజయవంతంగా నిర్వహించుకోగలిగాము. పి.ఎల్.జి.ఏ. ప్రజలను ఉత్పత్తిలోకి సమీకరించడంతో పాటు స్వయంగా వ్యవసాయ ఉత్పత్తిలో పాల్గొంది.

సామ్రాజ్యవాద, భూస్వామ్య కుసంస్కృతిని ప్రజల మనస్సుల నుండి కూకటివేళ్ళతో పెకిలించి శాస్త్రీయమైన, ప్రగతిశీల, ప్రజాస్వామ్య, విప్లవకర సంస్కృతిని ప్రజల మనస్సుల్లో రంగరింపజేసే సాంస్కృతిక కర్తవ్యం కూడా పీఎల్‌జీఏ నిర్వహిస్తున్నది. 'విప్లవ భావాలు ప్రజల్లో బలంగా నాటుకున్న నాడే అవి ఒక విప్లవ శక్తిగా అవతరిస్తాయి'. అందుకోసం తరతరాల బ్రాహ్మణవాద, భూస్వామ్య, పితృస్వామిక, సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా సైద్ధాంతిక, రాజకీయ కృషితో పాటు తన స్వీయ కార్యాచరణ ద్వారా, ఉపన్యాసాలు, సభలు, సమావేశాలు, ఆట పాటలు తదితర కళారూపాలతో ప్రజల్లో సాంస్కృతిక కృషి చేస్తున్నది.

పిఎల్‌జిఏ ఈ కింది నినాదాలు చేపట్టింది. 1) ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయండి, ప్రజలపై బహుముఖ దాడిని ఓడించండి. 2) పిఎల్‌జిఏను సాయుధం చేసేందుకు శత్రు

ఆయుధాలను స్వాధీనం చేసుకోండి. 3) పిఎల్‌జిఏను పిఎల్‌ఏగా అభివృద్ధి చేయడానికి పెద్ద సంఖ్యలో యువతను రిక్రూట్ చేయండి. 4) ప్రజా అధికార అంగాలను నిర్మించేందుకు ప్రజలకు సహాయపడండి. 5) ప్రజలతో మమేకంకండి, ప్రజలకు సేవ చేయండి. ఈ దశాబ్ద కాలంలో వీటిని ఆచరించడం ద్వారా అది రాజకీయంగా, సైనికంగా బలోపేతమయ్యింది.

గత పది సంవత్సరాలలో పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ దేశవ్యాప్తంగా గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసింది, విస్తరించింది. అది ఈ క్రమంలో డి.కె., ఏ.ఓ.బి.లలో స్థానిక స్థాయిలో శత్రు అధికారాన్ని నాశనం చేసి ప్రజా అధికార అంగాలను స్థాపించుకోవడంలో ప్రజలకు తోడ్పడింది. ముఖ్యంగా డికెలో కొన్ని ఏరియా, జిల్లా స్థాయి విప్లవ ప్రజా ప్రభుత్వాలను (ప్రాథమిక స్థాయిలో) స్థాపించి, సాపేక్షికంగా బలోపేతం కావడానికి తోడ్పడింది.

మన పార్టీ నాయకత్వంలో సాగుతున్న దీర్ఘకాల ప్రజాయుద్ధ క్రమంలో పోరాట, నిర్మాణ రూపాలలో మనకు సంపన్నమైన అనుభవాలు లభించాయి. గెరిల్లా యుద్ధం, ప్రజాసైన్యం, , గెరిల్లాజోన్లు, ప్రజల రాజకీయాధికార అంగాలు, గెరిల్లాబేసులు, విముక్తి ప్రాంతాల గురించిన పార్టీ అనుభవం, అవగాహన పెరిగాయి. గెరిల్లాజోన్లలో గెరిల్లా సైన్యం, గెరిల్లా యుద్ధం ప్రధాన నిర్మాణ, పోరాట రూపాలుగా ఉంటాయనీ, పిఎల్‌జిఏ సంఘటితం అవుతున్న కొద్దీ గెరిల్లా యుద్ధం తీవ్రతరమవుతుందనీ, విప్లవ ప్రజారాజకీయాధికారం స్థాపించడానికి దారితీస్తుందనీ మన ఆచరణలో మరోమారు రుజువైంది.

మావో రూపొందించిన ప్రజాయుద్ధ సిద్ధాంతాన్ని మన విప్లవ యుద్ధ నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయిస్తూ కొనసాగించిన కార్యాచరణలో సాధించిన గొప్ప అనుభవాలను పార్టీ సంశ్లేషించి, గెరిల్లాజోన్లలో ప్రధానంగా శత్రువుకూ మనకూ రాజకీయాధికారం కోసం పోటీ ఉ

> "యుద్ధం అంటే, ఇరుపక్షాల బలాబలాల మధ్య పోటీ. యుద్ధ క్రమంలో ఇరుపక్షాల బలాబలాలలో మార్పు వస్తుంది. ఇక్కడ స్వీయాత్మక కృషి నిర్ణయాత్మక పాత్ర నిర్వహిస్తుంది. ఎక్కువ విజయాలు సాధించటం, తక్కువ తప్పులు చేయటం అనేదే స్వీయాత్మక కృషి. భౌతిక పరిస్థితులు ఇలాంటి మార్పుకు అవకాశం కల్గిస్తాయి. కాని ఈ అవకాశం వాస్తవరూపం తీసుకోవాలంటే, సరైన విధానం, స్వీయాత్మక కృషి అవసరం. అప్పుడే స్వీయాత్మక కృషి నిర్ణయాత్మక పాత్ర వహిస్తుంది."
>
> - మావో, దీర్ఘకాలయుద్ధం

ంటుందని నిర్ధారించుకున్నాం. అటువంటి చోట్ల పార్టీ శత్రు రాజకీయాధికారాన్ని ధ్వంసం చేస్తూ, ప్రజల రాజకీయాధికారాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నది. అక్కడ విధ్వంసం ప్రధానమైనదిగా, నిర్మాణం ద్వితీయమైనదిగా ఉంటున్నది. గెరిల్లా బలగాలు దృఢసంకల్పంతో పోరాటం సాగించి శత్రు బలగాల మీద పైచేయి సాధించినప్పుడు ప్రజల అధికారాన్ని స్థాపించడం సాధ్యమవుతున్నది. మరో పక్క తీవ్ర అణచివేత వల్ల గెరిల్లా బలగాలు రిట్రీట్ కావలసి వచ్చినప్పుడు శత్రువు తన పాలనను పునరుద్ధరించుకుంటున్నాడు. అంటే, గెరిల్లా జోన్లలో అధికారం కోసం తీవ్ర పోటీ ఉంటుందనీ, మరో మాటలో చెప్పాలంటే, గెరిల్లాజోన్లలో మన బలాన్ని [పార్టీ బలం, పిఎల్జిఏ (ప్రజాసైన్యం) బలం, ప్రజల సంఘటితశక్తిని, ప్రజాయుద్ధంలో వారి పాత్రను] బట్టి, శత్రువు బలాన్ని బట్టి రాజకీయాధికారం తరచూ చేతులు మారుతూ ఉంటుందనీ, ప్రజాసైన్యం దాన్ని పూర్తిగా శత్రువు చేతులలో నుంచి గుంజుకొని విముక్తి ప్రాంతాన్ని స్థాపించేంత వరకూ సుదీర్ఘ కాలం పాటు ఇలాగే కొనసాగుతుందనీ మన అనుభవం మరోసారి రుజువు చేసింది.

పార్టీ, పి.ఎల్.జి.ఏ.ను సంఘటితపరిచి, విస్తరించి అభివృద్ధి చేసేందుకూ, వ్యూహాత్మక ప్రాంతాలలో, జనతా ప్రజాస్వామిక అధికార అంగాలు నిర్మాణం చేసేందుకూ, వీటి సంఘటితరూపంగా జి.బి.లు స్థాపించేందుకూ, దిద్దుబాటు క్యాంపెయిన్లను, ఎత్తుగడల ఎదురుదాడులను, ఎదురుదాడుల క్యాంపెయిన్లను పథకం ప్రకారం చేపట్టేందుకూ నిర్దిష్ట కర్తవ్యాలు రూపొందించింది. ఈ కర్తవ్యాల సాధన కోసం సాగిన ఆచరణ నుండే విప్లవోద్యమం నేటి స్థాయికి చేరుకున్నది.

మన ప్రజాయుద్ధ నిర్దిష్ట పరిస్థితులనూ, ప్రజాయుద్ధ అవసరాలనూ దృష్టిలో పెట్టుకొని మావో అభివృద్ధి చేసిన సైనిక శాస్త్రాన్ని ఆచరణ నుండి నేర్చుకున్న పాఠాలతో మేళవించి మన సైనిక పంథాని అభివృద్ధి చేసుకున్నాము.

## గెరిల్లా యుద్ధంలో అభివృద్ధి

దేశవ్యాప్తంగా విప్లవోద్యమానికి వ్యతిరేకంగా గత పది సంవత్సరాలలో శత్రువు కొనసాగించిన నిర్బంధాన్నీ, అనుసరించిన కొత్త కొత్త ఎత్తుగడలను తిప్పికొట్టడానికి పార్టీ నాయకత్వంలో పిఎల్జిఏ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రంగా, విస్తృతంగా కొనసాగించింది. నందిగ్రాం, లాల్గఢ్, నారాయణపట్నా పోరాటాలతో పాటు వివిధ రాష్ట్రాలలో కొనసాగిన అనేక విస్థాపన వ్యతిరేక ఆందోళనలకు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి చురుకుగా మన పిఎల్జిఏ దన్నుగా నిలిచింది. దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బంగ్, ఏఓబిలలో గెరిల్లా యుద్ధంలో గొప్ప నమూనాలుగా నిలిచే ఉన్నతస్థాయి ఎత్తుగడల ఎదురుదాడులు నిర్వహించి పిఎల్జిఏ

శత్రువును కంగు తినిపించింది. గెరిల్లా యుద్ధ నియమాలైన రహస్యం, వేగం, దృఢ సంకల్పాన్ని పరిస్థితులకు తగిన విధంగా సృజనాత్మకంగా అమలుపర్చి ధైర్యంగా దృఢసంకల్పంతో, త్యాగనిరతితో పోరాడడం వల్లనే ఈ దాడుల్లో విజయాలను అది సాధించగలిగింది. ఈ నియమాలను, ఈ పోరాటశైలిని సరిగా అమలు జరపని కారణంగా కొన్ని దాడుల్లో అది విఫలమైంది లేదా పాక్షిక విజయాలను సాధించింది. ఈ క్రమంలో అనేక నూతన అనుభవాలను గడిస్తూ గెరిల్లా యుద్ధాన్ని ఉన్నత స్థాయికి పెంపొందించే కృషి చేసింది. గెరిల్లా దాడుల్లో దెబ్బతిన్న ప్రతిసారీ శత్రువు ప్రజాయుద్ధాన్ని అణచడానికి కొత్త ఎత్తుగడలను ప్రయోగించాడు. వీటిని విఫలం చేయడానికి పిఎల్‌జిఏ వీరోచితంగా, త్యాగపూరితంగా పోరాడి గట్టి జవాబు నిచ్చింది. శత్రు దాడుల నుండి పార్టీని, ప్రజా ఉద్యమాలను, ప్రజల నూతన రాజకీయాధికార అంగాలను కాపాడడం, సంఘటితం చేయడం, విస్తరింపజేయడంలో కీలక పాత్రను పోషించింది. శత్రువుతో జరిపిన యుద్ధంలో అభివృద్ధిని సాధిస్తూ పార్టీ, పి.ఎల్.జి.ఏ.లు ఎత్తుగడల రూపకల్పనలో గొప్ప అనుభవాలను సంపాదించాయి. యుద్ధ అభివృద్ధిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధస్థాయికి, పిఎల్‌జిఏను పిఎల్ఏగా పరివర్తన చెందించే లక్ష్యంతో పార్టీ సరైన సమయంలో అనేక రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లను చేపట్టింది. కొన్ని గెరిల్లా జోన్లలో ఉన్నతస్థాయి సైనిక ఫార్మేషన్లను (కంపెనీలు, కొన్ని గెరిల్లా బెటాలియన్లు) ఏర్పాటు చేసింది. యుద్ధంలో చెప్పుకోదగిన మార్పుకు దారితీసింది. బ్యూరోల స్థాయిలో ఈఆర్‌సి, సిఆర్‌సి కమాండ్ల నుంచి కింది వరకూ కమాండ్లు నిర్మాణమై ఒక మేరకు అభివృద్ధి చెందాయి. పెద్ద సంఖ్యలో శత్రు బలగాల్ని నిర్మూలిస్తూ ఆయుధాలు, మందుగుండు స్వాధీనం చేసుకోవడంలో మన పిఎల్‌జిఏ గొప్ప విజయాలు సాధించింది. ఈ దశాబ్ద కాలంలో 2067 మంది పోలీసు, పారామిలటరీ బలగాలను నిర్మూలించి, 2000 మందిని గాయపరిచింది. 2120లకు పైగా ఆయుధాలను, 92 వేలకు పైగా మందుగుండును శత్రు బలగాల నుండి స్వాధీనం చేసుకొంది. ఉన్నత స్థాయి గెరిల్లా యుద్ధాన్ని కొనసాగిస్తున్న క్రమంలో మొబైల్ యుద్ధ లక్షణాలు గల కొన్ని చర్యలు విజయవంతంగా నిర్వహించింది. పి.ఎల్.జి.ఏ. నిర్వహించిన ఎత్తుగడల ఎదురుదాడుల్లో 165 మంది సాహసిక కమాండర్లు, పోరాటయోధులు అమరులయ్యారు.

రెయిడ్లు, ఆపర్చ్యునిటీ/డెలిబరేట్/ఏరియా ఆంబుష్‌లు, నైట్ ఆంబుష్‌లు, మైన్ యుద్ధ తంత్రం, బూబీట్రాప్స్, స్పెషల్ యాక్షన్ టీముల చర్యలు, ఆర్థిక దాడులు, ఎక్స్‌ప్లోజివ్ వాహనాలపై దాడులు, హెలికాప్టర్లపై దాడులు, మెరుపు దాడులు, సింగిల్ యాక్షన్లు మొదలైన రూపాలలో సాయుధ చర్యలు నిర్వహించి శతృబలగాలను సంహరించి పెద్దెత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకొని గెరిల్లా యుద్ధంలో పిఎల్‌జిఏ అనేక నూతన, విస్తృత, సుసంపన్నమైన అనుభవాలను గడించింది. అది సాయుధ రక్షణలో ఉన్నవారితో పాటు చాలామంది కరుడుగట్టిన

భూస్వాములను, పాలకవర్గ రాజకీయ నాయకులను, పోలీసు అధికార్లను, పోలీసు ఇన్‌ఫార్మర్లను, విప్లవ ద్రోహులను నిర్మూలించింది. విప్లవ ప్రతీఘాతుక సల్వాజుడుం, సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి, సోషల్ ఫాసిస్టు హర్మద్ బాహినిలకు వ్యతిరేకంగా, అగ్రకుల భూస్వామ్య శక్తుల నాయకత్వంలో ఏర్పడిన రణవీర్ సేన వంటి ప్రైవేట్ సైన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించింది, వీరోచితంగా ప్రతిఘటించి అణచివేసింది, ఓడించింది. రాజ్యప్రాయోజిత టిపిసి, జెపిసి, జెఎల్‌టి, పిఎల్‌ఎఫ్‌ఐ, ఎస్‌పిఎం, శాంతిసేన, శాంతి కమిటీ, భైరవ సేన వంటి విప్లవ ప్రతీఘాతుక సాయుధ గ్యాంగులను అణచేందుకై హోరాహోరీ పోరాడుతున్నది.

దేశవ్యాప్తంగా విప్లవోద్యమ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఎల్‌ఐసి' వ్యూహాన్ని అమలుచేస్తూ అనేక విప్లవ ప్రతీఘాతుక రాజకీయ–సైనిక క్యాంపెయిన్లను కొనసాగిస్తూ కార్పెట్ సెక్యూరిటీని, ఫోర్టిఫికేషన్ క్యాంపులను, స్టేషన్లను విస్తరింపజేస్తున్నాయి. వీటిని దెబ్బతీయడంలో భాగంగా మన పిఎల్‌జిఏ రాణిబోదిలి, మురికినార్, బట్‌గావ్, మధుబని, ఆరా, ఎన్‌ఎండిసి, బొకారో, ఆర్.ఉదయగిరి, ఖాస్ మహల్, రాజ్‌పూర్–బఘేలా, సాంక్రైల్, నాల్కో, సిల్దా తదితర షార్ట్ సర్‌ప్రైజ్ అటాక్‌లను, రెయిడ్లను నిర్వహించింది. పెద్ద సంఖ్యలో శత్రు బలగాలను నిర్మూలించడం ద్వారా ఈ దాడులు దేశవ్యాప్తంగా గెరిల్లా యుద్ధానికి గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఇవి ఎప్పటికప్పుడు ఫోర్టిఫైడ్ క్యాంపులు, స్టేషన్లలో ఉంటున్న శత్రు బలగాల మనోస్థైర్యాన్ని దెబ్బతీయగలిగాయి.

పిఎల్‌జిఏ బలగాలలో నూతన, ఉన్నత స్థాయి ఫార్మేషన్లను అభివృద్ధి చేసి, సాయుధం చేసే లక్ష్యంతో గిరిడి, ఆపరేషన్ రోప్ వే 'నయాగఢ్', ఝూఝా (జముయీ) వంటి చర్యలలో శత్రు ఆయుధాగారాలపై దాడులు చేసింది. వందల సంఖ్యలో ఆయుధాలను, పదుల వేల సంఖ్యలో తూటాలను స్వాధీనం చేసుకుంది. వీటిలో నయాగఢ్ రెయిడ్ మరింత ఉన్నత స్థాయిలో జరిగింది. ఈస్టర్న్, సెంట్రల్ రీజియన్ల సంయుక్త కమాండ్ నాయకత్వంలో ఒడిశాలో అత్యంత సాహసోపేతంగా సాగిన ఈ మొబైల్ యుద్ధచర్యలో పిఎల్‌జిఏ తన అత్యుత్తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించింది. రహస్యాన్ని పాటించడంలో, సువిశాలమైన మైదానాలను, అడవులను, నదీనదాలను అధిగమిస్తూ, సి4ని అత్యుత్తమంగా అమలు చేస్తూ, ఫైర్ అండ్ మూవ్‌మెంట్‌లోనూ, వివిధ సైనిక విన్యాసాలు సాగించడంలోనూ నైపుణ్యం సంపాదించుకుంది. విశాల ప్రజారాశులపై ఆధారపడి పిఎల్‌జిఏ సాగించిన ఈ దాడులతో పాలకవర్గాలు వణికిపోయాయి.

కాలినడకన ఎక్కువ సంఖ్యలో మన గెరిల్లా జోన్లలోని లోతట్టు ప్రాంతాల్లోకి చొరబడి మాపింగ్‌అప్ చర్యలు, కూంబింగులు నిర్వహిస్తున్న శత్రు బలగాలను డి.కె.లోని ఉర్పల్‌మెట్ట, మినప, బి.జె.లోని జోర్కో–ఇందిపిడీ, బెహ్‌రాడీహ్, లాతేహార్, కజరా, ధర్‌ధరియా లాంటి చోట్లలో పి.ఎల్.జి.ఏ. బలగాలు ప్రజల సహకారంతో వాటి వెంటబడి, వాటిని ముక్కలు

ముక్కలుగా విభజించి వాటి బలహీనమైన భాగాన్ని ఎక్కువ సంఖ్యలో నిర్మూలించాయి. ఈ చర్యలలో పి.ఎల్.జి.ఏ. తన విన్యాసాల సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా కాలినడకన వచ్చే శత్రు బలగాలను నష్టపర్చడంలో ఒక గుణాత్మకమైన మార్పును అది తీసుకువచ్చింది.

డి.కె.లోని తాడిమెట్ల-1, తోంగూడ, భట్టుగూడెం, భట్టుం, మినప, మర్కనార్, లాహిరి, కొంగెర, భద్రకాళి, కిష్టారం, కోసల్‌నార్, టేడుం, చిత్రం, మాంఝీపార, నూకన్‌పల్లి, చింతగుప్ప, బి.జె.లోని పీర్‌టాండ్, ఒడిషాలోని కాలింగ్‌బడి లాంటి అనేక పెద్ద, మధ్య రకం దాడుల ద్వారా పిఎల్‌జిఏ శత్రు రోడ్ ఓపెనింగ్ పార్టీలను దెబ్బతీసి శత్రు బలగాల సప్లైలకు, వాడి బలగాల బదిలీలు-తరలింపులకు, అధికార్ల పర్యటనలకు గ్యారంటీ లేని స్థితికి ఎప్పటికప్పుడు నెట్టడంతో పాటు వాటి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసింది.

శత్రు మాపింగ్‌అప్ చర్యలను ఎదుర్కొనేందుకు బి.జె.లోని దుల్వాడీహ్, ఫుస్‌రో-కోంద్వాడీహ్ బిడ్వా, అముమాటికర్, డి.కె.లోని మదనవేడ మొదలైన చోట్ల ఏరియా ఆంబుష్‌లను పిఎల్‌జిఏ నిర్వహించి పెద్దమొత్తంలో శత్రు బలగాలను నిర్మూలించి ఆయుధాలను స్వాధీనం చేసుకొని శత్రువు దూకుడుతనానికి అడ్డుకట్ట వేసింది. గెరిల్లా బలగాలకు, కమాండర్లకూ మంచి అనుభవాన్ని అందించింది.

మోటార్ సైకిళ్లపై దాడులకు వచ్చే శత్రు ఎత్తుగడను డి.కె.లోని జారాఘాటీ, కుదురు, సాంగ్‌డీ, ఒడిషాలోని దేకున్‌పానీ లాంటి చర్యలతో పిఎల్‌జిఏ విఫలం చేసింది. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించి మోటార్ సైకిళ్లపై వేగంగా అదనపు బలగాలను మోహరించవచ్చనే శత్రు బలగాల ధీమాను దెబ్బ తీసింది.

శత్రువు కార్పెట్ సెక్యూరిటీని విస్తృతపరుస్తూ 'కార్డన్ అండ్ సెర్చ్' పద్ధతిలో పార్టీ కామ్రేడ్స్‌పై, పి.ఎల్.జి.ఏ. బలగాలపై, స్థానిక నాయకత్వంపై దాడులు చేయడం, కూంబింగ్‌లు చేయడంతో పాటు పిఎల్‌జిఏ జరిపే దాడులను నివారించే ఎత్తుగడను అవలంబించాడు. శతృవు అవలంబించిన ఈ ఎత్తుగడలను డి.కె.లోని పాములవాయ, బండ-1, దర్భగూడెం, తడ్‌కేల్, మోదుగుపాల్-2, టాహ్‌కవాడ లాంటి ఆంబుష్‌ల ద్వారా పిఎల్‌జిఏ ఎదుర్కొంది.

పిఎల్‌జిఏ బలగాల నుండి రక్షణ కోసం, తమ బలగాల తరలింపు కోసం, గెరిల్లా బలగాలపై దాడుల కోసం శత్రువు ఎంపివిలను, హెలికాప్టర్లను పెద్దయెత్తున ఉపయోగిస్తున్నాడు. ఎంపివిలు, వాహనాల్లో ప్రయాణిస్తున్న శత్రు బలగాలను దెబ్బతీయడం కూడా పిఎల్‌జిఏకు సాధారణంగా మారింది. మైన్ యుద్ధతంత్రాన్ని పిఎల్‌జిఏ సృజనాత్మకంగా అభివృద్ధి చేసి వివిధ సైజులలో ఇంప్రూవైజ్డ్ మైన్లను రూపొందించి శత్రు బలగాల మైన్‌ప్రూఫ్/బుల్లెట్‌ప్రూఫ్/ సాధారణ వాహనాలపై విజయవంతంగా ప్రయోగించి పెద్దసంఖ్యలో వాటిని నిర్మూలించి, ఆయుధాలు స్వాధీనం చేసుకొంది. పశ్చిమ బంగ్‌లోని లాల్‌గఢ్-1, బురుడి బాంధ్, పిరాలి

గాడీ మోడ్, లాల్‌గఢ్-2, రామ్‌గఢ్-పింగ్‌బొనీ, బి.జె.లోని భీంబాంధ్, చందౌలీ-ఉత్తర ప్రదేశ్, కిరిబురు, పూండిధిరీ, లాందుప్, గోయెల్‌కేరా-1, కర్మాహీ, లాతేహార్, శ్యాంపూర్ భట్టా, లక్‌రాయ్ మోర్, బర్‌గఢ్, సురంగి టోంగరీ, బలథర్వా, అవస్పిత్, బార్వా , గంతి, చక్రబాంధ్, మరఘౌలీ, గోహ్, బాబా మందిర్, ఫర్సగాం, రాహే, బొకారో, సమ్‌రీపేట్-బలరాంపూర్, ఫుల్‌బసి నది-ఝార్ఖండ్-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు, ఏ.ఓ.బి.లోని గంపకొండ, తెల్లరాయి, మంత్రియాంబ, పాలూర్, రాల్లగడ్డ, డి.కె.లోని పదేడ, కర్రెమర్క, వింజరం, నవాటోలా, కొత్తచెరువు, అడేఝరి, చెరిబేడా, మర్దాపాల్, మాంధగిరి, కోకవాడ, బంజర్‌ఘాటీ, ఆసిర్‌గూడా, గణేష్‌నాలా, సింగవరం, పెదకోడేపాల్, ఆశా, ఇరుప్‌గుట్ట, ఒడిషాలోని బదరపంగ, చింద్‌గఢ్ వంటి గెరిల్లా చర్యలు ఇందుకు నమూనాలు.

వాహనాలలో ప్రయాణించే శత్రు బలగాలను ఫైర్ పవర్‌తో పిఎల్‌జిఏ సమర్థవంతంగా ఎదుర్కొంది. అది నిర్వహించిన అనేక మెరుపుదాడుల్లో వాహనాల్లో ప్రయాణించే పోలీసు బలగాలను నష్టపరిచింది. బి.జె.లో నిర్వహించిన రుషికుండ్, రానిగంజ్ బజార్, బధనియా, ఖుంటీ, గోయిల్‌కేరా-2, టోల్‌ప్లాజా రెయిడ్లు, ట్వాండా బజార్, లాతేహార్, విష్ణుపూర్ ఆంబుష్‌లు, సోనో, చైన్‌పూర్ మహులియాటాండ్ దాడులు, డి.కె.లో నిర్వహించిన టవ్వెటోలా, కిరందుల్-1, 2, మాంధగిరి, సన్‌బయిల్ దాడులు, ఒడిషాలోని జన్నుగూడ రెయిడ్, కర్నాటక-చిక్‌మగళూర్ ఫారెస్ట్ చెక్‌పోస్టుపై రెయిడ్ ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి.

పిఎల్‌జిఏ శత్రు బలహీనతలను ఉపయోగించుకొని రహస్యంగా పోలీస్‌స్టేషన్/క్యాంపుల సమీపానికి వెళ్లి శత్రువును దెబ్బతీసింది. డి.కె.లో జార, బెజ్జి, మదన్‌వేడ, తదితర ఘటనల్లో ఫ్రంటల్ అటాక్‌లు, ఆంబుష్‌లు చేసి పిఎల్‌జిఏ శత్రు బలగాల్ని దెబ్బతీసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నది. ఆక్యురేట్ షూటింగ్ ద్వారా డి.కె.లోని బుర్కపాల్, చింతల్‌నార్‌లలో పోలీసులను మట్టిగరిపించింది.

బి.జె.లోని బనియాడీహ్, బరండా మోడ్‌లలో, పశ్చిమ బంగ్ లోని లాల్‌గఢ్, డి.కె.లోని పూంద్రి మొదలైన చోట్ల పిఎల్‌జిఏ పెద్ద, మధ్యస్థాయి, చిన్న బూబీట్రాప్‌లను (అన్ కంట్రోల్డ్ మైన్) శత్రు బలగాలపై ప్రయోగించి వాటిని దెబ్బతీసింది.

పిఎల్‌జిఏ విజయవంతంగా వినియోగిస్తున్న మైన్ యుద్ధ తంత్రాన్ని విఫలం చేయడం కోసం శత్రువు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి తన ఎత్తుగడలలో మార్పు చేసుకున్నాడు. శతృవు చేపట్టిన ఈ ఎత్తుగడలను సైతం పిఎల్‌జిఏ సృజనాత్మక పద్ధతుల్లో తిప్పికొట్టి మరిన్ని విజయాలు సాధించింది. ఇందుకు ప్రజా ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకొంది. డి.కె.లోని మహామాయ, టిప్రాగఢ్, బస్తర్‌లలోనూ, బి.జె.లోని సరండా వద్ద గనుల ఎక్స్‌ప్లోజివ్ వాహనాలను స్వాధీనం చేసుకొని టన్నులకొలది పేలుడు పదార్థాలను హస్తగతం చేసుకుంది.

శత్రువు ఒకవైపున కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేసుకొని పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ డి.కె.లోని దోడ్‌రాజ్, పూసుటోల, కామానార్, ముర్మురీల వద్ద, బి.జె.లోని బొకారో, వాన్‌సో, మహబ్బత్‌పూర్, పాకుడ్‌ల వద్ద జరిపిన చర్యలలో పిఎల్‌జిఏ స్పెషల్ యాక్షన్ టీములు అత్యంత రహస్యంగా విన్యాసాలు సాగిస్తూ పెద్దయెత్తున శత్రు బలగాలను నిర్మూలించి గుణపాఠాలు అందించాయి.

నీటిపై ప్రయాణించే శత్రు బలగాల బలహీనతలను అధ్యయనం చేసి అహంకారంతో విర్రవీగే ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ కమాండో బలగాలపై బలమెల (మల్కన్‌గిరి) రిజర్వాయర్‌లో పిఎల్‌జిఏ గట్టి దెబ్బతీసింది. ఇందులో 38 మంది గ్రేహౌండ్స్ కమాండోలు మట్టిగరిచారు.

రైల్వే పోలీసు బలగాల బలహీనతలను పసిగట్టి ఏ.ఓ.బి.లోని కూనేరు, బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లలోని నార్‌గంజో బిరామ్‌డీహ్, గోఘీ-బరియాపూర్ మొదలైన చోట్ల పిఎల్‌జిఏ దాడులు జరిపి పోలీసులను నిర్మూలించి ఆయుధాలను స్వాధీనం చేసుకుంది.

ఒడిశాలో హిందూ ఫాసిస్టు మూకల నేత లక్షణానందపై పిఎల్‌జిఏ చేసిన ఖతం దాడి కాషాయి టెర్రరిజంను బహిర్గతపర్చడమే కాక అక్కడ ప్రజాయుద్ధ అభివృద్ధికి తోడ్పడింది.

దండకారణ్యంలో పాలకవర్గాల ప్రతినిధి, సల్వాజుడుం వ్యవస్థాపకుడు, నరహంతకుడు, కరుడుగట్టిన భూస్వామి మహేంద్ర కర్మను జీరంఘాటీ-1 ఆంబుష్‌లో పది మంది అంగరక్షకులతో పాటు ఖతం గావించి పిఎల్‌జిఏ దోపిడి పాలకవర్గాలలో వణుకు పుట్టించింది.

పిఎల్‌జిఏ చొరవ, సమయస్ఫూర్తితో హెలికాప్టర్లపై జరిపిన దాడులు గెరిల్లా యుద్ధంలో మరో నూతన అనుభవాన్ని జోడించాయి. డి.కె.లోని పిడియా, పెదకేడ్వాల్, తేమెల్‌వాడ, బడియ భట్టుం వద్ద, బి.జె.లోని పొడహట్, కొలాద్, కరండీహ్ వద్ద సైనిక హెలికాప్టర్‌లపై పిఎల్‌జిఏ జరిపిన దాడులు భారత వైమానిక సేనను, శత్రు బలగాలను కంగుతినిపించాయి.

దోపిడి పాలకవర్గాలు ఫోర్‌కట్ (తిండి పదార్థాలు, డబ్బు, ఆయుధాలు-మందుగుండు సప్లయిలు, ప్రజామద్దతు-రిక్రూట్‌మెంట్) పాలసీని అవలంబిస్తూ ప్రజాయుద్ధాన్ని దిగ్బంధిస్తున్న పరిస్థితిలో శత్రు ఆర్థిక వనరులపై పిఎల్‌జిఏ దాడులు నిర్వహించి పెద్దయెత్తున స్వాధీనం చేసుకుంది. ఐసిఐసిఐ బ్యాంకు వాహనంపై దాడి (జాతీయ రహదారి-33, రాంచి)లో ఐదు కోట్ల రూపాయలు, మల్కన్‌గిరి-చిత్రకొండ రోడ్డుపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాహనంపై దాడిలో ఒక కోటి రూపాయలు, రూర్కెలా-బరసవా రోడ్డుపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాహనంపై దాడిలో 49 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్న ఘటనలు ఇందుకు నమూనాలుగా నిలుస్తాయి.

గత పదేండ్లలో జరిగిన బూటకపు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించటానికి జరిగిన క్యాంపెయిన్లను పిఎల్‌జిఏ తన శక్తిమేరకు విజయవంతం చేసింది. దేశంలోని కొన్ని

ప్రాంతాలలో ఆవిర్భవిస్తున్న విప్లవ ప్రజా రాజ్యాధికారాన్ని పరిరక్షించుకుంటూ దాన్ని దోపిడి వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ముందుకు తీసుకొని వచ్చింది. అది నానాటికీ దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటోంది.

2009 మధ్య నుండి శత్రువు దేశవ్యాప్తంగా మరో పెద్ద రాజకీయ సైనిక దాడి ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ప్రారంభించి ప్రత్యేక బలగాలతో విప్లవోద్యమంపై దాడులు ముమ్మరం చేశాడు. ఇందులో భాగంగా కోబ్రా(సిఆర్‌పిఎఫ్‌లో కమాండో) బలగాలు సింగన్‌మడుగు (దంతేవాడ) గ్రామం వద్ద మన కామ్రేడ్స్‌పై, ప్రజలపై జరిపిన మొట్టమొదటి దాడిని తిప్పికొడుతూ మన పిఎల్‌జిఏ జరిపిన యుద్ధ చర్య శతృబలగాల ఆత్మస్థైర్యంపై తీవ్ర ప్రభావం వేసింది. అనేక మంది ప్రత్యేక అధికారులు, వందలాది సపోర్టు బలగాల మద్దతుతో కోబ్రా బలగాలు నిర్వహించిన ఈ ఆపరేషన్ విఫలమై దేశవ్యాప్తంగా కోబ్రా బలగాల గురించి శత్రువు చేసిన ప్రచారానికి ఈ దాడితో గట్టి దెబ్బపడింది.

2010 ఏప్రిల్ 6, న చారిత్రాత్మక ముకరం (తాడిమెట్ల–2) ఆంబుష్‌లో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన ఒక కంపెనీ బలగాల్ని ఫైర్ పవర్ ద్వారా పిఎల్‌జిఏ పూర్తిగా తుడిచిపెట్టింది. పిఎల్‌జిఏ బలగాలను అడ్డుకునేందుకు ఆంబుష్ సైట్‌లోకి మైన్‌ప్రూఫ్ వాహనంలో అదనపు బలగాలను శత్రువు తీసుకొని వచ్చినప్పటికీ ఆ వాహనాన్ని పూర్తిగా ధ్వంసం చేయడం ద్వారా వాడి ఎత్తుగడను పిఎల్‌జిఏ పూర్తిగా విఫలం చేసింది. భారతదేశ ప్రజాయుద్ధ చరిత్రలో ఒక అతి ముఖ్య ఘటనగా నిలిచిపోయే ఈ చర్య దేశవ్యాప్తంగా శత్రు వర్గాల్ని తీవ్రంగా కలవరపర్చింది. ఈ చర్య దేశ, ప్రపంచవ్యాప్తంగా మన ప్రజాయుద్ధ ప్రతిష్టను పెంచడమే గాక, పీడిత ప్రజలందరినీ మావోయిస్టు ప్రజాయుద్ధం వైపు మరింతగా ఆకర్షించడానికీ, ఆలోచింపజేయడానికీ తోడ్పడింది.

ఆపరేషన్ గ్రీన్ హంట్ రాజకీయ సైనిక దాడి రెండవ ఫేజ్‌లో పెద్దయెత్తున మాపింగ్ అప్ చర్యలకు శత్రువు పథకం రూపొందించుకున్నాడు. నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశాడు. మమాయిల్ (పశ్చిమ సింఘ్‌భూమ్) వద్ద మన గెరిల్లా క్యాంపును 7 వేల మంది శత్రు బలగాలు చుట్టుముట్టి దాడి చేయగా దాదాపు 30 గంటల పాటు పిఎల్‌జిఏ నిర్విరామంగా కొట్లాడి 5 గురు పోలీసులను నిర్మూలించి, 9 మందిని గాయపరిచి శత్రు చుట్టివేతను బద్దలు కొట్టింది. సరండా ప్రాంతంలో మన బలగాలపై శత్రువు 10 వేల బలగాలతో పెద్దయెత్తున చేపట్టిన చుట్టివేత ఆపరేషన్‌కు వ్యతిరేకంగా పిఎల్‌జిఏ బలగాలు కేంద్రీకృత కమాండ్ నాయకత్వంలో ప్రతిఘటన చేపట్టాయి. 72 గంటల పాటు పోరాడి విడి విడి ఘటనలలో 5 గురు పోలీసులను నిర్మూలించి, 12 మంది గాయపర్చి శత్రు ఆపరేషన్‌ను విఫలం చేశాయి. వందలాది కోబ్రా, కోయ కమాండో బలగాలు చింతల్‌నార్ (దంతేవాడ) ప్రాంతంలోని తింపురం, మోర్‌పల్లి, తాడిమెట్ల గ్రామాలను తగులబెట్టి, హత్యలు చేస్తూ, మహిళలపై అత్యాచారాలు సాగిస్తూ సర్వం విధ్వంసం సృష్టిస్తుండగా, తింపురం వద్ద పిఎల్‌జిఏ బలగాలు గంటల తరబడి

పోరాడి ముగ్గురు కోబ్రా కమాండోలను మట్టిగరిపించి తొమ్మిది మందిని గాయపర్చి మిగిలిన వాళ్లను తరిమేసింది. ఈ పోరాటంలో పిఎల్‌జిఏతో పాటు పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఇవి గెరిల్లా యుద్ధంలో పెద్ద మిలటరీ ఆపరేషన్లుగా, సమరాలుగా నిలిచాయి. వీటిలో సి4 మెరుగ్గా అమలైంది.

పగటి పూట శత్రువు అనుసరించిన ఎత్తుగడలు ఒక్కొక్కటి ప్రజాగెరిల్లాల చేతుల్లో విఫలమవుతుండగా వాడు గెరిల్లాల లాగా రాత్రిపూట కదలికలను పెంచుతూ తన ఎత్తుగడలను మార్చుకొన్నాడు. దీంతో పిఎల్‌జిఏ నైట్ ఆంబుష్‌లపై కేంద్రీకరించింది. డి.కె.లోని బోర్‌గూడ, గట్టం, కిరందూల్-1, 2, బడే ఝులియా నైట్ ఆపర్చ్యునిటీ రెయిడ్, బి.జె.లోని ఎంపి ఇంద్రజిత్ నామ్‌ధేర్ కాన్వాయ్‌పై చర్య మొదలైన ఎత్తుగడల ఎదురుదాడుల్లో పిఎల్‌జిఏ శత్రువును గణనీయమైన సంఖ్యలో నిర్మూలించి ఆయుధాలు స్వాధీనం చేసుకుంది.

విప్లవకారుల బూటకపు ఎన్‌కౌంటర్లు, అమాయక ప్రజల ఊచకోతలు, అత్యాచారాలు, అణచివేత క్యాంపెయిన్లకు నిరసనగా దేశవ్యాప్తంగా, వివిధ రాష్ట్రాలలో జరిగిన బంద్‌లు, నిరసన దినాలు, ఆర్థిక దిగ్బంధనాల సందర్భంగా పిఎల్‌జిఏ నాయకత్వంలో ప్రజలు, ప్రజా మిలీషియా వేలాది సంఖ్యలో కదిలి వందల సంఖ్యలో సాబోటేజ్ చర్యలు నిర్వహించారు. బహుళజాతి కంపెనీలకు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వందలాది కోట్ల రూపాయల విలువైన ఆస్తులను ధ్వంసం చేశారు. శత్రువును చికాకుపర్చే వందలాది చర్యలు నిర్వహించారు. పలు చర్యలలో శత్రు సప్లైలను స్వాధీనం చేసుకున్నారు.

చిన్నచిన్న పి.ఎల్.జి.ఏ., ప్రజామిలీషియా టీములు వారాంతపు సంతల్లో ఒంటరిగా, జంటలుగా, టీములుగా తిరిగే పోలీసుల మీద పడి వారిని సాంప్రదాయక, ఆధునిక ఆయుధాలతో నిర్మూలించి లేదా గాయపరిచి వారి వద్ద ఆయుధాలను గుంజుకునే చర్యలను అనేకం నిర్వహించాయి.

మాకడ్‌చువ్వ (గడ్చిరోలి) లో వందలాది కేంద్ర రాష్ట్ర కమాండో బలగాలు వలయాలుగా చుట్టుముట్టి ఆధునిక ఆయుధాలతో విచ్చలవిడిగా దాడి చేసినప్పటికీ శత్రు వలయంలో ఒంటరిగా చిక్కుకుపోయిన చాత్‌గావ్ ఏరియా జనతన సర్కార్ అధ్యక్షురాలు కామ్రేడ్ రణిత చివరి ఊపిరి వరకు వీరోచితంగా పోరాడుతూ ముగ్గురు కమాండోలను మట్టిగరిపించి, ఐదుగురిని గాయపరిచింది. కామ్రేడ్ రణిత జనతన సర్కార్లకు, పార్టీకి, పిఎల్‌జిఏ బలగాలకు ఆదర్శనీయంగా నిలిచింది. ఇదే విధంగా బీహార్, ఝార్ఖండ్, దండకారణ్యం, ఇతర ఉద్యమ ప్రాంతాలలో అనేక ఎన్‌కౌంటర్లలో కామ్రేడ్ డేవిడ్ (మమాయిల్) వంటి పిఎల్‌జిఏ కమాండర్లు, పోరాటయోధులు గంటల తరబడి శత్రు బలగాలతో వీరోచితంగా పోరాడుతూ నాయకత్వాన్ని కాపాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి శత్రువును మట్టిగరిపించి ఆదర్శనీయంగా నిలిచారు.

బి.జె.లో ఎస్‌పి సురేంద్ర బాబు, ఎస్‌పి అమరజిత్ బలిహార్, డి.కె.లో ఎస్‌పి వికె చౌబే, సిఆర్‌పిఎఫ్ కమాండెంట్, ఎస్‌టిఎఫ్ కంపెనీ కమాండర్ లవ్‌కుమార్ భగత్, సి–60 కమాండో లీడర్ చిన్న వెంటా, కోయ కమాండో బలగాల కంపెనీ కమాండర్లు, ఏఎస్‌పి రాజేష్ పవార్ (సన్‌బైల్, గరియాబంద్), ఏ.ఓ.బి.లో బిఎస్‌ఎఫ్ కమాండెంట్‌ల వంటి క్రూరులైన పోలీసు అధికార్లను, డి.కె.లో సల్వాజుడుంకు వెన్నుదన్నుగా నిల్చిన ప్రజావ్యతిరేక బూర్జువా పార్టీ నాయకులతో పాటు, సల్వాజుడుం గూండాలను, ఎస్‌పిఓలను, కోయ కమాండోలను, బి.జె.లో టిపిసి లాంటి సాయుధ ప్రతీఘాతుక సంస్థల నాయకులను, కరుడుగట్టిన సభ్యులను, వివిధ రాష్ట్రాలలో చాలా మంది క్రూరులైన పెత్తందార్లను, పిఎల్‌జిఏ అంతమొందించింది.

వందలాది సింగిల్ యాక్షన్స్ నిర్వహించడం ద్వారా ఉద్యమానికి వ్యతిరేకంగా నిలిచిన అనేక మంది భూస్వాములను, వారి ఏజెంట్లను, విప్లవ ప్రతీఘాతుక శక్తులను పిఎల్‌జిఏ నిర్మూలించింది.

శత్రువుకు కండ్లు, చెవులుగా మారి విప్లవోద్యమంపై దాడులకు పాల్పడుతున్న వాడి నెట్‌వర్క్‌లోని ఇన్ఫార్మర్లను, కోవర్టులను ఏరివేయడంలో పిఎల్‌జిఏ కేంద్రీకరించింది. ఈ పది సంవత్సరాల కాలంలో వందలాది శత్రు ఏజెంట్లను అది నిర్మూలించింది.

శత్రు బలహీనతలను కనిపెట్టి చొరవతో జహానాబాద్, దంతేవాడ, లఖీసరాయ్, గిరిడి, చాయిబాసా, రూర్కేలా, సరైకేలా–కర్‌సవాన్ వంటి జైలుబ్రేక్‌లను (బైటి నుండి, లోపలి నుండి)నిర్వహించడం ద్వారా జైళ్లలో మగ్గుతున్న పదుల సంఖ్యలో మన పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, వందల మంది పీడిత ప్రజలు శత్రు శిబిరం నుంచి విముక్తి పొందారు. దండకారణ్యంలో సల్వాజుడుం నిర్బంధ శిబిరాలపై పిఎల్‌జిఏ దాడులు చేసి శిబిరాల్లో మగ్గుతున్న చాలామంది ప్రజలను తమ గ్రామాల్లోకి చేర్చింది.

ప్రజలు, ప్రజామిలీషియా బలగాలు పెద్దయెత్తున కదలి సాయుధంగానూ, నిరాయుధంగానూ ప్రతిఘటించడంతో గత పదేండ్లలో శతృవు తన క్యాంపులెన్నింటినో ఎత్తివేసుకున్నట్లే ఇటీవల నూతనంగా ఏర్పరచిన రెండు పెద్ద క్యాంపులను కూడా ఎత్తివేసుకునేలా చేసింది. ప్రజల క్రియాశీల మద్దతుతో వందలాది మంది గెరిల్లాలు, ప్రజా మిలీషియా కలిసి కొనసాగించిన సాయుధ ప్రతిఘటన ద్వారా మినప (సుక్మా) సిఆర్‌పిఎఫ్ క్యాంపును, ప్రజల ప్రత్యేకించి మహిళల విస్తృత సామూహిక నిరాయుధ ప్రతిఘటన ద్వారా హర్రాకోడేర్ (తూర్పు బస్తర్)లో సిఆర్‌పిఎఫ్ క్యాంపును శత్రువు ఎత్తేసుకున్నాడు.

పిఎల్‌జిఏ సాధించిన ఈ విజయాలన్నింటికి ప్రజల గొప్ప త్యాగాలు, యుద్ధంలో వారి క్రియాశీల భాగస్వామ్యం ఒక ప్రధాన కారణం. కాగా, యుద్ధంలో కీలక మలుపులను తేవడానికి ప్రతి యుద్ధచర్యలో అత్యంత సాహసం, త్యాగ నిరతిని ప్రదర్శించి తమ విలువైన ప్రాణాల్ని ధారబోసి నూతన అభివృద్ధికి కారకులైన పార్టీ నాయకత్వం, సభ్యులు, పిఎల్‌జిఏ యోధుల,

కమాండర్ల నెత్తుటి త్యాగాలు లేకుండా మనం ఈ విజయాలను ఊహించలేం.

పిఎల్‌జిఏ మొదట ప్లాటూన్లు, కంపెనీలు కేంద్రంగా, ఆ తర్వాత బెటాలియన్ల స్థాయిలో దాడులు చేసే స్థితికి అభివృద్ధి చెందింది. కేంద్రీకరించిన గెరిల్లా బలగాలు పెద్ద దాడులకు పూనుకోగా, వికేంద్రీకరించిన యూనిట్లు చిన్న, మధ్య స్థాయి చర్యలు నిర్వహించాయి. క్రమంగా పిఎల్‌జిఏ సమీకరణ సామర్థ్యం పెరుగుతూ శత్రు బలగాలతో గంటల తరబడి పోరాడుతూ అనేక అనుభవాలు గడిస్తున్నది. ఫైర్ అండ్ మూవ్‌మెంట్, సిక్యూబి (క్లోజ్డ్ క్వార్టర్ బ్యాటల్) స్కిల్స్, ఫ్లాంకు, రేర్, ఫ్రంటల్ విన్యాసాలను సాగిస్తూ, టీములుగా, గ్రూపులుగా కొట్లాడుతూ శత్రు బలగాలను నిర్మూలించడంలో పిఎల్‌జిఏ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నది. శత్రువును చుట్టుముట్టి దాడి చేయడం, వివిధ రకాల బూబీట్రాపుల్ని, సాంప్రదాయక ట్రాపుల్ని విస్తృతంగా అభివృద్ధి చేసి ఉపయోగిస్తున్నది. ఎత్తుగడల ఎదురుదాడుల్లో సి4 సాధించడంలో క్రమంగా పట్టు సాధిస్తున్నది. విఫలమైన (షార్ట్ సర్‌ప్రైజ్ రెయిడ్స్), పాక్షికంగా సఫలమైన, విజయవంతమైన ఎత్తుగడల ఎదురుదాడుల (రెయిడ్స్, వివిధ రకాల ఆంబుష్‌లు, చికాకుపర్చే చర్యలు) నుండి తప్పుఒప్పులను బేరీజు వేసుకుంటూ తప్పుల నుండి నేర్చుకుంటూ తగిన గుణపాఠాలతో గెరిల్లా యుద్ధంలో అభివృద్ధిని సాధించటానికి కృషి చేస్తున్నది.

## గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో పిఎల్‌జిఏ ఎదుర్కొన్న వైఫల్యాలు – సవాళ్లు

2013 సిసి 4వ సమావేశం దేశవ్యాప్తంగా మన ఉద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నదని అంచనా వేసింది. 2004లో సిపిఐ (మావోయిస్టు) ఏర్పడినప్పటి నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్ఐసి వ్యూహంతో దేశవ్యాప్తంగా విప్లవోద్యమంపై తెరపిలేకుండా కొనసాగిస్తున్న బహుముఖ దాడులు ప్రస్తుత ఈ స్థితి తలెత్తడానికి దారితీసిన ముఖ్యమైన కారణాల్లో ఒకటి. ఇందుకోసం శత్రువు ప్రతి రాష్ట్రంలోనూ పదుల వేల సంఖ్యలో తన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బలగాలను మోహరించాడు. 2010 మధ్యభాగం నాటికి విప్లవోద్యమ నిర్మూలనకు $3–3\frac{1}{2}$ లక్షల పోలీసు, పారామిలటరి బలగాల్ని మోహరిస్తే, నేడు ఆ సంఖ్య ఐదు లక్షలకు చేరుకుంది.

గత పది సంవత్సరాలలో బూటకపు ఎన్‌కౌంటర్లలో ఐదుగురు కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు అమరులు కాగా మరో ఐదుగురు అనారోగ్యంతో అమరులయ్యారు. 16 మంది కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులతో పాటు పదుల సంఖ్యలో రాష్ట్ర కమిటీ స్థాయి కామ్రేడ్స్ నేటికీ జైళ్లలో మగ్గుతున్నారు. 2009 నుండి 2012 మధ్య కాలంలో శత్రువు మన కేంద్ర విభాగాలకు చాలా నష్టం కలిగించాడు. ఇది పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఇది పిఎల్‌జిఏ పోరాట సామర్థ్యానికి, యుద్ధ వనరులకు, ఎత్తుగడల అభివృద్ధికి పరిమితులు విధించింది.

విప్లవోద్యమం కొనసాగుతున్న ప్రాంతాల్లో (ముఖ్యంగా ప్రభుత్వం గుర్తించిన 82 జిల్లాల్లో) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం వేలాది కోట్ల రూపాయలను గుమ్మరించి కొనసాగిస్తున్న సంస్కరణల ఫలితంగా ప్రజా శిబిరంలో చీలిక మొదలయ్యి, ఒక చిన్న సెక్షన్

దోపిడి పాలకవర్గాల సామాజిక పునాదిగా మారుతున్నారు. ఫలితంగా విప్లవోద్యమానికి అనేక ప్రతికూలతలు ముందుకు వస్తున్నాయి. ఉద్యమ ప్రాంతాలంతటా వ్యవసాయక విప్లవ కార్యక్రమం ఆధారంగా వర్గ పోరాటాన్ని కొనసాగించడంలో తరతమ తేడాలతో కొనసాగుతున్న బలహీనతలు ఈ స్థితి తలెత్తడానికి గల కారణాల్లో ఒకటి. మారుతున్న దేశీయ, అంతర్జాతీయ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని సరైన ఎత్తుగడలను రూపొందించు కోవడంలో, రూపొందించుకున్న ఎత్తుగడలను అమలు చేయడానికి పార్టీనీ, ప్రజలనూ సమీకరించడంలో, మన లక్ష్యాన్ని పరిపూర్తి చేయడం కోసం దృఢమైన కృషి చేయడంలో, మన పార్టీలో, పిఎల్‌జిఎలో, విప్లవోద్యమంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న కార్మికవర్గేతర ధోరణులను సరిచేసుకోవడంలో, సాయుధ ప్రతిఘటనలోకీ, ఎదురుదాడులలోకీ ప్రభావవంతంగా పిఎల్‌జిఎనూ, ప్రజలనూ విస్తృతంగా సమీకరించడంలో, రహస్య పని విధానాన్నీ, గెరిల్లా యుద్ధ సూత్రాలనూ అమలు చేయడంలో, లీగల్-ఇల్లీగల్ సమన్వయ యంత్రాంగంలో, పార్టీకీ, పిఎల్‌జిఎకూ, ఆర్పీసీలకూ, ప్రజాసంఘాలకూ సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా, మిలటరీపరంగా పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ గరపడంలో, పట్టణ ఉద్యమాలను సంఘటితపర్చి, అభివృద్ధి చేయడంలో, మన ఉద్యమ ప్రాంతాలలోనూ, బయటా రైతాంగేతర విశాల ప్రజలను సమీకరించడంలో బలహీనతలూ, లోపాలు కొనసాగాయి. మన పంథాకూ, విధానాలకూ అనుగుణంగా అన్ని స్థాయిల్లో రాజకీయ, నిర్మాణపర కృషి చేసి విశాల ప్రజానీకాన్ని విప్లవోద్యమంలోకి సమీకరించడంలో కూడా పరిమితులు ఉన్నాయి. ప్రజాపునాది, భర్తీ, పోరాటశక్తి తగ్గిపోయి - స్వీయాత్మక పరిస్థితిలో వచ్చిన ఈ మార్పు వల్ల, దేశంలోనూ, ప్రపంచంలోనూ విప్లవానికి అనుకూలంగా విప్లవ భౌతిక పరిస్థితి అద్భుతంగా పెంపొందుతున్నప్పటికీ దీనిని సద్వినియోగం చేసుకోవడంలో పరిమితులకు గురవుతున్నాం.

మొత్తంగా చూసినప్పుడు విప్లవోద్యమం ప్రస్తుతం ప్రధానంగా ఆరు సవాళ్లను తీవ్రంగా ఎదుర్కొంటున్నది. 1) సరైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ కృషిని సాగించడంలో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకొని పార్టీని, పిఎల్‌జిఏను, ప్రజాసంఘాలను, ఐక్యసంఘటనా వేదికలను బలమైన పోరాట శక్తిగా మలచుకోవడం. 2) శత్రు బహుముఖ దాడులను, వాడి సంస్కరణ, సంక్షేమ కార్యక్రమాలను సకాలంలో ఎదుర్కోవడానికి తగిన ఎత్తుగడలను రూపొందించి సృజనాత్మకంగా అమలు చేయడంలో కొనసాగిన లోపాలను, బలహీనతలను అధిగమించడం. 3) వాస్తవిక పరిస్థితులను లోతుగా అర్థం చేసుకునేందుకు నిర్దిష్ట అధ్యయనం చేయడంలో జరిగిన లోపాన్ని సరిదిద్దుకోవడం. 4) గెరిల్లా యుద్ధాన్ని, ప్రజా పోరాటాలను సమర్థవంతంగా సమన్వయించి నడపడంలో జరిగిన లోపాన్ని సవరించుకోవడం. 5) పట్టణ, మైదాన పనికి సంబంధించి పని పద్ధతులలో గల లోపాలను అధిగమించడం. 6) శతృవు వివిధ రూపాలలో పై నుండి కింది వరకూ మన పార్టీకి కలిగిస్తున్న నాయకత్వ, క్యాడర్ల నష్టాలను తగ్గించుకోవడం, లొంగుబాట్లను అరికట్టడం, విద్రోహుల ఆట కట్టించడంలో గల లోపాలను అధిగమించడం.

## ముగింపు

మనం ఇంతవరకు శత్రువుకు ఎన్ని నష్టాలు కలిగించినా, ఎన్ని విజయాలు సాధించినా, వాడు ఇంకా బలసంపన్నుడనీ, మనలోనూ ఇంకా బలహీనతలున్నాయనీ, పోరాటం మరింత సుదీర్ఘంగా, కర్కశంగా ఉంటుందనేది స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనం సరిగా, దృఢసంకల్పంతో పోరాటాన్ని కొనసాగించడం ద్వారానే విజయాన్ని సాధించగలం. ఈ అవగాహన, విశ్వాసం యావత్తు పార్టీలో, పిఎల్‌జిఏలో, ప్రజలలో ఖచ్చితంగా నెలకొల్పాలి. ఈ సందర్భంగా శత్రువుకున్న వ్యూహాత్మక బలహీనత, విప్లవ శిబిరానికున్న వ్యూహాత్మక బలాన్నీ, దేశంలో కొనసాగుతోన్న కాలంచెల్లిన అర్ధవలస, అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాల మూలంగా ప్రజల బతుకులు దినదినం దుర్భరమవుతున్న తీరునూ, గత 20 సం॥రాలకు పైగా పాలకవర్గాలు ప్రజావ్యతిరేక, దేశవ్యతిరేక నయా ఉదారవాద విధానాలు అమలు చేస్తున్న ఫలితంగా దేశంలోని ప్రముఖ వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్న తీరునూ, సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక సంక్షోభం ఫలితంగా ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమవుతూ వివిధ రూపాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఉద్యమిస్తున్న తీరునూ, ఇప్పటికీ మనకున్న ప్రజాపునాదిని, నాయకత్వ శక్తులను, నాయకత్వ వనరులను, ప్రజాయుద్ధంలో పిఎల్‌జిఏ, ప్రజలు పొందిన విజయాలను, సంపాదించిన విలువైన అనుభవాలను పార్టీలో, పిఎల్‌జిఏలో, ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి విప్లవోద్యమంపై విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలి. శత్రువు తలపెట్టిన విప్లవ ప్రతీఘాతుక బహుముఖ దాడిని ఓడించడం ద్వారానే మన విప్లవోద్యమం మరో మెట్టు అభివృద్ధి చెందుతుంది.

మన పార్టీవిప్లవ సిద్ధాంత రాజకీయాలే, రాజకీయ పంథాయే, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాయే ప్రజా విముక్తికి, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి ఏకైక మార్గమని సంపూర్ణంగా విశ్వసించి శత్రువుతో దృఢంగా పోరాడకుండా దేశవ్యాప్త శత్రు బహుముఖ దాడిని ఓడించడం సాధ్యం కాదు. పార్టీ, పిఎల్‌జిఏ ప్రజా రాజ్యాధికార అంగాలలో దృఢత్వాన్ని దెబ్బతీయడానికి శత్రువు అంతులేని కుట్రలు పన్నుతున్నాడు. శత్రువు విప్లవ శక్తులలోకి కోవర్టులను చొప్పించి నష్టాలు కలిగించడంతో పాటు విప్లవ శ్రేణులలోనే అంతర్గతంగా అవిశ్వాసాన్ని సృష్టించి నాశనం చేయాలని చూస్తున్నాడు. మోడీ నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరెస్టులు, చిత్రహింసలు, బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా, ఊచకోత కోయడం ద్వారా తెల్ల బీభత్సాన్ని సృష్టిస్తూనే ఆపరేషన్ గ్రీన్ హంట్ మూడవ దశ దాడికి తుదిమెరుగులు

> "తనను తాను కాపాడుకోవటం-శత్రు నిర్మూలన అనేది యుద్ధ లక్ష్యం. యుద్ధం యొక్క ప్రధాన సారాంశమిది. యుద్ధ కార్యకలాపాలన్నిటికీ ప్రాతిపదిక ఇది. యుద్ధ సూత్రంలో యుద్ధ లక్ష్యం ఇమిడి ఉంది. టెక్నికల్ చర్యలుగానీ, ఎత్తుగడలు లేక వ్యూహంగానీ, సూత్రాలు లేక అభిప్రాయాలుగానీ ఇందుకు భిన్నంగా వెళ్లుటకు వీలులేదు."
>
> - మావో, దీర్ఘకాలయుద్ధం

దిద్దుతున్నాయి. ఈ దాడుల్ని అత్యంత దృఢంగా, సాహసోపేతంగా, త్యాగనిరతితో ఎదుర్కోవాలని నేటి పరిస్థితి మన విప్లవ శ్రేణులకు, పిఎల్‌జిఏకు సూచిస్తున్నది.

మన నూతన పార్టీ రాజకీయ వ్యూహం పట్ల, సైనిక వ్యూహం పట్ల మనకు స్పష్టమైన అవగాహన ఉండడం. ద్వారానే ప్రతిదాడి ఎత్తుగడలను సరిగా రూపొందించగలుగుతాం. ప్రస్తుత పరిస్థితుల్లో కామ్రేడ్ మావో బోధించిన గెరిల్లా యుద్ధ నియమాలను అధ్యయనం చేసి వాటిని తప్పకుండా సృజనాత్మకంగా, దృఢంగా అమలు చేయడానికి మన పిఎల్‌జిఏనూ, ప్రజా మిలీషియాను సిద్ధం చేయాలి.

ఏ యుద్ధంలోనైనా సాహసించి, ధైర్యంగా పోరాడిన పక్షానికే విజయం చేకూరుతుందనేది చారిత్రక సత్యం. స్వపక్షానికి తక్కువ నష్టాలు జరిగేలా చూసుకుంటూ, శత్రు పక్షానికి ఎక్కువ నష్టం కలిగిస్తూ వాడిని పూర్తిగా ఓడించే వైపుగా పయనించగలుగుతామనేది కూడా వాస్తవం. మన పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా రాజ్యాధికార అంగాలు శతృదాడుల నుండి రక్షించుకోవడానికి, నూతన విజయాలు సాధించడానికి, పెద్ద అంగలతో పురోగమించడానికి, శత్రువుకు ఎక్కువ నష్టాలు కలిగించడానికి వాడికి వ్యతిరేకంగా సాహసించి ధైర్యంగా త్యాగనిరతితో పోరాడడం ఎంతో అవసరమని మన ప్రజాయుద్ధంలో కూడా పదే పదే రుజువైంది. కనుక, శత్రువుపై మన దాడి ఎల్లప్పుడూ వర్గ కసితోనూ, నిర్భయంగానూ, దృఢసంకల్పంతోనూ కొనసాగించాలి. త్యాగం లేకుండా మన రాజకీయ లక్ష్యం సాధించడం, ప్రజల ప్రయోజనాలు నెరవేర్చడం సాధ్యం కాదని గుర్తించి, శత్రు బలగాలను ఢీకొనడంలో సాహసోపేతంగా ముందు వరుసన నిలబడాలి.

ప్రజాయుద్ధం ప్రజలు నిర్వహించే యుద్ధం అనేది మావోయిస్టు సూత్రం. మన పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా రాజ్యాధికార అంగాలు, విప్లవ ప్రజా సంఘాలు అన్నీ ప్రతి విషయంలోనూ ప్రజల మీద ఆధారపడి ప్రజాయుద్ధాన్ని సాగించడం ద్వారానే విప్లవ లక్ష్యాన్ని సాధించేందుకు చేరువ కాగలుగుతాయి. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, వారి దైనందిన, మౌలిక సమస్యల పరిష్కారానికి వారితో సంపూర్ణంగా మమేకమై వారికి అన్ని రంగాలలో సేవ చేస్తూ, వారిని చైతన్యపరుస్తూ,

> చైతన్యయుతమైన ప్రతిభావంతమైన పాత్ర నిర్వహించడం మానవుడి ప్రత్యేక లక్షణం. యుద్ధంలో ఈ లక్షణాన్ని మానవుడు బలంగా ప్రదర్శించుతాడు. ఇరుపక్షాలలోని మిలటరీ, రాజకీయ, ఆర్థిక, నైసర్గిక పరిస్థితులపైన, ఇరుపక్షాలు సాగిస్తున్న యుద్ధస్వభావంపైన, ఇరుపక్షాలకు లభ్యమయ్యే అంతర్జాతీయ సహకారంపైన యుద్ధంలో విజయం లేక ఓటమి ఆధారపడే మాట వాస్తవమే, కాని ఇవి మాత్రమే యుద్ధ ఫలితాన్ని నిర్ణయించలేవు. ఈ అంశాలు యుద్ధంలో విజయానికి లేక ఓటమికి ప్రాతిపదిక నేర్పరుస్తాయి తప్ప వాటంతటవే అంతిమ ఫలితాన్ని నిర్ణయించలేవు. ఈ అంశాలకు తోడుగా స్వీయాత్మక కృషి, యుద్ధ నిర్వహణ, మానవుడి ప్రతిభావంతమైన పాత్ర కలిసినపుడే అంతిమ ఫలితం నిర్ణయించబడుతుంది.
>
> - మావో, దీర్ఘకాలయుద్ధం

వారి చైతన్యయుత భాగస్వామ్యంపై ఆధారపడి, వారిని సాయుధం చేయడం నేటి మన ముఖ్య కర్తవ్యం. విస్తృతంగా నిర్మించబడిన ప్రజా మిలీషియా రాశులే మన లక్ష్యాన్ని నెరవేర్చేందుకు, పిఎల్‌జిఏ పిఎల్‌ఏగా మారేందుకు ముఖ్యమైన పునాది అవుతుంది. ప్రజల నుండి విప్లవకారులను వేరు చేయాలని శత్రువు చేసే ప్రతి ప్రయత్నాన్నీ తిప్పికొడుతూ, ప్రజాపునాదిని పెంపొందిస్తూ, అదే ప్రజాపునాదిపై ఆధారపడి శత్రువును ప్రజల నుండి విడగొట్టి ఏకాకిని చేసి దెబ్బతీయాలి.

ఈ పరిస్థితుల్లో, మనం చేపట్టిన బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా విస్తృతంగా ఎంఎల్ఎం, చరిత్ర అధ్యయనం చేయడం, తప్పులను సరిదిద్దుకోవడం, పార్టీ లోపల, పిఎల్‌జిఏ లోపల కార్మికవర్గ భావజాలానికీ–దృక్పథానికీ, కార్మికవర్గేతర భావజాలానికీ–దృక్పథానికీ మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయాలి. కార్మికవర్గ భావజాలాన్ని, దృక్పథాన్ని స్వీకరించాలి, దృఢపరచుకోవాలి. కార్మికవర్గేతరమైన ప్రతిదాన్నీ తిరస్కరించాలి, వదలించుకోవాలి. బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా తప్పులను సరిదిద్దుకోవడంలో, ఉత్పత్తి కోసం కృషి చేయడంలో – పిఎల్‌జిఏ చురుగ్గా పాల్గోవాలి. ఈ రెండూ సైద్ధాంతిక రంగంలో, భౌతిక జీవితంలో అత్యంత నిర్ణయాత్మక పాత్రను పోషిస్తాయి. సరైన సైద్ధాంతిక దృక్పథం, ఒకే లక్ష్యసాధనకు స్పష్టమైన కార్యక్రమం, సరైన ఎత్తుగడలు, దృఢసంకల్పంతో పనిచేయడం ఉన్నప్పుడే పిఎల్‌జిఏ కమాండర్లు, పోరాటయోధులు హృదయపూర్వంగా కార్యాచరణలో మమేకం కాగలుగుతారు. పార్టీ, పిఎల్‌జిఏ వర్గ సంపుటి నేపథ్యాన్ని పరిశీలించినపుడు వీరిలో మెజారిటీ మంది కార్మికవర్గేతర శ్రేణుల నుంచి, ప్రత్యేకించి రైతాంగం, పెటీబూర్జువా వర్గం నుంచి వచ్చిన కామ్రేడ్సే ఉన్నారు. వీరు లక్ష్యసాధనకు సమాజంలోని దోపిడీ, పీడనలను ధ్వంసం చేసే పోరాటంలో పాలుపంచుకున్నప్పటికీ, పార్టీ నాయకత్వం చైతన్యపూర్వకంగా వీరిని సైద్ధాంతికంగా, రాజకీయంగా విద్యావంతం చేసుకోవాలి; వారి సైద్ధాంతిక దృక్పథాన్ని మెరుగుపరచాలి. ఈ సైద్ధాంతిక–రాజకీయ కృషిని మనం నిరంతర ప్రక్రియగా, క్యాంపెయిన్లుగా కొనసాగించాలి. వీరిలో ఉక్కు క్రమశిక్షణా స్ఫూర్తిని నింపాలి. యుద్ధరంగానా, వెనుకతట్టునా కార్మికవర్గ నాయకత్వానికి అంటిపెట్టుకొని ఉండేలా, నూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిజం–కమ్యూనిజం లక్ష్యం కోసం పోరాడేలా వారిని తీర్చిదిద్దాలి. పి.ఎల్.జి.ఏ.ను ప్రజాయుద్ధ క్రమంలో బలమైన ప్రజా విముక్తి సైన్యంగా అభివృద్ధి చేయాలి. అటువంటి ప్రజాసైన్యమే నేటి సమాజంలోని దోపిడీ, పీడనలను సమూలంగా నిర్మూలించి సోషలిజం–కమ్యూనిజం వైపుగా సమాజాన్ని పురోగమింపజేయగలుగుతుంది. నేడు శత్రువు అత్యంత క్రూరంగా దాడి చేస్తున్న సమయం, మనం తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్న సమయం ఇది. మనం సరిగ్గా ఈ సమయంలోనే శత్రువుకు వ్యతిరేకంగానూ, మనకు అనుకూలంగానూ పరిస్థితిలో మార్పు తీసుకొని రావడానికి చొరవతో చైతన్యవంతమైన కృషి చేయాలి.

శత్రు దాడిని ఓడించడం అనేది – శత్రువు పట్ల సరియైన అంచనాలకు రావడంపై, గెరిల్లా యుద్ధంలో మొట్టమొదటి సూత్రమైన 'రహస్యాన్ని' పాటించడంపై, సకాలంలో సరైన ఎత్తుగడలను

రూపొందించి వాటిని అమలు చేయడం కోసం తుది వరకూ యుద్ధరంగాన నిలిచి సాహసోపేతంగా చావును సైతం ధిక్కరించే తెగింపుతో జరిపే పోరాటంపై ఆధారపడి ఉంటుంది. దీనికి అనుగుణంగా పిఎల్‌జిఏను సంఘటితం చేయాలి, సిద్ధాంత అధ్యయనం మెరుగుపరుచుకోవాలి, పని పద్ధతులను సంస్కరించుకోవాలి. నిరంతరం చలనశీలతను కలిగి ఉంటూ ఎక్కడైనా గానీ, ఎప్పుడైనా గానీ మన బలగాలను మోహరించే లాగా లేదా ఉపసంహరించుకునే లాగా కమాండింగ్‌ను అభివృద్ధి చేసుకోవాలి. పరిస్థితులపై పట్టు, నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయించుకోవడం, బలగాల సక్రమ విభజన, రాజకీయ-సైనిక శిక్షణ ఇవ్వడం, సరుకుల సప్లై, ఆయుధాలు సరియైన కండిషన్‌లో ఉండేలా చూడడం, ప్రజా సహకారాన్ని సక్రమంగా వినియోగించటం మొదలైన కర్తవ్యాలను వివిధ స్థాయి కమాండ్స్ స్వతంత్రంగా నిర్వహించేలా అభివృద్ధిపరచాలి. సరైన కమాండింగ్ లేమి బలగాల చలనశీలతను నిరోధిస్తుంది. కమాండ్స్ అందుకు తావీయకూడదు. రహస్యాన్ని, చలనశీలతను, ఆత్మరక్షణ-దాడి ఎత్తుగడలను సరిగ్గా సమన్వయం చేసుకుంటూ శత్రు అణచివేత దాడిని తిప్పికొట్టాలి.

దేశంలో మనం భూమి సమస్యను సంపూర్ణంగా పరిష్కరించడానికి సాయుధ వ్యవసాయ విప్లవంలో రైతాంగాన్ని విస్తృతంగా, మిలిటెంట్‌గా కదలించగలిగితే మన శత్రువు లందరినీ ఓడించి నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడానికి అవసరమైన అత్యంత మౌలిక పరిస్థితి, షరతులు మనకు సమకూరుతాయి. విప్లవ భూ సంస్కరణలను అమలు చేసేటప్పుడు నిరుపేద రైతాంగం, వ్యవసాయ కూలీల ప్రయోజనాలకు ప్రధాన ప్రాధాన్యతనివ్వడం ద్వారానే వారిని వ్యవసాయ విప్లవంలో విస్తృతంగా, క్రియాశీలంగా, మిలిటెంట్‌గా సమీకరించగలుగుతాము. ఈ సందర్భంగా మనం మధ్యతరగతి రైతాంగంతో దృఢమైన ఐక్యతను సాధించాలి. వారి ప్రయోజనాలకు హాని వాటిల్లనివ్వకూడదు.

పిఎల్‌జిఏ యుద్ధవనరులతో పాటు ప్రతి విషయంలో ప్రజలపై, స్వీయకృషిపై ఆధారపడినప్పుడు చాలావరకు స్వయం సంపూర్ణం కాగలుగుతుంది, పరిస్థితికి తగినట్లు వెసులుబాటు ఎత్తుగడలు చేపట్టగలుగుతుంది. ఈ విధంగానే నేటి పరిస్థితుల్లో తన పోరాటాలను ధారావాహికంగా కొనసాగించడంలో, వాటిని ఒక స్థాయి నుండి మరొక ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లడంలో సఫలీకృతం అవుతుంది.

పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏలోని కమాండర్లు, పోరాట యోధులు ప్రతి ఒక్కరూ లక్ష్యసాధనకు త్యాగాలకు వెనుదీయక, ఆచరణ క్రమంలో ఎదురయ్యే కష్టాలను, ఇబ్బందులను, ఆటంకాలను కమ్యూనిస్టు చైతన్యంతో అధిగమిస్తూ, తమ జ్ఞానాన్ని, శక్తిసమర్థతలను సృజనాత్మకంగా యుద్ధరంగంలో వెచ్చించేలా పిఎల్‌జిఏ అంతా ఒకే మనిషి అన్నట్లుగా దృఢంగా ఐక్యమవ్వాలి. పిఎల్‌జిఏ గొప్ప వీరత్వాన్ని ప్రదర్శిస్తూ శత్రువును నాశనం చేయడానికి సాహసించే అజేయమైన ఎర్రసైన్యంగా తయారు కావాలి. పార్టీ నాయకత్వాన అటువంటి ఎర్రసైన్యం కొనసాగించే ప్రజాయుద్ధం అజేయమైనది కాగలదు. *

# వ్యూహాత్మక లంగరుగా భారతదేశ ప్రజాయుద్ధం

**- అజిత్**

ప్రస్తుత ప్రపంచ పరిస్థితి ప్రపంచ విప్లవంలో ఒక శక్తివంతమైన నూతన వెల్లువ (వేవ్)కు దారి తీయగల గొప్ప అవకాశాలను (పొటెన్షియల్‌ను) సూచిస్తున్నది. ఒకదాని తర్వాత ఒకటిగా, పీడిత దేశాల్లోనూ, సామ్రాజ్యవాద దేశాల్లోనూ ప్రజలు లక్షలాదిగా పోరాటాల్లో కదులుతున్నారు. తరచుగా ఇది ఒక సమరశీల మలుపును తీసుకుని పాలకవర్గాల అణచివేత శక్తులతో హింసాత్మక ఘర్షణలకు దారి తీస్తోంది. ఈ పోరాటాలు మొత్తంగా ఒక నూతన తరాన్ని దోపిడీదారులకు వ్యతిరేకంగా జరిగే సమరాలకు పరిచయం చేస్తున్నాయి. గతంతో పోల్చినప్పుడు, ప్రత్యేకమైన అణచివేత రూపాలకు గురయ్యే సామాజిక వర్గాలు, యువతులు మరింత ఎక్కువగా వీటిలో పాల్గోవడం గమనించదగినది. అయినప్పటికీ, విప్లవ సంఘటిత శక్తులు, అంటే కమ్యూనిస్టు అగ్రగాములు, ప్రపంచంలో ఉన్న ఈ విప్లవ పొటెన్షియల్‌తో సంబంధాలను నెలకొల్పుకుని, దాన్ని వెల్లివిరిసేలా చేయడంలో తీవ్రంగా వెనుకబడి ఉన్నాయనేది చేదు వాస్తవం. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం (ఐసిఎం) చైనాలో సోషలిజాన్ని ధ్వంసం చేసిన 1976 నాటి డెంగు-హువా ముఠా అధికార దురాక్రమణ కల్గించిన వెనకడుగు నుండి ఇంకా బైటపడలేదు. అయితే పరిస్థితి మొత్తంగా ప్రతికూలంగా లేదనేది తేలతెల్లమే. పరిస్థితిలో ఒక మెరుగుదలను ఇంకా సాధించుకోవాల్సే ఉన్నప్పటికీ, అనేక మావోయిస్టు పార్టీలు డెంగు రివిజనిజానికీ, హోక్సా డాగ్మటో-రివిజనిజానికీ వ్యతిరేకంగా దృఢంగా నిలిచి విప్లవకర ఆచరణను పెంపొందించడాన్ని కొనసాగించాయి. కేంద్రపాత్రను నిర్వహించగలిగిన సోషలిస్టు దేశం లేకపోవడం అనే సమస్యను అధిగమిస్తూనే, అవి పరస్పర సంబంధాలను నెలకొల్పుకుని రివల్యూషనరీ ఇంటర్నేషనలిస్టు మూవ్‌మెంటు (రిమ్), కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ మావోయిస్టు పార్టీస్ అండ్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ సౌత్ ఆసియా (కంపోసా), ఇంకా యితర అంతర్జాతీయ సంస్థలను ఏర్పర్చుకోవడంలో విజయవంతం అయ్యాయి. కార్మికవర్గ సిద్ధాంతంలో నూతన దశగా మార్క్సిజం-లెనినిజం-మావోయిజం ను విస్తృతంగా ఆమోదించడం, నూతన మావోయిస్టు పార్టీల ఏర్పాటు, ఒక దేశంలో మావోయిస్టు శక్తుల ఏకీకరణ ద్వారా ఏకైక పార్టీల ఏర్పాటు, ప్రజాయుద్ధాల కొనసాగింపు, పురోగమనం మొదలైనవన్నీ కమ్యూనిజం ప్రాజెక్టును సజీవంగా వుంచి దానికి నూతన అనుచరులను సంపాదించి పెట్టాయి.

కమ్యూనిస్టు ఉద్యమంలో గొప్ప పురోగమనాలు తరచుగా మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అన్వయిస్తూ విప్లవ పోరాటంలో సాధించిన ప్రముఖ విజయాల ద్వారా లభించాయని

చరిత్ర మనకు చెబుతోంది. ఈ విషయాన్ని మావో అన్న ఈ మాటలు చక్కగా సూచిస్తున్నాయి - "అక్టోబర్ విప్లవ ఫిరంగి మోతలు చైనాకు మార్క్సిజం-లెనినిజాన్ని తీసుకొచ్చాయి." ఇది నేటికీ  నిజమే. విప్లవాచరణలో పురోగమనాలు ఒక భౌతిక వాస్తవంగా కమ్యూనిస్టు ప్రాజెక్టు ఎంత సరైనది, ఎంత ఆచరణాత్మకమైనది అనేదాన్ని రుజువు చేస్తాయి. ఆ విధంగా అవి కమ్యూనిజం సందేశాన్ని అత్యంత శక్తివంతంగా, అత్యంత విస్తృతంగా విశాల ప్రజానీకంలోకి తీసుకెళ్తాయి. సెట్‌బ్యాకులనూ, విచ్ఛిన్నాలనూ అధిగమిస్తూ నిలదొక్కుకున్న ప్రజాయుద్ధాలు, చైనా వెనకడుగు తర్వాత నూతనంగా ఆరంభమైన ప్రజాయుద్ధాలు సరిగ్గా ఈ పాత్రనే నిర్వహించాయి. వాటి ఉనికి అనేదే కమ్యూనిజం మొత్తంగా ఓడిపోయిందనే సామ్రాజ్యవాద ప్రచారాన్నీ, 'చరిత్ర అంతమైంద'నే వారి ప్రవచనాలనూ, నేటి ప్రపంచంలో 'సాయుధ పోరాటం అసాధ్యం' అనే రివిజనిస్టు అబద్ధాలనూ తుత్తునియలు చేసింది. ఇవి తామొక ఉదాహరణగా నిలవడం ద్వారా నూతన తరాలు ఎర్రజెండా చుట్టూ సమీకృతులయ్యేలా, సామ్రాజ్యవాదానికీ, ప్రతీఘాతుకత్వానికీ వ్యతిరేకంగా పోరాటాల్లోకి దూకేలా, ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసేలా వాటిని ఆకర్షించాయి, ఉత్సాహపరిచాయి, ఉత్తేజపరిచాయి.

అన్ని సోషలిస్టు దేశాలనూ కోల్పోయిన స్థితిని ఎదుర్కొని నిలవడంలో, ఐసియంలో వచ్చిన సెట్‌బ్యాక్ నుండి బైటపడి దాన్ని తిరిగి నిర్మించే వైపుగా నడవడంలో మావోయిస్టులు పొందిన విజయాలు, సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల భీకరమైన దాడులకూ, తీవ్ర నిర్బంధాలకూ గురయ్యాయి. మావోయిస్టు ఉద్యమం లోపల నుండే ముందుకొచ్చిన పెరూలోని మితవాద అవకాశవాద పంథా, నేపాల్ విప్లవానికి ప్రచండ-భట్టారాయ్ ముఠా చేసిన విద్రోహం, అవాకియన్ లిక్విడేషనిజం వంటి నూతన తరహాల రివిజనిజాలు వారికి ఈ దాడులు చేయడంలో దోహదపడ్డాయి. ఈ సమ్మిళిత దాడులు తాము చేయగల్గిన నష్టాన్నంతా  చేశాయి.

నేపాల్ ప్రజాయుద్ధం ఆచరణలో అన్ని విధాలా లిక్విడేట్ అయిపోయింది. అది జన్మనిచ్చిన విప్లవ చైతన్యం ఇప్పటికీ సజీవంగా ఉన్నది. అయితే 2006లో నేపాల్ విప్లవం తాను ఆగిపోయిన చోటు నుండే తిరిగి మొదలై పురోగమించడం సాధ్యం కాదు. అందుకోసం ప్రజాయుద్ధాన్ని తిరిగి ఆరంభించాల్సి వుంటుంది. 1996లో వలెనే రివిజనిజానికీ, సెంట్రిజానికీ వ్యతిరేకంగా ఒక దృఢమైన పోరాటం సాగించినప్పుడే అది సాధ్యమవుతుంది. ప్రత్యేకించి పార్టీ నాయకత్వం నుండే ముందుకొచ్చిన - 'ప్రచండ పాత్'గా పవిత్రత ఆపాదించబడి, పార్టీ వ్యూహాత్మక ఓరియంటేషన్‌ను తలకిందులు చేసిన వరుస పెడధోరణులలో నిర్దిష్టీకరణ చెంది, అంతిమంగా ప్రజాయుద్ధ లిక్విడేషన్‌తో ముగిసిన -

తప్పుడు పంథాపై దృఢమైన పోరాటం సాగించినప్పుడే అది సాధ్యం.

మితవాద అవకాశవాదుల పథకాలను ఓడించడంలో, ఎర్రజెండానెత్తిపట్టడంలో పెరూలోని మావోయిస్టులు విజయవంతమైనప్పటికీ, విచ్ఛిన్నం కలిగించిన సెట్‌బ్యాక్ బాధాకరమైన రీతిలో అగుపడుతూనే ఉన్నది. పార్టీని పున:సంఘటితం చేసే తమ పథకాల్లో, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో పురోగమించడంలో, కామ్రేడ్ గొంజాలో నాయకత్వంలో రూపొందించబడిన విప్లవ పంథాను ఎత్తిపట్టడంలో, సెట్‌బ్యాక్ వల్ల కల్గిన చేదు అనుభవం నుండి పాఠాలు తీసుకోవడంలో మావోయిస్టులు మరింత విజయం సాధించడం పైన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

టర్కీ, బంగ్లాదేశ్‌లలో శత్రు క్రూరమైన దాడులు మావోయిస్టు ఉద్యమాలకు, ప్రజాయుద్ధాలకు తీవ్ర నష్టాలను కల్గించాయి. ఈ దేశాలలోని మావోయిస్టు పార్టీలు ఈ పరిస్థితిని అధిగమించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. విప్లవ పథంలో కొనసాగుతూ, మా-లె-మా మార్గదర్శకత్వంలో వారు ఇందులో తప్పక సఫలీకృతులవుతారు. అయితే ప్రస్తుత స్థితిలో, 60లలో ప్రారంభమైన ఈ ప్రజాయుద్ధాలు తాము గతంలో అందుకున్న ఎత్తులను తిరిగి చేరాలంటే ఇంకా చాలా ప్రయాసపడాల్సే ఉన్నది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రారంభమై అభివృద్ధి చెందిన ఈ ప్రజాయుద్ధాలన్నీ అంతర్జాతీయ కార్మికవర్గానికి సంపద్వంతమైన అనుభవాలనూ, విలువైన పాఠాలనూ అందించాయి. ఈ దేశాల్లోని మావోయిస్టు పార్టీలు తమ అనుభవాలను క్రోడీకరించడానికీ, పురోగమించడానికీ చేస్తున్న నిరంతర కృషి అంతిమంగా తప్పక ఫలితాలనిస్తుంది. కానీ ప్రస్తుతానికి మాత్రం అవి ఎదుర్కొంటున్న వెనుకడుగులు మరోసారి ఐసియంను తీవ్రంగా బలహీనపరిచాయి. ఈ పరిస్థితుల్లో, ఫిలిప్పీన్స్, భారతదేశాల్లో జరుగుతున్న ప్రజాయుద్ధాల శక్తివంతమైన ఉనికి కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది. రెండూ కూడా 1960లలో మావో సే టుంగ్ రివిజనిజానికి వ్యతిరేకంగా చేపట్టిన గొప్ప తిరుగుబాటు నుండి నేరుగా ప్రభావితమై ఆరంభించబడినవే. మార్క్సిజాన్ని మా-లె-మా అనే ఉన్నతమైన దశకు తీసుకువెళ్లిన మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం నుండి యివి ఉత్తేజాన్ని పొందాయి. ఫిలిప్పీన్స్ ప్రజాయుద్ధం ద్వీపసముదాయమంతా వ్యాపించి ప్రస్తుతం వ్యూహాత్మక ప్రతిష్ఠంభన దిశగా పురోగమిస్తోంది. అమెరికాకు ఈ దేశం గొప్ప వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగినది. అది అక్కడ ఒక పెద్ద నావికా దళాన్ని నిలిపి ఉంచింది. అది ఫిలిప్పీన్స్ సైన్యానికి శిక్షణ, ఆయుధాలు అందిస్తున్నది. అది ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నడుస్తున్న ఆ దేశ నూతన ప్రజాస్వామిక విప్లవానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన విప్లవ ప్రతీఘాతుక యుద్ధ పథకాన్ని రూపొందించడంలో

నేరుగా పాల్గొంటున్నది. ఫిలిప్పీన్స్ ప్రజాయుద్ధం సంపద్వంతమైన అనుభవాలను, విలువైన పాఠాలను - ప్రత్యేకించి అమెరికా ప్రోత్సహిస్తున్న ఎల్ఐసీ వ్యూహాన్ని ఎదిరించడంలో, ఓడించడంలో - అందిస్తున్నది. అది మరింతగా పురోగమించడం అనేది అమెరికా సామ్రాజ్యవాదంతో మావోయిస్టుల నాయకత్వంలోని ఒక ప్రజాయుద్ధం నేరుగా ఢీకొనే ఒక ముఖ్యమైన దశను ఆవిష్కరిస్తుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా గొప్ప పరిణామాలకు దారి తీస్తుంది.

భారతదేశంలోని ప్రజాయుద్ధం ఇప్పటికీ వ్యూహాత్మక ఆత్మరక్షణ దశలోనే ఉన్నది. ఇది ప్రస్తుతం దేశ మధ్య, తూర్పు భాగాల్లో కొనసాగుతోంది. సహ్యాద్రి పర్వత శ్రేణిలోని దక్షిణ భాగాన్ని కేంద్రంగా చేసుకుని భారత పెనిన్సులాలో నైరుతి ప్రాంతంలో నూతన యుద్ధరంగాన్ని తెరవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మధ్య, తూర్పు రీజియన్ల ప్రజాయుద్ధ పరిధిలోకి వచ్చే ప్రాంతం చాలా విశాలమైనది. దండకారణ్యంలోని బస్తర్ ప్రాంతమే కేరళం రాష్ట్రానికి దాదాపు సమానంగా ఉంటుంది. ప్రజాయుద్ధం ద్వారా ఏర్పర్చబడిన నూతన రాజ్యాధికార అంగాలైన ఆర్పీసీలు అధికారాన్ని  చెలాయిస్తున్న ప్రాంతాలు కూడా గణనీయంగా ఉన్నాయి. అయినప్పటికీ, దేశ వైశాల్యాన్నీ, జనాభానూ, జాతుల, భౌగోళిక లక్షణాల్లోని వైవిధ్యాన్నీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఇది చాలా చిన్నది. యుద్ధ జోన్లలోని జనాభా అత్యధికంగా ఆదివాసులు, అక్కడి ఆర్థిక వ్యవస్థలు వెనుకబడినవి. బేస్‌ఫోర్సు అయిన ప్రజామిలీషియా సహా పిఎల్‌జిఎ లోని మూడు ఫోర్సులూ జిల్లా కేంద్రాలలోనే కొన్ని సాహసోపేతమైన, శక్తివంతమైన దాడులను చేపట్టాయి. అవి కంపెనీ స్థాయి శత్రు బలగాలపై దాడి చేసి ఓడించగల, శత్రు 'చుట్టుముట్టి అణచివేత' క్యాంపెయిన్ల నుండి బైటపడగల సామర్థ్యాలను కలిగి ఉన్నాయని రుజువైంది. అయితే భారత రాజ్య బలగాల బలం, సామర్థ్యాలతో పోల్చినప్పుడు (ఇందులో దాని సాయుధ బలగాల మూడు వింగులూ, వివిధ పారామిలటరీ బలగాలూ, రాష్ట్రాల పోలీసు బలగాలూ భాగం) పిఎల్‌జిఎ ఇప్పటికీ ఒక చిన్న, బలహీనమైన శక్తే.

ఈ సాపేక్షికమైన బలహీనతలు, పరిమితులతో పోలిక లేని విధంగా, దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ప్రజాయుద్ధం వేసిన రాజకీయ ప్రభావం అనేకరెట్లు ఎక్కువగా వున్నది. భారత ప్రభుత్వం పాశవిక అణచివేత క్యాంపెయిన్ అయిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఆరంభించినప్పుడు ఈ ప్రజాయుద్ధానికి లభించిన విస్తృతమైన మద్దతులో దీని రాజకీయ ప్రభావం వెల్లడైంది. సంఘీభావంగా ముందుకొచ్చేలా విశాలమైన సెక్షన్లను అది కదిలించింది. మానవహక్కుల ఉల్లంఘనలపై కేంద్రీకరిస్తూ భారత రాజ్య 'ప్రజలపై యుద్ధా'నికి

వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదిక ఏర్పాటు, మావోయిస్టు ఓరియంటేషన్ కలిగి ఉండడం వల్లనే ప్రజాయుద్ధాన్ని పరిరక్షించడం, దానికి మద్దతునివ్వడం తన (ఉనికికి) ప్రాసంగికతగా భావించే అంతర్జాతీయ సంఘీభావ కమిటీ ఏర్పాటు రెండు ప్రముఖమైన అంతర్జాతీయ వ్యక్తీకరణలు.

ఈ పరిణామానికి కారణాలు ప్రస్తుత ప్రపంచంలో భారతదేశానికున్న స్థానంతో నేరుగా సంబంధం కలిగి ఉన్నవి. ఇది ప్రపంచంలో రెండవ అతి పెద్ద జనాభాగల దేశం. ఈ శతాబ్దం మధ్యనాటికి ఇందులో అది మొదటి స్థానానికి వస్తుంది. దీని సైజు, దీని విశాలమైన ఆర్థిక వ్యవస్థ దీన్ని ఇతర అనేక మూడవ ప్రపంచదేశాలకంటే వేరుగా నిలబెడ్తున్నాయి. దక్షిణాసియాలో సామ్రాజ్యవాద పెత్తనానికి ఆలంబనగా దీని జియో-పొలిటికల్ పాత్ర (దక్షిణాసియా కూడా ప్రపంచంలో అతి పెద్ద జనాభాగల ప్రాంతాల్లో ఒకటే), దీనికి స్వయంగా గల విస్తరణవాద స్వభావం దీన్ని సామ్రాజ్యవాద వ్యవస్థకు అత్యంత కీలకమైన దేశాల్లో ఒకటిగా చేస్తున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఇదో పేలబోతున్న అగ్నిపర్వతంలా వున్నది, ఇక్కడ అన్ని రకాల వైరుధ్యాలూ చిక్కుముడి పడి ఉన్నాయి. ఈ దేశంలో ప్రజాయుద్ధం ప్రారంభం కావడం, నిలదొక్కుకోవడం, స్థిరంగా ఎదగడం అనేవాటికి గొప్ప ప్రాముఖ్యత ఉన్నది. అందుకే మావో సే టుంగ్ నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ 1967 నాటి నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటును వెంటనే ప్రస్తుతించింది. ఈ తిరుగుబాటు దానికదిగా చూసినప్పుడు చాలా చిన్నస్థాయిలో జరిగినదే - ఒక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో లేదా తెభాగా తిరుగుబాటుతో పోల్చినప్పుడు. కానీ దానికి గల రాజకీయ ప్రాముఖ్యత ఎంతో గొప్పది. దాని వల్ల మావోయిస్టుల నాయకత్వంలో విప్లవమార్గం తిరిగి ఉనికిలోకి వచ్చింది.

భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావడం అనేది ప్రపంచ-చారిత్రక ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది. ఈ దేశంలో మిగతా దేశాలతో పోల్చినప్పుడు అంతర్గతంగా ఏదో అదనపు గుణం ఉండడం వల్ల కాదు, పైన పేర్కొన్న అన్ని కారణాల వల్ల దానికా ప్రాముఖ్యత ఉంటుంది. అది ప్రజాయుద్ధాలు సహా మావోయిస్టు ఉద్యమం విస్తృతంగా కొనసాగిన దక్షిణాసియా దేశాల్లో ఒక విప్లవాల వరుసను శక్తివంతంగా ముందుకు తోయవచ్చు లేదా అవి ప్రారంభం కావడానికి దారి తీయవచ్చు.

భారతదేశ ప్రజాయుద్ధానికి గల అంతర్జాతీయ ప్రాముఖ్యత ఇది. అందువల్లే ప్రపంచంలోని మావోయిస్టు శక్తులు ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో దీన్ని (ఇతర ప్రజాయుద్ధాలతో పాటు) ఒక 'వ్యూహాత్మక లంగరు'గా పరిగణిస్తున్నాయి. అందుకనే దీనికి

మద్దతుగా ముందుకొచ్చిన సంఘీభావ ఉద్యమం అనేక మావోయిస్టు శక్తులను ఒక దగ్గర చేర్చింది. ఈ శక్తులన్నీ తమ తమ దేశాల్లో విప్లవాన్ని కొనసాగించడమే భారతదేశ ప్రజాయుద్ధానికి తాము అందించగల అత్యుత్తమ సంఘీభావం అనే ఓరియంటేషన్‌ను కలిగి ఉన్నాయి. లక్షలాదిమంది రోడ్ల మీదకు వచ్చి, ఒక విభిన్నమైన ప్రపంచం కోసం, అంటే దోపిడీ, పీడనలు లేని ప్రపంచం కోసం, తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి ఒక నమ్మకమైన మార్గాన్ని వెతుక్కుంటున్న తరుణంలో, ఈ ప్రజాయుద్ధాలు ఏది అవసరం, ఏది చేయగల్గుతాం అనేవాటికి భౌతికమైన ఉదాహరణలుగా కొట్టొచ్చినట్టుగా నిలుస్తున్నాయి. ఆ విధంగా అవి తమ సజీవమైన, విప్లవకర ఉనికి ద్వారా ఒక దిశానిర్దేశం చేస్తాయి. ఐసియం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సెట్‌బ్యాకుల నేపథ్యంలో, ఇది మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

భారతదేశ ప్రజాయుద్ధానికి లభిస్తున్న గొప్ప మద్దతు ప్రపంచ ప్రజలు దానినుండి ఎంత ఎక్కువగా ఆశిస్తున్నారు అనేదానికి కూడా ఒక సూచికే. భారతదేశంలోని మావోయిస్టులు ఈ ఆకాంక్షలకు అనుగుణంగా ఎదగాలి, వాటిని పరిపూర్తి చేయాలి. ఇది అత్యంత ప్రధానంగా విప్లవాచరణలో మరింత పురోగతిని సాధించడానికి సంబంధించిన విషయమే అయినప్పటికీ, ఇది కేవలం దానికి మాత్రమే పరిమితమైనది కాదు. తమ, తమ స్వంత అస్థిత్వాలు, సంస్కృతులు కలిగిన కులాలు, తెగలు, జాతుల కొలిమి మధ్య నుండే ఒక కార్మికవర్గ అగ్రగామిని నిర్మించే విషయంలో; లక్షలాదిగా ప్రజలను సమీకరించి వారిని విప్లవ మార్గంలోకి నడిపించడంలో; తమ, తమ ప్రత్యేక రాజకీయ వైఖరులను కచ్చితంగా వ్యక్తం చేయగల అనేకానేక కార్మికవర్గేతర శక్తులను ఐక్యం చేయడంలో; విప్లవ పార్టీలనూ, సాయుధ ఉద్యమాలనూ అణచివేయడంలో దశాబ్దాల అనుభవం కలిగిన, బ్రహ్మాండమైన సాయుధశక్తి కలిగిన రాజ్యాన్ని మొదటి నుండీ ఎదుర్కోవలసి వచ్చిన సాయుధపోరాటం ద్వారా ఏమీ లేని దగ్గర నుండి ఆరంభించి ఒక విప్లవకర సైన్యాన్ని నిర్మించడంలో; సెట్‌బ్యాకులనూ, క్లిష్టమైన పరిస్థితులనూ అధిగమిస్తూ, తమకంటే ఎన్నో రెట్లు శక్తివంతమైన బలగాలను ఎదుర్కొంటూ ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో; జెండర్ నుండి మొదలుకొని ఎథ్నిసిటీ వరకూ అనేకమైన వైరుధ్యాలచే విభజితమై ఉన్న ప్రజల మధ్య నూతన రాజ్యాధికారాన్ని నిర్మించడంలో; ఈ అధికారాన్ని మరింత సంఘటితం చేసి, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని మరింత పురోగమింపజేయడానికి ప్రజల మధ్య వైరుధ్యాలతో (వీటిలో ప్రతి ఒక్కదానినీ శత్రువు ఉపయోగించుకోగలిగే స్థితి ఉంటుంది) సరిగ్గా వ్యవహరించడంలో - భారతదేశ ప్రజాయుద్ధం ఎదుగుదల, దాని విజయవంతమైన పురోగమనం అపారమైన, సంపద్వంతమైన

అనుభవాలను అందించింది. ఈ విశాలమైన అనుభవాల గని, వీటిని సిద్ధాంతీకరించే బాధ్యతను కూడా భారతదేశ మావోయిస్టుల భుజస్కందాలపై మోపుతోంది.

తప్పనిసరిగా ఈ విషయంలో కొంత కృషి జరిగింది. అయితే ఇంకా ఎంతో, ఎంతో జరగాల్సే వున్నది. ఇది విప్లవశక్తుల, ప్రజాయుద్ధ గుణాత్మక స్థాయిని ఎదిగించడానికి, భారత విప్లవం కచ్చితంగా విజయం సాధించడానికి ఎంతో అవసరం అనేది స్పష్టమే. అంతే కాకుండా, ఇది భారతదేశంలోని మావోయిస్టు అగ్రగామి చైతన్యయుతంగా చేపట్టాల్సిన ఒక ముఖ్యమైన అంతర్జాతీయ కర్తవ్యం కూడా. ప్రపంచ సోషలిస్టు విప్లవానికీ, దానికి మార్గదర్శకత్వం వహించే సిద్ధాంతానికీ అది చేయగల్గిన, చేసి తీరాల్సిన ఒక చేర్పు ఇది. ఒక విప్లవాన్ని ముందుకు తోసే వైరుధ్యాల సంక్లిష్టత (విజయవంతం కావాలంటే వీటిని తప్పక పరిష్కరించాల్సి ఉంటుంది) అనేది మార్క్సిస్టు సిద్ధాంత వైఖరుల విషయంలో కాన్సెప్చువల్ అండర్‌స్టాండింగ్ (భావనాత్మక అవగాహన)ను పెంపొందించాల్సిన అవసరాన్ని కచ్చితంగా ముందుకు తెస్తుంది. ఈ వైరుధ్యాల సంక్లిష్టత ఎంత ఎక్కువగా ఉంటే, ఇది అంత ఎక్కువగా జరగాల్సి ఉంటుంది. సంపద్వంతమైన వైవిధ్యం కలిగిన వైరుధ్యాల ఆధారంగా నిలదొక్కుకుంటున్నందువల్ల భారత విప్లవం ఈ విషయంలో అనుపమానమైన స్థితిలో ఉన్నది. వీటిలో అనేకం విశిష్ట అస్థిత్వాలకు పునాదిగా ఉన్నాయి. సామ్రాజ్యవాదులు, ప్రతీఘాతుకుల అణచివేతకు గురవుతున్న సామాజిక సెక్షన్ల జాగృతిని 'అస్థిత్వవాద గోడల మధ్యకు' మళ్లించడానికి నిత్యం ప్రయత్నిస్తూ ఉంటారు. ఆ విధంగా చేయడం ద్వారా వారి విముక్తికి అవసరమైన సంపూర్ణ సామాజిక విప్లవం నుండి వారిని దూరంగా కంచె లోపల వుంచేసే ప్రయత్నం చేస్తారు. అందువల్ల, ఈ అస్థిత్వాలతో విజయవంతంగా వ్యవహరించడం, మావోయిజం మార్గదర్శకత్వంలో వాటిలో ఉన్న వైరుధ్యాలను విప్లవకరంగా పరిష్కరించడం, ఆ అనుభవాన్ని సంశ్లేషించడం ద్వారా సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడం సమకాలీన ప్రపంచంలో ఎంతో ప్రాసంగితను కలిగి ఉంటాయని కచ్చితంగా చెప్పవచ్చు.

అలాగే, ఈ సంక్లిష్ట సామాజిక స్థితిగతుల్లో కార్మికవర్గ అగ్రగామిని నిర్మించడంలో వచ్చే అనుభవాల సైద్ధాంతిక సంశ్లేషణ, తమ తమ అస్థిత్వాలకు గట్టిగా అంటిపెట్టుకుని ఉండేవారితో సహా అన్ని నిరసన, పోరాట, తిరుగుబాటు స్రవంతులనూ ఒక బ్రహ్మాండమైన, అదే సమయంలో వైవిధ్యభరితమైన, విప్లవ వెల్లువగా ఐక్యం చేయడంలో దాని విజయం ఒక గొప్ప చేర్పుగా నిలిచిపోతుంది; లెనినిస్టు అగ్రగామి అనే భావన స్థానంలో దానికి బదులుగా 'రెయిన్‌బో కొయలిషన్స్' (ఇంద్రధనస్సు సమూహాలు) ముందుకొస్తున్నట్టుగా నటిస్తున్న నేటి తరుణంలో ఇది మరింత అవసరం.

అంతేకాక, విజయవంతంగా నిలదొక్కుకుని అభివృద్ధి చెందుతున్న ప్రజాయుద్ధానికి నేతగా సిపిఐ (మావోయిస్టు), ప్రస్తుత ఐసియం పరిస్థితికి తగిన ఒక అంతర్జాతీయ కార్మికవర్గ సంస్థను నిర్మించే కృషికి ఎంతో చేర్పును చేయగల ఒక స్థానంలో ఉన్నది. ఒక విశాలమైన, ప్రపంచవ్యాప్తమైన సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక ఏర్పాటులో ఇది ఒక ఉత్ప్రేరకం పాత్రను నిర్వహించి, దానికి కోర్‌గా పని చేయగల్గుతుంది. ప్రస్తుత ప్రపంచంలో ఉనికిలో వున్న అనుకూల వస్తుగత పరిస్థితి ఈ రెంటినీ కూడా తక్షణం కోరుతున్నది. ఈ రెండూ కూడా స్వీయాత్మకంగా ఎదుర్కొంటున్న వెనుకబాటును (ల్యాగ్) అధిగమించడంలో అపారంగా సహాయపడి, తద్వారా విప్లవాల నూతన వెల్లువకు గల అవకాశాలు (పొటెన్షియల్ న్యూ వేవ్ ఆఫ్ రివల్యూషన్) మరింతగా వెల్లివిరియడానికి దారి తీస్తాయి. సిపిఐ (మావోయిస్టు) పదవ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా, ప్రజాయుద్ధానికి అందుతున్న హృదయపూర్వకమైన సంఘీభావానికి సరిసమానమైన ప్రతిస్పందనను అందించడానికి మనం మరింత కృషి చేయాలి. అది రెండు రకాలుగా ఉంటుంది - దేశంలోపల మన విప్లవ కర్తవ్యాలను మరింత మెరుగ్గా కొనసాగించడం, అంతర్జాతీయంగానూ ఇదే చేయడం. ఈ విధంగా మాత్రమే ప్రస్తుత ప్రపంచ స్థితిలో వ్యూహాత్మక లంగరుగా ప్రజాయుద్ధ పొటెన్షియల్‌ను పూర్తిగా వెలికి తీయగల్గుతాం.

చివరగా, ఏంగెల్స్ జర్మన్ కార్మికవర్గానికి ఇచ్చిన సలహాను గుర్తు చేసుకోవడం మనకు ఉపయోగంగా ఉంటుంది, "... **ప్రస్తుత తరుణంలో జర్మన్ కార్మికులు కార్మిక పోరాటంలో అగ్రగామిగా వున్నారు. పరిణామాలు వారిని ఎంతకాలం ఈ స్థానంలో ఉండేలా అనుమతిస్తాయో మనం ముందుగానే ఊహించలేం. అయితే వారు ఆ స్థానంలో ఉన్నంతకాలం తమ డ్యూటీలను సక్రమంగా నెరవేరుస్తారని ఆశిద్దాం...అయితే, మొదటగా, ఎటువంటి దురభిమానానికీ (ఛావినిజం) తావు లేని ఒక నిజమైన అంతర్జాతీయవాద స్పిరిట్‌ను కలిగి ఉండడం అవసరమౌతుంది. ఇది కార్మికోద్యమంలోని ప్రతి ఒక నూతన అడుగునూ, అది ఏ దేశంలో రూపొందినదైనప్పటికీ, ఆనందంగా ఆహ్వానించాలి. జర్మన్ కార్మికులు ఈ విధంగానే ముందుకు సాగినా, వారు ఉద్యమానికి ముందుపీఠీనే నడవలేకపోవచ్చు, ఒక దేశ కార్మికులు అందరికంటే ముందు పీఠీన నడవాలనుకోవడం ఉద్యమ ప్రయోజనాలకు తగినదేం కాదు, అయితే వారు యుద్ధరంగంలో ఒక గౌరవనీయమైన స్థానాన్ని పొందుతారు. ఇతర గంభీరమైన పరీక్షలూ లేదా ఉజ్వలమైన ఘటనలూ మరింత ధైర్యాన్నీ, మరింత దృఢనిశ్చయాన్నీ, ఆచరణకు పురిగొల్పే సంకల్పాన్నీ డిమాండ్ చేసినప్పుడు వారు యుద్ధం చేయడానికి సాయుధంగా నిలిచి ఉంటారు.**"

***

# విప్లవోద్యమ విజయానికి హామీనిచ్చే మూడు అద్భుతాయుధాలలో ఐక్యసంఘటన ఒకటి

**- సోను**

కామ్రేడ్ మావో ఇలా చెప్పాడు :

*"సాయుధ పోరాటాన్ని నిర్వహించడానికి ఉద్దేశించినదైతేనే ఒక ఐక్యసంఘటన ఐక్యసంఘటనవుతుంది. శత్రు స్థావరాలను చికాకుపరిచేందుకూ, ధ్వంసం చేసేందుకూ ఐక్యసంఘటన, సాయుధ పోరాటం అనే రెండు ఆయుధాలను ఉపయోగించే వీరయోధుడే పార్టీ."*

పైన పేర్కొన్న మాటల్లో మావో ఐక్యసంఘటన ప్రాముఖ్యతను అద్భుతంగా వివరించాడు. అంతేకాదు, ఐక్యసంఘటన వాస్తవంగా ఎందుకు ఉద్దేశించబడిందో కూడా చాలా స్పష్టంగా చెప్పాడు. అది రాజ్యాధికార స్వాధీనానికి సాయుధ పోరాటాన్ని నిర్వహించడానికేనన్నది సదా మన గమనంలో ఉండాల్సినంతటి వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన అంశం. ఆ వెలుగులోనే మనం ఐక్యసంఘటనను అర్థం చేసుకోవడం, ఆచరించడం జరగాలి.

ఐక్యసంఘటన అంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ వర్గాల ప్రజలు తమ ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా సమైక్యమై, ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికై అంకితమైన సంస్థ. వివిధ ఐక్యసంఘటనల స్వరూపం ఏదైనా, అవి ఏ స్థాయిలో ఏర్పడినా అవన్నీ శత్రుప్రభుత్వాన్ని సాయుధ పోరాటం ద్వారా కూలదోసి జనతా ప్రజాస్వామికాన్ని స్థాపించడం కోసం ఏర్పడే ఐక్యసంఘటనకు ఉపయోగపడేట్టు చూడడానికే కార్మికవర్గ పార్టీ శ్రద్ధ వహించాలన్నది విప్లవంలో రాజ్యాధికార ప్రాముఖ్యతను తెలుపుతుంది. అదే విధంగా ఐక్యసంఘటన విధానం ఏ సూత్రంపై ఆధారపడి ఉండాలో కూడా మనకు తెలిసి ఉండాలి. 'శత్రువుల మధ్య ఉండే వైరుధ్యాలను వాడుకోవడం, ఎక్కువ మందిని మనవైపు తిప్పుకోవడం, కొద్దిమందిని వ్యతిరేకించడం, శత్రువులను ఒక్కొక్కరిని నాశనం చేయడం' అన్న సూత్రంపై అది ఆధారపడి ఉంటుందంటాడు మావో.

వాస్తవంగా ఏ సమస్యపైనైనా, ఏ రకమైన ఐక్యసంఘటనైనా, ఏ స్థాయిలోనైనా ఒకేపక్షం కోరుకుంటే ఏర్పడేది కాదు. అది ఆ సమస్యతో తమ ప్రయోజనాలు ముడిపడిన వివిధ వర్గాల సంసిద్ధతపై ఆధారపడి ఉంటుంది. నిరంతరం కమ్యూనిస్టు పార్టీ విప్లవ ప్రయోజనాల నాశించి దీర్ఘకృషితో, ఓపికతో మిత్రులందరినీ కలుపుకొని పోరాడటానికి చొరవ తీసుకోవడం ద్వారా ఐక్యసంఘటన ఏర్పాటుకు అవకాశాలు మెరుగవుతాయి. ఐక్యసంఘటన నిర్మించే మొత్తం క్రమంలో అంటే నిర్దిష్ట సమస్యలపై ఏ స్థాయిలోనైనా నిర్మించే ఐక్యసంఘటన (ఎత్తుగడల ఐక్యసంఘటన) నుండి రాజకీయ అధికారం నెలకొల్పడం కోసం నిర్మించే వ్యూహాత్మక ఐక్యసంఘటన వరకు మనం తప్పనిసరిగా పార్టీ రాజకీయ పంథాను అమలు

చేయాలి.

మన పార్టీ కొనసాగించిన గత మూడున్నర దశాబ్దాల కృషిగానీ మరీ నిర్దిష్టంగా చెప్పాలంటే గత పదేళ్ల కృషిగానీ అందులో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ పై లెనినిస్టు అవగాహనతో పనిచేయడం వల్లనే ప్రధానంగా విజయాలు సాధించాం. ఈ సందర్భంగా మనమొక విషయాన్ని తప్పకుండా గుర్తుచేసుకోవాలి. మన ప్రియతమ అమరుల రక్తంతో తడిసిన బాటలో పయనిస్తూ, వారి కమ్యూనిస్టు కలలను సాకారం చేసేందుకు ప్రజలకు మరింత సేవ చేసేలా ఆ అమరుల ఆదర్శాలే మనలను మరింత దృఢంగా తయారు చేశాయి. ఆ గొప్ప అమరులందరి బలిదానాలు మన పార్టీనీ, పి.ఎల్.జి.ఏ.నూ, ఐక్యసంఘటననూ, మన పార్టీ నాయకత్వాన జరుగుతోన్న యావత్తు విప్లవ కృషిని మరింత మెరుగుపరచాయి.

అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం చేపట్టిన సాయుధ పోరాట క్రమంలో ఐక్యసంఘటనను నిర్మించడం జరుగుతుందనీ, సమర్థవంతమైన ఐక్యసంఘటన రూపొందినప్పుడే సాయుధ పోరాటం శక్తివంతమైనది కాగలుగుతుందనేది మన అవగాహన. ఐక్యసంఘటన ప్రజాయుద్ధానికి సేవ చేస్తుందనీ, పూరకంగా ఉంటుందనీ అర్థం చేసుకున్నప్పుడే మన ఆచరణను మెరుగ్గా కొనసాగించగలుగుతాం.

మన పార్టీ ముందు నుంచీ ప్రజాసమస్యలపై ఆనాటి రాజకీయ, ఉద్యమ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కలిసిరాగల మిత్రశక్తులను కలుపుకొని ఎత్తుగడలపర ఐక్యసంఘటనలో భాగంగా ఐక్యకార్యాచరణ వేదికలను నిర్మిస్తూ ప్రజలను సమీకరించి పోరాటాలను నిర్వహిస్తూ వస్తోంది. మరోవైపు వ్యూహాత్మక ఐక్యసంఘటన నిర్మాణానికి తీవ్రంగా కృషి చేస్తూ ఆశాజనకమైన ఫలితాలను సాధించింది. మన ఐక్యసంఘటనా నిర్మాణ కృషిలో ఇదే ప్రధానమైనది, స్థిరమైనది, ఆధారపడదగింది. దీని పునాది పైన ఆధారపడి ఎత్తుగడలపర ఐక్యసంఘటనను నిర్మిస్తున్నాము. వ్యూహాత్మక ఐక్యసంఘటన వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్ని ఆధారం చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో నిర్మితమవుతూ అభివృద్ధి చెందుతోంది. దీనిని నూతన ప్రజాస్వామిక ఐక్యసంఘటనగా పేర్కొంటున్నాం. ఈ ఐక్యసంఘటన యొక్క నిర్దిష్ట రూపంగా నూతన ప్రజాస్వామిక అధికార అంగాలు ఏర్పడి అభివృద్ధి చెందుతున్నవి. వీటిని 'విప్లవ ప్రజాకమిటీ'లుగా పేర్కొంటున్నాం. ఇవి ప్రజాయుద్ధానికి ప్రత్యక్షంగా దోహదపడుతున్నాయి. ప్రజాయుద్ధ పురోగమనంలో భాగంగా ఇవి అభివృద్ధి చెందుతున్నాయి. పార్టీ నాయకత్వంలో ప్రజాయుద్ధం-ప్రజారాజ్యాధికారం అవిభాజ్యంగా పరస్పరాధారితాలుగా ఉంటూ పురోగమిస్తున్నాయి. వివిధ స్థాయిలలో నిర్మితమవుతున్న ఎత్తుగడలపర ఐక్యసంఘటనలు మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతోన్న ప్రజాయుద్ధానికీ, వ్యూహాత్మక ఐక్యసంఘటనకు కొన్ని సందర్భాలలో ప్రత్యక్షంగా, చాలా సందర్భాలలో పరోక్షంగా సహాయకారిగా ఉంటున్నాయి. ప్రజాసైన్యం అండతో ఎత్తుగడలపర ఐక్యసంఘటనలు ఫాసిస్టు నిర్బంధంలో సైతం నిర్మితమవుతూ పనిచేస్తున్నాయి. అవి ఎంత తాత్కాలికమే అయినప్పటికీ ప్రజాసమస్యలపై ఎక్కడికక్కడే ఏర్పడి పనిచేయడంలో దేశంలో కొనసాగుతోన్న ప్రజాయుద్ధం వాటికి ప్రాణవాయువులా పనిచేస్తోందన్నది నిర్వివాదమైన అంశం.

మన పార్టీ నాయకత్వంలో ఏర్పడుతోన్న నాలుగు వర్గాల వ్యూహాత్మక ఐక్యసంఘటన (కార్మికవర్గం, రైతాంగం, పట్టణ పెటీబూర్జువా, జాతీయ బూర్జువా)లో మొదటి మూడు విప్లవానికి మౌలిక చోదక శక్తులు కాగా జాతీయ బూర్జువా వర్గం ఊగిసలాడే మిత్రవర్గం. ఈ ఐక్యసంఘటన సాయుధ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతోన్న విప్లవోద్యమాన్ని, ఇందులో భాగంగా ప్రాథమిక స్థాయిలో ఉన్న నేటి ప్రత్యామ్నాయ రాజ్యాధికార వ్యవస్థను మట్టుబెట్టడానికి శత్రువు ఎడతెరిపి లేకుండా దాడులు కొనసాగిస్తున్నాడు. ఈ ఫాసిస్టు దాడుల మధ్యనే ఈ ప్రత్యామ్నాయ రాజ్యాధికార అంగాలు ప్రజల అండదండలతో పనిచేస్తూ ప్రజాయుద్ధం కొనసాగడానికి, పురోగమించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాయి. శత్రుబలగాల దాడులను పి.ఎల్.జి.ఎ. శక్తివంతంగా ఎదుర్కోవడానికి, వాటిని దెబ్బతీయడానికి, వీలైన చోటల్లా వాటిని మట్టుబెట్టడానికి, వాటి ఆయుధాలను-మందుగుండును స్వాధీనపర్చుకోవడానికి, వాటి సరఫరాలను అడ్డుకోవడానికి, వాటి వేగవంతమైన కదలికలను కుంటుపర్చడానికి, వాటి నూతన క్యాంపుల విస్తరణను అడ్డుకోవడానికి విప్లవ ఐక్యసంఘటన నాయకత్వంలో ప్రజలు సృజనాత్మక రూపాలలో క్రియాశీలంగా ముందుకు వస్తున్నారు. దేశంలోని పలు విప్లవోద్యమ ప్రాంతాలలో ముఖ్యంగా గెరిల్లాజోన్‌లలో శత్రువుతో తెగించి పోరాడుతున్న ప్రజా గెరిల్లాల విజయాలలో ప్రజల అద్భుతమైన పాత్రను గమనించవచ్చు. ఝార్ఖండ్‌లోని గిరిడి, దండకారణ్యంలోని ముకురం, కొంగెర, లాహెరి, జీరంఘాటీ మాటుదాడుల వరకు అలాగే పశ్చిమ బంగలోని సిల్దా రెయిడ్ వరకు ప్రజల సంఘటిత శక్తినీ, క్రియాశీల పాత్రను చూడవచ్చు. తాజా అనుభవాలనే చెప్పుకోవాల్సి వస్తే దండకారణ్యంలోని సుక్మాజిల్లాలో గల మినప గ్రామంలో వెయ్యి మంది అర్ధసైనిక బలగాలతో ఏర్పడిన నూతన క్యాంపును, అలాగే తూర్పు బస్తర్‌లోని హర్రాకోడేర్ గ్రామంలో ఏర్పడిన అర్ధసైనిక బలగాల మరో నూతన క్యాంపును ఉపసంహరించుకునేలా చేయడంలో ప్రజాగెరిల్లాలు-ప్రజలు సరికొత్త పోరాట రూపాలు చేపట్టి విజయం సాధించారు. వాస్తవంగా చెప్పాలంటే విశాల ప్రజల క్రియాశీల పాత్ర, సంఘటిత బలం లేకుండా, విప్లవ ప్రజాసంఘాల నిర్మాణం లేకుండా, విప్లవ ప్రజాకమిటీల నిర్మాణం లేకుండా ఈ విజయాలను నిజంగానే ఊహించలేం.

విప్లవ ప్రజాకమిటీల పాత్ర కేవలం ప్రజాగెరిల్లాలు సాధించిన సైనిక విజయాలకే పరిమితమై లేదు. అవి విశాల ప్రజారాశుల దైనందిన, మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయి. అవి నూతన ప్రజాస్వామిక అధికారాన్ని నెరపుతూ, దోపిడీ పాలకవర్గాల పోలీసు, అర్ధసైనిక బలగాల దాడులను తిప్పికొట్టగలిగిన మేరకు ప్రజల స్వయం ఆధారిత ఆర్థిక వ్యవస్థ నిర్మించగలుగుతున్నాయి. స్థానిక వ్యవసాయ ఉత్పత్తి విధానంలో మెరుగుదల తీసుకురావడానికి మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నాయి. వ్యవసాయ సాగు పద్ధతులను మెరుగుపరుస్తున్నాయి. సాగునీటి వ్యవస్థ రూపకల్పనకు పూనుకుంటున్నాయి. గత నాలుగేళ్లుగా పేద రైతుల కోసం దండకారణ్యంలో భూమి చదును-మళ్ల నిర్మాణ కేంపెయిన్లలో వేలాదిగా రైతాంగంలోని వివిధ సెక్షన్ల (ఏటా 15-20 రోజులు సాగుతోంది) ప్రజలు స్వచ్ఛందంగా, విప్లవ చైతన్యంతో పాల్గొంటున్నారు. అవి ప్రజల ఆహార పరిస్థితిలో మెరుగుదల సాధించడంలో భాగంగా వారికి పౌష్టికాహారం లభించడం కోసం చేపల పెంపకం, పండ్లతోటల పెంపకాన్ని

చేపడుతున్నాయి. అనేక శత్రు ఆటంకాల మధ్యనే పిల్లల విద్యాబోధనకు నిరంతర ప్రయత్నాలు జరుపుతున్నాయి. ప్రజల కనీస వైద్య అవసరాలు తీర్చడానికి, మలేరియా, డయేరియా, కలరా లాంటి అతి సాధారణ జబ్బుల నివారణకు, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండడానికి శక్తిమేరకు చర్యలు చేపడుతున్నాయి. విప్లవ ప్రజాకమిటీలు పనిచేస్తున్న ప్రాంతాలలో రైతాంగం ప్రధానంగా వ్యవసాయ రంగంలో అలాగే ఇతర రంగాలలోనూ సహకారోద్యమాన్ని బలోపేతం చేసుకుంటున్నారు. పీడిత ప్రజల పక్షాన ఆలోచించేవారికెవరికైనా మన దేశంలో ప్రాథమికంగా మౌలిక సదుపాయాల రూపకల్పన అంటే వెంటనే స్ఫురించేవి ఇలాంటివి కాకుండా మరేం ఉంటాయి? కానీ సామ్రాజ్యవాదుల, దళారీ బడాబూర్జువాల, భూస్వామ్య శక్తుల ప్రయోజనాలను ఈడేర్చే దోపిడీ ప్రభుత్వాలు మాత్రం దేశంలో మౌలిక సదుపాయాల రూపకల్పన పేరుతో సామ్రాజ్యవాదులకు దేశాన్ని తాకట్టు పెడుతూ, వారికి దేశ సంపదలను తెగనమ్మివేస్తూ కేటాయిస్తోన్న భారీ నిధులతో ఎక్స్‌ప్రెస్ హైవేలు, రింగ్ రోడ్లు, ఫ్లైఓవర్లు, విమానాశ్రయాలు, కమ్యూనికేషన్ టవర్లు లాంటివి నిర్మిస్తున్నాయి. విప్లవ ప్రజాకమిటీలు స్పష్టమైన లక్ష్యంతో దోపిడీ పాలకవర్గాల విధానాలకు పూర్తి భిన్నంగా అన్ని రంగాలలో ప్రజానుకూల చర్యలను చేపడుతున్నాయి. విప్లవ ప్రజాకమిటీలు అనుసరిస్తున్న ప్రజాహిత విధానాలతో ప్రధానంగా పునాది వర్గాల ప్రజల ప్రయోజనాలే నెరవేరుతున్నప్పటికీ, ఉన్నత మధ్య, ధనిక రైతాంగ ప్రయోజనాలకు నష్టం కలుగకుండా చూడడమే గాకుండా విప్లవోద్యమం తమ సమస్యలకూ పరిష్కారాన్ని చూపుతోందన్న విశ్వాసం వారిలో ఇనుమడింపజేస్తున్నది.

గెరిల్లా జోన్‌లను బేస్ ఏరియాలుగా మలచుకొనే ప్రక్రియలో భాగంగా మనం ప్రధానంగా శత్రు అధికారాన్ని విధ్వంసం చేయడం పైనే కేంద్రీకరిస్తున్నాం. విప్లవ ప్రజాకమిటీలు ప్రజా యుద్ధం ద్వారా లభిస్తోన్న విజయాలను, అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి నిర్మాణంపై అత్యంత శ్రద్ధ పెడుతున్నాయి. అలాగే ఇవి సమస్యల పరిష్కారానికి పోరాడుతోన్న విప్లవ ప్రజాసంఘాలకు అండగా నిల్చి తమ కార్యకలాపాలన్నింటినీ వాటితో సమన్వయించుకుంటున్నాయి. ఈ విధంగా ప్రజాయుద్ధంలో ప్రజలు మరింత క్రియాశీలంగా, విస్తృతంగా పాల్గొవడానికీ, విప్లవ ప్రజాకమిటీలు సంఘటితపడడానికీ, విస్తరించడానికీ కావలసిన పరిస్థితిని సృష్టించుకుంటున్నాయి.

దోపిడీ పాలకవర్గాలు తలకెత్తుకున్న ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల దివాలాకోరు ఆర్థిక విధానాల మూలంగా, ఏనాటికానాడు మరింత తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభ ఫలితంగా దేశ ప్రజలు చెప్పనలవికాని బాధలకు గురవుతున్నారు. ప్రజల కష్టాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నాయి. వీటిలో విస్థాపన సమస్య ప్రధానమైనది. విస్థాపన సమస్య ప్రధానంగా భూమి సమస్యే అయినప్పటికీ స్థానిక ప్రజల ఉనికికి సంబంధించిన సమస్య, పర్యావరణ సమస్య కూడా.

ఇలాంటి పరిస్థితులలో లక్షలాది ప్రజల అస్థిత్వమే, దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారనుంది. ఇది ఈనాటి భౌతిక వాస్తవికత. దీనిని అడ్డుకోవడానికి ప్రజలు ఎక్కడికక్కడే తెగించి కళింగనగర్, సింగూర్, నందిగ్రాం, లాల్‌గఢ్, నియంగిరి, రావ్‌ఘాట్, పల్లెమాడి, బోధ్‌ఘాట్, కోర్చి లాంటి అనేక పోరాటాల బాటలో నేడు పోరాడక తప్పదు. విప్లవ

ప్రజాసంఘాలు, విప్లవ ప్రజాకమిటీలు వివిధ స్థాయిలలో ఏర్పడి పనిచేస్తున్న చోట గత అనేక సంవత్సరాలుగా దేశ, విదేశీ భారీ కంపెనీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఎన్ని ఎం.ఓ.యు.లు కుదుర్చుకున్నప్పటికీ (ఒక అంచనా ప్రకారం 2007-12 మధ్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో 8000 ప్రాజెక్టుల కోసం ఐదు లక్షలకు పైగా ఎకరాల భూమి కేటాయించాయి) కార్యరూపం తీసుకోలేకపోతున్నాయి. అందుకే మోడీ-రాజనాథ్‌సింగ్-జైట్లీ-వెంకయ్య నాయుడు-రమణ్‌సింగ్-నవీన్ పట్నాయక్-చంద్రబాబు నాయుడులు ఆఘమేఘాల మీద విప్లవోద్యమ ప్రాంతాలన్నిటినీ కమ్యూనికేషన్ టవర్లతో, ఖాకీ బలగాలతో నింపేస్తూ విప్లవోద్యమ నిర్మూలనకు భారీ అభియాన్-ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ ఫేజ్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇన్నాళ్లుగా 'జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార్' కోసం పోరాడిన ఆదివాసీ-రైతాంగ ప్రజలు, అలాగే 'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజాకమిటీలకే సర్వాధికారాలు' అంటూ పోరాడుతున్న రైతాంగం-విశాల ప్రజారాశులు ఇకపై మరింత ఐక్యంగా, మరింత ధైర్యంగా, మరింత పట్టుదలతో, మరింత దృఢంగా పోరాడాల్సిన అవసరం ఉందని పరిస్థితులు సూచిస్తున్నాయి. ప్రజలు ప్రజాసాయుధ బలగాల అండతో గతంకన్నా మరింత మిలిటెంట్‌గా, సాయుధంగా ప్రతిఘటనకు పూనుకోవాల్సిన అవసరాన్ని నేటి పరిస్థితులు అనివార్యం చేస్తున్నాయి. "ప్రజలను సంఘటితపర్చే కృషిగానీ, ప్రజాపోరాటాలను నిర్మించే కృషిగానీ ప్రజాసాయుధ బలగాల మద్దతు లేకుండా విజయవంతంగా సాగదు. గెరిల్లా యుద్ధాన్ని విస్తరించి, అభివృద్ధిపర్చడం ద్వారా మాత్రమే పార్టీ ప్రజాపోరాటాల ద్వారా లభించిన విజయాలను సంఘటితపరచుకోగలుగుతుంది. ఆ విధంగా మాత్రమే అది ప్రత్యామ్నాయ ప్రజారాజకీయ అధికారానికి పునాదిని వేయగలుగుతుంది" అంటూ 'మన వ్యూహం-ఎత్తుగడలు' డాక్యుమెంట్ మనకు మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది.

నారాయణపట్నాలో మన పార్టీ నాయకత్వాన ఆదివాసీ రైతాంగం గొప్ప భూపోరాటాన్ని నిర్వహించారు. దశాబ్దాలుగా అక్కడ కుళ్లికంపుకొట్టిన కె.ఎన్. రామచంద్రన్ నాయకత్వంలోని ఆధునిక రివిజనిస్టు ముఠా అనుసరించిన రాజకీయాల పట్టు నుంచి ప్రజలు బయటపడి పోరాట వెల్లువను సృష్టించి ప్రత్యామ్నాయ రాజకీయ అధికారానికి గట్టి పునాదులు వేశారు. నందిగ్రాం వీరోచిత రైతాంగం సమైక్యంగా సోషల్ ఫాసిస్టు సి.పి.ఎం. ప్రభుత్వ హర్మద్ బాహిని సాయుధ దాడులను సాయుధంగా ఎదిరించడం ద్వారా విదేశీ కార్పొరేషన్‌ను (ఇండోనేషియాకు చెందిన సలీం కెమికల్ హబ్) తరిమికొట్టి తమ పంట భూములను కాపాడుకున్నారు. నందిగ్రాం పోరాటం వివిధ పోరాట శక్తుల ఎత్తుగడల ఐక్యసంఘటన నాయకత్వంలోనే జరిగిందన్నదీ, ఇందులో మన పార్టీ కీలక పాత్ర నిర్వహించిందన్నదీ అందరికీ తెలిసిందే.

లాల్‌గఢ్ వీర ప్రజానీకం రాజ్య నిర్బంధం తక్షణ సమస్య కేంద్రంగా చారిత్రాత్మకమైన గొప్ప పోరాట వెల్లువను సృష్టించారు. సోషల్ ఫాసిస్టుల రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహంతో ఆరంభమైన పోరాటం ఊడలు దిగిన నయా రివిజనిస్టుల నడ్డి విరుస్తూ లాల్‌గఢ్ సామాజిక జీవితంలోని సమస్త పార్శ్వాల్ని స్పృశించింది, కుదిపివేసింది. అది వినూత్నమైన పోరాట, నిర్మాణ రూపాలతో రెండు సంవత్సరాలకు పైగా కొనసాగింది.

ఈ ప్రాంతమంతా 1970వ దశకం నుండీ మావోయిస్టు విప్లవ రాజకీయాల ప్రభావంలో ఉన్నందునే, మూడు దశాబ్దాల సోషల్ ఫాసిస్టు పాలనలో బెంగాల్‌లోని అత్యధిక ప్రజానీకం విసిగి వేసారి తీవ్ర అసంతృప్తితో కోపంతో ఉన్న, పాలకవర్గాల (సి.పి.ఎం-త్రిణమూల్ పార్టీల) మధ్య వైరుధ్యాలు చాలా తీవ్రంగా ఉన్న చాలా అనుకూల రాజకీయ పరిస్థితి ఉన్నందునే, ప్రత్యేకంగా నూతన పార్టీ ఏర్పడినప్పటి నుండి పెంపొందిన స్వీయాత్మక శక్తీ, స్వీయకృషీ, పార్టీ కమిటీల నాయకత్వ చొరవా, భారత విప్లవోద్యమ విజయాల ప్రభావం, సింగూర్, నందిగ్రాం విస్థాపన వ్యతిరేక ఉద్యమ విజయాల ప్రభావం, ప్రజల సుదీర్ఘ పోరాటానుభవం మూలంగానే ఈ ప్రజావెల్లువ సాధ్యమైంది. మరో వాస్తవం ఏమంటే లాల్‌గఢ్ ప్రజాఉద్యమం పార్టీ నాయకత్వంలోనే, సరైన ఐక్యసంఘటన నిర్మించుకోవడం ద్వారానే, పోరాట క్రమంలో సృజనాత్మకంగా సాయుధ/సాయుధేతర పోరాట నిర్మాణ రూపాలను, నినాదాలను ముందుకు తీసుకురావడం ద్వారానే, ప్రజలను విస్తృతంగా, మిలిటెంట్‌గా కదిలించడం ద్వారానే ఆ గొప్ప విజయాలు సాధ్యమయ్యాయి. లాల్‌గఢ్‌లో సంయుక్త బలగాల నిర్బంధానికి వ్యతిరేకంగా విశాల ప్రజలు విస్తృతంగా, మిలిటెంట్‌గా కదులుతూనే, తమ దైనందిన సమస్యలపై, భూమి సమస్యతో పాటు ఇతర మౌలిక సమస్యలపై పోరాటాలు వెల్లువెత్తించారు. అవన్నీ మన పార్టీ నాయకత్వంలో విశాల ప్రాతిపదికన ఏర్పడిన ఐక్యసంఘటన నాయకత్వంలోనే జరిగాయి. తీవ్రతరమైన శత్రు నిర్బంధం,ఉద్యమ క్రమంలో జరిగిన లోపాలు, నాయకత్వంతో పాటు స్వీయాత్మక శక్తుల నష్టం కారణంగా లాల్‌గఢ్ విప్లవ వెల్లువ దెబ్బతిన్నా, పార్టీ నాయకత్వంలో లాల్‌గఢ్ విప్లవ ప్రజానీకం ప్రజాయుద్ధ మార్గాన సాగుతూనే ఉన్నారు. లాల్‌గఢ్‌లో సోషల్ ఫాసిస్టులకు వ్యతిరేకంగా ఈ ఐక్యసంఘటన ఒక నిజమైన ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్న సమయంలోనే కేంద్ర, రాష్ట్ర సంయుక్త బలగాలు అత్యంత క్రూరంగా అణచివేత కొనసాగించాయి. లాల్‌గఢ్ వీర ప్రజానీకం, వారికి అండగా నిలిచిన సిధూ-కానూ మిలీషియా, పి.ఎల్.జి.ఏ. బలగాలు సంయుక్త బలగాలను అత్యంత ధైర్యసాహసాలతో ఎదిరించే క్రమంలో ఎనలేని త్యాగాలు చేశారు. ఈ ఐక్యసంఘటనలో ఇందుకు సిద్ధంగా లేని ఒక సెక్షన్, ఉదారవాద మేధావుల్లోని ఒక సెక్షన్ ఈ ఉద్యమాన్ని వదిలిపెట్టింది లేదా దూరం జరిగింది. భారత విప్లవోద్యమానికి బెంగాల్ కామ్రేడ్స్, బెంగాల్ విప్లవ ప్రజానీకం, ప్రత్యేకంగా లాల్‌గఢ్ కామ్రేడ్స్, లాల్‌గఢ్ విప్లవ ప్రజలందించిన పాఠాలు, ప్రత్యేకంగా ఐక్యసంఘటన రంగంలో అందించిన పాఠాలు అత్యంత విలువైనవి.

విప్లవ ప్రజాసంఘాలు, విప్లవ ప్రజాకమిటీలు పనిచేస్తున్న చోట రాజ్యహింసకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాపోరాటాలకు, ప్రజా ప్రతిఘటనకు అవి క్రియాశీలంగా నాయకత్వం వహిస్తున్నాయి. ప్రభుత్వ పోలీసు, అర్ధసైనిక బలగాలు గ్రామాలపై బడి రైతాంగాన్ని విచ్చలవిడిగా అరెస్టులు చేస్తుంటే ప్రజలు అడ్డుకుంటున్నారు. గ్రామస్థాయి విప్లవోద్యమ నాయకత్వాన్ని బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపుతూ శవాలను సైతం తమ వెంట తీసుకెళ్తుంటే, పోలీసుల క్రూర చర్యలను ఖండిస్తూ శవాల స్వాధీనానికి పోరాడుతున్నారు. మహిళలపై అత్యాచారాలకు పూనుకుంటుంటే, సామూహికంగా ప్రతిఘటిస్తున్నారు. రాజకీయ ఖైదీల విడుదల కోసం చురుగ్గా కదులుతున్నారు. విద్యార్థుల సమస్యలపై అధికారులను

నిలదీస్తున్నారు. అయితే ప్రజార్యాలీలు, నిరసన ప్రదర్శనలు చాలావాటిలో ఐక్యసంఘటన వేదికలలో చేరిన బూర్జువా, రివిజనిస్టు పార్టీల స్థానిక నాయకత్వమే వేదికలెక్కి ప్రజలచే గుర్తింపబడి తమ పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. విప్లవ ప్రజాసంఘాల నాయకత్వం నిర్బంధం కారణంగా బహిరంగంగా ఇలాంటి చాలా ఐక్య ప్రదర్శనలకు, సభలకు నాయకత్వం వహించలేక పోయారు. నిర్బంధంలో సహితం ఇలాంటి కార్యక్రమాలకు నాయకత్వం వహించగలిగే శక్తులను, వేదికలను నిర్మించుకోలేని లోపం కారణంగా వారికి ఈ అవకాశం కలిగింది. మనం ఈ సమస్యను పరిష్కరించుకోవడం ద్వారానే ఐక్యసంఘటనకు ప్రభావవంతంగా నాయకత్వాన్ని అందించగలుగుతాము. మావో ఐక్యసంఘటనకు సంబంధించి కార్మికవర్గం అనుసరించాల్సిన మౌలికమైన ఎత్తుగడల సూత్రాలను రూపొందించాడు. అవి, ఐక్యసంఘటన పైన కార్మికవర్గ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలి; అన్ని పరిస్థితులలోనూ కార్మికవర్గం తన సొంత కృషిపై ఆధారపడాలి; చొరవను, స్వతంత్రాన్ని తన చేతిలో ఉంచుకోవాలి; ఆ ఐక్యసంఘటన సాయుధ పోరాటానికి సేవ చేయాలి. మనం ఈ సూత్రాల వెలుగులోనే ఈనాటి గడ్డు పరిస్థితులను అధిగమించే విధంగా విప్లవ ఐక్యసంఘటనను పటిష్టం చేసుకోవాలి.

విప్లవ ప్రజాకమిటీలు ఏర్పడి ప్రాథమిక స్థాయిలో పనిచేస్తున్న చోటనైనా, విప్లవ ప్రజాసంఘాలు బలంగా పనిచేస్తున్న చోటనైనా, వాటిని విచ్ఛిన్నం చేయడానికి స్థానికంగా అధికారాన్ని కోల్పోయిన/కోల్పోతున్న వర్గాల నుంచి వివిధ రూపాల్లో ప్రతిఘటన ఎదురవుతోంది. లెనిన్ మాటల్లో చెప్పాలంటే గతంకన్నా పదిరెట్ల అధిక బలాన్ని కూడగట్టుకొని రంగంలోకి దిగుతున్నారు. బూర్జువా రాజ్యయంత్రాంగంతో, రాజకీయ పార్టీలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా చేయి కలిపి అనేక కుట్రలకూ, కుహకాలకూ పాల్పడుతున్నారు. బూర్జువా, రివిజనిస్టు పార్టీలకు చెందిన స్థానిక నాయకత్వ శక్తులు ప్రజలను విప్లవ మార్గం నుండి పక్కతోవ పట్టించడానికి, సంస్కరణవాద రొంపిలో దింపడానికి చాపకింది నీరులా వ్యవహరిస్తున్నారు. దేశ, విదేశీ పెట్టుబడిదారుల భారీ పెట్టుబడులకు దళారులుగా వ్యవహరిస్తున్న పరమ స్వార్థపర శక్తులు గుట్టు చప్పుడు కాకుండా ప్రజాపోరాటాలకు తూట్లు పొడవడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా, ఇలాంటి శక్తులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తెస్తున్న భారత పాలకవర్గాలచే అమలుపరచబడుతున్న ఎల్.ఐ.సి. వ్యూహం-ఎత్తుగడలకు వ్యతిరేకంగా పార్టీ అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ విప్లవ ప్రజాకమిటీలను, ప్రజలను జాగరూకులను చేయాలి. విప్లవోద్యమ ఆటు-పోట్ల గురించి, విజయం-ఓటమి-అంతిమంగా విజయం సాధించే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా గురించి వ్యూహాత్మక దృష్టితో బోధించి ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచాలి.

మన పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతోన్న వివిధ రాష్ట్రాలలో ప్రజలు అనేక సమస్యలపై పోరాడుతున్నారు. దేశవ్యాప్తంగా స్పాంటేనియస్‌గా, వివిధ బూర్జువా, పెటీబూర్జువా, రివిజనిస్టు సంస్థల నాయకత్వంలో ప్రజలు తమ సమస్యలపై ఏదో ఒక మేరకు పోరాడుతున్నారు. బూర్జువా, రివిజనిస్టు నాయకత్వం ప్రజాఉద్యమాలు మిలిటెంట్‌గా అభివృద్ధి చెందకుండా నిరంతరం ప్రజలను పక్కదారి పట్టిస్తూనే ఉన్నారు. స్పాంటేనియస్‌గానూ,

వివిధ శక్తుల నాయకత్వంలోనూ జరుగుతున్న పోరాటాలలో మన ప్రజాసంఘాలు సరైన నినాదాలతో పాల్గోవాలి, చొరవగా నాయకత్వాన్ని అందించడానికి కృషి చేయాలి. విప్లవోద్యమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే మన సంఘాలు, శక్తులు వేటిలో పాల్గోవాలనేది నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. స్పాంటేనియస్‌గా పనిచేయడం ఎలా పొరపాటో కేవలం స్వీయాత్మక శక్తికి పరిమితమై ఆలోచిస్తూ వాటికి దూరంగా ఉండడం అంతే పొరపాటు. రాజకీయంగా చొరవ తీసుకొని ప్రజాపోరాటాలను బలపరచడం, వాటిలో పాల్గోవడం, వాటిలో ముందుపీఠిన నిలిచి నాయకత్వాన్నందించి వాటిని బలమైన ఉద్యమాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలి. ఈ విధంగానే ప్రజలను సరైన మార్గాన నడిపించగలం; మిత్రశక్తుల నమ్మకాన్ని చూరగొనగలం; అవకాశవాద శక్తుల్ని ఒంటరి చేయగలం; నాయకత్వాన్ని స్థాపించగలం; స్వీయశక్తుల్ని అభివృద్ధి చేసుకోగలం.

ఐక్యసంఘటనలో కలిసి వచ్చే విభిన్న వర్గాల మధ్య ఒకవైపు ఐక్యత, మరోవైపు పోరాటం ఉంటాయి. వాటన్నింటికీ ఉమ్మడి లక్ష్యం ఉన్నందువల్ల ఐక్యసంఘటనలో ఐక్యత ఉంటుంది. భిన్న వర్గప్రయోజనాల కారణంగా వాటి మధ్య పోరాటమూ ఉంటుంది. ఈ రెండూ ఐక్యసంఘటన లక్షణాలు. వీటిలో ఏది మరిచినా ఐక్యసంఘటనకు నష్టం కలుగుతుందని మన అనుభవం తెలుపుతున్నది. అలాగే ఐక్యసంఘటనా కార్యకలాపాలలో మన ఓరియంటేషన్ భిన్న శక్తులను నూతన ప్రజాస్వామిక కార్యక్రమం ప్రాతిపదికగా సమీకరించడానికి తోడ్పడేదిగా ఉండాలి. ఈ కార్యకలాపాలన్నీ మన సాయుధ పోరాటాన్ని మరింతగా ఉధృతం చేయడానికి, విస్తృతం చేయడానికి దోహదపడాలి. ప్రజాయుద్ధ లక్ష్యానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడనటువంటి ఉమ్మడి కార్యకలాపాలు లేదా ఉమ్మడి వేదికలు ఉద్యమానికి ఉపయోగపడవు.

సెంట్రల్ రీజియన్‌లోని రాష్ట్రాలలో, స్పెషల్‌జోన్లలో ప్రధానంగా భూమి సమస్య కేంద్రంగా విస్థాపన వ్యతిరేక ప్రజాపోరాటాలు జరుగుతున్నాయి. గనుల తవ్వకానికి, భారీ డ్యాంల నిర్మాణానికి, వన్యమృగ సంరక్షణా (అడవుల నుండి జనవాసాల తొలగింపు) కేంద్రాల స్థాపనకు, అటవీ భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా, పెసా లాంటి ప్రభుత్వ చట్టాలను అమలు చేయాలంటూ, ఆదివాసీ ప్రజల అటానమస్ హక్కుల కోసం, ఆదివాసీ ప్రజల ఆత్మగౌరవానికై, రైతాంగ పంటలకు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కావాలంటూ ప్రజానీకం తమ సమస్యలపై దోపిడీ ప్రభుత్వాలతో పోరాడుతున్నారు. మత మైనార్టీలపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు, వారి భద్రత కోసం, హక్కుల కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. రాజకీయ ఖైదీల విడుదల కోసం, వారి హక్కుల కోసం జైలులోనూ, బయటా పోరాటాలు జరుగుతున్నాయి. అసంఘటిత రంగంలోని కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సంఘటితమవుతూ పోరాటాలు చేపడుతున్నారు. ఆర్థిక, రాజకీయ రంగాలతో పాటు సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడా ప్రజలు తమ న్యాయమైన డిమాండ్లు ముందు పెడుతూ పోరాడుతున్నారు. మరోవైపు ఈ దేశంలో దశాబ్దాలుగా సాగుతోన్న ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలకు ఈ మధ్యే జయప్రదమైన తెలంగాణా రాష్ట్రోద్యమం నూతన ఉత్సాహాన్ని, ప్రేరణను ఇచ్చింది. తెలంగాణ ప్రజలు

దాదాపు ఆరు దశాబ్దాలు పోరాడి తుదకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారు. ప్రజలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా నిజమైన ప్రజాస్వామిక తెలంగాణాను సాధించుకునే మహత్తర కర్తవ్యం మిగిలే ఉంది. ఈ ఉద్యమంలో మనం ఐక్యసంఘటనకు సంబంధించి మంచి అనుభవం సంపాదించాం.

పైన పేర్కొన్న వివిధ సమస్యలపై మన విప్లవ, ప్రజాస్వామిక సంఘాలు, మిత్రసంస్థలు, శక్తులతో కలిసి వివిధ స్థాయిలలో ఐక్యసంఘటనా వేదికలను ఏర్పర్చుకొని పోరాడుతున్నాయి. అవి కొన్నిచోట్ల చొరవతో నాయకత్వం వహిస్తుండగా, మరికొన్ని చోట్ల చురుగ్గా, క్రియాశీలంగా పాల్గొంటున్నాయి. ఎక్కడికక్కడే బలాబలాలపై ఆధారపడి ఈ ప్రజాసంఘాలు పనిచేస్తున్నాయి. పైన పేర్కొన్న పోరాటాలలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం, ప్రభుత్వ నిర్బంధ వ్యతిరేక ఉద్యమం, రాజకీయ ఖైదీల విడుదల, విస్థాపన లాంటివి మినహా మిగతా అనేకం కింది స్థాయిల్లో ఐక్యసంఘటనా వేదికలను ఏర్పర్చుకొని జరుగుతున్నవి. వాస్తవంగా మన స్వీయాత్మక పరిస్థితుల నేపథ్యంలో చెప్పాలంటే ఈనాటి గడ్డు పరిస్థితులలో తక్షణం పైనుంచి ఐక్యసంఘటనలు నిర్మించే స్థితి కూడా ముందరిలా లేదు. ఇలా చెప్పుతున్నామంటే ఏ సమస్య పైననూ పైనుంచి ఐక్యసంఘటనల నిర్మాణానికి కృషి జరపలేమన్నది ఎంతమాత్రం కాదు. వస్తుగతంగా ఐక్యసంఘటన అభివృద్ధికి పరిస్థితులు గతం కంటే అనుకూలంగా నెలకొని ఉన్నాయి, పెంపొందుతున్నాయి.

మన దీర్ఘకాల కార్యాచరణలో నుంచి నిస్సందేహంగా రుజువవుతోన్న విషయమేమంటే విప్లవోద్యమ పురోగమనానికీ, పైనుంచి ఐక్యసంఘటనా వేదికల నిర్మాణానికి వివిధ శక్తులు తమ సంసిద్ధత తెలపడానికి మధ్య విడదీయరాని సంబంధం ఉంది. అలాగే ప్రజాయుద్ధ విజయాలు, దేశంలోని కొన్ని ప్రాంతాలలో ప్రాథమిక స్థాయిలో ఏర్పడి పనిచేస్తున్న నూతన ప్రజాస్వామిక అధికార అంగాలు (విప్లవ ప్రజా కమిటీలు) ఒక విప్లవకర ప్రత్యామ్నాయంగా దేశప్రజల గుర్తింపు పొందుతున్న కారణంగా మేధావుల్లో, వివిధ ప్రజాస్వామిక శక్తుల్లో జరుగుతున్న చర్చ నేపథ్యంలో పైనుంచి ఐక్యసంఘటనలకు మున్నెన్నటి కన్నా అధిక శక్తులు, సంస్థలు మనతో కలిసి పనిచేయడానికి అవకాశాలు మెరుగవుతున్నాయి. ఈ అనుకూల పరిస్థితిని సద్వినియోగం చేసుకోవడానికి మనం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి.

ఐక్యసంఘటన విషయంలో, ముఖ్యంగా ఎత్తుగడలపర ఐక్యసంఘటన విషయంలో విప్లవశక్తులు తొందరపడి వ్యవహరించకుండా అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. పట్టణ పేదల, దళితుల, ఆదివాసీల, మహిళల, మత మైనారిటీల సమస్యలపై అనేక దేశ, విదేశీ స్వచ్ఛంద సంస్థలు(ఎన్.జి.ఓ.లు) పనిచేస్తున్నాయి. మన దేశంలో వీటి సంఖ్య లక్షలలోనే ఉంటుంది. ఇవి మన విప్లవోద్యమ ప్రాంతాలలో ఎక్కువగా కేంద్రీకరిస్తూ పనిచేస్తున్నాయి. నిలువెల్లా సంస్కరణవాదంతో నిండిపోయిన ఈ ఎన్.జి.ఓ.లు ప్రజలను వివిధ సమస్యలపై సమైక్యంగా, మిలిటెంట్‌గా పోరాడనీయకుండా చేస్తూ నీరుగారుస్తున్నాయి, పక్కదార్లు పట్టిస్తున్నాయి. ఇవి పనిగట్టుకొని ప్రత్యక్షంగా, పరోక్షంగా విప్లవ వ్యతిరేక ప్రచారానికి పూనుకుంటున్నాయి. మన ప్రాంతాలలో గల ప్రతి ఎన్.జి.ఓ. లక్ష్యాన్నీ, వాటి స్వభావాన్నీ మనం నిర్దిష్టంగా పరిశీలించాలి. ఎన్.జి.ఓ.ల పట్ల, వాటితో వ్యవహరించాల్సిన

వైఖరి పట్ల పార్టీలో, ప్రజలలో స్పష్టమైన అవగాహన పెంపొందించాలి. వివిధ కారణాల వల్ల కొన్ని ఎన్.జి.ఓ.లు ప్రజల సమస్యలను తీసుకొని పనిచేస్తున్నాయి. ఇలాంటి వాటితో మనం నిర్దిష్ట సమస్యలపై కలిసి పనిచేస్తూనే ఐక్యసంఘటనలో మన నాయకత్వాన్నీ, స్వతంత్రతనూ, చొరవనూ నిలబెట్టుకోవడానికీ, జాగరూకతతో ఉండడానికీ కృషి చేయాలి. అలాగే వివిధ ఎన్.జి.ఓ.లను నిర్దిష్టంగా పరిశీలించకుండా గంపగుత్తగా అన్నిటితో శత్రుపూరిత వైఖరితో వ్యవహరిస్తే మనమే ప్రజలలో ఒంటరివాళ్లమయ్యే ప్రమాదం ఉంటుందన్న విషయం మన గమనంలో ఉండాలి. మనం ఐక్యసంఘటనలలో చేరే భిన్న రాజకీయ వైఖరులు గల, భిన్న ప్రయోజనాలు గల శక్తులతో వ్యవహరించేటప్పుడు ఒంటెత్తు వైఖరిగానీ, ఉదారవాద వైఖరిగానీ అవలంబిస్తే ఉద్యమానికి నష్టం కలుగుతుంది. ఉమ్మడిగా రూపొందించుకున్న కార్యక్రమానికి కట్టుబడని శక్తులతో ఐక్యత సాధించే దృష్టితో పోరాడుతూనే, ఐక్యసంఘటనకు నష్టం కలిగించే శక్తులను మిత్రశక్తులలో, ప్రజలలో ఎండగట్టి ఒంటరులను చేయాలి. ఐక్యసంఘటనా కార్యకలాపాలలోకి పాలకవర్గ పార్టీలప్రతినిధుల వలే పేరుమోసిన ప్రజావ్యతిరేక శక్తులు చొరబడకుండా మనం మొదటి నుండీ తప్పక జాగ్రత్తగా ఉండాలి.

ఐక్యసంఘటనలో చొరవ-స్వాతంత్ర్యం నిలబెట్టుకోవటానికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. ''ఐక్యసంఘటనలోని ప్రతి పార్టీ, ప్రతి గ్రూపూ తన సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ స్వతంత్రతను పదిలపరుచుకోవాలి'' అనీ, అలాగే ''ఐక్యసంఘటనలో స్వాతంత్ర్యం సాపేక్షికమైనదేననీ సంపూర్ణమైనది కాదన్నది నిస్సందేహం'' అనీ కా. మావో స్పష్టం చేశాడు. ఐక్యసంఘటనలో లొంగుబాటుతత్వాన్ని దృఢంగా వ్యతిరేకించాలన్నది మనం ఖచ్చితంగా పాటించాలి. ఐక్యసంఘటనలో ఒంటెత్తుపోకడలతో చేసే తప్పులకూ, తలుపులు మూసుకునే పద్ధతులు అవలంబించడానికీ అవకాశాలు ఉన్నట్టే తోకపట్టుకుపోయే విధానాలు అనుసరించడానికి అవకాశాలు ఉన్నాయి. మన ఆచరణలో ఈ రెండు రకాల తప్పుడు ధోరణులను ఎదుర్కొంటున్నాం. తొందరపాటుతో తగిన సన్నాహాలు లేకుండా ఒంటరిగా పోరాటాలకు దిగే, సైనిక చర్యలకు పూనుకొనే సెక్టేరియన్ తప్పులుగానీ, అవతలవారి రాజకీయ కుట్రలను, మోసాలను ఉదారవాదంతో చూస్తూ ఉండిపోయేలాంటి తప్పులనుగానీ దరిచేరనీయవద్దు. ఐక్యసంఘటనలో తేనెపూసిన కత్తిలా వ్యవహరించడంలో రివిజనిస్టులు మహా ఉద్దండులు. వీరు మన వర్గపోరాటం తీవ్రంగా జరుగుతున్న దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉన్నారు. వీరు సాధారణంగానే ఎర్రజెండాను ముందుపెట్టుకొని ప్రజాపోరాటాల పేరుతో ప్రదర్శనలు, బహిరంగ సభలలో ముందుంటారు. వీరు విస్థాపన సమస్యపై ఎక్కడ కలిసి వచ్చినా అధిక నష్టపరిహారం, పునరావాసం పేరుతో పోరాటాలను నీరుగార్చి పబ్బం గడుపుకుంటున్నారు. మనం ఐక్యసంఘటనలో ఇలాంటి వారితో అప్రమత్తంగా వ్యవహరించాలి.

జాతుల బందిఖానా అయిన భారతదేశంలో చాలాకాలం పీడిత జాతులు స్వయం నిర్ణయాధికార హక్కు కోసం సాయుధ పోరాటాన్ని కొనసాగించాయి, వాటిలో కొన్ని నేటికీ కొనసాగిస్తున్నాయి. నూతనంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడిన తర్వాత పీడిత జాతుల సంస్థలతో వ్యూహాత్మక దృష్టితో సన్నిహిత సంబంధాలు కొనసాగించడానికీ, ఐక్యసంఘటన నిర్మించడానికీ కృషి చేశాము. కొన్ని ఐక్యసంఘటనా కార్యక్రమాలు కొనసాగి

రెండు శిబిరాల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ పరిణామాలు దోపిడీ పాలకవర్గాలలో కలవరం సృష్టించాయి. పాలకవర్గాలు ఈ ఐక్యసంఘటనతో ఎదురుకానున్న భవిష్యత్ ప్రమాదాన్ని తీవ్రంగా పరిగణిస్తూ అణచివేత చర్యలను ముమ్మరం చేశారు. తీవ్రతరమైన శత్రుదాడితో, ఆశాజనకంగా పురోగమిస్తున్న ప్రక్రియ తాత్కాలికంగా కుంటుపడినా ఈ వ్యూహాత్మక కర్తవ్యం మన ముందుంది.

16వ లోక్‌సభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ మెజార్టీ సాధించింది. కేంద్రంలో కరుడుగట్టిన ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. నాయకుడైన నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్.డి.ఏ.) ప్రభుత్వం ఏర్పడింది. భారతీయ జనతా పార్టీ ఉన్నత నాయకత్వ పదవులలోకి కరుడుగట్టిన ఆర్.ఎస్.ఎస్. శక్తులను పథకం ప్రకారమే తీసుకొచ్చింది. దేశ రాజకీయాలలో నేరుగా ఆర్.ఎస్.ఎస్. జోక్యం మున్నెన్నడూ లేని విధంగా పెరిగింది. కరుడుగట్టిన మతవాద, మితవాద, తిరోగమన రాజకీయాలలో ఆరితేరిన మోడీ దేశ ప్రధాని కావడం ఎంతటి వినాశకర పరిణామాలకు దారితీయనుందో కొద్దిరోజుల దాని పరిపాలనే అద్దం పడుతున్నది. దేశంలో అల్ప సంఖ్యాక మతస్థులపై హిందూ మతోన్మాదుల దాడులు తీవ్రమయ్యాయి. వారిని కించపరిచే చర్యలు అనేకం వెలుగు చూస్తున్నాయి. నెహ్రూ హయాం నుంచే క్రమంగా తూట్లు పొడుస్తూ వస్తున్న ఆర్టికల్ 370ని (కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి) ఇప్పుడు పూర్తిగా ఎత్తేస్తామంటున్నారు. ఆర్.ఎస్.ఎస్. మరియు పదులకొద్దీ దాని అనుబంధ సంస్థలు ఆర్థిక, రాజకీయ, సైనిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో దేశవ్యాప్తంగా అల్లుకపోయి పథకం ప్రకారం బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు చర్యలను ఉధృతం చేస్తున్నాయి.

నిన్నటివరకు పరమ దేశభక్తి, జాతీయత, స్వదేశీ విధానాలు అంటూ గొంతు చించుకున్న సంఘ్ పరివార్ శక్తులన్నీ ఈ రోజు సామ్రాజ్యవాద గ్లోబలైజేషన్ విధానాల ముందు నిర్లజ్జగా సాగిలబడుతున్నాయి. నరేంద్రమోడీ అంతర్జాతీయ పెట్టుబడికి అత్యంత నమ్మకమైన ఏజెంట్‌గా అతి దూకుడుగా వ్యవహరిస్తున్నాడు. దేశ రక్షణ, రైల్వే, భీమా సహా ఇంతవరకు ప్రైవేట్‌పరంగాని అన్ని రంగాలను అతి వేగంగా ప్రైవేట్‌పరం చేస్తున్నాడు. దేశంలోని వంద నగరాలను స్మార్ట్ సిటీలు చేయడానికి అంతర్జాతీయ పెట్టుబడిని ఆహ్వానించి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాడు. ఇందుకనుగుణంగా కార్మిక చట్టాలను మార్చివేసి వారి హక్కులను సైతం హననం చేస్తున్నాడు. 'డిజిటల్ ఇండియా', 'మేక్ ఇండియా' నినాదాలతో దేశాన్ని ప్రపంచ శక్తిగా అభివృద్ధి చేస్తానంటూ తన ప్రజావ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాలకు ముసుగు తొడగ ప్రయత్నం చేస్తున్నాడు. మన విప్లవోద్యమంపై ఎంత తీవ్రంగా దాడి చేయనున్నారో కేంద్ర, రాష్ట్రాల తయారీలే స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రమాద తీవ్రతను సరిగా అర్థం చేసుకోగలిగినప్పుడే వ్యూహాత్మక, ఎత్తుగడలపర ఐక్యసంఘటనల ఆవశ్యకతను లోతుగా గ్రహించగలం. వాటి నిర్మాణానికి గల అవకాశాలన్నింటినీ వినియోగించుకోవడానికి తీవ్రంగా కృషి చేయగలం.

ప్రపంచవ్యాప్తంగా వస్తుగత పరిస్థితులు గతం కన్నా విప్లవానికి అనుకూలంగా మారుతున్నాయి. మన దేశంలోనూ ప్రజలు భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేపడుతున్నారు. విప్లవోద్యమ ప్రాంతాలలో ప్రాణాలకు సైతం తెగించి ప్రజలు పోరాడుతున్నారు. ఇటీవల దేశంలో పీడిత జాతుల పోరాటాలు తాత్కాలికంగా

బలహీనపడినా, అక్కడి ప్రజలు వివిధ రూపాలలో తమ న్యాయబద్ధమైన ఆకాంక్షలను వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

దేశంలో భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను తీవ్రతరం చేయడానికీ, విస్తరింపజేయడానికీ, ఐక్యసంఘటన నిర్మాణాలు ఏర్పర్చుకోవడానికి మున్నెన్నటికన్నా అవకాశాలు అధికమయ్యాయి. బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా మతమైనార్టీలతో సహా సెక్యులర్ ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు, సంస్థలు ముందుకు వస్తున్నాయి. అలాగే సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్త శక్తులు ముందుకు వస్తున్నాయి. 'విప్లవ ప్రతీఘాతుక పాలకవర్గాలు కలసికట్టుగా సాగించే ఫాసిస్టు అణచివేత, నిర్మూలనా కేంపెయిన్‌ల నుండి విప్లవోద్యమాన్ని కాపాడే నిజమైన కోట విప్లవ ఐక్య సంఘటనే'. సాయుధ పోరాటాన్ని పురోగమింపజేసే క్రమంలోనే ఈ ఐక్యసంఘటన శక్తివంతమైనది, నిలకడైనది కాగలుగుతుంది. సమర్థవంతమైన ఐక్యసంఘటన రూపొందినప్పుడే సాయుధ పోరాటం శక్తివంతమైనది కాగలుగుతుంది. యావత్తు భారత విప్లవోద్యమ అనుభవం, ప్రత్యేకంగా విప్లవ ప్రజాకమిటీల అనుభవం దీనినే రుజువు చేస్తున్నాయి. నేడు ప్రజా ఉద్యమాల అభివృద్ధికీ, ప్రజాయుద్ధం అభివృద్ధికీ, బలమైన ఐక్యసంఘటన నిర్మాణానికీ పూర్తి అవకాశాలున్నాయి.

*

శత్రువుకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాన్ని నడపడంలో, కమ్యూనిస్టులు పరిస్థితిని మొత్తంగా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజలలో అత్యధిక సంఖ్యాకుల తరఫున ఆలోచించాలి. తమ మిత్రులతో కలిసి పనిచేయాలి. పాక్షికమైన అవసరాలు, మొత్తం యొక్క అవసరాలకు, ప్రయోజనాలకు లోబడి ఉండాలనే సూత్రాన్ని వారు తప్పక గ్రహించాలి. ఒక ప్రతిపాదన పరిస్థితిలోని ఒక భాగానికి అనువుగా ఉండి, పరిస్థితి మొత్తానికంతా అలా లేనట్లయితే, మొత్తానికి దారి ఇచ్చి ఆ భాగం పక్కకు తప్పుకోవాలి. తద్విరుద్ధంగా ఆ ప్రతిపాదన పరిస్థితి మొత్తానికంతా అనువుగా ఉండి, ఒక భాగానికి అననుకూలం అయితే అప్పుడు కూడా ఆ భాగం పక్కకి తప్పుకొని మొత్తానికే త్రోవ ఇవ్వాలి. పరిస్థితిని మొత్తంగా పరిగణించడం అంటే ఇదీ అర్థం. కమ్యూనిస్టులు ఎన్నడూ అధిక సంఖ్యాక ప్రజల నుండి వేరుపడకూడదు, లేదా, కొద్దిమంది అభ్యుదయశక్తులను ఒంటెత్తుగా దుందుడుకుగా ముందుకు తీసుకుపోతూ అధిక సంఖ్యాక ప్రజలను నిర్లక్ష్యం చేయకూడదు. అభ్యుదయ శక్తులకూ విశాల జన సామాన్యానికీ మధ్య సన్నిహితనమైన లంకె ఏర్పరచాలి. అత్యధిక సంఖ్యాకుల పరంగా ఆలోచించడం అంటే అర్థం ఇదే. మనతో సహకరించడానికి ఇష్టపడే ప్రజాస్వామిక పార్టీలూ, వ్యక్తులూ ఎక్కడ ఉన్నా వారితో విషయాలను చర్చించి వారితో కలిసి పనిచేసే ధోరణినే కమ్యూనిస్టులు అవలంబించాలి. నిరంకుశంగా నిర్ణయాలు చేయడమూ, దూకుడుగా చేతలకు దిగడమూ, మన మిత్రులను నిర్లక్ష్యం చేయడమూ చాలా తప్పు. మంచి కమ్యూనిస్టు, పరిస్థితిని మొత్తంగా పరిగణించడంలోనూ, అధిక సంఖ్యాకుల పరంగా ఆలోచించడంలోనూ, మిత్రులతో కలిసి పనిచేయడంలోనూ కూడా మంచివాడు కావాలి.

*- (చైె.క.పా. సి.సి. 6వ విస్తృత ప్లీనంలో మావో రిపోర్టు, అక్టోబర్, 1938)*

# విముక్తి ప్రాంతాల నిర్మాణంలో గెరిల్లాబేసుల పాత్ర

**– దేవ్‌జీ**

దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అనుసరించి సాగే విప్లవాల్లో విముక్తి ప్రాంతాల నిర్మాణపు ప్రాధాన్యత గురించి మావో సైద్ధాంతికంగా చెప్పిన విషయాలనూ, మావో పేర్కొన్న సైద్ధాంతిక నియమాలను భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడానికి మనం ఎలా అన్వయిస్తున్నాం? ఈ క్రమంలో అచరణలో మనం గెరిల్లాబేసుల-విముక్తి ప్రాంతాల నిర్మాణానికి చేస్తున్న కృషి, అందులో మన అనుభవాల, సమస్యల గురించి చూద్దాం.

1927లో చైనాలో,పట్టణాల్లో ప్రతీఘాతుక తెల్లబీభత్సం ఫలితంగా విప్లవం ఓడిపోయినప్పుడు మావో నాయకత్వంలోని బలగాలు గ్రామీణ ప్రాంతానికి తిరోగమించి చింకాంగ్ పర్వతాల్లో విముక్తి ప్రాంతాన్ని ఏర్పాటు చేశాయి. చింకాంగ్ విముక్తి ప్రాంత నిర్మాణంలోని అనుభవాల ఆధారంగా చైనా విప్లవానికి మార్గంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను ప్రతిపాదిస్తూ 1928 అక్టోబరు, నవంబర్ నెలలో మావో ***'చైనాలో ఎర్ర రాజకీయాధికారం ఎందుకు మనగలుగుతుంది', 'చింకాంగ్ పర్వతాల్లో పోరాటం'*** అనే వ్యాసాలు రాశాడు. అప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవకారుల ముందు రష్యా విప్లవ మార్గమైన సార్వత్రిక సాయుధ తిరుగుబాటు పంథానే ఉండేది. చైనాలో కూడా 1925 నుండి ఆ పంథాను అనుసరించి విఫలమవుతూ వస్తున్న పరిస్థితుల్లో, వలస, అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశమయిన చైనా జనాభాలో రైతాంగం అత్యధికంగా ఉన్నరీత్యా, తమ దేశానికి సార్వత్రిక సాయుధ తిరుగుబాటు పంథా వర్తించదని మావో దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను ప్రతిపాదించాడు. అయితే పార్టీలో ఆనాడు చెన్-టూ-షీ మితవాద పంథా (1927 వరకు), లీలీసాన్ అతివాద పంథా (1930వ సంవత్సరంలో), వాంగ్‌మింగ్ అతివాద పంథా (1931-35 వరకు) ఆధిక్యతలో ఉండేవి. ఫలితంగా 1934 వరకు దక్షిణాది విముక్తి ప్రాంతాలను కోల్పోయి ఎర్రసైన్యం వ్యూహాత్మక తిరోగమనాన్ని (లాంగ్‌మార్చ్) చేపట్టాల్సి వచ్చింది. ఈ వ్యూహాత్మక తిరోగమనం కాలంలోనే 1935 జనవరిలో సున్‌యీలో పొలిట్‌బ్యూరో విస్తృత సమావేశం జరిగింది. ఆ సమావేశం వాంగ్‌మింగ్ అతివాద పంథాను తిరస్కరించి మావో పంథాను స్వీకరించింది. అప్పటినుండి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అనుసరించి చైనా విప్లవం పురోగమించింది.

చింకాంగ్ పర్వత విముక్తి ప్రాంతాన్ని సంఘటితం చేయడానికి అడ్డంకిగా ఆనాడు పార్టీలో ఉన్న తప్పుడు అభిప్రాయాలను విమర్శిస్తూ ***"పార్టీలో తప్పుడు అభిప్రాయాలను సరిదిద్దడం"*** అనే వ్యాసాన్ని రాశాడు. అందులో "విప్లవ కేంద్రాన్ని నిర్మించుకోకుండా, ఎప్పుడూ ఒకచోట నుండి మరొక చోటికి పరిగెత్తే తిరుగుబోతు దేశదిమ్మరి దళాల రాజకీయ సిద్ధాంతం మన ఎర్రసైన్యంలో తలెత్తింది. కొందరు ఒకచోట నుండి మరొక చోటికి పరిగెత్తే తిరుగుబోతు

గెరిల్లాచర్యల ద్వారా మన రాజకీయ పలుకుబడిని విస్తృత పరుచుకోవాలని సూచిస్తారు. విప్లవ కేంద్రాన్ని స్థాపించటం, ప్రజారాజకీయాధికారాన్ని స్థాపించుకోవడం లాంటి కష్టమైన పనులు వీరికి గిట్టవు" అంటూ మావో ఈ తప్పుడు భావాలను విమర్శిస్తూ, ఇలాంటి సిద్ధాంతం ద్వారా విప్లవాలు విజయవంతం కావని చెప్పాడు.

చైనాలో విప్లవ యుద్ధం/ప్రజాయుద్ధం అంతర్యుద్ధంగా సాగిన కాలంలో (1927-37 వరకు రెండవ విప్లవ అంతర్యుద్ధ దశ)నయినా, జపాను ప్రతిఘటనా యుద్ధంగా సాగిన జాతీయ విముక్తి యుద్ధ కాలంలో (1937-1945 వరకు)నయినా మావో విముక్తి ప్రాంతాల / స్థావర ప్రాంతాల ప్రాధాన్యత గురించి వివరించాడు. జపాన్, వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధాన్ని సరిగా నడపడం కోసం జపాన్ ఆక్రమిత ప్రాంతాల్లో విప్లవ స్థావరాలను నెలకొల్పాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

"దేశ దిమ్మరి తిరుగుబాటుదార్ల" స్వభావం కలిగిన అనేక రైతు పోరాటాలు చరిత్రలో ఉన్నాయి. కానీ అందులో ఒక్కటి కూడా విజయవంతం కాలేదు. ప్రస్తుత యుగంలో రవాణా మార్గాలు, ఆధునిక ఆయుధాలు బాగా అభివృద్ధి చెంది ఉన్నాయి. దేశదిమ్మరి తిరుగుబాటుదార్లలాగా పోరాడడం ద్వారా, ప్రస్తుత యుగంలో విజయం సాధించడం వూహాతీత విషయం. దేశ దిమ్మరి తిరుగుబాటుదార్ల పోరాట పద్ధతి పేదరైతాంగంలో ఇప్పటికీ పాతుకుని ఉంది. ఈ అభిప్రాయమే గెరిల్లా కమాండర్లలో విప్లవ స్థావరాలు ముఖ్యమైనవి కావని, అనవసరమనే అభిప్రాయ రూపంలో ప్రతిబింబించుతూ ఉంది. విప్లవ స్థావరాల విధానం నిర్ణయించుకొనుటకు ముందుగా తప్పుడు అభిప్రాయాన్ని తొలగించుకోవలసి ఉంటుంది" అని అంటూ జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధంలో విప్లవ స్థావరాల అవసరం ఏమిటనేది మావో చెప్పాడు.

"గెరిల్లాయుద్ధం ఎక్కువ కాలం నిలువగలగడం కానీ అభివృద్ధి చెందడం గానీ విప్లవ స్థావరాలు లేకుండా అసాధ్యం. నిజంగా విప్లవ స్థావరాలే సైన్యాలకు వెనుకతట్టు భూభాగం" అనీ తమ వ్యూహాత్మక కర్తవ్యాలను నిర్వహించుటకు గెరిల్లాసైన్యాలు ఆధారపడే వ్యూహాత్మక స్థావరాలే విప్లవ స్థావరాలనీ మావో వివరించాడు.

జపాను వ్యతిరేక గెరిల్లా పోరాటంలో టెర్రయిన్ ఆధారంగా చూసినప్పుడు పర్వత ప్రాంతాల్లో నిలకడగలిగిన విప్లవ స్థావరాలను, నది సరస్సు ప్రాంతాల్లో పర్వత ప్రాంతాల విప్లవ స్థావరాల్లాగా నిలకడగలిగిన స్థావరాలను ఏర్పాటు చేయలేకపోయినా సాపేక్షికంగా స్థిరమయిన స్థావరాలను, మైదాన ప్రాంతాల్లో తాత్కాలిక, అస్థిరమయిన విప్లవ స్థావరాలను స్థాపించవచ్చునని మావో చెప్పాడు. అలాగే మైదాన ప్రాంతాల్లో పోరాడే పెద్ద గెరిల్లా సైన్యాలు అక్కడ ఎక్కువ కాలం నిలబడి పోరాటం కొనసాగించలేవనీ, పరిస్థితుల అవసరాన్ని బట్టి అవి క్రమంగా పర్వత ప్రాంతాలకు తరలవలసి ఉంటుందని చెప్పాడు. అలాగే విప్లవ స్థావరం విస్తృతమైన భూభాగం

కలిగి ఉండాలి, శత్రువు నాలుగువైపుల చుట్టివేసి ఉండినప్పుడు, దీర్ఘకాలం నిలవగలిగిన విప్లవ స్థావరం కొండ ప్రాంతాల్లో మాత్రమే సాధ్యమవుతుందనీ, అయితే గెరిల్లాలు ఉపయోగించుకోవడానికి విస్తృతమైన భూభాగం ఉండాలని కూడా మావో చెప్పాడు.

జపాన్ ఆక్రమిత భూభాగంలో/శత్రు వెనకతట్టున ప్రజా గెరిల్లా బలగాలు నిర్మించే విప్లవ స్థావరాల్నే గెరిల్లా స్థావరాలని కూడా మావో పేర్కొన్నాడు.

విముక్తి ప్రాంతాలను, గెరిల్లా స్థావరాలను నిర్మించాలంటే బలమైన కమ్యూనిస్టు పార్టీ, బలమైన ప్రజాసైన్యం, బలమైన ఐక్యసంఘటన (బలమైన ప్రజాపునాది), అనుకూలమైన టెర్రయిన్/విశాల భూభాగం, స్వయం పోషకంగా మనగలిగే ఆర్థిక వ్యవస్థ ఉండాలని మావో చెప్పాడు. వీటిలో మొదటి మూడు ముఖ్యమైనవి.

ఈ గెరిల్లా స్థావరాలను ఏర్పరచిన తరువాత వాటిని సంఘటితం చేయడం, విస్తృతం చేయడం అనే సమస్యను సరిగా పరిష్కరించడం గురించి కూడా మావో చెప్పాడు.

గెరిల్లా స్థావరాలను సంఘటితపరచడమంటే ప్రజారాజ్యాధికార అంగాలను విస్తృతంగా నిర్మించి, సంఘటితం చేయడం, ప్రజా సంఘాలను నిర్మించి, సంఘటితం చేయడం, గెరిల్లా బలగాలకు రాజకీయ, మిలిటరీ తర్ఫీదును ఇవ్వడమనీ; గెరిల్లా స్థావరాలను విస్తృతపరచడమంటే, గెరిల్లా జోన్ ప్రాంతాలను విస్తరించడం, అదివరకే ఏర్పడిన గెరిల్లాబేస్ ప్రాంతాల్లో కొత్త గెరిల్లా స్థావరాలను కలుపుకోవడమనీ, విప్లవ స్థావరాలను సంఘటితపరుచుకుంటూ, విస్తృతపరుచుకోవడమే సరైన సూత్రమనీ అంటే సంఘటిత బలంపై ఆధారపడి విస్తరణ జరగాలనీ చెబుతూనే అయితే నిర్దిష్ట పరిస్థితులను బట్టి గెరిల్లా స్థావరాలను సంఘటితపరచడం, విస్తరించడం అనే దాంట్లో దేనిపై కేంద్రీకరించాలో నిర్ణయించుకోవాలని మావో చెప్పాడు. అలాగే గెరిల్లా స్థావరాలను అలలు అలలుగా అభివృద్ధి పరచాలనీ, దుందుడుకు పద్ధతుల ద్వారా అభివృద్ధి పరచుకునే విధానాన్ని వ్యతిరేకించాలని చెప్పాడు.

జపాను ప్రతిఘటనా యుద్ధకాలంలో, గెరిల్లా పోరాటం ఫలితంగా శత్రువుకు మనకు జరిగే పోరాటం వల్ల శత్రు ఆక్రమిత భూభాగమంతా మూడు రకాలుగా విభజించవచ్చు. మొదటిది : గెరిల్లా దళాల రాజకీయ అధికార సంస్థల స్వాధీనంలో ఉన్న జపాను వ్యతిరేక విప్లవ కేంద్రం; రెండవది : జపాను సామ్రాజ్యవాదుల లేక కీలుబొమ్మ ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న ప్రాంతం; మూడవది : ఇరు పక్షాల మధ్య ఆధిపత్యం కొరకై పోరాటం సాగుతున్న మధ్యభూభాగం అంటే గెరిల్లా పోరాట ప్రాంతం (గెరిల్లా జోన్ అని అర్థం-అను). గెరిల్లా కమాండర్లు మొదటి, మూడవ రకాల ప్రాంతాలను వీలైనమేరకు విస్తృతపరుచుకుంటూ రెండవ రకాన్ని వీలైనమేరకు తగ్గించుటకు కృషి చేయాలి. గెరిల్లా పోరాటపు వ్యూహాత్మక కర్తవ్యం ఇది అని మావో చెప్పాడు.

మావో ఈ విషయాన్ని జపాను ప్రతిఘటనా యుద్ధకాలంలో చెప్పినా అది అంతర్యుద్ధానికీ,

జాతీయ విముక్తి యుద్ధానికీ వర్తిస్తుంది. అంటే అంతర్యుద్ధాన్నీగానీ, జాతీయవిముక్తి యుద్ధాన్నిగానీ సరిగా నడపడానికి గెరిల్లా స్థావరాలను-విముక్తి ప్రాంతాన్ని నిర్మించుకోవాలనీ, దాని కోసం గెరిల్లా స్థావరంగా - విముక్తి ప్రాంతంగా ఎంచుకున్న ప్రాంతాల్లో శతృవును నిర్మూలించడం, ఓడించడం; తద్వారా ప్రజారాజ్యాధికారాన్ని ఏర్పరచడం ఇవి రెండు గెరిల్లాయుద్ధపు వ్యూహాత్మక కర్తవ్యాలని అర్థమవుతుంది.

విముక్తి ప్రాంతాన్ని నిర్మించడమనేది కఠినతరమైన కర్తవ్యమే అయినప్పటికీ ప్రజలందరిని విస్తృతంగా ప్రజాయుద్ధంలో సమీకరించాలనీ, దానికోసం ప్రజలను గెరిల్లాజోన్లలో, గెరిల్లా స్థావరాల్లో కౌలురేట్ల తగ్గింపు, వేతనాల పెంపు, ఉత్పత్తి పెంపు, భూస్వాముల భూముల ఆక్రమణ పోరాటాల్లో కదిలించాలనీ మావో వేర్వేరు సందర్భాల్లో చెప్పాడు.

వ్యూహాత్మక ప్రాంతాలుగా మనం ఎంచుకునే ప్రాంతాల్లో ప్రజల వెనుకబాటు చైతన్యాన్ని చూసి, వారిని వెనుకబడిన వారని నిందించకుండా ప్రజలే చరిత్ర నిర్మాతలనే మార్క్సిస్టు మౌలిక సూత్రంపై విశ్వాసముంచి వారిని విస్తృతంగా ప్రజాయుద్ధంలో కదిలించాలనీ; అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాల్లో సాగించే ప్రజాయుద్ధమనేది, కార్మికవర్గ అగ్రగామి దళమైన కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో సాగే రైతుయుద్ధమేనని మావో బోధించాడు.

భారతదేశంలో విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం సీపీఐ, సీపీఎమ్‌ల రివిజనిజంతో, నయా రివిజనిజంతో, వాటి పార్లమెంటరీ పంథాతో, ఈ పార్టీలతో తెగతెంపులు చేసుకుంటూ 1969 నాటికే చారుమజుందార్, కన్హయ్‌ఛటర్జీల నాయకత్వంలో విప్లవ శక్తులు ప్రాంతాలవారీగా అధికారాన్ని హస్తగతం చేసుకునే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను చేపట్టాయి. ఆనాడు మనం రూపొందించుకున్న రాజకీయ-మిలిటరీ వ్యూహాలు సరైనవే. అయినప్పటికీ తీవ్ర శత్రు నిర్బంధంతో పాటు సి.పి.ఐ.(ఎం.ఎల్) అనుసరించిన అతివాద ఎత్తుగడల ఫలితంగా ఆనాడు ఉవ్వెత్తున ఎగిసిన శ్రీకాకుళం, బీర్భూమ్ తదితర విప్లవ రైతాంగ పోరాటాలన్నీ దెబ్బతిని పోయాయి. ఎం.సి.సి. నాయకత్వంలో కొనసాగిన కాంక్సా, సోనార్‌పూర్ రైతాంగ ఉద్యమాలు తీవ్ర శత్రు నిర్బంధంతో పాటు లోపాల వల్ల దెబ్బతిన్నాయి. భారత విప్లవం తాత్కాలిక వెనుకంజకు గురయింది. ఈ స్థితిలో ఈ ఓటమికి దారితీసిన కారణాలను నిజమైన విప్లవ శక్తులు సమీక్షించుకుని నూతన ఎత్తుగడలు రూపొందించుకొని కార్యాచరణలోకి దిగాయి. ఇందులో భాగంగా ఎం.సి.సి. 1969-70లలో బీహార్‌లోని హజారీబాగ్, గయ, గిరిడి తదితర జిల్లాల్లో రైతాంగ ఉద్యమాలను నిర్మించింది; ఏ.పి. రాష్ట్రకమిటీ నూతన ఎత్తుగడలతో 'మన ఎత్తుగడల పంథా'ను రూపొందించుకుని 1978 నుండి ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల్లో రైతాంగ ఉద్యమాలను నిర్మించడం ఆరంభించింది. విముక్తి ప్రాంతాల స్థాపనా లక్ష్యంతో ఈ ఉద్యమాలను గెరిల్లాజోన్ దశకు అభివృద్ధి చేసే క్రమంలో భారతదేశంలో విముక్తి ప్రాంతాల నిర్మాణం గురించి మన అవగాహన మరింత స్పష్టంగా రూపొందుతూ సుసంపన్నమవుతూ వచ్చింది.

2001లో జరిగిన పీపుల్స్‌వార్ పార్టీ 9వ కాంగ్రెస్ రూపొందించిన 'వ్యూహం–ఎత్తుగడల' డాక్యుమెంట్‌లో గెరిల్లా జోన్లలో నూతన రాజకీయాధికార అంగాల (విప్లవ ప్రజాకమిటీల–ఆర్.పి.సి.)నిర్మాణం, గెరిల్లాజోన్ విముక్తి ప్రాంతంగా పరివర్తన చెందడంపై స్పష్టంగా రాసుకున్నాం. ఇదే అంశాన్ని మరింత స్పష్టంగా, సమగ్రంగా 2007లో జరిగిన ఏకతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్‌లో రూపొందించుకున్న 'భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడల' డాక్యుమెంటులో రాసుకున్నాం. ఎమ్‌సీసీఐ పార్టీ ప్రారంభం నుండి నిర్మిస్తూ వచ్చిన 'క్రాంతికారీ కిసాన్ కమిటీ'(కెకెసి)లను ఆర్.పి.సి.లుగా అభివృద్ధి పరచడం గురించి కూడా ఈ డాక్యుమెంట్‌లో స్పష్టతను ఇచ్చాం.

"ప్రజా రాజకీయ అధికారాన్ని నెలకొల్పడం కోసం, మన సొంత బలగాల సైనిక, రాజకీయ శిక్షణ కోసం, మన బలగాలను పరిరక్షించుకోవడం కోసం, విప్లవాన్ని పురోగమింపజేయడం కోసం, శత్రువును గట్టి దెబ్బలుతీసి బలాబలాల సమతూకంలో మార్పును తేవడం కోసం మనం గెరిల్లాజోన్లలోని మంచి ప్రజా పునాది, అనుకూలమైన టెర్రయిన్ ఉన్న వ్యూహాత్మక ప్రాంతాలను గెరిల్లాబేసులుగా అభివృద్ధి చేసి తీరాలి. ఈ గెరిల్లా బేసులలోని ప్రజా మిలీషియా, పార్టీ యూనిట్లు, ప్రజా రాజకీయ అధికార అంగాలు, వివిధ ప్రజా సంఘాలు సాపేక్షికంగా బలంగా ఉంటాయి. శత్రువుకు బలహీనమైన ప్రాంతాల నుండి శత్రువును తుడిచి పెట్టేయడానికి కేంద్రీకరించడం ద్వారా, ఆ ప్రాంతం నుండి శత్రువును తరిమికొట్టి విప్లవ శక్తులను సుసంఘటితపరచడం ద్వారా మనం గెరిల్లాయుద్ధాన్ని మరింతగా తీవ్రతరం చేయవలసి ఉంటుంది. ఈ రెండు బలగాల మధ్య పోటీ ఉంటుంది. ప్రతి ఒక్కటి రెండో దానిని నిర్మూలించి, తన సొంత అధికారాన్ని స్థిరపరచుకోవడానికి ప్రయత్నిస్తుంటుంది. ఇలాంటి గెరిల్లా బేసులలో ప్రజలను రాజకీయంగా జాగృతులను చేయాలి. ప్రజా గెరిల్లా సైన్యం, ప్రజా రాజకీయ అధికారాలను సుసంఘటితం చేయాలి, పటిష్టం కావాలి. రాజకీయ అధికారం గెరిల్లాజోన్‌లోని మిగతా ప్రాంతాలకు విస్తరించాలి.

"గెరిల్లాబేసులు పరివర్తనా స్వభావాన్ని కలిగినవి. అది దానికదిగా ఒక విడిదశ (ఫేజ్) కాదు. మనం గెరిల్లా యుద్ధాన్ని శక్తివంతంగా సాగించాలని కోరుకున్నట్టయితే, మనం గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చాలని కోరుకున్నట్టయితే అప్పుడిక గెరిల్లాబేసులను ఏర్పరిచే సమస్య ప్రత్యేక ప్రాముఖ్యత కలిగినదవుతుంది. ఈ గెరిల్లా బేసులు, గెరిల్లా జోన్లలో బలమైన పార్టీని, బలమైన ప్రజా విముక్తి సైన్యాన్ని, ఐక్యసంఘటనను అభివృద్ధిపరుస్తూ, అదే సమయంలో విముక్తి ప్రాంతాల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తూ అలలు అలలుగా రాజకీయ అధికారాన్ని విస్తరింపచేసి విప్లవ ధృతిని త్వరితం చేయడానికి కేంద్ర స్థానాలుగా ఉంటాయి. గెరిల్లా బేసులలోని నూతన రాజకీయ అధికారం సుస్థిరమవుతూ ఉండే క్రమంలో, వ్యవసాయక విప్లవాన్ని తీవ్రతరం చేస్తూ అక్కడ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు తీసుకురావాలి. దున్నేవారికే

భూమి ప్రాతిపదికపైన భూమిని పంపిణీ చేయాలి. పిండ రూపంలోని నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని సుసంఘటిత పరచాలి. ***అందువలన గెరిల్లాబేసు ఏర్పాటు అంటే, స్థావర ప్రాంతాన్ని నిర్మించే క్రమంలో గణనీయమైన ముందడుగు అని అర్థం చేసుకోవాలి.*** ఇది, గెరిల్లాబేసుకు చుట్టుపక్కల వుండే ప్రజలపైన బలమైన ప్రభావాన్ని కలుగజేసి, ప్రజాయుద్ధంలో వారు మరింత విస్తృతంగా పాల్గొనేట్టుగా వారిని ఉత్తేజపరుస్తుంది". (భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, ఐక్యత కాంగ్రెస్-9వ కాంగ్రెస్ ఆమోదించిన డాక్యుమెంట్ నుండి. పేజీలు-60, 61)

1978-80 నాటికి రూపొందించుకున్న మన ఎత్తుగడల పంథా ఆధారంగా, 1994 జులైలో కేంద్రకమిటి విడుదల చేసిన 'గ్రామ కమిటీల' సర్క్యులర్‌లోని గైడెన్స్ ఆధారంగా తెలంగాణా, దండకారణ్యం, ఏఓబీల్లో 1995 ప్రారంభం నుండి గ్రామ కమిటీల/గ్రామరాజ్య కమిటీల రూపంలో ప్రజారాజ్యాధికార అంగాలను నిర్మించడం ప్రారంభించాం. మరోవైపు ఎమ్‌సీసీఐ 'వ్యూహం-ఎత్తుగడల' డాక్యుమెంట్ ఆధారంగా 2004 వరకు కెకెసిని రైతాంగ ప్రజల రాజకీయాధికార అంగంగా నిర్మిస్తూ వచ్చింది.

గ్రామ కమిటీల/గ్రామ రాజ్యాధికార కమిటీల అనుభవాలను సంశ్లేషించుకోవడంతోపాటు గెరిల్లాజోన్లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రక్రియను మరింత స్పష్టంగా రూపొందించుకోవడానికిగానూ మనం చైనా, వియత్నాం, మలయా, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్, పెరూ అనుభవాలను, తెలంగాణా పోరాట కాలం(1946-51) నాటి 'గ్రామ కమిటీ'ల అనుభవాలను అధ్యయనం చేసి 2001 ఏప్రిల్‌లో ఆర్.పి.సి.లపై ఒక సర్క్యులర్‌ను రూపొందించుకున్నాం. (తదనంతర కాలంలో నేపాల్ అనుభవాలను కూడా అధ్యయనం చేశాం) 1994లో కేంద్రకమిటీ విడుదల చేసిన గ్రామ కమిటీలు సర్క్యులర్‌లో ఆర్.పి.సి.ల నిర్మాణానికి ప్రజాసైన్య నిర్మాణానికి మధ్య ఉండే సంబంధం, విముక్తి ప్రాంతాల స్థాపనలో పరివర్తనాదశగా గెరిల్లాజోన్స్, గెరిల్లాజోన్స్‌లో ఆర్‌పిసిల నిర్మాణానికి సంబంధించిన విషయాల్లో మన అవగాహనను మెరుగుపరుచుకొని ఈ సర్క్యులర్‌ను రూపొందించుకున్నాం. ఈ సర్క్యులర్‌లోని గైడెన్స్ ఆధారంగా ప్రజారాజ్యాధికార అంగాలను గ్రామ కమిటీలు అనడం కన్నా 'విప్లవ ప్రజా కమిటీలు' అనడం సరిగా ఉంటుందనే స్పష్టతతో ఆనాటి నుండి (2001 నుండి) వాటిని ఆ పేరుతోనే నిర్మిస్తున్నాం. 2004లో దండకారణ్యంలో ఏరియా స్థాయిలో విప్లవ ప్రజాకమిటీని ఏర్పరచే సందర్భంగా సి.సి. గైడెన్స్‌లో ఆర్.పి.సి. విధాన కార్యక్రమం రూపొందించుకొని అప్పటినుండి ఈ కార్యక్రమం ప్రకారం పనిచేశాం. ఆర్.పి.సి.ల భావనను దండకారణ్యంలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళడం కోసం "జనతన సర్కార్లు" (ప్రజా ప్రభుత్వాలు) అనే పేరు నిర్ణయించాం. ఆర్.పి.సి.ల నిర్మాణంలో భాకపా (మాలె) [పీపుల్స్‌వార్], ఎమ్‌సీసీఐల అవగాహనలను, అనుభవాలను సంశ్లేషించుకుని ఏకతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడల డాక్యుమెంట్‌లో రాసుకోవడంతోపాటు కాంగ్రెస్ అనంతరం 2007 నవంబర్‌లో జరిగిన సీసీ సమావేశంలో

ఆర్.పి.సి.ల విధాన కార్యక్రమాన్ని రూపొందించుకున్నాం.

గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా రాజకీయ, సైనిక, నిర్మాణ రంగాల్లో చేపట్టాల్సిన ఎత్తుగడల గురించి 2001 నుండి 2007 కాంగ్రెస్ వరకు, 2007 నవంబర్ సీసీ సమావేశం వరకు మన అవగాహన మరింత మెరుగవుతూ వచ్చింది. మరోవైపు గెరిల్లాజోన్లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికై ప్రజా గెరిల్లా సైన్యాన్ని (గెరిల్లా సైన్యాన్ని) ప్రజా విముక్తి సైన్యంగా (రెగ్యులర్ సైన్యంగా), గెరిల్లాయుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయడం గురించి 2008 నవంబరులో ఒక డాక్యుమెంటు రాసుకున్నాం.

1967 నుండి 2014 వరకు మన ఉద్యమం గొప్ప విజయాలను, భారీ శత్రుదాడులను, తీవ్రమైన నష్టాలనూ చూసింది. అయినప్పటికీ అప్పటినుండి ఇప్పటివరకు మనం ప్రాంతాలవారీగా అధికారాన్ని హస్తగతం చేసుకునే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను దృఢంగా అంటిపెట్టుకుని ఉంటూ దాన్ని ఆచరణలో పెడుతున్నాం. ఈక్రమంలో ఆచరణ-అధ్యయనం-అనుభవాల-సంశ్లేషణ-అవగాహనలో ఉన్నతస్థాయి అభివృద్ధి, తిరిగి అన్వయింపు-ఆచరణ-అధ్యయనం -అనుభవాల సంశ్లేషణ అనే పద్ధతిని అనుసరించి ఉన్నత స్థాయి అవగాహనతో మన ఆచరణ కొనసాగుతుంది. ఈ ఆచరణ క్రమం నుండే మన మిలిటరీ పంథా సమగ్రమవుతూ వస్తోంది. ఈ క్రమంలో 2001లో భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో గెరిల్లాజోన్లను గెరిల్లాబేసులుగా అభివృద్ధి చేసే ప్రక్రియ ద్వారా విముక్తి ప్రాంతాల ఏర్పాటుకు పూనుకోవడం సైద్ధాంతికపరమైన అవగాహనలో ఒక గెంతులాంటిది. అప్పటినుండి మనం ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని, గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేస్తూ, డీకే, బీజే, తెలంగాణా, ఏఓబీ, పశ్చిమబెంగాల్, ఒడిశాలలోని గెరిల్లాజోన్లలో శత్రు అధికారాన్ని ధ్వంసం చేస్తూ, గ్రామ స్థాయిలో ప్రజారాజ్యాధికార అంగాలను నిర్మిస్తున్నాం. 2001కి ముందుగానీ, అప్పటినుండిగానీ ఇవి నూతన ప్రజాస్వామిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థల నిర్మాణానికై కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఉత్తర తెలంగాణాలో, నల్లమలలో ఏర్పడిన ఆర్పిసిలు 2002-2003 నాటికి శత్రుదాడిని తిప్పికొట్టలేని స్థితిలో ఇవి పనిచేయలేని స్థితి తలెత్తింది. మరోవైపు దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్లోని కిష్టారం ఏరియాలో 2004 డిసెంబర్లో తొలి ఏరియా విప్లవ ప్రజా కమిటీ/ఏరియా జనతన సర్కారు (ఏఆర్పీసీ/ఏజేఎస్) నిర్మాణం జరిగింది. ఆ తర్వాత ఈ డివిజన్తో పాటు 2010 వరకు మరో 6 డివిజన్లలో ఏరియా జనతన సర్కార్లు నిర్మాణమైనాయి.

ఒక డివిజన్లో కనీసం మూడు ఏరియా విప్లవ ప్రజా కమిటీలు నిర్మాణమయిన చోట వాటి ఆధారంగా డివిజనల్ జనతన సర్కారును (డీజేఎస్) నిర్మించాలనే కేంద్రకమిటీ గైడెన్స్ను అనుసరించి 2007లో 2 డివిజన్ స్థాయి జనతన సర్కార్లను నిర్మించాం. భూస్వామ్య వ్యతిరేక;

సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల పోరాట సాధనంగా; ఏరియా, డివిజనల్ జనతన సర్కార్ల సమన్వయ కర్తగా/సమన్వయ కేంద్రంగా; జోన్ స్థాయిలో ప్రజారాజ్యాధికార ప్రచార కేంద్రంగా, జోన్ స్థాయిలో భవిష్యత్తులో నిర్మాణమయ్యే ప్రజారాజ్యాధికారానికి పిండరూపంగా ఉండేలా కేంద్రకమిటీ నిర్ణయానుసారంగా 2008లో జోన్ జనతన సర్కారు సన్నాహక కమిటీని ఏర్పాటు చేశాం.

దండకారణ్యంలో నిర్మాణమయిన ఏరియా, డివిజనల్ జనతన సర్కార్లు ఏరియా, డివిజనల్ గెరిల్లా స్థావరాలుగా పని చేస్తున్నాయి. గెరిల్లా యుద్ధపు వ్యూహాత్మక కర్తవ్యాల సాధనకు ఇవి ఉపయోగపడగా, ప్రజావిముక్తి గెరిల్లా బలగాలు వీటి ఆధారంగా శత్రుదాడులను ఎదుర్కొంటూ ప్రజారాజ్యాధికార అంగాలను కాపాడుతున్నాయి. ఈ రకంగా ఈ గెరిల్లా స్థావరాలు ప్రజా విముక్తి బలగాలకు వెనుకతట్టులాగా ఉపయోగపడుతున్నాయి. ఈ గెరిల్లా బేసులు ప్రజావిముక్తి గెరిల్లా సైన్యానికి రిక్రూట్‌మెంట్ కేంద్రాలుగా ఉంటున్నాయి. గెరిల్లాబేసుల కర్తవ్యాల సాధనలో భాగంగా ఏరియా, డివిజనల్ జనతన సర్కార్లు యుద్ధరంగంలో గాయపడ్డ ప్రజాసైనికులకు వైద్య సేవలందిస్తున్నాయి, మిలీషియాను సాయుధం చేస్తున్నాయి, పీఎల్‌జీఏకు ఇంటిలిజెన్స్‌ను, సప్లయిలను అందిస్తున్నాయి. ఈ గెరిల్లా స్థావరాలు పీఎల్‌జీఏ బలగాల రాజకీయ-మిలిటరీ శిక్షణకు, ఆయుధాల తయారీ క్యాంపులకు స్థావరాలుగా ఉపయోగపడుతున్నాయి. ఈ రకంగా ఈ గెరిల్లా స్థావరాలు గెరిల్లా బలగాలకు వెనుకతట్టుగా పని చేస్తున్న ఫలితంగా వీటి ఆధారంగా గెరిల్లా బలగాలు ఈ స్థావరాలపై శత్రుబలగాలు చేసే దాడులను తిప్పికొడుతూ ప్రజారాజ్యాధికారాన్ని కాపాడుతున్నాయి. ఈ గెరిల్లా స్థావరాలతో కలిసి ఉండే గెరిల్లా పోరాట ప్రాంతాల్లో శత్రుబలగాలను దెబ్బతీస్తూ ప్రజారాజ్యాధికార అంగాలను విస్తరింపజేస్తున్నాయి. పీఎల్‌జీఏ శత్రువుపై చేస్తున్న దాడుల దన్నుతో గ్రామ, ఏరియా, డివిజనల్ జనతన సర్కార్లు ఆయా స్థాయిల్లో ప్రజారాజ్యాధికారాన్ని అమలు చేస్తూ ప్రాథమిక స్థాయిలో నూతన ప్రజాస్వామిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థగా పనిచేస్తూ, సంఘటితపడే, విస్తరించే లక్ష్యంతో పనిచేస్తున్నాయి.

2007 జనవరిలో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ నిర్దేశించిన దండకారణ్య, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసి ఇతర గెరిల్లాజోన్లలో శక్తిమేరకు గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలనే కర్తవ్యం ప్రకారం 2007 నుండి మనం దండకారణ్యంతోపాటు బీహార్-ఝార్ఖండ్, ఏఓబీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా తదితర ప్రాంతాల్లో శక్తిమేరకు గెరిల్లాయుద్ధాన్ని కొనసాగించాం. ఈ గెరిల్లాయుద్ధం ద్వారా బీహార్-ఝార్ఖండ్‌లోని వ్యూహాత్మక ప్రాంతాల్లో శత్రు అధికారాన్ని ధ్వంసం చేసి కొన్నిచోట్ల గ్రామస్థాయి విప్లవ ప్రజాకమిటీలను నిర్మించాం. ఏఓబీలో కొన్నిచోట్ల గ్రామస్థాయి విప్లవ ప్రజాకమిటీలను నిర్మించడమేకాక ఒకచోట ఏరియా విప్లవ ప్రజాకమిటీని నిర్మించాం. లాల్‌గఢ్ పోరాట కాలంలో

ప్రభంజనంలా వెల్లువెత్తిన ప్రజాపోరాటం–గెరిల్లాయుద్ధం ఫలితంగా ఆ ప్రాంతంలో దోపిడీ వర్గాల అధికారం  దాదాపు రెండు సంవత్సరాల పాటు పనిచేయకుండా పోయింది. ఈ స్థితిలో అక్కడ మన పార్టీ నాయకత్వంలో  పోలీసు నిర్బంధ వ్యతిరేక ప్రజాకమిటీ రూపంలో విశాల ప్రజల సంయుక్త అధికారం చెలాయించబడింది.

గెరిల్లాజోన్లలో గెరిల్లాబేసుల నిర్మాణం ద్వారా విముక్తి ప్రాంతాల నిర్మాణానికి మనం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రస్తుతం గ్రామ స్థాయిలో గ్రామసభలో విప్లవ ప్రజానీకం ప్రత్యక్ష ఓటింగు ద్వారా విప్లవ ప్రజాకమిటీలను ఎన్నుకుంటుండగా, ఏరియా, డివిజనల్ స్థాయిలో ప్రతినిధుల సభ (కౌన్సిల్స్)లు ఆయా స్థాయి విప్లవ ప్రజా కమిటీలను ఎన్నుకుంటున్నాయి. వీటిలో భౌతికంగా నాలుగు వర్గాల ప్రతినిధులు (కార్మికులు, రైతాంగం, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా) లేనప్పటికీ ఇందులో దండకారణ్య, ఝార్ఖండ్, ఏఓబీలోని సామాజిక సంపుటి రీత్యా రైతాంగమే ప్రధానంగా ఉంటూ, కొన్నిచోట్ల పెటీబూర్జువా వర్గపు ప్రతినిధులు ఉన్నప్పటికీ ఇవి కార్మికవర్గ పార్టీ–సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వంలో నాలుగు వర్గాల ప్రజానీకపు విముక్తిని సాధించడానికై ఆ వర్గాల ఆకాంక్షల ప్రతిరూపపు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ప్రజాయుద్ధం పెంపొందుతూ శత్రు అధికారం ధ్వంసమయ్యే దానిపై ఆధారపడి ఇవి సంఘటితపడే క్రమంలో వీటిలో కార్మిక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలను సంలీనం చేసుకోవడం వీలవుతుంది.

ప్రస్తుతం దండకారణ్యంలో గ్రామ, ఏరియా, డివిజనల్ జనతన సర్కార్లకు పి.ఎల్.జి.ఏ.లో భాగంగా ఉన్న స్థానిక స్థాయిలో ప్రజా మిలీషియా; ఏరియా స్థాయిలో లోకల్ గెరిల్లా స్క్వాడ్స్ (ఎల్‌జీఎస్), ప్లటూన్లు; డివిజన్ స్థాయిలో కంపెనీలు; స్పెషల్ జోన్ స్థాయిలో కంపెనీలు, బెటాలియన్లు సైనిక దన్నును అందిస్తున్నాయి. ప్రజా పునాది పటిష్టత, పీఎల్‌జీఏ అందించే సైనికదన్ను ఆధారంగా పార్టీ నాయకత్వంలో జనతన సర్కార్ల అధికారం స్థానిక స్థాయి నుండి డివిజన్ స్థాయి వరకు అమలవుతుంది.

వ్యూహాత్మక ప్రాంతాల్లో (అడవులు, కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాలు) విముక్తి ప్రాంతాల ఏర్పాటు ఎలా సాధ్యమయ్యే అవకాశం ఉందనే విషయంలో మన పంథాని సృజనాత్మకంగా మన నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి కొనసాగిస్తున్న కార్యాచరణ ఫలితంగా దండకారణ్యంలో మనం ఏర్పాటు చేసిన ఏరియా, డివిజనల్ గెరిల్లా బేసుల ప్రక్రియ ఈ క్రమంలో వేసిన ఒక ముందడుగు. ఇది మన పంథా సవ్యత్వాన్ని రూఢి చేస్తున్నది.  వ్యూహాత్మక ప్రాంతాలలో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేస్తూ గెరిల్లా బేసులను ఏర్పరుస్తూనే దేశంలో గల వివిధ స్థాయి ఉద్యమాలను సంఘటితపరుస్తూ ప్రజలను రాజకీయంగా మరింత విస్తృతంగా సమీకరిస్తూ స్వీయాత్మకశక్తులను పెంపొందించుకోగలిగితే,  నూతన ప్రాంతాలకు విప్లవోద్యమాన్ని/గెరిల్లా యుద్ధాన్ని విస్తరింపజేయగలిగితే, ప్రజాయుద్ధాన్ని దేశప్రజల ముందు ప్రత్యామ్నాయ మార్గంగా

ఉంచి మరింతగా వారి అభిప్రాయాన్ని ఇందుకనుగుణంగా మలచగలిగితే, స్వీయాత్మక శక్తులను చాలావరకు రక్షించుకోగలిగితే, స్వీయాత్మక శక్తులను పెంపొందించుకుంటూ వాటిపై ఆధారపడి పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా అభివృద్ధిపరిచే ప్రక్రియను అనుసరించి సైనికశక్తిని పెంపొందించుకుంటూ గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయగలిగితే, దేశంలో రాజకీయంగా మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడినప్పుడు శతృ సాయుధ బలగాలను పెద్దఎత్తున నిర్మూలించి ఓడించ/తరిమివేయగలిగినప్పుడు గెరిల్లాజోన్ స్థాయిలో కూడా ప్రజారాజ్యాధికారాన్ని అమలు చేయగలిగే (ఎగ్జిక్యూట్ చేయడం) విప్లవ ప్రజాకమిటీని/కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా నిర్ణీత గెరిల్లా జోన్‌ను విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేయవచ్చుననేది ఆచరణపూర్వకంగా అర్థమవుతుంది. **అంటే విముక్తి ప్రాంత ఏర్పాటు దిశలో గెరిల్లాబేసుల ఏర్పాటు అనేది ఒక ముందడుగు అనేది ప్రస్తుతం మరింత దృఢంగా, స్పష్టంగా చెప్పవచ్చు.**

దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసే దిశలో ముందడుగుగా మనం నిర్మిస్తున్న గెరిల్లాబేసులు ఉనికిలోకి రావడంతో, ప్రజాయుద్ధంలో పీడిత ప్రజల క్రియాశీల పాత్ర పెంపొందుతూ విజయాలు సాధిస్తూ ప్రజాయుద్ధం విస్తరిస్తుండడంతో భారతదేశ దోపిడీ పాలకవర్గాలు తీవ్రంగా ఆందోళనకు గురయ్యాయి. ఈ గెరిల్లాబేసులు పీఎల్‌జీఏకు వెనుకతట్టుగా నిలబడడమే కాకుండా ఇక్కడి నూతన రాజకీయాధికార అంగాలు రాజకీయంగా బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా దేశ ప్రజల ముందు నమూనాగా నిలువడం, ప్రపంచబ్యాంకు/సామ్రాజ్యవాద నిర్దేశిత ఆర్థికాభివృద్ధికి ప్రత్యామ్నాయంగా స్వతంత్ర, స్వావలంబన ఆర్థిక వ్యవస్థగా ఒక నమూనాగా ప్రజల ముందు నిలబడడంతో భారత దోపిడీ వర్గాలు వీటిని నిర్మూలించడానికి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో 2009 నుండి దేశవాప్త విప్లవ ప్రతీఘాతుక దాడిని కొనసాగిస్తున్నాయి. విప్లవ పార్టీని నిర్మూలించి భారత విప్లవానికి దిశానిర్దేశంచేసే విప్లవ కేంద్రం లేకుండా చేసే లక్ష్యంతో, గెరిల్లాబేసులను నిర్మూలించి పీఎల్‌జీఏకు వెనుకతట్టు లేకుండా చేసి గెరిల్లా యుద్ధాన్ని ఓటమిపాలు చేసే లక్ష్యంతో విప్లవ ప్రజాకమిటీలను ధ్వంసం చేసి బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం ఉనికిలో లేకుండా చేసే లక్ష్యంతో, దేశంలో మరెక్కడా ఇలాంటివి బలపడకుండా, తలెత్తకుండా చేసే ప్రతీఘాతుక లక్ష్యంతో ఈ దాడి కొనసాగుతుంది. ఈ దాడి ఫలితంగా ప్రస్తుతం భారత విప్లవోద్యమం గడ్డుస్థితిని ఎదుర్కొంటుంది.

1857 నుండి మొదలయ్యి కొనసాగుతున్న భారత ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో ఇప్పటివరకు గడచిన 157 సంవత్సరాల చరిత్రలో మనదేశంలో రైతాంగ, ఆదివాసీ తిరుగుబాట్లు అనేకం జరిగాయి. అవన్నీ సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీ వర్గాల సాయుధ బలగాల దాడులను తట్టుకుని నిలబడలేక స్వల్ప కాలాల పాటే ఉనికిలో ఉంటూ ఓడిపోతూ వచ్చాయి. దీనికి భిన్నంగా 1969 నుండి మనపార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న భారత నూతన ప్రజాస్వామిక

విప్లవ పోరాటం ఆటుపోట్లగుండా సాగుతూ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 1970ల నాటి నక్సల్బరీ, శ్రీకాకుళం, బీర్భూమ్, కాంక్సా తదితర పోరాటాలు ఓటమి పాలయ్యినప్పటికీ, 2006 నాటికి ఉత్తర తెలంగాణా, ఆంధ్ర, ఏఓబీ, ఉత్తర ఛత్తీస్‌గఢ్ పోరాటాలు తాత్కాలిక వెనుకంజకు గురయినా, 2011 నాటికి దేశవ్యాప్త ఉద్యమం గడ్డుస్థితిని ఎదుర్కొనే స్థితి తలెత్తినప్పటికీ ఇవన్నీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో సాగుతోన్న నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో తాత్కాలిక ఓటమిని, గడ్డు స్థితిని సూచించేవే. పై పోరాటాలు తాత్కాలిక వెనుకంజ వేసినప్పటికీ, ఇంత దీర్ఘకాలం మన పార్టీ నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవం కొనసాగడానికి కారణం మనం అనుసరిస్తున్న వ్యూహం-ఎత్తుగడలు సరైనవి కావడమే. అంటే, గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు నడపడం; గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నడపడం;ఈ క్రమంలో గ్రామీణ మైదాన ప్రాంతాలను గెరిల్లా జోనులుగా అభివృద్ధి చేయడానికి కృషి చేయడం; వ్యూహాత్మక ప్రాంతాల్లో ప్రధాన గెరిల్లాజోన్లను-గెరిల్లా బేసులను నిర్మించడం; మైదాన ప్రాంత గెరిల్లా జోన్ల ఆధారంగా వ్యూహాత్మక ప్రాంతాల ప్రధాన గెరిల్లాజోన్లను గెరిల్లాబేసులుగా-విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేయడం; వ్యూహాత్మక ప్రాంతాల్లోని ప్రధాన గెరిల్లా జోన్ల, గెరిల్లాబేసుల ఆధారంగా మైదాన ప్రాంత ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలను, గెరిల్లాజోన్ ప్రాంతాలను నిలబెట్టడం, విస్తరించడం అనే పరస్పర ఆధారిత, సమగ్రతతో కూడిన పోరాట పంథాను అనుసరించడమే. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్త ఉద్యమ గడ్డుస్థితి గెరిల్లాబేసులను అభివృద్ధి చేయడంలో తీవ్రమైన సమస్యలను ముందుకు తీసుకువచ్చింది. వాటిని అధిగమించడానికి కృషి చేయడం ప్రస్తుత పరిస్థితిలో కీలకమైన కర్తవ్యం.

### *గెరిల్లాబేసులను నిలబెట్టి-సంఘటితం చేస్తూ-విస్తరింపచేయడంలో ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు-పరిష్కారాలు*

భారత విప్లవ యుద్ధపు అసమానాభివృద్ధి నియమాలను అనుసరించి ప్రస్తుతం మనదేశంలో విప్లవోద్యమం కొన్నిచోట్ల విప్లవ రాజకీయాల ప్రచార కేంద్రాలుగా, రహస్యంగా విప్లవోద్యమ నిర్మాణ కృషి సాగే ప్రాంతాలుగా, ఎర్రప్రతిఘటనా ప్రాంతాలుగా, గెరిల్లాజోన్లుగా, ప్రధాన గెరిల్లాజోన్లుగా-గెరిల్లాబేసులుగా కొనసాగుతుంది. భారత విప్లవోద్యమపు అసమానాభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని శత్రువు విప్లవ ప్రతీఘాతుక యుద్ధతంత్రంగా తక్కువ తీవ్రత కలిగిన యుద్ధతంత్రాన్ని(ఎల్ఐసి), కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్‌ను అనుసరించి మన విప్లవోద్యమంపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో దాడి చేస్తున్నాడు. ఇందులో భాగంగా విప్లవ ప్రజానీకంపై, పార్టీపై, ప్రజాసైన్యంపై దాడులు కొనసాగుతున్నాయి. గెరిల్లాయుద్ధ నియమాలను ప్రత్యర్థి/శత్రు గెరిల్లా బలగాలపై ప్రతీఘాతుక పద్ధతుల్లో ఉపయోగించడమే కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్. దీన్ని అనుసరించే మన ప్రజాపునాది, ఫార్మేషన్ల స్థాయి-శక్తి తక్కువగా ఉన్న ప్రాంతాల నుండి

ఆరంభించిన ఫేజ్‌లవారీ ఆపరేషన్లను (క్లియర్, హోల్డ్, బిల్డ్, డెవ్‌లప్‌మెంట్ అనే ఫేజులు) శత్రువు మొదలుపెట్టి ఒక్కో ప్రాంతాన్ని తన అదుపులోకి తీసుకుంటూ ప్రస్తుతం గెరిల్లాబేసులను తన అదుపులోకి (హోల్డ్) తీసుకునే ఆపరేషన్‌లను, తన అదుపులోకి వచ్చిన ప్రాంతాల్లో బలహీనపడ్డ, ధ్వంసమైన ప్రభుత్వ యంత్రాంగాన్ని పునర్నిర్మించి, తిరిగి విప్లవోద్యమం బలమైన శక్తిగా ఎదగకుండా అత్యంత ప్రతీఘాతుక రాజకీయ, సైనిక, సామాజిక, సాంస్కృతిక నిర్మాణాలను, యంత్రాంగాన్ని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తూ వనరులను కొల్లగొట్టడానికి ఉపయోగపడే మౌలిక సదుపాయాలయిన రోడ్లు, రవాణా, కమ్యూనికేషన్, విద్యుత్తు, నీటి వ్యవస్థలను నిర్మించడానికి పూనుకున్నాడు. ఇదే ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ. ఈ స్థితిలో శత్రువు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఓడించడం అనేది మనం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య. దేశప్రజలను విస్తృతంగా కదిలించడం ద్వారా, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేయడం ద్వారా, పరిస్థితికనుగుణమైన ఎత్తుగడలను చేపట్టి యావత్తు పార్టీ, పిఎల్‌జీఏ, ఉద్యమ ప్రజానీకం ఏకతాటిపై నిలిచి ధైర్యంగా పోరాడడం ద్వారా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించగలం. **ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఓడించడం ద్వారానే గెరిల్లాబేసులను నిలబెట్టుకుని -సంఘటితం చేసి-విస్తరింపచేయవచ్చు, విప్లవోద్యమాన్ని రక్షించుకొని, సంఘటితం చేసుకొని పురోగమింపజేయవచ్చు.**

ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిలో కీలకమైనది సాయుధ దాడే అయినప్పటికీ అది కేవలం సాయుధ/సైనిక దాడి కాదు. అది రాజకీయ, సైనిక, మానసిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో కొనసాగుతున్న బహుముఖ దాడి. అది కేంద్ర స్థాయి నుండి స్థానిక స్థాయి వరకు కొనసాగుతుంది. కాబట్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఓడించడానికి మనం కూడా మన రాజకీయ-సైనిక పంథాని సృజనాత్మకంగా అమలుచేయడంలో భాగంగా ఉద్యమ బలాబలాలను అనుసరించి బహుముఖ ప్రతిదాడి ఎత్తుగడలతో, అన్ని రంగాల్లో, స్థానిక స్థాయి నుండి కేంద్ర స్థాయి వరకు ప్రతిదాడి చేయాలి, పోరాడాలి. కేంద్ర, రాష్ట్రకమిటీలు ప్రధానంగా వివిధ రంగాల్లో కొనసాగించే రాజకీయపర దాడికి ప్రాధాన్యతనివ్వాలి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడి సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడాభూస్వామ్య వర్గాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించింది కాబట్టి, ఆ దాడి ఫలితంగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా నష్టపోతున్న, దెబ్బ తింటున్న కార్మిక, కర్షక, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలను రాజకీయంగా సమీకరించి, చట్టబద్ధ-చట్టవ్యతిరేక, బహిరంగ-రహస్య పద్ధతుల్లో, సాయుధ-నిరాయుధ పద్ధతుల్లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా పోరాడాలి. ఈ దాడిని కొనసాగిస్తున్న శత్రువును, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒంటరి చేసేలా విశాల ప్రజానీకాన్ని మన పక్షాన నిలబెట్టుకోవాలి, శత్రువుల మధ్యనున్న వైరుధ్యాలను ఉపయోగించుకునే రాజకీయ ఎత్తుగడలను అనుసరించాలి.

బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలో భాగమయిన చట్టసభలు, కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థ అవినీతి, ఆశ్రితపక్షపాతంలో కూరుకుపోయి కుళ్ళి కంపు కొడుతున్న తీరును, ప్రజా వ్యతిరేక, దేశద్రోహకర చట్టాలతో, పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వాల తీరుతెన్నులను దేశ ప్రజానీకంలోకి తీసుకెళ్ళి వీటన్నింటికీ ప్రత్యామ్నాయంగా ఉనికిలోకి వచ్చిన విప్లవ ప్రజా కమిటీలను, దేశంలో విప్లవోద్యమాన్ని ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడి నుండి కాపాడుకోవడం ద్వారానే అది విముక్తి పథంలో పురోగమించగలుగుతుందని రాజకీయంగా దేశ ప్రజలందరినీ సమీకరించుకుని, దేశ ప్రజలందరినీ విప్లవ ప్రజాకమిటీలకు మద్దతుగా నిలబెట్టుకోవాలి. వీటికి అండగా నిలబడ్డవాళ్ళు తమ శక్తి, సమర్థతలమేరకు నైతికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సైనికంగా, సాంస్కృతికంగా, న్యాయపరంగా, విద్య, వైద్య, వ్యవసాయరంగాల్లో సేవలందించేలా కూడగట్టాలి. ఇందులో ఉద్యమ ప్రాంతాల బయట ఉన్న విప్లవ, ప్రజాస్వామిక సంఘాలు, ఫ్రంట్‌లు తమవంతు కృషి చేయాలి.

విప్లవ స్థావరాలు లేకుండా గెరిల్లాయుద్ధం దీర్ఘకాలం నిలబడలేదు కాబట్టి గెరిల్లా స్థావరాలను నిర్మించుకుని వాటిని వీలైనమేరకు వెనుకతట్టుగా నిలబెట్టుకునే కృషి చేస్తూనే, శత్రు బలాధిక్యత వల్లా గెరిల్లా బేసులను నిలబెట్టుకోలేని స్థితి తలెత్తినప్పుడు, స్వీయాత్మక శక్తిని/స్వశక్తిని వీలైనమేరకు కాపాడుకోవడానికి, శత్రుశక్తిని ధ్వంసం చేయడానికి తోడ్పడేలా బలగాల కేంద్రీకరణ–వికేంద్రీకరణ ఎత్తుగడలను; పురోగమన–తిరోగమన ఎత్తుగడలను అనుసరించి శత్రుదాడిని ఓడించాలి. ఈ క్రమంలో గెరిల్లా స్థావరాలు శత్రుచేతుల్లోకి వెళ్ళి, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా/తెల్ల ప్రాంతాలుగా కూడా మారవచ్చు. నూతన ప్రాంతాలు కొత్తగా గెరిల్లా స్థావరాలుగా అభివృద్ధి కావచ్చు. కాబట్టి ప్రస్తుతం గల మొత్తం పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఒక సాధారణ ప్లానును, ఇందులో భాగంగా తిరోగమన దిశగా ఏర్పడుతున్న పరిస్థితుల ఆధారంగా ఆత్మరక్షణ ఎత్తుగడలను, ఉద్యమ పురోగమనానికి నేటికీ గల అవకాశాలను దృష్టిలో పెట్టుకొని పురోగమన ఎత్తుగడలను రూపొందించుకోవాలి; ప్రధాన ఉద్యమ ప్రాంతాలలో గల నిర్దిష్ట పరిస్థితులపై సంబంధిత రీజినల్ బ్యూరోలు, రాష్ట్రకమిటీలు పురోగమన, తిరోగమన ఎత్తుగడలలో అవసరమైన మార్పులు చేసుకోవాలి; ఉద్యమాభివృద్ధికి అవకాశాలు గల నూతన ప్రాంతాలలో ప్రజలను రాజకీయంగా సమీకరిస్తూ, సంఘటితశక్తిని పెంపొందించుకుంటూ వర్గపోరాటం, గెరిల్లా యుద్ధం అభివృద్ధి చేసే దిశగా సాగేందుకు తోడ్పడే ఎత్తుగడలను చేపట్టాలి; బలహీనంగా ఉన్న ప్రాంతాలన్నింటా స్వీయాత్మకశక్తులను రక్షించుకోవడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూనే సృజనాత్మక పద్ధతుల్లో ప్రజలను రాజకీయంగా సమీకరించి, సంఘటితపరుస్తూ వర్గపోరాటాలను, స్వీయాత్మకశక్తులను పెంపొందించుకోవడానికి తోడ్పడే ఎత్తుగడలను చేపట్టాలి. అన్ని రకాల ప్రాంతాలలోనూ రూపొందించుకున్న ఎత్తుగడలను కృతనిశ్చయంతో అమలుచేస్తూనే పరిస్థితులలో త్వరత్వరగా వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని నాయకత్వం నేటి గడ్డు పరిస్థితినధిగమించే లక్ష్యంతో పనిచేయాలి. ఇలాంటి ఎత్తుగడల ద్వారా యుద్ధంలో చొరవ కోల్పోకుండా, ఓటమిపాలు

కాకుండా, లేదా తక్కువ నష్టాలతో యుద్ధంలో తలెత్తే ప్రతికూలతలను అధిగమించవచ్చు.

అంతర్యుద్ధ కాలంలో భూస్వాముల భూముల ఆక్రమణ ద్వారా, జపాన్ ప్రతిఘటనా యుద్ధ రోజుల్లో కౌలురేట్ల తగ్గింపు, కూలీరేట్ల పెంపు, ఉత్పత్తి పెంపు క్యాంపెయిన్ల ద్వారా పీడిత ప్రజలను విప్లవ స్థావరాల నిర్మాణానికై విస్తృతంగా సమీకరించాలని మావో సూచించాడు. వీటిని విప్లవ స్థావరాల నిర్మాణంలో ప్రజలను విస్తృతంగా సమీకరించడానికి మార్గదర్శక నియమాలుగా తీసుకోవడమంటే పీడిత ప్రజల ఆకాంక్షల పరిపూర్తికై గెరిల్లాయుద్ధాన్ని ముడిపెట్టి నడపడమే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల దైనందిన, మౌలిక సమస్యల పరిష్కారానికై భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వర్గపోరాటాన్ని, రాజ్య వ్యతిరేక పోరాటాన్ని గెరిల్లాజోన్లలో, గెరిల్లాబేసులలో కొనసాగించడం ద్వారానే ప్రజలను గెరిల్లా స్థావరాల నిర్మాణంలో–వాటిని సంఘటితం చేయడంలో విస్తృతంగా సమీకరించడానికి తోడ్పడుతుంది. దీంతోపాటుగా గెరిల్లా స్థావరాల్లో ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి తోడ్పడేలా ఉత్పత్తిని పెంచడం కోసం భూమి సమతలీకరణ, సాగునీటి కోసం చెరువుల, కుంటల, కాల్వల నిర్మాణ క్యాంపెయిన్‌లను చేపట్టాలి. వీటితోపాటుగా ప్రజలకు విద్య, వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించాలి. ఈ రకంగా గెరిల్లాజోన్లలో, గెరిల్లాబేసులలో సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని, రాజ్య వ్యతిరేక పోరాటాలను తీవ్రతరం చేయడం, గెరిల్లాబేసుల్లో ఉత్పత్తిని పెంచే క్యాంపెయిన్లు చేపట్టడం, సంక్షేమ చర్యలను విస్తృతం చేయడం ద్వారా స్థానిక స్థాయిలో పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటన నిర్మాణాల్లోకి నిరంతరం కొత్త శక్తులను విస్తృతంగా సమీకరించాలి. ఈ బలగాల సమీకరణ మన విజయానికి ప్రాతికపదిక కల్పిస్తుంది. కాబట్టి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాలను నడపడంలో, ఉత్పత్తి, సంక్షేమ కార్యకలాపాలు నడపడంలో మన లోపాలను, బలహీనతలను, పరిమితులను అధిగమించే కృషి చేయాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో మైదాన ప్రాంత, అడవి ప్రాంత, పట్టణ ప్రాంత ఉద్యమాలను పరస్పర పూరకాలుగా గుర్తించి నడపాలి. ప్రస్తుతం ఉన్న శక్తులను ఒకవైపు కాపాడుకుంటూనే, నూతన ఎత్తుగడలతో, రహస్య పద్ధతుల్లో మైదాన ప్రాంతాల్లో, పట్టణాల్లో పని చేస్తూనే ఆ ప్రాంతాల నుండి గెరిల్లాజోన్లలో, గెరిల్లా బేసులలో పార్టీ, మిలిటరీ, ఐక్యసంఘటనా రంగాలను నడిపే కొత్త కేడర్లను క్రమక్రమంగా తయారు చేసుకోవాలి.

ప్రతికూల పరిస్థితుల్లో, గడ్డు పరిస్థితుల్లో, ఓటమి కాలాల్లో వర్గపోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని నడిపే ఎత్తుగడలపై పార్టీని, పీఎల్‌జీఏను తర్ఫీదు చేసుకోవాలి. ఈ తర్ఫీదు ద్వారా రానున్న రోజుల్లో భారత విప్లవోద్యమం ఎలాంటి ప్రతికూల స్థితికి లోనయినా ఆ స్థితిని ఎదుర్కొని నిబ్బరంగా నిలిచేలా, “తుఫానులో సైతం గమ్యం దిశగా నావను నడిపే నావికుల్లాగా” మన పార్టీ కార్యకర్తలను, పీఎల్‌జీఏ కమాండర్లను పార్టీ నాయకత్వం తయారు చేసుకోవాలి.

ఇన్‌ఫర్మేషన్, కమ్యూనికేషన్ రంగాల్లో సంభవిస్తున్న విప్లవాత్మక మార్పులు విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని, విప్లవయుద్ధాన్ని రెండింటిని అనుకూలంగా, ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. సహజంగానే అధికారంలో ఉన్న దోపిడీ వర్గాలు విప్లవాలను, తిరుగుబాట్లను (ఇన్‌సర్జెన్సీ) అణిచివేయడానికి వీటిని తమ ఆధిక్యతలో ఉంచుకుంటూ తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నాయి. చాలా తేడాలున్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా విప్లవకారులు, తిరుగుబాటుదారులు కూడా వాటిని తమకు అనుకూలంగా కూడా ఉపయోగించుకుంటున్నారు. కాబట్టి ఇన్‌ఫర్మేషన్, కమ్యూనికేషన్ రంగాల్లో సంభవించే మార్పులను అధ్యయనం చేస్తూ, వాటి ఆధారంగా శతృవు కొనసాగించే విప్లవ ప్రతీఘాతుక దాడిని తిప్పి కొట్టడానికి, విప్లవయుద్ధానికి అనుకూలంగా వాటిని ఉపయోగించుకోవడానికి కృషి చేయాలి.

రోడ్డు, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థల్లో దినదినం సంభవిస్తున్న మార్పులు, అవి గ్రామీణ, అడవి ప్రాంతాల్లోకి విస్తరిస్తున్న ఫలితంగా గెరిల్లాయుద్ధ నిర్వహణలో ఎదురవుతున్న ప్రతికూలతలను అధిగమించేలా మనం గెరిల్లాయుద్ధాన్ని నిర్వహించేలా పోరాట, నిర్మాణ రూపాలను అభివృద్ధి చేసుకోవాలి. నగరీకరణ ఫలితంగా పెరుగుతున్న రైతాంగేతర సెక్షన్లను వారి ఆకాంక్షలకు అనుగుణంగా సామ్రాజ్యవాద వ్యతిరేక-భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాల్లో సమీకరించాలి.

గత 47 సంవత్సరాల భారత ప్రజాస్వామిక విప్లవోద్యమ చరిత్రలో, మనం దేశంలో విముక్తి ప్రాంతాల స్థాపనదిశగా గెరిల్లా బేసులను నిర్మించడం ఒక ముందడుగు. ఈ గెరిల్లా బేసులను సంఘటితం చేస్తూ-విస్తరింప చేయడానికి ప్రస్తుతం వస్తుగత పరిస్థితిలో పెంపొందుతున్న వర్గ వైరుధ్యాల తీవ్రత; పార్టీ, పీఎల్‌జీఏ గెరిల్లా యుద్ధాన్ని నడపడంలో సాధించిన అనుభవాలు, 1977-80 నుండి ఇప్పటివరకు గత 34-37 సంవత్సరాల వర్గపోరాటంలో ప్రజలు రాటుదేలడం అనేవి మనకున్న అనుకూలాంశాలు. అయితే శతృ బలాన్ని అధికంగా, స్వీయాత్మక శక్తిని (పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటన, విప్లవ ప్రజలు) తక్కువగా అంచనావేసే స్వీయాత్మకత వల్లా పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటనలో ఒక సెక్షన్‌లో ఆత్మవిశ్వాసం సడలడం, అధైర్యపడడం, పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటనలో అన్యవర్గ ధోరణులు కొనసాగడం, ప్రజాపునాది బలహీనపడడం, పీఎల్‌జీఏ ప్రతిఘటనా శక్తి తగ్గిపోవడం లాంటి బలహీనతల రీత్యా మన విప్లవోద్యమం ప్రస్తుతం తీవ్రమైన ప్రతికూలతలను ఎదుర్కొంటుంది. ఈ స్థితిలో కేంద్రకమిటీ 2013లో నిర్ణయించిన ఎత్తుగడల ఆధారంగా, వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ ప్రజాపునాదిని పెంచుకుందాం, బోల్షెవీకరణ ద్వారా పార్టీని, పీఎల్‌జీఏను సాహసిక, అజేయమైన శక్తిగా మలచుకుందాం. ఈ క్రమంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఓడిస్తూ గెరిల్లా బేసులను సంఘటితం చేస్తూ-విస్తరిస్తూ విముక్తి ప్రాంతాల స్థాపనదిశగా పురోగమిద్దాం.

*

# లెనిన్

**- స్టాలిన్**

(క్రెమ్లిన్ మిలటరీ స్కూలు సంస్మరణ సభలో కామ్రేడ్ స్టాలిన్ చేసిన ఉపన్యాసం)

*జనవరి, 1924*

కామ్రేడ్స్, ఈ రోజు సాయంత్రం మీరు ఒక లెనిన్ స్మారక సభను ఏర్పాటు చేశారనీ, అందులో ఒక ఉపన్యాసకుడిగా నన్ను ఆహ్వానించారనీ తెలియజేశారు. లెనిన్ రాజకీయ కార్యకలాపాల గురించి తయారుగా వున్న ఒక ఉపన్యాసాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందని నాకు అనిపించడం లేదు. ఒక మనిషిగా, ఒక నాయకుడిగా లెనిన్ లక్షణాలు కొన్నిటిని వెలుగులోకి తేవడానికి కొన్ని వాస్తవాలను చెప్పడానికి నేను పరిమితం అవుతే బావుంటుందని నాకనిపిస్తోంది. ఈ వాస్తవాల మధ్య అంతర్గత సంబంధం ఏమీ వుండకపోవచ్చు కానీ లెనిన్ గురించి ఒక సాధారణ అవగాహన ఏర్పర్చుకోవడానికి ఇదేమంత ప్రాముఖ్యత కలిగిన విషయం ఏం కాదు. ఏదేమైనా, పైన వాగ్దానం చేసినదానికంటే ఈ సందర్భంలో ఎక్కువేం చెప్పలేను కూడా.

## పర్వతప్రాంత గద్ద

నాకు లెనిన్ మొదటిసారిగా పరిచయమైంది 1903లో. అది వ్యక్తిగత పరిచయం ఏమీ కాదనేది వాస్తవమే. మేం కలిసింది ఉత్తరాల ద్వారా. కానీ నాపై అది చెరిగిపోని ముద్రను వేసింది. అది నేను పార్టీలో పని చేస్తున్న కాలం అంతటిలోనూ నాతోనే ఉండిపోయింది. నేను ఆ సమయంలో సైబీరియాలో ప్రవాసంలో ఉన్నాను. 90ల చివర నుండి, ముఖ్యంగా 1901 తర్వాత నుండి, ఇస్క్రా వెలువడడం మొదలైన తర్వాత నుండి, లెనిన్ విప్లవ కార్యకలాపాల గురించి నాకున్న జ్ఞానం రీత్యా ఆయన అసాధారణ ప్రజ్ఞావంతుడు అని నేను నిశ్చయించుకున్నాను. ఆ సమయంలో ఆయనను నేను కేవలం పార్టీ నాయకుడిగా మాత్రమే చూడలేదు. దాని అసలైన వ్యవస్థాపకుడిగా ఆయనను పరిగణించాను. ఎందుకంటే పార్టీ అంతర్గత సారాన్నీ, మన పార్టీ తక్షణ అవసరాలను గుర్తెరిగినది ఆయనొక్కడే. మన పార్టీలోని ఇతర నాయకులతో ఆయనను పోల్చి చూసినప్పుడల్లా ఆయన తన సహచరులందరికంటే అంటే ప్లెహనోవ్, మార్టోవ్, ఆక్సల్‌రాడ్, ఇంకా యితరులందరికంటే యెంతో ఉన్నతుడిగా తోచేవాడు; వారితో పోల్చినప్పుడు లెనిన్ కేవలం నాయకులలో ఒకడు కాడనీ, అత్యున్నత శ్రేణికి చెందిన నాయకుడనీ, ఒక పర్వతప్రాంత గద్దలా (మౌంటెన్ ఈగిల్) పోరాటంలో భయం అంటే ఎరుగనివాడనీ, రష్యా విప్లవోద్యమంలో గతంలో ఎవరం ఎరుగని మార్గాల గుండా పార్టీని పురోగమింపజేసిన

నాయకుడనీ అనిపించేవాడు. ఆయన వేసిన ముద్ర నాపై ఎంత బలంగా ఉండిందంటే నేను దాని గురించి విదేశాల్లో రాజకీయ ప్రవాసిగా నివసిస్తున్న నా సన్నిహిత మిత్రుడికి రాయకుండా ఉండలేకపోయాను. దానిపై ఆయన అభిప్రాయాన్ని కోరాను. కొంతకాలం తర్వాత నేను సైబీరియాలో ప్రవాసంలో ఉండగా అంటే 1903 చివరలో నా స్నేహితుడి నుండి ఒక ఉత్సాహభరితమైన జవాబు కూడా వచ్చింది. దాంతో పాటు లెనిన్ రాసిన ఒక సాదాసీదా అయిన కానీ లోతైన వ్యక్తీకరణ గల ఒక జాబు కూడా వచ్చింది. లెనిన్ రాసిన నోట్ పోల్చి చూసినప్పుడు చిన్నగానే ఉండింది గానీ అందులో పార్టీ ఆచరణాత్మక కార్యకలాపాలపై శషభిషలు లేని, ధైర్యంతో కూడిన విమర్శ ఉండింది. సమీప భవిష్యత్తులో పార్టీ పనికి సంబంధించిన మొత్తం పథకం గురించిన అత్యంత స్పష్టమైన, క్లుప్తమైన వివరణ వుండింది. ఒక్క లెనిన్ మాత్రమే అత్యంత సూక్ష్మమైన విషయాలను కూడా అంత సాదాసీదాగా, స్పష్టంగా, క్లుప్తంగా, శషభిషలు లేకుండా రాయగలడు. ఆయన ప్రతీ వాక్యం మాటల తూటాలా పేలుతుంది. ఈ సాదాసీదా, శషభిషలు లేని ఉత్తరం ఆయన మన పార్టీలోని పర్వతప్రాంత గద్ద లాంటివాడు అనే నా అభిప్రాయాన్ని మరింత బలోపేతం చేసింది. ఒక పాత అజ్ఞాత కార్యకర్తకుండే అలవాటులో భాగంగా, అనేక యితర ఉత్తరాల వలెనే లెనిన్ రాసిన ఈ వుత్తరాన్ని కూడా నేను కాల్చి బూడిద చేసేశాను. అందుకు నన్ను నేను క్షమించుకోలేను.

## నమ్రత

ఫిన్లాండ్‌లోని తమ్మర్‌ఫోర్స్‌లో 1905 డిసెంబర్‌లో జరిగిన బోల్షివిక్ కాన్ఫరెన్సులో నేను లెనిన్‌ను మొదటిసారిగా కలిశాను. మన పార్టీలోని పర్వత ప్రాంత గద్దను, ఆ గొప్ప మనిషిని - గొప్పతనం రాజకీయపరంగా అనే కాదు, నా ఊహల్లో అయితే ఆకారంలో కూడా, చూస్తానని నేను ఆశపడ్డాను. లెనిన్‌ను నేను ఆజానుబాహువుగా, హుందాగా, రాజసం ఉట్టిపడేలా వుంటాడని ఊహించుకున్నాను. ఒక అత్యంత సాధారణంగా కనబడే, సగటు ఎత్తుగల, ఏ విధంగానూ ఇతరుల నుండి వేరే చేసే ఎటువంటి లక్షణాలూ లేని ఒక మానవుడిని నేను చూసినప్పుడు నాకు కలిగిన నిరాశను మీరు ఊహించవచ్చు.

ఇతరులందరూ అతని ఆగమనం కోసం ఊపిరి బిగపట్టి చూడగలందుకు ''గొప్ప వ్యక్తి'' సమావేశాలకు ఆలస్యంగా రావడం అనేది ఆమోదం పొందిన విషయంగా ఉండింది. అప్పుడిక ఆ ''గొప్ప వ్యక్తి'' అడుగిడుతాడనగా, ''హుష్!...నిశ్శబ్దం!...ఆయన వస్తున్నారు!'' అని హెచ్చరికతో కూడిన గుసగుసలు వెలువడుతాయి. ఈ సంప్రదాయం నాకు అనవసరమైనదిగా తోచలేదు, ఎందుకంటే అది ఒక ముద్రను వేస్తుంది, గౌరవాన్ని కలిగిస్తుంది అనుకున్నాను. కాబట్టి లెనిన్ డెలిగేట్లు (ప్రతినిధులు) అందరికంటే ముందుగా కాన్ఫరెన్స్ వద్దకు చేరుకున్నాడనీ, ఏదో మూల సర్దుకుని ఒక అత్యంత సాధారణ ప్రతినిధితో ఒక

అత్యంత సాధారణ సంభాషణను ఏమాత్రం హంగూ ఆర్భాటం లేకుండా కొనసాగిస్తున్నాడనీ తెలుసుకున్నప్పుడు నాకు కలిగిన నిరాశను మీరూహించవచ్చు. కొన్ని అత్యవసరమైన నియమాలకు యిదంతా ఉల్లంఘనగా ఆనాడు నాకు తోచిందనే విషయాన్ని నేను మీ నుండి దాచను.

ఈ సాదాసీదాతనం, ఈ నమ్రత, అందరి కళ్లలో పడకుండా ఉండాలనే తపన, కనీసం కొట్టొచ్చినట్టుగా కనబడకుండా వుండాలనుకోవడం, తన ఉన్నత స్థాయిని నొక్కి వక్కాణించకపోవడం మొదలైనవన్నీ నూతన ప్రజానీకపు సాదాసీదా, సాధారణ ప్రజల, మానవుల్లోని 'సాధారణ శ్రేణుల' నూతన నాయకుడిగా లెనిన్ కలిగి వున్న అత్యంత బలమైన లక్షణాల్లో భాగమని నేను ఆ తర్వాతి కాలంలో మాత్రమే గుర్తించగలిగాను.

## తర్కబలం

ఆ కాన్ఫరెన్స్ వద్ద లెనిన్ ఇచ్చిన రెండు ఉపన్యాసాలూ ప్రముఖమైనవి : ఒకటి సమకాలీన స్థితి గురించి, రెండవది వ్యవసాయ సమస్య గురించి. దురదృష్టవశాత్తు, వాటిని భద్రపరచలేకపోయాం. అవి ఉత్తేజంతో నిండి, మొత్తం కాన్ఫరెన్సు హాలునంతా ఉత్సాహపు వెల్లువలో ముంచెత్తాయి. ప్రేక్షకులను ప్రభావితం చేయడానికుద్దేశించి వారి కళ్లు తిరిగేలా చేసే భంగిమలూ, నాటకీయమైన పదబంధాలు వంటివేమీ లేని అసాధారణమైన నిబద్ధతాబలం, సాదాసీదాతనం, వాదనాస్పష్టత, క్లుప్తమైన, సులభంగా అర్థం అయ్యే వాక్యాలు వాటిలో ఉండినాయి. ఇదంతా మనకు ఎల్లప్పుడూ తారసపడే "పార్లమెంటరీ" ఉపన్యాసకుల ఉపన్యాసాల నుండి లెనిన్ ఉపన్యాసాలను వేరుపరిచే పసందైన లక్షణాలు.

అయితే ఆనాడు నన్ను కట్టిపడేసినది లెనిన్ ఉపన్యాసాలకుండే ఈ పార్శ్వం కాదు. వాటిలోని ఎదురులేని తర్కబలం నన్ను కట్టిపడేసింది. అది కొంత కటువుగా ఉన్నప్పటికీ ప్రేక్షకులపై తన పట్టును బిగించి క్రమంలో వారిలో విద్యుత్తరంగాల్ని ప్రసరిస్తుంది. ఈ తర్వాత వారిని పూర్తిగా తన స్వాధీనంలోకి తెచ్చేసుకుంటుంది. చాలామంది ప్రతినిధులు యిలా అనడం నాకు గుర్తుంది: "లెనిన్ ఉపన్యాసాల్లోని తర్కం బలమైన బంధనంలాంటిది. అది నిన్ను మొత్తంగా చుట్టేసి నీ చుట్టూ తన పట్టును బిగిస్తుంది. దాని పట్టులోంచి మనల్ని మనం విడిపించుకోవడం అసాధ్యం. నువ్వు దానికి తలైనా వంచాలి లేదా ఘోరపరాజయం పాలైనా కావాలి."

ఆయన ఉపన్యాసాల్లోని ఈ లక్షణం ఆయన ఉపన్యాసకళలోని అత్యంత బలమైన పార్శ్వం అని నాకనిపిస్తుంది.

## విలపించడం ఉండదు

నేను లెనిన్‌ను రెండవసారి కలిసింది 1906లో జరిగిన మన పార్టీ స్టాక్‌హోం కాంగ్రెస్‌లో. ఈ కాంగ్రెస్‌లో బోల్షివిక్కులు మైనారిటీలో పడిపోయి ఓడిపోయారనే విషయం మీకు తెలిసిందే. లెనిన్‌ను ఓటమిపాలైన వ్యక్తిగా నేను చూడ్డం అదే మొదటిసారి. కానీ ఆయన ఓటమి తర్వాత విలపించి, గుండె బేజారైపోయే నాయకుల వంటివాడు ఏమాత్రం కాడు. అందుకు విరుద్ధంగా, ఓటమి ఆయనను పట్టి ఉంచిన స్ప్రింగ్‌లోని శక్తిలాగా మార్చివేసింది. అది ఆయన అనుచరులను నూతన సమరాలకు, భవిష్యత్తు విజయానికి సన్నద్ధపరిచింది. లెనిన్ ఓటమి పాలయ్యాడని నేను అన్నాను. కానీ అది ఎటువంటి ఓటమి? మీరు ఆయన ప్రత్యర్థులను అంటే స్టాక్‌హోం కాంగ్రెస్ విజేతలైన ప్లెహనోవ్, ఆక్సల్‌రాడ్, మార్టోవ్, ఇంకా యితరులనూ చూడాల్సింది, వారేమాత్రం విజేతల్లాగ అగుపడలేదు. ఎందుకంటే మెన్షివిజంపై లెనిన్ నిర్దాక్షిణ్యమైన విమర్శ వారి ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్కను మిగల్చలేదు. బోల్షివిక్కు ప్రతినిధులమైన మేమందరం ఒక గుంపుగా గుమిగూడి లెనిన్‌కేసి తదేకంగా చూస్తూ ఆయన సలహాలను కోరడం నాకు గుర్తుంది. అక్కడ కొంతమంది డెలిగేట్ల ఉపన్యాసాలు వారి అలసటను, నిరాశను కప్పిపుచ్చలేకపోయాయి. లెనిన్ పళ్లు గిట్టకరుచుకుని అటువంటి ఉపన్యాసాలకు పదునుగా జవాబివ్వడం నాకు గుర్తుంది. "విలపించకండి కామ్రేడ్స్, మనం గెలిచి తీరతాం. ఎందుకంటే మనం చెప్తున్నది సరైనది." విలపించే మేధావుల పట్ల ద్వేషం, స్వీయశక్తిపై నమ్మకం, విజయం పట్ల విశ్వాసం - ఇదీ లెనిన్ మాకు గట్టిగా చేసిన బోధన. మా బోల్షివిక్కుల ఓటమి తాత్కాలికమైనదనీ, అతి సమీప భవిష్యత్తులోనే మేం తప్పక విజయం సాధిస్తామని మాకు అనిపించింది.

"ఓటమి గురించి విలపించడం తగదు" - లెనిన్ కార్యకలాపాలలోని ఈ లక్షణం చివరి వరకూ నమ్మకంతో వుండే, స్వీయశక్తిపై విశ్వాసం కలిగి వుండే ఒక సైన్యాన్ని ఆయన తన చుట్టూ సమీకరించుకోవడానికి ఆయనకు దోహదపడింది.

## గొప్పలు చెప్పుకోవడం లేదు

1907లో లండన్‌లో జరిగిన ఆ తర్వాతి కాంగ్రెస్‌లో బోల్షివిక్కులు విజయం సాధించారు. లెనిన్‌ను విజేత పాత్రలో నేను చూడ్డం అదే మొదటిసారి. విజయం కొంతమంది నాయకుల తల తిరిగేలా చేసి వారిని గర్వపోతులుగా, గొప్పలు పోయేవారిగా మారుస్తుంది. ఇటువంటి చాలా సందర్భాల్లో వారు విజేతలుగా తమ విజయాలతో సంతృప్తిపడిపోయి ఆగిపోతారు. కానీ లెనిన్ ఏమాత్రం అటువంటి నాయకుడు కాడు. అందుకు విరుద్ధంగా, సరిగ్గా ఒక విజయాన్ని పొందాకే ఆయన ప్రత్యేకించి మరింత జాగరూకతతో, జాగ్రత్తగా ఉండేవాడు. లెనిన్ పదేపదే ప్రతినిధులకు బోధించాడు: "అన్నిటికంటే మొదటి విషయం, విజయగర్వం

తలకెక్కనివ్వకూడదు, గొప్పలు పోగూడదు; రెండవది, విజయాన్ని సంఘటితపర్చుకోవాలి; మూడవది, శత్రువును చివరి దెబ్బ కొట్టాలి, ఎందుకంటే శత్రువు ఓడిపోయాడే గానీ నాశనం కాలేదు.'' ''ఇప్పుడిక మెన్షివిక్కుల పని అయిపోయింది,'' అని తేలిగ్గా పైపైన వ్యాఖ్యానించిన ప్రతినిధులపై ఆయన విరుచుకుపడ్డాడు. కార్మికోద్యమంలో మెన్షవిక్కులకింకా మూలాలు మిగిలి ఉన్నాయనీ, వాటితో ప్రజ్ఞావంతంగా పోరాడాలనీ, మన స్వీయశక్తిని అతిగా అంచనా వేసుకోవడం, ముఖ్యంగా శత్రువు బలాన్ని తక్కువగా అంచనా వేయడం ఎట్టి పరిస్థితిలో చేయకూడదనీ అర్థం చేయించడం ఆయనకు ఏమాత్రం కష్టం కాలేదు.

''విజయం గురించి గొప్పలు పోకూడదు'' - లెనిన్ స్వభావంలోని ఈ లక్షణం శత్రువు బలాన్ని గంభీరంగా అంచనా వేయడంలో, పార్టీని భవిష్యత్తులో అకస్మాత్తుగా ఎదురయ్యే ఘటనల నుండి కాపాడ్డంలో ఆయనకు దోహదపడింది.

## సూత్రానికి కట్టుబడి ఉండడం

పార్టీ నాయకులు పార్టీలోని మెజారిటీ అభిప్రాయానికి విలువనివ్వక తప్పదు. ఏ నాయకుడైనా మెజారిటీకున్న బలంతో వ్యవహరించక తప్పదు. ఇతర పార్టీ నాయకుల వలెనే లెనిన్‌కి కూడా ఈ విషయం బాగానే తెలుసు. కానీ లెనిన్ ఎన్నడూ మెజారిటీకి బందీ కాలేదు, ముఖ్యంగా మెజారిటీకి సూత్రబద్ధమైన పునాది లేనప్పుడు. మన పార్టీ చరిత్రలో మెజారిటీ అభిప్రాయం లేదా పార్టీ తాత్కాలిక ప్రయోజనాలు కార్మికవర్గ మౌలిక ప్రయోజనాలతో ఢీకొన్న సందర్భాలు వుండినాయి. అటువంటి సందర్భాల్లో లెనిన్ ఎన్నడూ వెనకా ముందాడలేదు. పార్టీలోని మెజారిటీకి వ్యతిరేకంగా సూత్రానికి కట్టుబడిన దృఢమైన వైఖరిని ఆయన తీసుకునేవాడు. అంతే కాకుండా, అందరికీ వ్యతిరేకంగా తానొక్కడే ఒంటరిగా నిలవడానికి కూడా అటువంటి సందర్భాల్లో ఆయన భయపడేవాడు కాదు. ఆయన తరచూ అనేట్లుగా - ''సూత్రానికి కట్టుబడిన విధానం మాత్రమే సరైన ఏకైక విధానం.''

ప్రత్యేకించి ఈ విషయాన్ని ప్రతీకాత్మకంగా ఎత్తిచూపేవే ఈ కింది రెండు వాస్తవాలు.

మొదటి వాస్తవం. ఇది జరిగినది 1909-1911 మధ్య. ప్రతీఘాతుక విప్లవం చేతిలో దెబ్బతినిపోయిన పార్టీ ముక్కచెక్కలైపోయే క్రమంలో వుండింది. పార్టీలో అవిశ్వాసం విస్తరించింది. మేధావులే కాకుండా కొంతమేరకు కార్మికులు కూడా మొత్తంగా పార్టీని విడిచిపెట్టిపోతుండినారు. చట్టవిరుద్ధమైన సంస్థ అవసరం లేదనే వాదనలు పైకి లేచిన కాలం అది. లిక్విడేషనిజం విస్తరించి పార్టీ కూలిపోబోయే దశ. మెన్షివిక్కులలోనే కాక, బోల్షివిక్కులలో కూడా అనేక ఫ్యాక్షన్లు (ముఠాలు), ధోరణులు ఉండేవి. అవి ఎక్కువ శాతం కార్మికోద్యమం నుండి విడివడిపోయి వుండేవి. చట్టవిరుద్ధమైన సంస్థను మొత్తంగా

లిక్విడేట్ చేసి, కార్మికులను ఒక చట్టబద్ధమైన, ఉదారవాద స్టోలిపిన్ పార్టీగా ఆర్గనైజ్ చేయాలనే భావన తలెత్తినది ఆ కాలంలోనే అని మీకు తెలుసు. విస్తృతంగా విస్తరించిన ఈ అంటురోగానికి గురి కాకుండా ఉండిన ఒకే ఒక వ్యక్తి ఆ కాలంలో లెనినే. ఆయనొక్కడే పార్టీ సూత్రాన్ని పతాకలా ఎత్తిపట్టుకున్నాడు. చెల్లాచెదురైపోయి, ముక్కలు చెక్కలుగా మిగిలిపోయిన పార్టీ శక్తుల్ని ఆయన ఒక దగ్గరకు చేర్చి, ఆశ్చర్యం గొలిపే సహనంతో, అసాధారణమైన పట్టుదలతో కార్మికోద్యమంలోని ప్రతి ఒక్క పార్టీ వ్యతిరేక ధోరణినీ ఎదుర్కొంటూ, అసామాన్యమైన ధైర్యంతో, అనుపమానమైన నిశ్చయశక్తితో పార్టీ సూత్రబద్ధతను ఆయన కాపాడాడు.

పార్టీ సూత్రబద్ధతకై జరిగిన ఈ పోరాటంలో ఈ తర్వాత కాలంలో లెనిన్ విజేతగా నిలిచాడని మనకు తెలుసు.

రెండవ వాస్తవం. 1914-1917 మధ్య సామ్రాజ్యవాద యుద్ధం ప్రచండంగా చెలరేగుతున్న కాలంలో మొత్తంగా లేదా దాదాపుగా అందరు సోషల్ డెమాక్రాట్లు, అన్ని సోషలిస్టు పార్టీలు సర్వత్రా నెలకొన్న దేశభక్తి ఉన్మాదానికి గురయ్యి తమ, తమ దేశాల్లోని సామ్రాజ్యవాదులకు తమ మద్దతును ఇచ్చిన కాలానికి చెందినదీ వాస్తవం. రెండవ ఇంటర్నేషనల్ పెట్టుబడిదారీ విధానానికి దాసోహం అయిన కాలం. ప్లెహనోవ్, కాట్స్కీ, గుయెస్‌డె వంటివారూ, ఇతరులూ కూడా ఉన్మాదపు వెల్లువను తట్టుకుని నిలబడలేకపోయారు. ఆ కాలంలో లెనిన్ ఒక్కడే లేదా దాదాపుగా ఆయనొక్కడే ఆ సామాజికోన్మాదానికీ, సామాజిక పాసిఫిజంకీ (ఏ రకమైన యుద్ధాలనైనా వ్యతిరేకించే ధోరణి-అను.) వ్యతిరేకంగా దృఢనిశ్చయంతో పోరాడినాడు; గుయెస్‌డేలూ, కాట్స్కీలూ చేసిన విద్రోహాన్ని తీవ్రంగా ఖండించాడు; రెండు రకాల "విప్లవకారుల" అన్యమనస్కతను బహిరంగంగా విమర్శించాడు. తనను ఒక ప్రాముఖ్యత లేని చిన్న మైనారిటీ మాత్రమే బలపరుస్తోందని లెనిన్‌కు తెలుసు. కానీ ఆయనకు సంబంధించినంత వరకూ ఇది నిర్ణయాత్మకమైన ఘడియ. ఎందుకంటే భవిష్యత్తు కలిగిన ఏకైక విధానం స్థిరమైన అంతర్జాతీయతావాద విధానం మాత్రమేననీ, సూత్రబద్ధమైన విధానమే సరైన ఏకైక విధానమనీ ఆయనకు తెలుసు.

నూతన ఇంటర్నేషనల్‌కై జరిగిన ఈ పోరాటంలో కూడా లెనిన్ విజేతగా నిలిచాడని మనకు తెలుసు.

"సూత్రంపై ఆధారపడిన విధానమే సరైన విధానం" - ఈ ఫార్ములాను ఉపయోగించే ఆయన "ఛేదించజాలని" వైఖరులన్నిటిపై దాడిని ఎక్కుపెట్టి కార్మికవర్గంలోని అత్యుత్తమ శక్తుల్ని మార్క్సిజం వైపుకు గెలుచుకొచ్చాడు.

***

# బోల్షివీకరణను సాధించడానికి కొన్ని మౌలిక షరతులు

– స్టాలిన్

బోల్షివీకరణను సాధించాలంటే కనీసం కొన్ని మౌలిక షరతులను పరిపూర్తి చేయాలి. ఇవి లేకుండా కమ్యూనిస్టు పార్టీల బోల్షివీకరణ సాధ్యం కాదు.

**1.** పార్టీ తనను తాను పార్లమెంటరీ ఎన్నికల యంత్రాంగానికి ఉపాంగంగా భావించుకోరాదు. నిజానికి సోషల్ డెమాక్రటిక్ పార్టీ అలా భావిస్తుంది. పార్టీ తనను తాను ట్రేడ్ యూనియన్లకు పనికిమాలిన ఒక అనుబంధంగా భావించుకోరాదు. కొన్ని అరాచకవాద శక్తులు కొన్నిసార్లు తాము అలాంటివారమని చెప్పుకుంటాయి. పార్టీ తనను తాను కార్మికవర్గ అత్యున్నత వర్గసంస్థగా భావించుకోవాలి. దాని కర్తవ్యం ఇతర అన్ని రూపాల కార్మికవర్గ సంస్థలనూ, అంటే ట్రేడ్ యూనియన్ల నుండి మొదలుకొని పార్లమెంటులోని పార్టీ బృందం వరకూ అన్నిటికీ నాయకత్వం వహించడం.

**2.** పార్టీ, ముఖ్యంగా దాని నాయకత్వ శక్తులు విప్లవాచరణతో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్న మార్క్సిజం విప్లవ సిద్ధాంతంపై కూలంకషమైన పట్టు సంపాదించాలి.

**3.** తయారుగా ఉన్న ఫార్ములాల మీదా, చారిత్రకంగా ఉన్న పోలికల మీదా ఆధారపడి పార్టీ తన నినాదాలనూ, ఆదేశాలనూ రూపొందించకూడదు. విప్లవోద్యమ నిర్దిష్ట అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితుల మీద నిశితంగా చేసిన విశ్లేషణల ఫలితంగా అవి రూపొందాలి. అలాగే అది తప్పనిసరిగా అన్ని దేశాల విప్లవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలి.

**4.** పార్టీ ఈ నినాదాలు, ఆదేశాలు ఎంత సరైనవనేదాన్ని విప్లవ ప్రజానీకం చేసే పోరాటాల కొలిమిలోనే నిగ్గుదేల్చాలి.

**5.** పార్టీ మొత్తం పని అంతటినీ, ప్రత్యేకించి దానిలో ఇప్పటికీ సోషల్ డెమాక్రటిక్ సంప్రదాయాలు నిర్మూలన కాకుండా యింకా మిగిలి ఉన్నప్పుడు, పార్టీ వేసే ప్రతి అడుగూ, తీసుకునే ప్రతి చర్యా విశాల కార్మిక ప్రజారాశులను విప్లవస్ఫూర్తితో విప్లవీకరించడానికీ, వారికి శిక్షణ గరపడానికీ, వారిని విద్యావంతం చేయడానికీ సహజంగా దోహదపడేలా నూతన విప్లవ పద్ధతుల్లో తిరిగి సంఘటితం చేయాల్సి ఉంటుంది.

**6.** పార్టీ తన పనిలో సూత్రాలకు కచ్చితంగా కట్టుబడి ఉండడాన్ని (దీన్ని సెక్టేరియనిజంతో గందరగోళపరచరాదు!), ప్రజలతో అత్యధిక సంబంధాలనూ, బంధాలనూ కలిగి ఉండడంతో (తోక పట్టుకొని పోయే ధోరణితో దీన్ని గందరగోళపరచరాదు) జోడించాలి ఇలా చేయకపోతే పార్టీ ప్రజలకు ఏమీ నేర్పలేకపోవడమే కాదు వారి నుండి ఏమీ నేర్చుకోలేదు కూడా, అది

ప్రజలకు నాయకత్వం వహించి వారిని తన స్థాయికి ఎదిగించలేకపోవడమే కాక, వారి అభిప్రాయాలను పట్టించుకుని వారి తక్షణ అవసరాలను ముందే అంచనా కట్టలేకపోతుంది కూడా.

**7.** పార్టీ తన పనిలో రాజీలేని విప్లవస్ఫూర్తిని (దీన్ని విప్లవ దుందుడుకువాదంతో గందరగోళపరచరాదు!) అత్యధికమైన పట్టువిడుపులతో, విన్యాసాలు చేయగల సామర్థ్యంతో (దీన్ని అవకాశవాదంతో గందరగోళపరచరాదు!) జోడించాలి. ఇలా చేయకపోతే పార్టీ అన్ని రకాల పోరాట, నిర్మాణ రూపాలపై పట్టు సాధించలేకపోతుంది, కార్మికవర్గ రోజువారీ సమస్యలను కార్మికవర్గ విప్లవ మౌలిక ప్రయోజనాలతో జోడించలేకపోతుంది, అలాగే తన పనిలో చట్టబద్ధ, చట్టవ్యతిరేక పోరాటాలను జోడించలేకపోతుంది.

**8.** పార్టీ తన తప్పులను కప్పిపుచ్చుకోకూడదు, అది విమర్శలకు వెరవకూడదు. అది తన తప్పుల నుండి నేర్చుకోవడం ద్వారా తన కార్యకర్తలను మెరుగుపరిచి వారిని విద్యావంతం చేయాలి.

**9.** పార్టీ తన ముఖ్యమైన నాయకత్వ బృందంలోకి పురోగామి యోధుల నుండి అత్యున్నత శక్తులను భర్తీ చేసుకోగలగాలి. వారు విప్లవ కార్మికవర్గ ఆకాంక్షలకు అసలైన ప్రతినిధులుగా ఉండేలా ఆశయం పట్ల తగినంత అంకితభావం కలిగినవారై ఉండాలి. కార్మికవర్గ విప్లవానికి నిజమైన నాయకులుగా మారడానికి తగినంత అనుభవం కలిగినవారై ఉండాలి. వారు లెనినిజం వ్యూహం, ఎత్తుగడలను అన్వయించగలిగినవారై ఉండాలి.

**10.** అత్యున్నత సమైక్యతను సాధించే లక్ష్యంతో పార్టీ తన సంస్థల సామాజిక పొందికను ప్రణాళికాబద్ధంగా మెరుగుపర్చుకుంటూ, చెడగొట్టే అవకాశవాద శక్తులను తన నుండి ఏరిపారేయాలి.

**11.** సైద్ధాంతిక (ఐడియలాజికల్) సమైక్యత, ఉద్యమ లక్ష్యం పట్ల స్పష్టత, ఆచరణాత్మక చర్యల్లో సమైక్యత, పార్టీ సభ్యుల విశాలరాశులకు పార్టీ కర్తవ్యాల పట్ల ఉన్న అవగాహనల ప్రాతిపదికన పార్టీ ఉక్కు క్రమశిక్షణను సాధించాలి.

**12.** పార్టీ ప్రణాళికాబద్ధంగా తన నిర్ణయాల, ఆదేశాల అమలు తీరుతెన్నులను తెలుసుకోవాలి ఇది జరగకుంటే ఈ నిర్ణయాలూ, ఆదేశాలూ ఒట్టి వాగ్దానాలుగా మిగిలిపోయే ప్రమాదం వుంది. ఇది పార్టీపై విశాల కార్మికరాశులకున్న విశ్వాసాన్ని వమ్ము చేస్తుంది.

(జర్మన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు హెర్జోగ్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కామ్రేడ్ స్టాలిన్ చెప్పిన అంశాలివి. 'జర్మన్ కమ్యూనిస్టు పార్టీకి గల అవకాశాలూ, బోల్షెవీకరణ సమస్య' అనే పేరిట ఈ ఇంటర్వ్యూ 'ప్రావ్దా' పత్రిక నెంబర్ **27**లో, **1925** ఫిబ్రవరి 3న ప్రచురితమైనది.)

# విప్లవకర భూసంస్కరణలను చేపట్టి నూతన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్న క్రాంతికారీ జనతన సర్కార్లు

**- మైన**

భారతదేశంలోని 75-77 శాతం ప్రజానీకం పేదరికాన్ని, అనారోగ్యాలను, సాంస్కృతిక వెనుకబాటుతనాన్ని, కష్టాలను అనుభవించటానికి కారణం సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల, బడాభూస్వాముల దోపిడీ, పీడనలు కొనసాగడమే. ఈ దోపిడీ వర్గాల పాలన వల్లనే 1947 ఆగస్టు 15 నుండి నేటివరకు గత ఆరున్నర దశాబ్దాలుగా కేంద్రంలో, రాష్ట్రాల్లో కాంగ్రెస్, బి.జె.పి., రివిజనిస్టు పార్టీలు లేదా కూటములు ఏవి అధికారంలోకి వచ్చినా, 'అభివృద్ధి' పేరుతో ఎన్నో పథకాల్ని అమలుచేసినా అవన్నీ వీరి, సామ్రాజ్యవాదుల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు ఉద్దేశించినవే కావడంతో పీడిత ప్రజానీకపు సమస్యలేవీ పరిష్కారం కాలేదు. దీంతో దేశంలో పీడిత ప్రజలు పేదరికం, అనారోగ్యం, అవిద్య తదితర సమస్యలతో పీడించబడుతున్నారు. ఈ సమస్యలన్నింటిలో కీలకం భూమి సమస్యే. అందుకే 'దున్నేవారికే భూమి', 'జల్-జంగల్-జమీన్‌పై ఆదివాసులకు, పీడిత ప్రజలకే హక్కు', 'ఇజ్జత్ ఔర్ అధికార్ చాహియే' అనే నినాదాలతో వ్యవసాయ విప్లవ కార్యక్రమం ఆధారంగా దేశ ప్రజల్ని వర్గపోరాటాల్లో, ప్రజాయుద్ధంలో సమీకరించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటానికి మావోయిస్టు పార్టీ పూనుకుంది.

దండకారణ్య ఉద్యమం 1980లో మొదలైంది. 1980 నుండి మొదలుకొని 1995-96 నడుమ వరకు మన పార్టీ నాయకత్వంలో డి.కె.లోని గడ్‌చిరోలి, బస్తర్ ప్రాంతాల్లో వేలాది ఆదివాసీ పురుషులు, మహిళలు ఫారెస్టు ఆఫీసర్ల దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా, తెగపెద్దల, భూస్వాముల సామాజిక పెత్తనానికి, అణచివేత, వెట్టిచాకిరీలకు వ్యతిరేకంగా, భూస్వామ్య విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజకీయంగా సమీకరించబడుతూ దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘ్(డిఏకెఎంఎస్), క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘ్(కెఏఎంఎస్)లలో సంఘటితమయ్యారు. ఈ సంఘటితశక్తితో గడ్‌చిరోలి, బస్తర్ జిల్లాల్లో వేలాది మంది ప్రజలు కదిలి ఫారెస్టు అధికార్లను శిక్షించడంతో పాటు, భూస్వాముల, తెగపెద్దల సాంప్రదాయ దోపిడీ కట్టుబాట్లకు వ్యతిరేకంగా పోరాడి భూస్వాముల భూములతో పాటు అటవీ భూముల్ని స్వాధీనం చేసుకున్నారు.

శ్రమదోపిడీ రూపమైన 'వెట్టి'కి వ్యతిరేకంగానూ, తెగ భూస్వాముల అన్యాయాలకు వ్యతిరేకంగానూ పార్టీ నాయకత్వంలో ప్రజాసంఘటితరూపమైన 'డి.ఎ.కె.ఎం.ఎస్.'(సంఘం) ప్రజాకోర్టులు నిర్వహించి సమస్యలను పరిష్కరించి ప్రజల ఆదరణను, విశ్వాసాన్ని చూరగొన్నది. అదే సమయంలో పార్టీ సంఘాలకు వర్గపోరాట రాజకీయాలను అర్థం చేయిస్తూ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పోరాటాల్లో వర్గపంథా-ప్రజాపంథాను అమలుచేయించడంతో, 'సంఘం' దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడేదిగా, తమకు అండగా ప్రజల హృదయాల్లో నిలిచిపోవడమే కాకుండా అనతికాలంలోనే అది ఆదివాసీ రైతాంగ ప్రజల అధికార నిర్మాణంగా

కూడా పనిచేసింది.

పై పోరాటాలతో పాటు పార్టీ ఇక్కడి ప్రజల్లో ఉన్న కొన్ని మంచి సాంప్రదాయాల నుండి నేర్చుకుంటూ వాటిని విప్లవీకరిస్తూ సంఘాలకు, ప్రజలకు వర్గపోరాట చైతన్యాన్ని పెంచింది, సంఘటితశక్తిని పెంచింది, వారి సృజనాత్మకతను వెలికి తెచ్చింది. ఉదాహరణ చెప్పాలంటే ఇక్కడి ప్రజలకు విత్తనాలు, దున్నడానికి గొడ్ల సమస్య తీవ్రంగా ఉండేది. దాన్ని ప్రజల్లో చర్చించి, సంఘాల నాయకత్వంలో ఈ క్రింది విధంగా అమలు చేసింది. ఆ తర్వాతి క్రమంలో గ్రామ రాజ్య కమిటీలకు పునాదిగా ఉన్న ప్రజలే దాన్ని నడిపించారు. పార్టీ ఇక్కడకు రాకముందు నుండే ఆదివాసీ సాంప్రదాయంలో ఆదివాసీ భూస్వాములు, ధనిక రైతులు పేద ప్రజలకు అప్పుగా ఇచ్చే పద్ధతి రెండు రకాలుగా ఉండేది. 1. ఒక పేదరైతు ఒక క్వింటాల్ విత్తనాలను భూస్వామి వద్ద అప్పుగా తీసుకుంటే, పంట పండిన తర్వాత అప్పుగా ఇచ్చిన భూస్వామికి రెండు క్వింటాళ్ల ధాన్యం చెల్లించాల్సి ఉండేది. 2. కరువుకాలంలో మాత్రం తినడానికి ఒక క్వింటాల్ ధాన్యం అప్పుగా తీసుకుంటే పంట పండిన తర్వాత కేవలం ఒక క్వింటాలే ఇవ్వడం అనే పద్ధతి ఉండేది (అంటే తినడానికి తీసుకెళ్లాడు కాబట్టి అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదనేది). ఇలాంటి మంచిని ప్రోత్సహిస్తూనే వర్గపంథా-ప్రజాపంథాకు అనుగుణంగా విత్తనాలు అప్పు తెచ్చుకున్న రైతు 100% వడ్డీ కాకుండా 50%, 25%, ఇంకా తక్కువ ఉండేలా ఒక క్యాంపెయిన్ చేపట్టింది.

ఇంటికి ఒక కిలో ధాన్యం (ఇవ్వగలిగిన వాళ్లే) ఇచ్చేలా, అలాగే ప్రజా వ్యతిరేకులు కాని భూస్వాములు, ధనిక రైతులకు రాజకీయంగా అర్థం చేయిస్తూ వాళ్లు 2-3 కిలోల ధాన్యం ఇచ్చేలా చేసి, అలా ప్రతి ఇంటి నుండి గ్రామంలో జమ చేసిన మొత్తం ధాన్యాన్ని ఏ గ్రామంలోవి ఆ గ్రామంలోని ప్రజాసంఘ నాయకత్వంలో 'వంజీ(వడ్లు)' సహకార సంఘాల (విత్తన బ్యాంకులు)ను ఏర్పాటు చేసి ఒక క్వింటాల్‌కు ఒకటిన్నర క్వింటాల్ మళ్లీ సహకార సంఘంలో ధాన్యం జమచేసే పద్ధతిని 1987-88లోనే చేపట్టడం ఆరంభించి అనతికాలంలోనే ఈ నిర్మాణం దాదాపు డి.కె. అంతటికీ విస్తరించింది. ఇది కరువు (అకాల్) కాలంలో ప్రజలకు అండగా నిలిచింది. అలాగే 50 గొడ్లు ఉన్న ప్రతి ధనిక రైతు సంఘానికి ఒక గొడ్డుని ఇవ్వాలి. అలా జమచేసిన గొడ్లను సంఘం పేద ప్రజలకు దున్నుకునేందుకు ఇచ్చే పద్ధతిని సంఘాలు చేపట్టాయి. దీనితో దున్నుకోవడానికి గొడ్లను, విత్తనాల అప్పును తెచ్చుకునే పేద, మధ్యతరగతి రైతులు భూస్వాములకు, ధనిక రైతులకు వెట్టి పనులు చేయడం నుండి విముక్తి కావడానికి ప్రాతిపదిక ఏర్పడింది. వాటిని ప్రజలు తమకు తామే బాధ్యతగా నిర్వహిస్తూ తీవ్ర నిర్బంధంలో సైతం తమ చేతిలో ఉన్న ధాన్యం, గొడ్లను కాపాడుకున్నారు. ఆ తర్వాతి కాలంలో ఈ వంజీ సహకార సంఘాలు గ్రామ రాజ్య కమిటీల (జి.ఆర్.సి.ల)లోని వ్యవసాయాభివృద్ధి శాఖా కమిటీ కింద పనిచేస్తూ విత్తనాలు, ఇతర అవసరాలైన పెళ్లి, పండుగల ఖర్చులకు పేద వర్గాల ప్రజలకు అండగా నిలిచాయి.

1995-96 తర్వాత వర్గపోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ గ్రామాల్లో తెగపెద్దల, పెత్తందార్ల, భూస్వాముల, దోపిడీ ప్రభుత్వ అధికారాన్ని ధ్వంసం చేసి దాని స్థానంలో ప్రజారాజ్యాధికార అంగాలైన జి.ఆర్.సి.లను, 2001 నుండి క్రాంతికారీ జనతన సర్కార్లను (ఆర్.పి.సి.లు) పార్టీ నాయకత్వంలో ప్రజలు ఏర్పరచుకున్నారు. గ్రామం నుండి పంచాయతీ (ఇది ప్రభుత్వ 'గ్రామ పంచాయతీ' పరిధి కాదు) పరిధి (3-5 గ్రామాలు)లో అంటే 500-

5000 జనాభా పరిధిలో ఈ జనతన సర్కార్లు ఏర్పడ్డాయి. జనతన సర్కార్లను గ్రామసభల్లో ప్రజలు ఎన్నుకుంటారు. ఏరియా, డివిజనల్ జనతన సర్కార్లను ఆయాస్థాయి ప్రతినిధి సభలు ఎన్నుకుంటాయి. దండకారణ్యంలోని చాలా ప్రాంతాల్లో పంచాయతీ, ఏరియా, జనతన సర్కార్లు, రెండు డివిజన్ స్థాయి జనతన సర్కార్లు ఏర్పడి అన్ని రంగాల్లోనూ గణనీయమైన మార్పును సాధించాయి.

భారతదేశంలో పీడిత ప్రజల ప్రధాన సమస్య అంటే భూమి సమస్యయే. పీడిత ప్రజలకు భూమి దక్కనంతవరకు వారి జీవితాల్లో మౌలికమైన మార్పు, అభివృద్ధి రాదు. డికెలో భూమి తెగపెద్దల చేతుల్లో, ఆదివాసీ, గైరాదివాసీ భూస్వాముల, వ్యాపారుల చేతుల్లో, దోపిడీవర్గాల ప్రభుత్వాల చేతుల్లో ఉండేది. తెగపెద్దల నుండి, భూస్వాముల నుండి, బడా వ్యాపారుల నుండి, దోపిడీవర్గ ప్రభుత్వం నుండి ఆదివాసీ, గైరాదివాసీ పీడిత ప్రజలు భూముల్ని లాక్కొనకుండా ఇక్కడి పేదరికాన్ని రూపుమాపలేం, ప్రజల జీవితాల్ని అభివృద్ధి చేయలేం. అందుకే భా.క.పా.(మావోయిస్టు) దండకారణ్యంలోకి ప్రవేశించిన తొలిరోజుల నుండే దున్నేవారికే భూమి, జల్, జంగల్, జమీన్‌పై ఆదివాసులకు, పీడిత ప్రజలకే అధికారం అనే నినాదాలతో వారిని వర్గపోరాటాల్లో సమీకరించింది. ఆదిలాబాద్, గడ్‌చిరోలి, బస్తర్, కోరాపుట్, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలతో పాటు, ఖమ్మం జిల్లాలోని కొంత ప్రాంతంతో కూడుకొని ఉన్న డికెలో 1995 నాటికే లక్షలాది ఎకరాల అటవీ భూముల్ని, భూస్వాముల, ప్రజావ్యతిరేక తెగపెద్దల చేతుల్లో నుండి వేలాది ఎకరాల భూముల్ని పార్టీ నాయకత్వంలో ప్రజలు ఆక్రమించుకున్నారు.* గ్రామరాజ్య కమిటీలు ఏర్పడిన 1996 నుండి మొదలుకొని 2014 వరకు [2001 నుండి విప్లవ ప్రజాకమిటీలుగా మారిన విప్లవ ప్రజాప్రభుత్వాల (జనతన సర్కార్ల) నాయకత్వంలో] ఈ 18 సంవత్సరాల కాలంలో కూడా గడ్‌చిరోలి, అవిభక్త బస్తర్ ప్రాంతంలో వేలాది ఎకరాల అటవీ భూములను, వందలాది ఎకరాల భూస్వాముల, ప్రజావ్యతిరేక పెద్దల, బడా కాంట్రాక్టర్ల, బడా వ్యాపారుల భూముల్ని ప్రజలు ఆక్రమించుకుంటూనే ఉన్నారు. విప్లవ భూసంస్కరణలో దోపిడీవర్గాల, దోపిడీ ప్రభుత్వాల చేతుల్లోని భూముల్ని పీడిత ప్రజలు ఆక్రమించడం తొలివిడుతయితే, ప్రజారాజ్యాధికారాన్ని ఉపయోగించుకొని ఆ భూముల్లో ఉత్పాదతకతను పెంచడం రెండో అడుగు. జనతన సర్కార్లు ఈ ఆదివాసీ ప్రాంతంలో ప్రజాయుద్ధం ద్వారా స్థానిక ప్రజా వ్యతిరేకుల, దోపిడీవర్గాల అధికారాన్ని, అర్ధవలస, అర్ధభూస్వామ్య ఆర్థికాన్ని ధ్వంసం చేసి నూతన ప్రజాస్వామిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థను నిర్మిస్తున్నాయి. నూతన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో భాగంగా ప్రజలు ఆక్రమించుకున్న భూముల్ని

---

* 1995లో ఆదిలాబాద్ జిల్లా, ఖమ్మం జిల్లాలోని ఈ ప్రాంతాలు ఉత్తర తెలంగాణా స్పెషల్‌జోన్‌లో భాగంగా, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలు ముందు ఈస్ట్ రీజియన్‌లో భాగంగా ఉండి, 2001 చివరి నుండి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు స్పెషల్‌జోన్‌లో భాగంగా మార్చబడినాయి. నేడు దండకారణ్య స్పెషల్ జోన్ ప్రాంతం అంటే ఆనాటి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని (నేటి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని) అవిభాజిత బస్తర్ నేడు 7 జిల్లాలుగా మారిపోయింది. వాటితో పాటు, మహారాష్ట్ర లోని గడ్‌చిరోలి, గోందియా జిల్లాలు, ఛత్తీస్‌గఢ్‌లోని రాజనంద్‌గాం, కాంకేర్, బాలోద్ జిల్లాల సరిహద్దుతో కూడిన డివిజన్‌లు.

సమతలం చేసి, వాటికి నీటిపారుదల సౌకర్యం కల్పిస్తున్నాయి. మరోవైపు పండ్ల తోటల పెంపకం, చేపల చెరువుల నిర్మాణం, విత్తన, పరపతి సహకార సంఘాల్ని ఏర్పాటు చేస్తున్నాయి. అందులో భాగంగా 2011 నుండి డికెవ్యాప్తంగా భూమి సమతలీకరణ అభియాన్లు ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి నెలల్లో కొనసాగుతున్నాయి. వీటి ద్వారా ప్రజల్లో పెరిగే మిగులు ఆధారంగా ధాన్యం మిల్లుల్ని, నూనె మిల్లుల్ని ఏర్పాటు చేయడం, అటవీ ఉత్పత్తుల వ్యాపారం నిర్వహించడం తదితర రూపాల్లో అత్యంత ప్రాథమిక స్థాయిలో వ్యాపార, పరిశ్రమల ఏర్పాటు కోసం కృషి మొదలయ్యింది. ప్రాథమిక స్థాయిలో నిర్మాణమవుతున్న ఈ నూతన ప్రజాస్వామిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థ అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థకు, సామ్రాజ్యవాద నిర్దేశిత ప్రపంచీకరణ విధానాలకు ప్రత్యామ్నాయ వ్యవస్థగా దేశ ప్రజల ముందు నిలుస్తూ ఉంది.

ఏ అభివృద్ధి అయినా అక్కడి ప్రజలు దోపిడీదారుల నుండి విముక్తి సాధించేందుకు పోరాడుతూనే తాము తమ స్వీయకృషితో బతుకుతున్నామన్న, తమ భవిష్యత్తును తామే నిర్మించుకోగలుగుతామన్న నమ్మకం కలిగించి, అన్ని రంగాల్లో వారి సామర్థ్యం పెరిగేందుకు, వనరులను వినియోగించుకునేందుకు, సృజనాత్మకత వెలికి తీసేందుకు, మెట్లుమెట్లుగా ఉత్పాదకశక్తిని పెంచేందుకు తోడ్పడాలి. వారి జీవితాలపై వారికే సాధికారత ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. ఇందుకు నూతన ప్రజాస్వామిక విప్లవ విజయ సాధనకు విముక్తి ప్రాంతాల నిర్మాణ లక్ష్యంతో డి.కె.లో పార్టీ నాయకత్వాన ఆదివాసీ రైతాంగం అనన్య త్యాగాలతో సామ్రాజ్యవాదులకూ, భారత పాలకవర్గాలకూ వ్యతిరేకంగా ప్రజాయుద్ధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డికె ప్రజల్లో వచ్చిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పుల్ని ఒకటొకటిగా చూద్దాం.

**ఆర్థిక కార్యక్రమం :**

1. దున్నేవారికే భూమి ప్రాతిపదికన డికెలోని జనతన సర్కార్లు భూమిలేని వారికి, పేద రైతులకు ప్రాధాన్యతనిచ్చి ప్రతి కుటుంబానికి భూమి పంచడం, భూమితో పాటు విత్తనాలు, శ్రమ సహకార టీంలలో రైతులు ఒకరికొకరు ప్రతి పనిలో సహకరించుకునేలా చేయడంతో వారు పండించే పంటల ఉత్పత్తి పెరిగి, వారి జీవన ప్రమాణాల్లో గతంకన్నా మెరుగుదల రావడంతో పాటు ప్రజల్లో సహకార, సమిష్టి, సమైక్యతా భావన ఇతోధికంగా పెరిగింది.
2. వందలు, వేలల్లో జనం కదిలి తమ స్వచ్ఛంద శ్రమతో సమిష్టిగా ఈ కింది పనులు పూర్తి చేశారు. నీటి చెరువులు - 4762; కుంటలు-6381; చేపల పెంపకం చెరువులు-397; నీటి కాల్వలు-22; చెరువుల మరమ్మతు-1737; తాగునీటి సమస్య ఉన్న దగర నిర్మించిన సిమెంట్ బావులు - 130; రింగ్ బావులు-20 నిర్మించుకున్నారు. రిపేరింగ్‌లు చేసుకున్నారు.
3. 2011 నుండి మొదలైన భూమి సమతలీకరణ (భూమి చదును) క్యాంపెయిన్‌లో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని గడచిన 3 సంవత్సరాల్లో 13667 కుటుంబాలకు చెందిన 14357 ఎకరాల భూమిని (ప్రధానంగా పేదరైతుల భూమి) చదును చేసి దానిలో ఒక పంట పండేలా గ్యారంటీని కల్పించారు. ఇలా చదును చేసిన భూముల్లో పి.ఎల్.జి.ఎ.లో ఉన్నవారి కుటుంబాల, అమరవీరుల కుటుంబాల, జైల్లో

ఉన్న వారి కుటుంబాల భూములు కూడా ఉన్నాయి. రెండవ పంట పండేలా అభివృద్ధి చేసిన భూములు కొన్ని గ్రామాల్లో పదుల కుటుంబాలకు ఉన్నాయి. అలాగే ప్రతి కుటుంబం 1-2 డోలీలు నాట్లు వేసుకునే పద్ధతిని అమలుచేయడంతో ప్రజల ఆర్థిక జీవన స్థాయి కొంత పెరిగింది.

4. ప్రతి పంచాయతీలో మామిడి, జామ, సీతాఫలం, నిమ్మ, దానిమ్మ, పనస, అరటి వంటి వందలాది మొక్కలను వేసి పండ్ల తోటలను పెంచేందుకై జనతన సర్కార్లు ప్రోత్సహిస్తున్నాయి.
5. 2006 నుండి కూరగాయ తోటల పెంపకం, చెరువుల్లో చేపల పెంపకాలను తప్పనిసరిగా గ్రామ ప్రజలంతా సమిష్టిగా, వ్యక్తిగతంగా కూడా చేపట్టేలా జనతన సర్కార్లు కార్యక్రమం తీసుకొని మెజార్టీగా అమలు జరుపుతున్నాయి, మరికొన్ని చోట్ల ప్రోత్సహిస్తున్నాయి.
6. జనతన సర్కార్లు దున్ను కోవడానికి గొడ్లు లేని రైతులను సహకార టీముల్లో కలిపి వారికి పనులు చేసివ్వడం, వీలున్నప్పుడు కొందరికి గొడ్లు ఇవ్వడం చేస్తున్నాయి. సేంద్రీయ ఎరువుతో పంటలు పండించేలా ప్రోత్సహిస్తూ, బయటి సంకర రకపు విత్తనాల బారిన పడకుండా స్థానిక విత్తనాలతో తమ కాళ్లపై తాము ఆధారపడి పంట దిగుబడులు పెంచేందుకై జనతన సర్కార్లు "కృషి(వ్యవసాయ) వర్క్‌షాప్"లు నిర్వహిస్తూ చర్చల ద్వారా అవగాహన పెంచుతున్నాయి. దీంతోపాటు మేకల పెంపకం, పందుల పెంపకం, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

**రాజకీయ కార్యక్రమం :**

1. తెగ పెత్తందార్లను, ఒడ్డె (పూజార్లు)ల పెత్తనాన్ని అరికట్టడం
2. దోపిడీ వర్గ ప్రభుత్వ యంత్రాంగాన్ని ధ్వంసం చేయడం
3. మహిళలకు పురుషులతో సమాన హక్కులు కల్పించడం
4. పంచాయతీ (గ్రామ), ఏరియా, డివిజన్ స్థాయిలో ప్రజలు గ్రామ సభల్లోనూ, కౌన్సిల్ (ప్రతినిధుల సభ)లోను, పీడితప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రభుత్వాలను తామే నడుపుకోవడం; వీటిలో మహిళల క్రియాశీల పాత్రనీ, భాగస్వామ్యాన్నీ పెంపొందించడానికి కృషి చేయడం; నూతన రాజకీయాధికారం నెరపేలా రైతాంగాన్ని, ప్రత్యేకంగా పేద రైతాంగాన్ని విస్తృతంగా రాజకీయరంగంలోకి తీసుకురావడానికి, వారి పాత్ర పెంపొందించడానికి కృషి చేయడం
5. ప్రజాయుద్ధంలోకి ప్రజలను రాజకీయంగా మరింత విస్తృతంగా, క్రియాశీలంగా సమీకరిస్తూ, రాజకీయాధికారాన్ని విస్తరించడం

**సాంస్కృతిక కార్యక్రమం :**

1. పిల్లలకు 'విద్య-విజ్ఞానం' అనే లక్ష్యంతో పంచాయతీ స్థాయిలో పాఠశాలలు, ఏరియా, డివిజన్లలో ఆశ్రమ పాఠశాలలను నడిపించి వేలాది పిల్లలకు విద్యను నేర్పించడం.
2. దండకారణ్య ఆదివాసీ ప్రజల సంస్కృతిలోని మంచిని ప్రోత్సహిస్తూ, చెడుకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజాసంస్కృతిని విప్లవీకరిస్తూ నూతన ప్రజాస్వామిక

సంస్కృతిని నెలకొల్పడం.

3. తెగ సాంప్రదాయంలో ఉన్న బలవంతపు పెళ్లిళ్లను అరికట్టడం, ప్రేమ పెళ్లిళ్లతో పాటు దొర్ల (రాజగోండు), కోయతెగలు పెళ్లిళ్లు చేసుకోవడానికి ప్రోత్సహించడం.
4. నరబలులకు వ్యతిరేకంగా ప్రచారం, ప్రజాపంచాయతీలల్లో చర్చించి, ప్రజాపంథా కనుగుణంగా జనతన సర్కారు న్యాయశాఖ పంచాయతీలు నిర్వహించడం, ఫ్యూడల్ మరియు సామ్రాజ్యవాద లంపెన్ సంస్కృతి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ భావాలతో చైతన్యం పెంచుతూ ప్రచారం చేయడం, నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నిలబెట్టేందుకు, విస్తరింపజేసేందుకు కృషి చేయడం.
5. మహిళల అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ వారికి ప్రజాడాక్టర్లతో క్లాసులు నిర్వహించడం, చర్చల రూపంలో ఎడ్యుకేట్ చేస్తూ, మందుల్ని వాడడం, పరిశుభ్రతను పాటించడం, మాతాశిశు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు గ్రామం/పంచాయతీ వరకు తీసుకెళ్లడం.
6. వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజారోగ్య-సంక్షేమాన్ని తాత్కాలిక క్యాంపుల ద్వారా, మొబైల్ హాస్పిటల్స్ నడిపించడం, జడీబూటీ మందులను ప్రోత్సహిస్తూవీటి ద్వారానూ, అల్లోపతి మందులతోనూ వైద్యసేవలు అమలుచేసి ప్రజలకు వైద్యం అందించడం.

ఇలా ప్రాథమిక స్థాయిలోనే అయినప్పటికీ డికె విప్లవ ప్రజా ప్రభుత్వం నూతన ప్రజాస్వామిక అభివృద్ధిపంథాలో పురోగమిస్తున్నది. దీనిని సహించలేని దోపిడీ పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు జనతన సర్కార్లను ధ్వంసం చేసేందుకు, విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు 2005-07లో సల్వాజుడుం ఫాసిస్టు దాడులు చేశారు; 2009 మధ్య నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సామూహిక హత్యాకాండ, అత్యాచారాలు, 'సర్వం విధ్వంసం' దాడులు కొనసాగిస్తున్నారు. మోడీ నాయకత్వంలోని హిందూ ఫాసిస్టు ప్రభుత్వం అధికారానికి వచ్చినప్పటి నుండి ఈ దాడిని మున్నెన్నటి కన్నా తీవ్రం, విస్తృతం చేసి కొనసాగిస్తున్నారు.

దేశ ప్రకృతి సంపదలను, విశాల ప్రజల వికాసానికి వినియోగించగలిగేదీ, భావి తరాలకు భద్రంగా అందించేది క్రాంతికారీ జనతన సర్కారే. దానిని అణచివేసేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలను రూపొందిస్తున్నాయి. అయినా జనతన సర్కార్లు, ప్రజలు దేశ ప్రజలతో, పోరాట సంఘాలతో భుజం భుజం కలిపి పోరాడే తమ పోరాట సాంప్రదాయాన్ని కొనసాగిస్తూనే జల్-జంగల్-జమీన్‌పై తమకే అధికారం ఉండాలని పోరాడుతున్నారు.

పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ. దన్నుతో జనతన సర్కార్లు ఒక పక్క విప్లవ ప్రతీఘాతుక ప్రభుత్వాలు సాగిస్తోన్న ఈ అన్యాయ యుద్ధాన్ని ఎదిరిస్తూనే, అవి చేపడుతున్న బూటకపు సంస్కరణల, సివిక్ యాక్షన్ ప్రోగ్రాంల నిజస్వరూపాన్ని ప్రజలలో రాజకీయంగా బహిర్గతపరుస్తూనే, మరో పక్క ప్రజలకు రక్షణకల్పిస్తూ, ఉత్పత్తిని పెంపొందిస్తూ, విద్యా, వైద్య, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజాయుద్ధమే, పేద ప్రజల అభివృద్ధియే సామాజిక పరివర్తనకు నిజమైన అభివృద్ధి మార్గం అనేది నేటి నిర్దిష్ట పరిస్థితిలో ప్రాథమిక స్థాయిలో ఆచరణలో అమలుచేసి చూపిస్తున్నారు దండకారణ్య ప్రజలు. *

ప్రజలు, ప్రజలు మాత్రమే ప్రపంచ చరిత్రకు చోదకశక్తులు కాగలరు, - మావో (మిశ్రమ ప్రభుత్వం, మావో రచనలు 3వ సంపుటి)

# యువజనుల కోపావేశాన్ని మహత్తర విప్లవ తరంగంగా మారుద్దాం !

*[సి.పి.ఐ.(మావోయిస్టు) 10వ వార్షికోత్సవాల సందర్భంగా దేశంలోని యువశక్తి, వారి ఎంప్లాయ్‌మెంట్‌ల పరిస్థితి మీద కొన్ని సమాలోచనలు]*

**- దీపక్**

ప్రపంచంలో 'పెద్ద'దైన భారత ప్రజాస్వామ్యాన్ని గురించి పార్లమెంటరీ నాయకులు మరియు మీడియా అలుపూ సొలుపూ లేకుండా పొగుడుతున్నారు. కానీ మన దేశం ఈ ప్రజాస్వామ్య నాటకపు చివరి అంకంలో ఉంది. ఏదేమైనప్పటికీ విశ్లేషకులకు ఇండియా వర్సెస్ భారత్ అనే అంశం చర్చనీయాంశమైంది. దరిద్రులతో కూడినది భారత్‌గానూ, ధనవంతులతో కూడినది ఇండియాగానూ అభివర్ణించుచున్నారు. ప్రపంచంలోని దేశాల్లో మన దేశంలోనే యువజనులెక్కువగా ఉన్నారని అంటున్నారు. కానీ ఇండియాలోని యువజనుల భవిష్యత్తు వారి ఆశలకు, సామర్థ్యానికి అనుగుణంగా లేదు. సామర్థ్యం మీద ఆధారపడి లేదు. దేశ ప్రజల గురించి పట్టించుకోని పాలకుల చేతిలో వీరి భవితవ్యం ఉండటమే దీనికి కారణం. వారు భారత ప్రజాస్వామ్యాన్ని గుత్తస్వామ్యంగా మార్చారు. ప్రజాస్వామ్యమూ, గుత్తస్వామ్యమూ ఒకదానికొకటి చుక్కెదురు. అయినప్పటికీ వర్గవిభజితమైన సమాజంలో ప్రజాస్వామ్యాన్ని చూసుకోవటం ఒక పెద్ద భ్రమ. ప్రజాస్వామ్యం అని దేన్ని పిలుస్తున్నామో అది వాస్తవంగా బూర్జువా ప్రజాస్వామ్యమే. భారతదేశంలో బూర్జువా ప్రజాస్వామ్యం భూస్వామ్య మరియు దళారీ నిరంకుశ బూర్జువా ప్రజాస్వామ్యంగా ఉండి 'ట్రికిల్ డౌన్' (సంపద దళారీ నిరంకుశ బూర్జువాల నుండి మెట్టుమెట్టుగా పేదలకు చేరుతుందనే మన్‌మోహన్ సింగ్ సిద్ధాంతం. వాస్తవంగా పేదలకు సంపదేమీ రాదు.) సిద్ధాంతంతో పనిచేస్తున్నది. 'నెహ్రూ సోషలిజం'తో మొదలై, ఇందిరా ఎమర్జెన్సీలో వికృత రూపం తీసుకొని రాజీవ్, మన్‌మోహన్ల చేతుల్లో టెర్రరిస్టుగా మారి ఇప్పుడు 'మోడీ'గారి హయాంలో ఫాసిస్టు రూపం తీసుకున్నది. యు.పి.ఏ.-2 ప్రభుత్వం తయారుచేసిన బిల్లును ఒక లోక్‌సభ సభ్యుడు చించి చెత్తకుండీలో వేస్తే మిగతా పార్లమెంటు సభ్యులంతా దానిని ఆమోదించారు. కాకపోతే, కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని కార్యదర్శులనూ, మొనగాడు మోడీ తన దర్బారులో పెరేడ్ కూడా చేయించగలడు. ఈ రెండువిషయాలు ఒకటే. ప్రజాస్వామ్యం గురించి ఫిడేలు వాయించే వారికే దానిని పొందటం గగన కుసుమం అయిపోతే ఇక సామాన్యుల విషయం చెప్పనవసరం లేదు. యోగ్యమైన, అర్థవంతమైన భవిష్యత్తు గురించి కలలు కనే యువతరానికి ఇది ఏమివ్వగలదు? తమ భవిష్యత్తు గురించి బంగారు కలలు కనే యువతరం నేటి (నేతిబీర) 'ప్రజాస్వామ్య' వ్యవస్థకు, వారి భవిష్యత్తుకు గల సంబంధాన్ని తెలుసుకోవాలి.

## జనసామాన్యం వర్సెస్ ప్రజాస్వామ్యం

మంచి జనసామాన్యాన్ని కూడా ఒక చెడ్డ ప్రజాస్వామ్యం నాశనం చేయగలదు. భారత ప్రజాస్వామ్యం తన ప్రజల పట్ల అటువంటి పథకాన్నే అమలు జరుపుతున్నది. 2011

జనాభా లెక్కల ప్రకారం 121 కోట్ల దేశ జనాభాలో 24 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు వారు 48.6% లేదా సుమారుగా సగం మంది ఉన్నట్లు అంచనా. 15 నుండి 24 సంవత్సరాల వయస్సు వారు 23 కోట్ల 20 లక్షల మంది ఉన్నారు. మొత్తం జనాభాలో పనిచేయగలిగిన లేదా 15 నుండి 69 సంవత్సరాల వయస్సు కలిగినవారు 62.5% మంది ఉన్నారు. ఈ విధమైన జనాభాను కలిగి ఉండటం గర్వకారణం. ఈ శ్రమశక్తిని సక్రమంగా వినియోగించుకోగలిగితే దేశ ముఖచిత్రాన్ని మార్చవచ్చు. కాని దేశంలోని వ్యవస్థ పెద్ద స్థాయిలో ఉద్యోగాలను కల్పించగలిగే దైతేనే ఇది సాధ్యపడుతుంది. ఒక అంచనా ప్రకారం గత దశాబ్ది జి.డి.పి. వేగంగా పెరిగిన కాలంలో సంవత్సరానికి 12 మిలియన్ల ఉద్యోగాలిచ్చినట్లు ఒక అంచనా చెబుతుంది. ఇటీవల అది 2 మిలియన్లకు పడిపోయింది. ఇప్పుడున్న శ్రమశక్తికంతటికీ ఉద్యోగాలు కల్పించాలంటే ఏటా 5 కోట్ల చొప్పున రాబోయే 9 సంవత్సరాలలో 50 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించాల్సి ఉంటుంది. కాని భారత ప్రభుత్వం ఇన్ని చేతులకు పని గల్పించటానికి సిద్ధంగా ఉందా? కొమ్ములు తిరిగిన ఆర్థికవేత్తల నుండి సామాన్య మానవుని వరకూ అందరూ దీనికి కాదని సమాధానమే ఇస్తారు.

50 కోట్ల యువజనులకు విద్య మరియు నైపుణ్య అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం చెప్పుకుంటోంది. అందువల్ల 'స్కిల్ డెవలప్‌మెంట్' పథకాలను ప్రవేశ పెట్టింది. 53 కోట్ల యువజనులకు 2022 నాటికి ఈ స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వాలని పాలకవర్గాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. 23 రాష్ట్ర ప్రభుత్వాలు 38 కోట్ల యువజనులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణనిస్తాయనీ, మిగిలిన 15 కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో శిక్షణనిస్తుందనీ చెబుతున్నారు. జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌నూ మరియు స్వయం ప్రతిపత్తి గల జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీని ఏర్పరిచారు. ఈ రెండు సంస్థల మధ్య సమన్వయం కోసం ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్ష హోదాలో జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ బోర్డును ఏర్పరిచారు. వీటి ద్వారా 1.35 మిలియన్ల యువజనులకు గత మూడేళ్లలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చామని చెప్పారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 8.7 మిలియన్ల యువజనులకు శిక్షణ నిచ్చారు. వారి మాటల్లోనే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నత్తనడక నడుస్తోంది. ప్రతి సంవత్సరం శ్రామిక జనాభాకు 13 మిలియన్ల మంది అదనంగా చేరుతుండగా కేవలం 3.1 మిలియన్ మందికి లేదా 20 శాతం మందికి శిక్షణనివ్వగలిగే సామర్థ్యం మాత్రమే ఉందని ప్రభుత్వం చెబుతోంది. అనగా నాలుగింట మూడు వంతుల మంది పనిచేయగలిగిన వారికి స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ లేకుండానే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఏమేరకు ప్రయత్నించినప్పటికీ రాబోయే పదేళ్లలో అర్హత కలిగిన యువజనులందరికీ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వగలిగే వ్యవస్థను ఏర్పరిచే స్థితి కనిపించటం లేదు. 11వ పంచవర్ష ప్రణాళిక డాక్యుమెంట్లు కూడా 80 శాతం మంది యువజనులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో స్థానం లేదని చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం మరింత మంది యువశక్తి శ్రమశక్తిలో చేరుతుండగా ప్రతి సంవత్సరం తీవ్రతరమవుతున్న నిరుద్యోగ సమస్యను ఏ విధంగానైనా పరిష్కరించగలిగే ఉపాయం ప్రభుత్వం వద్ద లేదని స్పష్టమవుతోంది.

ఇంత అకస్మాత్తుగా స్కిల్ డెవలప్‌మెంట్ గురించి ఈ పెడబొబ్బలేమిటి? నిజంగా పాలకవర్గాలు యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ అందించి వారికి ఉద్యోగితను కల్పించి దేశ ఆర్థిక వ్యవస్థ లోకి యువత నైపుణ్యాన్ని తీసుకొని ఉపయోగించుకోవటానికేనా? దీనికి సమాధానం లేదని, కాదని బిగ్గరగా చెప్పవచ్చు. సామ్రాజ్యవాద ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభంలో భాగంగా ఆ దేశాలలోని ఉత్పాదక యూనిట్లనూ, కొంత పెట్టుబడినీ ఇండియా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరలించి ఇక్కడి చౌక శ్రమనూ, ముడి పదార్థాలనూ, భూమి, నీరు లాంటి ప్రకృతి వనరులను ఉపయోగించుకొని అధిక లాభాలను సంపాదించాలనే గ్లోబలీకరణ పాలసీలో భాగంగా, మన దేశ పాలకవర్గాలు సామ్రాజ్యవాద సంస్థలకు అతిచౌకగా ప్రకృతి వనరులను అప్పజెప్పి మౌలిక వనరులను, రవాణా, విద్యుత్తు లాంటి సౌకర్యాలను కూడా కారుచౌకగా వారికి ఏర్పాటు చేసే దానిలో భాగమే ఈ గగ్గోలు అని అర్థం చేసుకోవాలి. ఈ సర్వసత్తాక దేశం బహుళజాతి సంస్థలకు 5 నుండి 10 సంవత్సరాల వరకు 'టాక్స్ హాలిడే'లను ప్రకటించింది. ఈ బహుళజాతి సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు ఒక స్థాయి నైపుణ్యం అవసరం ఉంది. అందుకనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు నైపుణ్యాన్ని నేర్పాలనే రాగాలాపన చేస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాల్లో ఈ స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఎక్కువ జీతాలిచ్చి నేర్పాల్సి ఉంటుంది. మన దేశంలో ఆ పనిని కారుచౌకగా చేయవచ్చు. అందుకనే బహుళజాతి సంస్థలు భారత ప్రభుత్వం ద్వారా యువతకు శిక్షణనిప్పించాలని అనుకుంటున్నాయి. ఇదంతా వారి పెట్టుబడి ఖర్చును తగ్గించుకొనే దానిలో భాగమే. దీనిలో శిక్షణ పొందిన వారందరికీ ఉద్యోగాలు రావు. వీరంతా నిరుద్యోగ రిజర్వ్ సైన్యంగా ఉండి ఉద్యోగాలు చేస్తున్నవారి జీతాలు పెరగకుండా ఉండటానికి వనరుగా ఉంటారు. ఒకవేళ ఇంతకంటే చౌకగా నైపుణ్యం కలిగిన యువత వేరే దేశంలో దొరికితే అక్కడ నుండే తెచ్చుకుంటారు. మన దేశంలో శిక్షణ పొందిన యువతనంతా తీసుకుంటారనే గ్యారంటీ ఏమీ లేదు. పైగా వారి యూనిట్లలో పనిచేసేవారిని కూడా తొలగించి అంతకంటే చౌకగా దొరికే వారినే పెట్టుకుంటారు. నిరుద్యోగమూ, అల్ప ఉద్యోగిత ప్రపంచవ్యాప్త ధోరణిగా కొనసాగుతూ తీవ్రమైన అశాంతికి కారణమై కొన్ని ప్రభుత్వాలనే కూల్చివేసిన నేటి పరిస్థితిలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మన దేశ రాజకీయ నాయకులు చెప్పేది చూస్తే మన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో విడివడి ఉన్నట్లుగా భావించాల్సి వస్తుంది. దీనిని గురించి చాలా తక్కువ మాట్లాడడమే మంచిది.

స్కిల్ డెవలప్‌మెంట్ గురించి ఈ గగ్గోలు చేయటం మనలను ప్రధాన సమస్య నుండి దృష్టి మరల్చటానికే. ద్రవ్యలోటును తగ్గించాలనే పేరుతో బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలయిన నవరత్నాలు మరియు మహారత్నాల నుండి 43,800 కోట్ల రూపాయల పెట్టుబడులను ఉపసంహరించటానికి పథకం పన్నింది. మరోవైపున 'పవిత్ర గోవు' లాగా భావించే రక్షణరంగంతో సహా అన్ని కీలకరంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాకకు మార్గం సుగమం చేసింది. ఈ విధంగా రోజురోజుకు దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకనుగుణంగా పునర్నిర్మాణం గావించబడుతున్న పరిస్థితుల్లో ఇది యువతకు ఉద్యోగాలు కల్పించి స్వయంసమృద్ధమైన, స్వతంత్రమైన ఆర్థిక వ్యవస్థగల దేశంగా మారుతుందని ఎవరైనా అనుకోగలరా? సామ్రాజ్యవాద నయా వలసవాద

సంకెళ్ల నుండి దేశాన్ని విముక్తి చేసినప్పుడు మాత్రమే యువతకు వీరు చెప్పే ఎంప్లాయ్‌మెంట్ ఇవ్వటం  సాధ్యమౌతుంది.

భారత ప్రభుత్వం యువతరానికి ఉద్యోగాలు కల్పించే దానికి బదులుగా వేల రూపాయల నిరుద్యోగ భృతినిస్తానని వాగ్దానం చేస్తోంది. ఉదాహరణకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం 1000 రూపాయల నిరుద్యోగ భృతిని వాగ్దానం చేసింది. బి.జె.పి. 2000 రూపాయలిస్తానని వాగ్దానం చేసింది. వారు ఆ వాగ్దానాలను నెరవేర్చటమనేది వేరే విషయం. నిజానికి నిరుద్యోగ భృతిని పొందుతున్నవారు చాలా కొద్దిమందే. ఇటువంటి వాగ్దానాలు హంబగ్ (బూటకం) మాత్రమే. దీన్నుండి అర్థమవుతున్నదేమంటే, యువతకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యం వారికి లేదు. యువతను నిస్సహాయులుగానూ, పనికిరానివారుగానూ తయారు చేస్తున్నారు. ఈ వ్యవస్థ ఇటువంటి మోసపు పనులకు ఖజానాగా ఉంది.

ఆర్థిక వ్యవస్థ దానికదే స్వతంత్రమైనది కాదు. దాని కనుగుణమైన రాజకీయ వ్యవస్థను ఆర్థికం సృష్టించినప్పుడు రాజకీయాలు ఆర్థికానికి సేవ చేస్తాయి. వీటి రెంటి మధ్య గతితార్కిక సంబంధం ఉంది. మన దేశ ఆర్థిక వ్యవస్థను ఎవరు నియంత్రిస్తున్నారనేది చాలా స్పష్టం. భారతదేశ ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి కంట్రోలు చేస్తున్నది. దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలు ద్రవ్య పెట్టుబడికి సేవ చేస్తున్నాయి. అందువల్ల యువతకు సంబంధించిన స్కిల్, విద్య, ఉద్యోగిత మరియు జీవితం ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న దళారీ వర్గాల నియంతృత్వంతో ముడిపడి ఉంది. ఓట్లు వేయటం మరియు ఎర్రకోటపై జెండా ఎగురవేయటమే ప్రజాస్వామ్యమా? “రండి, భారతదేశంలో తయారుచేయండి” అని ఎర్రకోట బురుజుల నుండి ప్రధానమంత్రి విదేశీ దోపిడీదారులకు ఎర్రతివాచీ పరిచాడు. దీని అర్థమేమంటే వచ్చి భారతదేశాన్ని దోచుకోండి అని. స్వాతంత్ర్యానికి అర్థం ఇదేనా? దేశంలో 2/3వంతు జనాభా రెండు పూటలూ తినటానికి నోచుకోవటం లేదు. జనాభాలో 77 శాతం మంది రోజుకు 20 రూపాయలతోనే జీవిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కువ మంది ‘కుపోషణ’తో బాధపడేవారు మనదేశంలోనే ఉన్నారు. రాజకీయ వ్యతిరేకతను బూటకపు ఎన్‌కౌంటర్లతో సహా అనేక రూపాల్లో అణచివేస్తున్నారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు గ్యారంటీ చేయబడిన హక్కులు నిజంగా అనుభవించేందుకు అవకాశం ఉందా? పతనమవుతున్న సామాజిక విలువలను, సంస్కృతిని మనం ప్రజాస్వామ్యం అందామా? స్వేచ్ఛ కోసం పోరాడుతున్న ప్రజల్ని హత్యలు చేస్తుంటే సహిద్దామా ? ఈ స్థితి భారత రాజ్యాంగయంత్ర నిజ స్వభావాన్ని బహిర్గతం చేస్తోంది.

**ఉద్యోగితకు సంబంధించిన వివరాలు:** గత దశాబ్దంలో బహుకొద్ది ఉద్యోగావకాశాలను కల్పించి దానినే ఉద్యోగితా దశాబ్దంగా పొగుడుతున్నారు. ఈ దశాబ్దంలో భారీ స్థాయిలో శ్రమను దోచుకోవటానికి కాంట్రాక్టు విధానం మరియు అప్రాధాన్యతా పనులను మాత్రమే కల్పించి భారీస్థాయిలో శ్రమను దోచుకున్నారని అనటంలో అతిశయోక్తి ఏమీ లేదు. 2010 నుండి 2012లోపు 2.2% మాత్రమే ఉద్యోగావకాశాలు కల్పించారు. విద్యార్హతలున్నవారు మరియు ఉన్నత చదువులు చదివిన వారు కూడా గతిలేని పరిస్థితుల్లో సగటు వేతనాల కంటే తక్కువకే పనిచేస్తున్నారు. చాలా ఎక్కువ మంది కార్మికులు క్యాజువల్ వర్క్ మీదనే

జీవిస్తున్నారు. దీనికి తోడు దేశంలోని ప్రతి రంగంలోనూ అల్ప ఉద్యోగిత మరియు ప్రచ్ఛన్న నిరుద్యోగిత కొనసాగుతున్నాయి. ఇది ఒక రకంగా నిరుద్యోగమే. ఉద్యోగ భద్రత మరియు సాంఘిక భద్రతకు గ్యారంటీలేమీ లేవు. జాతీయ సర్వే రిపోర్టు ప్రకారం ఎక్కువ ఆర్థికాభివృద్ధి జరిగిన 2000 నుండి 2012 మధ్య చాలా తక్కువ ఉద్యోగాల కల్పన జరిగిందని అంచనా. హోటల్ పరిశ్రమలో 35 మిలియన్ల నుండి 53 మిలియన్లకు ఉద్యోగాలు పెరిగాయని చెబుతున్నారు. కాని ఇవి అల్పాదాయ ఉద్యోగాలు. 2004-2005 మధ్య జి.డి.పి. పెరుగుదల 8.5 శాతం ఉండగా ఉద్యోగాల కల్పన రేటు సంవత్సరానికి 0.5% మాత్రమే ఉండింది. దేశ శ్రామికశక్తిగా ఉన్న 470 మిలియన్ల మంది లేదా 92% దేశ శ్రామిక శక్తికి అప్రాధాన్యతా మరియు అసంఘటిత రంగంలో ఎటువంటి ఉద్యోగ రక్షణా లేకుండా పనిచేస్తున్నారు. దేశ జి.డి.పి.లో 16 శాతంగా ఉన్న వస్తు తయారీ రంగం తగినంత ఉద్యోగితను కల్పించలేక పోతోంది. ఇదే కాలంలో 37 మిలియన్ల మంది శ్రామికులు వ్యవసాయ రంగం నుండి బయటకు నెట్టబడితే వారిని పారిశ్రామిక రంగం ఇముడ్చుకోలేక పోయింది. జి.డి.పి.లో 58 శాతంగా ఉన్న సర్వీసు రంగం కేవలం 26 శాతం ఉద్యోగాలను మాత్రమే కల్పిస్తోంది. భారీస్థాయిలో ఉన్న నైపుణ్యంలేని కార్మికులకు ఉద్యోగాలు కల్పించే విషయంపై కేంద్రీకరించకుండా అమెరికా మరియు ఇతర సామ్రాజ్యవాద దేశాలకు అవసరమైన ఐ.టి. మరియు సాఫ్ట్‌వేర్ స్కిల్ డెవలప్‌మెంట్ మీద మన పాలకులు కేంద్రీకరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వస్తు తయారీ రంగానికి జవసత్వాలు నింపాలని ప్రగల్భాలు పలుకుతోంది. దీని వెనకాల కారణమేమంటే విదేశ పెట్టుబడుల మీద ఆధారపడిన ఢిల్లీ, ముంబాయి పారిశ్రామిక కారిడార్లు, అలాంటి మరికొన్ని కారిడార్ల అవసరాలు తీర్చటమే. చైనాలో చౌకగా దొరికే శ్రమశక్తీ, కార్మిక చట్టాలను భయంకరంగా ఉల్లంఘించటం, ఫ్యాక్టరీలలో భయంకరమైన పని పరిస్థితుల లాంటి విషయాల వల్ల సామ్రాజ్యవాదులకు చైనా మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తయారైంది. భారతదేశంలోని విశాలమైన శ్రామిక శక్తిని కార్పొరేట్ తోడేళ్లకు బలి ఇచ్చి చైనా వంటి దేశాలకు పోతున్న మాన్యుఫాక్చరింగ్ అవకాశాలను కొన్నింటిని చేజిక్కించుకోవాలని భారత ప్రభుత్వం చూస్తోంది. ఒకవేళ బహుళజాతి సంస్థలు వారి దేశాల్లోని వస్తు తయారీ యూనిట్లను తొలగించి మనదేశంలో నెలకొల్పితే కొద్దిమేరకు ఉద్యోగావకాశాలు దొరకవచ్చు. అప్పుడు కూడా శ్రామికులకు దుర్భరమైన పని పరిస్థితులే ఉంటాయి తప్ప మెరుగైన ఉద్యోగాలైతే రావు. పైపెచ్చు విదేశీ పెట్టుబడి గత పది సంవత్సరాలలో మనదేశాన్ని తీవ్రంగా దోపిడీ చేసిన తీరును చూస్తే ఏదో కొద్దిపాటి ఉద్యోగాలు కల్పించి ఐసు ముక్కతో పిల్లలను సంతృప్తి పరిచినట్లుగా మాయ మాటల గారడీ తప్ప మరోటి కాదు. ఆ కొద్దిపాటి ఉద్యోగాల కల్పన సముద్రంలో నీటిబొట్టంత మాత్రమే.

10వ పంచవర్ష ప్రణాళిక (2002-2007) మరియు 11వ పంచవర్ష ప్రణాళిక (2007-2012)లలో దేశం అసమాన ఆర్థికాభివృద్ధిని సాధించిందని పాలకవర్గాలు, వారి తొత్తులు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇది ఉద్యోగాల కల్పన లేని అభివృద్ధి మరియు సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ మీద ఆధారపడింది. 2004-2005 మరియు 2005-2010 సంవత్సరాలలో సంఘటిత రంగంలో పెద్దయెత్తున ఉద్యోగాలను ఇన్‌ఫార్మల్ పనిగా మార్చివేయటం జరిగింది.

వ్యవసాయరంగంలోనూ, పారిశ్రామిక మరియు సర్వీసు రంగాల్లోనూ ఉద్యోగిత కూడా నల్లేరు మీద బండి దొర్లినట్లుగా లేదు. వ్యవసాయ రంగం ఇప్పటికీ ఎక్కువ మంది ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది. దేశంలోని శ్రామిక జనాభాలో సగానికి పైగా మందికి ఈ రంగం పని కల్పిస్తోంది. అయినప్పటికీ 2005లో ఉపాధి కల్పనలో 57%గా ఉన్న నిష్పత్తి 2010 నాటికి 53కు తగ్గిపోయింది. అనగా 14 మిలియన్ల మంది వ్యవసాయరంగం నుండి సర్వీసు మరియు పారిశ్రామిక రంగాల్లోకి వెళ్లారు. పేద, భూమిలేని రైతులు మరియు మధ్యతరగతిలోని ఒక సెక్షన్ వ్యవసాయ రంగాన్ని వదిలి ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస పోతున్నారు. 2010 నుంచి 2012 మధ్య వ్యవసాయరంగంలో ఉపాధి కల్పన రేటు మరలా 53 నుండి 49 శాతానికి పడిపోయింది. దీనితో 13 మిలియన్ల మంది శ్రామిక జనాభా వ్యవసాయ రంగం నుండి బయటికి నెట్టివేయబడ్డారు. ఈ రకంగా ఉపాధి కల్పనరేటు దిగజారటం ఈ 'స్వతంత్ర భారతం'లో ఇంతకు ముందెన్నడూ (2005కు ముందు) జరగలేదు. గత రెండు శతాబ్దాలలో జి.డి.పి.లో వ్యవసాయరంగం వాటా 33 నుండి 15 శాతానికి పడిపోయింది. సర్వీసు రంగం, పారిశ్రామిక రంగాల తర్వాత జి.డి.పి. వాటాలో అధిక వాటాను కలిగి ఉన్న వ్యవసాయ రంగం 1947 అధికార మార్పిడి తర్వాతి నుండి ఎక్కువ మంది ప్రజలకు ఉపాధిని కల్పించలేక పోతోంది. ఈ రంగాన్ని ప్రభుత్వమే ప్రమాదపు అంచులకు నెట్టివేస్తోంది. వ్యవసాయానికి అనుబంధ రంగాలైన హార్టికల్చర్, పశుపోషణ, అడవుల పెంపకం, చేపల పెంపకం వంటి వాటిల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటోంది. కాని ఈ రంగాల్లో కూడా భారీ కోతలే జరుగుతున్నాయి. 2005లో ఈ రంగాల్లో ఉపాధి రేటు 50.8 మిలియన్లు ఉండగా 2010 నాటికి 34.6 మిలియన్లకు పడిపోయింది.

పారిశ్రామిక రంగంలో కూడా ఉపాధి రేటు పడిపోయింది. ఈ రంగంలో ఉపాధి పెరుగుదల రేటు 24% నుండి 26%కి మాత్రమే పెరిగింది. ఉపాధి పెరుగుదల రేటు వాస్తవానికి స్థిరంగానే ఉండిపోయింది. పది మంది కంటే ఎక్కువ కార్మికులతో పనిచేసే యూనిట్లలో కేవలం 5% మాత్రమే పెరుగుదల రేటు ఉంది. ఎక్కువ మంది కార్మికులతో పనిచేసే యూనిట్లలో ఈ రేటు 75 నుండి 65 శాతానికి పడిపోయింది. 2000-2005 మధ్యలో వస్తు తయారీ రంగంలో 12 మిలియన్ల ఉద్యోగాల కల్పన జరుగగా, 2005-10 మధ్య కాలంలో 5 మిలియన్ల ఉద్యోగాల మీద కోత పడింది.

సర్వీస్ రంగంలో మాత్రమే కొద్దిగా పెరుగుదల ఉంది. దానిలో పెడుతున్న భారీ పెట్టుబడులతో పోలిస్తే ఉద్యోగాల కల్పన శాతం నామమాత్రమే. గత ఇరవై సంవత్సరాలలో సర్వీస్ రంగపు జి.డి.పి. వాటా పెరిగింది. 1990-91లో 43 శాతంగా ఉన్న రేటు 2010-11 నాటికి 57 శాతానికి పెరిగింది. సర్వీస్ రంగంలో ఈ సంవత్సరంలో దాని అభివృద్ధి రేటు 10 శాతాన్ని సాధించినప్పటికీ కేవలం నాలుగు మిలియన్ల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించగలిగింది. 2010-12 మధ్యకాలంలో 11 మిలియన్ల దాకా ఉద్యోగాల కల్పన ఈ రంగంలో జరిగింది. సర్వీస్ రంగంలో కొద్దిమంది ఉన్నత, మధ్యతరగతి వర్గాలకు మేలు జరగగా, మెజారిటీ మంది సర్వీస్ రంగంలోనూ, ఇతర రంగాల్లోనూ కఠినమైన పరిస్థితులలో ఉద్యోగాలు చేస్తున్నారు.

| A. రంగాల వారీగా కార్మికులు,1999-2000 (మిలియన్లలో) | | | |
|---|---|---|---|
| కాల వ్యవధి | 1999 – 2000 | | |
| రంగం | మొత్తం | అసంఘటిత | సంఘటిత |
| వ్యవసాయం | 237.67 | 232.2 | 5.47 |
| వస్తు తయారీ | 44.05 | 30.92 | 13.13 |
| గనులు | 2.17 | 0.88 | 1.29 |
| విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా | 1.13 | 0.09 | 1.04 |
| నిర్మాణం | 17.54 | 12.92 | 4.62 |
| వస్తుతయారీయేతర | 20.84 | 13.89 | 6.95 |
| టోకు, చిల్లర వ్యాపారాలు | 36.63 | 34.30 | 2.33 |
| చిన్న, పెద్ద హోటళ్లు | 4.62 | 4.08 | 0.54 |
| రవాణా, నిల్వ, కమ్యూనికేషన్ | 14.61 | 10.44 | 4.18 |
| బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ | 2.25 | 0.49 | 1.76 |
| రియల్ ఎస్టేట్లు, అద్దెలు | 2.67 | 2.02 | 0.65 |
| ప్రభుత్వ, రక్షణ, సామాజిక భద్రత సంబంధిత | 10.48 | 0.80 | 9.68 |
| విద్య | 8.47 | 2.29 | 6.18 |
| ఆరోగ్యం | 2.62 | 1.19 | 1.43 |
| ఇతర సామాజిక, వ్యక్తిగత సేవలు | 9.99 | 8.50 | 1.49 |
| మొత్తం సేవలు | 94.20 | 65.62 | 28.57 |
| మొత్తం శ్రామికశక్తి | 396.76 | 342.64 | 54.12 |

ఈ మూడు పట్టికలలో (A, B. C) చూపబడిన విధంగా అసంఘటిత రంగంలో ఎంప్లాయ్‌మెంట్ ఎక్కువగా ఉంది. మొదటి ఐదు సంవత్సరాలలో ఎంప్లాయ్‌మెంట్ పెరిగి తర్వాత ఐదు సంవత్సరాలలో పడిపోయింది. అసంఘటితరంగం పెరగటానికి కారణం కార్మికుల మీద దోపిడీ తీవ్రత పెరగటమే. వ్యవసాయ రంగంలో 2000లో సంఘటిత రంగపు వాటా 2.2% ఉండగా 2010 నాటికి 1.1%కి పడిపోయింది. మరోవైపున సర్వీసు మరియు వస్తూత్పత్తి కాని రంగాలలోని సంఘటిత రంగంలో క్రమంగా ఎంప్లాయ్ మెంట్ ఈ దశాబ్ద కాలంలో పెరిగింది. ఏదేమైనప్పటికీ సంఘటిత రంగం లోని వస్తు తయారీ, వస్తు తయారీయేతర మరియు సర్వీస్ రంగాలలోని వాటా మొత్తం ఎంప్లాయ్‌మెంట్‌లో 1/

| **B.** రంగాల వారీగా కార్మికులు, **2000-2005** (మిలియన్లలో) | | | |
|---|---|---|---|
| కాల వ్యవధి | **2000 – 05** | | |
| రంగం | మొత్తం | అసంఘటిత | సంఘటిత |
| వ్యవసాయం | 258.93 | 252.8 | 6.09 |
| వస్తు తయారీ | 55.77 | 39.71 | 16.06 |
| గనులు | 2.64 | 0.89 | 1.75 |
| విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా | 1.30 | 0.09 | 1.21 |
| నిర్మాణం | 26.02 | 19.66 | 6.35 |
| వస్తుతయారీయేతర | 29.96 | 20.64 | 9.32 |
| టోకు, చిల్లర వ్యాపారాలు | 43.36 | 41.43 | 1.93 |
| చిన్న, పెద్ద హోటళ్లు | 6.10 | 5.29 | 0.81 |
| రవాణా, నిల్వ, కమ్యూనికేషన్ | 18.47 | 14.02 | 4.45 |
| బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ | 3.10 | 0.80 | 2.30 |
| రియల్ ఎస్టేట్లు, అద్దెలు | 4.65 | 3.29 | 1.36 |
| ప్రభుత్వ, రక్షణ, సామాజిక భద్రత సంబంధిత | 8.84 | 0.08 | 8.76 |
| విద్య | 11.43 | 3.07 | 8.36 |
| ఆరోగ్యం | 3.34 | 1.58 | 1.76 |
| ఇతర సామాజిక, వ్యక్తిగత సేవలు | 8.75 | 7.45 | 1.30 |
| మొత్తం సేవలు | 112.81 | 81.72 | 31.09 |
| మొత్తం శ్రామికశక్తి | 457.46 | 394.90 | 62.57 |

3 వంతు కంటే తక్కువే. దేశం మొత్తం లోని ఎంప్లాయ్‌మెంట్‌లో అసంఘటితరంగపు వాటా 84%గా ఉంది. వ్యవసాయ రంగం లోని 99% ఎంప్లాయ్‌మెంట్ అసంఘటిత రంగానిదే. మొత్తం ఎంప్లాయ్‌మెంట్‌లో 33% మాత్రమే వ్యవసాయేతర రంగాలకు చెందిన సంఘటిత రంగానిది. ఇది ఆందోళన కరమైన విషయం. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించకుండా అసంఘటిత రంగాన్ని ఇంకా పెంచుకుంటూ పోతోంది. వస్తు తయారీ రంగంలో ఈ దశాబ్దం మొదట్లో 44 మిలియన్ల ఉద్యోగాలు కల్పించగా 2005 నాటికి 55.8 మిలియన్లకు పెరిగి 2010 నాటికి 50.7 మిలియన్లకు పడిపోయింది. ఇదే రంగంలోని అసంఘటిత రంగంలో ఈ దశాబ్దపు మొదటి ఐదేళ్లలో 30% ఎంప్లాయ్‌మెంట్ పెరిగి చివరి ఐదేళ్లలో ఐదు మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ రకంగా వస్తు తయారీ రంగంలోని అసంఘటిత రంగంలో 34.7 మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

| C. రంగాల వారీగా కార్మికులు, 2009-2010 (మిలియన్లలో) | | | |
|---|---|---|---|
| కాల వ్యవధి | 2005 – 10 | | |
| రంగం | మొత్తం | అసంఘటిత | సంఘటిత |
| వ్యవసాయం | 244.85 | 242.11 | 2.74 |
| వస్తు తయారీ | 50.74 | 34.71 | 16.03 |
| గనులు | 2.95 | 1.09 | 1.86 |
| విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా | 1.25 | 0.12 | 1.13 |
| నిర్మాణం | 44.08 | 31.1 | 13.0 |
| వస్తుతయారీయేతర | 48.28 | 30.38 | 17.90 |
| టోకు, చిల్లర వ్యాపారాలు | 43.53 | 40.55 | 2.98 |
| చిన్న, పెద్ద హోటళ్లు | 6.13 | 5.22 | 0.91 |
| రవాణా, నిల్వ, కమ్యూనికేషన్ | 19.97 | 15.09 | 4.88 |
| బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ | 3.82 | 0.89 | 2.93 |
| రియల్ ఎస్టేట్లు, అద్దెలు | 5.75 | 3.35 | 2.40 |
| ప్రభుత్వ, రక్షణ, సామాజిక భద్రత సంబంధిత | 9.46 | 0.00 | 9.46 |
| విద్య | 11.85 | 2.68 | 9.17 |
| ఆరోగ్యం | 3.59 | 1.39 | 2.20 |
| ఇతర సామాజిక, వ్యక్తిగత సేవలు | 12.24 | 11.00 | 1.24 |
| మొత్తం సేవలు | 116.34 | 80.17 | 36.17 |
| మొత్తం శ్రామికశక్తి | 460.22 | 387.38 | 72.84 |

సంఘటిత వస్తు తయారీ రంగంలో ఈ దశాబ్దంలో 30% ఉద్యోగాలు కల్పించి మొత్తం ఉద్యోగితలో 35% మాత్రమే పెరుగుదల సాధించింది. సంఘటితరంగంలో సాపేక్షికంగా ఎక్కువ జీతాలు, ఉద్యోగ రక్షణ, ఇతర సాంఘిక భద్రతలు, ఉద్యోగుల సంక్షేమం మొదలగు అంశాలను మనం గమనించవచ్చు. ప్రభుత్వం చెప్పుకుంటున్నట్లుగా జి.డి.పి. వేగంగా పెరిగినప్పటికీ సంఘటితరంగంలో ఎంప్లాయ్‌మెంట్ పెరుగుదల గమనించదగిన స్థాయిలో లేదు. ప్రభుత్వం చెప్పేదానికి దీనికి పొంతన లేదు. ఎంప్లాయ్‌మెంట్‌లో పెరుగుదల ఉన్నది అంటే అది ప్రధానంగా కాంట్రాక్ట్ పనులు మరియు ప్రాధాన్యత లేని పనులు. దీనిని బట్టి అర్థమయ్యేదేమంటే ఉద్యోగాల కల్పన విషయంలో సామాజిక శ్రమకు అవకాశాలు కల్పించటంలోనూ, కార్మికుల భద్రత, సంక్షేమానికి సంబంధించిన విషయాల్లో ప్రభుత్వానికి కార్మిక అనుకూల వైఖరి లేదు అనేది స్పష్టమౌతున్నది. ఎంప్లాయ్‌మెంట్ కల్పన జరిగిందనుకుంటే

| ప్రధాన రంగాలలో సంఘటిత, అసంఘటిత ఉద్యోగిత (2009-10)(మిలియన్లలో) | | | |
|---|---|---|---|
| శ్రామిక శక్తి | మొత్తం ఉద్యోగిత | సంఘటిత రంగం | అసంఘటిత రంగం |
| వ్యవసాయం | 244.85 (100) | 242.11(99) | 2.74(1) |
| వస్తుతయారీ | 50.74(100) | 34.71(69) | 16.03(31) |
| వస్తుతయారీయేతర | 48.28(100) | 30.38(63) | 17.90(37) |
| సర్వీసులు | 116.34(100) | 80.17(69) | 36.17(31) |
| అన్ని రంగాలు | 460.22(100) | 387.38(84) | 72.84(16) |

అది కూడా బహుళజాతి సంస్థల మరియు భారత కార్పొరేట్ వర్గాలు లాభాలు సంపాదించే క్రమంలో ట్రికిల్ డౌన్ సిద్ధాంతం ద్వారా దొరికిన ఉద్యోగాలు మాత్రమే.

గత దశాబ్దంలో నిర్మాణ రంగంలోని సంఘటిత రంగంలో మొదటి ఐదు సంవత్సరాలలో 4.6 మిలియన్ల నుండి 6.35 మిలియన్లకు ఉద్యోగిత పెరిగింది. ఇది తర్వాత ఐదు సంవత్సరాల్లో 13 మిలియన్లకు పెరిగింది. పెద్దయెత్తున విదేశీ పెట్టుబడి మౌలిక సదుపాయాల రంగంలో ప్రవేశించటం వల్ల ఇది జరిగింది. ఆ రంగంలోకి విదేశీ పెట్టుబడిని ఆహ్వానించే లక్ష్యం పూర్తి చేయబడింది. లార్సన్ అండ్ టుబ్రో, గమ్మాన్ మరియు జి.ఎం.ఆర్. లాంటి సొరచేపలు ఈ రంగంలో ఉన్నారు. ఇలాంటి పెద్ద కంపెనీల టర్నోవర్ వల్ల కొంత మెరుగైన జీతాల్ని ఇవ్వగలుగుతున్నారు. వీరు సృష్టించిన ఎంప్లాయ్‌మెంట్ సంఘటిత రంగం కిందికే వస్తుంది.

అయినప్పటికీ ఈ కంపెనీలు సబ్ కాంట్రాక్టర్ల ద్వారా, వీరి కింద చిన్న కాంట్రాక్టర్ల ద్వారా అసంఘటిత రంగంలో ఎక్కువ ఉద్యోగాలను సృష్టించారు. వాస్తవంగా వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులు నిర్మాణ రంగంలోకి వచ్చారు. గమనించాల్సిన విషయమేమంటే ఈ రంగంలోని ఎంప్లాయ్‌మెంట్ స్థిరమైనది కాకపోగా అది విదేశీ పెట్టుబడిపై ఆధారపడింది. ఈ పెట్టుబడి ఏ సమయంలోనైనా విదేశాలకు వెళ్లిపోతే ఎంప్లాయ్‌మెంట్‌లో

| వ్యవసాయేతర రంగాల్లోని నియమిత, అనియమిత ఉపాధి, 2009-10 (మిలియన్లలో) | | | | |
|---|---|---|---|---|
| శ్రామికులు | మొత్తం | అసంఘటిత | సంఘటిత | శాతాల్లో వాటా |
| మొత్తం | 460.22 | 387.34 | 72.87 | 100 |
| నియమిత | 33 | 2.26 | 30.74 | 7.2 |
| అనియమిత | 427.22 | 385.08 | 42.13 | 92.8 |
| శాతాలలో వాటా | 100 | 84.2 | 15.8 | |
| వ్యవసాయేతర | 215.37 | 145.23 | 70.13 | 100 |
| వ్యవసాయేతర రంగంలో నియమిత శ్రామికులు | 31.00 | 2.26 | 28.74 | 14.4 |
| వ్యవసాయేతర రంగంలో అనియమిత శ్రామికులు | 184.37 | 142.97 | 41.39 | 85.6 |
| శాతాలలో వాటా | 100 | 67.4 | 32.6 | |

పెద్ద కోతను పెడుతుంది. గత దశాబ్దంలో మొదటి ఐదు సంవత్సరాలలో సర్వీస్ రంగంలో ఉద్యోగాల కల్పనలో అభివృద్ధి జరగగా, చివరి ఐదు సంవత్సరాల్లో 4 మిలియన్ల ఉద్యోగాలు మాత్రమే సృష్టించారు. ప్రస్తుతం ఈ రంగం ఉద్యోగ కల్పనలో ప్రతిష్టంభనలో ఉంది.

ప్రాథమిక రంగం నుండి ద్వితీయ రంగానికీ, దాన్నుండి తృతీయ రంగానికి నిరుద్యోగుల వలస అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒక సాధారణ లక్షణంగా ఉంది. వ్యవసాయ రంగం నుండి నెట్టివేయబడిన శ్రామికులు గత్యంతరం లేక క్యాజువల్ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఇక్కడ పని అనేక విషయాల మీద ఆధారపడింది. పని గంటలు, వాతావరణ పరిస్థితులు, జీతాలు, పని స్వభావం, న్యాయపరమైన రక్షణలు, పనికి సంబంధించిన వైద్య సౌకర్యాలు మొదలగు ఇబ్బందులు దీనిలో ఉన్నాయి. ప్రాధాన్యత, ప్రాధాన్యతలేని పనుల నుండి మనం ఎంప్లాయ్‌మెంట్ స్వభావాన్ని గమనించవచ్చు. ఇన్‌ఫార్మల్ రంగానికి చెందిన కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, పెన్షన్, వైద్య సౌకర్యం, ప్రసూతి సెలవులు మొదలగు సామాజిక రక్షణ సౌకర్యాలు లేవు. వారికి పనిగంటలు సుదీర్ఘంగానూ, వేతనాలు తక్కువగానూ ఉంటాయి. అన్నిటికంటే వారికి ఉద్యోగ గ్యారంటీ లేకపోగా పనిభారం ఎక్కువ. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో 93% ఉద్యోగాలు ఇటువంటివే. మొత్తం ఎంప్లాయ్‌మెంట్‌లో 16 శాతం మాత్రమే సంఘటితరంగానికి చెందినది. దానిలో కూడా సగం ఇన్‌ఫార్మల్ వర్క్‌కి సంబంధించినదిగా గమనించవచ్చు.

వ్యవసాయేతర రంగాల నుండి చూసినట్లైతే వస్తుతయారీ రంగంలో 67% ఇన్‌ఫార్మల్ రంగానికి సంబంధించినవే. వస్తూత్పత్తియేతర రంగంలో అయితే 86% ఇటువంటి పనులే. కేవలం సర్వీస్ రంగంలో మాత్రమే సంఘటిత రంగపు వాటా సాపేక్షికంగా 63% ఉంది. దీనిలో రక్షణ, బ్యాంకింగ్, ప్రజాపాలన మొదలగు రంగాలు ఉన్నాయి. నిర్మాణ రంగంలో 2009-10 సంవత్సరంలో 44 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించగా, దానిలో 31 మిలియన్ ఉద్యోగాలు అసంఘటిత రంగానివి కాగా, 13 మిలియన్లు మాత్రమే సంఘటిత రంగానివి. అసంఘటిత రంగంలోని దాదాపు అన్ని ఉద్యోగాలు ఇన్‌ఫార్మల్‌వే. సంఘటితరంగం కిందికి వచ్చే పెద్ద వ్యాపార సంస్థల్లో కూడా 12 మిలియన్లు లేదా 96 శాతం ఉద్యోగాలు ఇన్‌ఫార్మల్‌వే. నిర్మాణరంగంలోని మొత్తం 44 మిలియన్ల ఉద్యోగాలలో 43 మిలియన్ల ఉద్యోగాలు ఇన్‌ఫార్మల్ స్వభావానికి చెందినవి. మరోమాటలో చెప్పాలంటే నిర్మాణ రంగంలోని 98% మందికి ఉద్యోగ గ్యారంటీగానీ, సామాజిక భద్రతగానీ లేవు. బొగ్గుగనుల తవ్వకం స్వభావరీత్యా శాశ్వితమైన (ఉద్యోగం) దైనప్పటికీ దానిలోని ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి కార్మికులను తీవ్ర దోపిడీకి గురిచేస్తున్నారు.

## అసంబద్ధమైన లేబర్ మార్కెట్

లేబర్ మార్కెట్‌లో అసమానత మరియు ఎగుడుదిగుళ్లు కొనసాగి పనులలో విభజనలు జరగటం చూడవచ్చు. జీతాల విషయాన్నే చూసుకుంటే రెగ్యులర్ కార్మికులకు, క్యాజువల్ కార్మికులకు చాలా వ్యత్యాసం ఉంది. అలాగే సంఘటితరంగ కార్మికులకు, అసంఘటిత రంగ కార్మికులకు చాలా తేడా ఉంది. 2011-12 సంవత్సరంలోగ్రామీణ ప్రాంతంలో

క్యాజువల్ కార్మికులకు రోజుకూలి 138 రూపాయలుండగా, పట్టణ ప్రాంతంలో 173 రూపాయలుగా ఉంది. గ్రామీణ ప్రాంతంలోని రెగ్యులర్ కార్మికులకు 298 రూపాయలుండగా, పట్టణ ప్రాంతంలోని వారికి 445 రూపాయలుగా ఉంది. ప్రభుత్వం కనీస వేతనాన్ని నిర్ధారించినప్పటికీ పెద్దయెత్తున జరిగే అవినీతి, మోసాల వల్ల ఆ మొత్తాన్ని కార్మికులు పొందలేక పోతున్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంత క్యాజువల్ కార్మికులు ప్రభుత్వ రంగ క్యాజువల్ కార్మికుల కంటే 7% తక్కువగా పొందుతున్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల కార్మికుల జీతాల నిష్పత్తి 1:6గా ఉంది.

కార్మికులను వివిధ విభాగాలుగా విభజించారు. పనిని బట్టి, డిపార్టుమెంట్‌ని బట్టి, స్థానాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి, జెండర్‌ని బట్టి, కులాన్ని బట్టి, మతాన్ని బట్టి, ఆదివాసీ/గైరాదివాసీ మొదలగు కారణాలతో విభజించారు. దళితులు, ఆదివాసీలు మరియు వెనుకబడిన తరగతుల వారిని వ్యవసాయ మరియు నిర్మాణ రంగాల లాంటి తక్కువ ఉత్పాదకత, తక్కువ ఆదాయ వనరులు లాంటి క్యాజువల్ లేదా ఇన్‌ఫార్మల్ రంగాలలోని ఉద్యోగాలకే పరిమితం చేశారు. ముస్లింలను తక్కువ శ్రేణి, తక్కువ ఉత్పాదకత లాంటి స్వయం ఉపాధి ఉద్యోగాలకే పరిమితం చేశారు. మరోవైపున హిందూ అగ్రకులాలు ఎక్కువ ఆదాయాన్నిచ్చే ఉద్యోగాలు పొందుతున్నారు. ప్రభుత్వరంగ సంస్థలు 1999-2000 మరియు 2011-12లలో రిజర్వేషన్ వల్ల దళితులకు, ఆదివాసీలకు ఉద్యోగాలు దొరికినప్పటికీ బ్యాక్‌లాగ్ ఎత్తివేయక పోవటంతో పెద్దగా అభివృద్ధి జరిగింది లేదు. ప్రైవేట్ సెక్టార్‌లోని ఉన్నత తరగతి ఉద్యోగాలు దాదాపు ఖాళీగానే ఉంచారు. ప్రైవేట్ పెట్టుబడిదార్లు వ్యతిరేకించటంతో ప్రభుత్వం ఈ విషయంలో ఏమీ చేయలేక పోయింది. దీనిలో అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతోంది. గత దశాబ్దంలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో ముస్లిమ్‌ల వాటా తగ్గిపోయింది.

మహిళలలో విద్యావ్యాప్తి పెరుగుతూ ఉంది. 15 నుండి 29 సంవత్సరాల వయస్సు కలిగిన గ్రాడ్యుయేట్ మహిళల్లో 23% మంది మంచి ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారు. గ్రాడ్యుయేట్లు, ఆపై ఉన్నత విద్య నభ్యసించిన వారిలో 2005లో 21 శాతంగా ఉన్న నిరుద్యోగం 2011-12 నాటికి 30%కి పెరిగింది. సాంకేతిక విద్యలో గ్రాడ్యుయేట్‌లయిన వారిలో 18% మంది నిరుద్యోగులుగా ఉన్నారు. గత దశాబ్దంలో నయా ఉదారవాద విధానాల ఫలితంగా కులము, మతం, జెండర్ ఆధారంగా ఎంప్లాయ్‌మెంట్‌ను కల్పించారు. ఈ విధంగా ఉద్యోగాల కల్పనలో వివక్షత పెరిగింది.

## కార్మికుల మీద దాడి

గత దశాబ్దిలో కార్మికుల మీద రాజ్య అణచివేతను 'కార్మికుల మీద యుద్ధం'గా పిలవవచ్చు. ఈ దాడికి వ్యతిరేకంగా గత కొన్ని సంవత్సరాల్లో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. ఇది కార్మికుల మీద పెట్టుబడిదారుల యుద్ధంగా చూడవచ్చు. కార్మికుల ఆవేశానికి ఆటోమొబైల్ పరిశ్రమ కేంద్రస్థానమైంది. మనేసార్‌లోని మారుతీ సుజుకీ ప్లాంట్‌లో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. కంపెనీ గూండాలు కార్మికులతో బాహాబాహీ తలపడిన ఫలితంగా జనరల్ మేనేజర్ చనిపోయాడు. ఈ నిందను కార్మికుల మీద

మోపారు. 148 మంది కార్మికులను జైళ్లకు పంపి, 2వేల మందిని పని నుండి తొలగించారు. వేతనాలలో తీవ్రమైన కోతలే ఈ ఆందోళనలకు కారణం. దీనికి మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. కంపెనీ గూండాయిజంతో పాటు కార్మికులు సంఘాలను ఏర్పాటు చేసుకొనే హక్కు కూడా ప్రశ్నార్థకమైంది. మారుతీ సుజుకీ ఫ్యాక్టరీయే గాక 2013లో మిగతా చోట్ల కూడా గణనీయమైన స్థాయిలో పోరాటాలు జరిగాయి. మహారాష్ట్రలోని ఇక్లాకరంజీలోని పవర్‌లూం పరిశ్రమలోని పోరాటాలు, నాసిక్‌లోని మహేంద్ర అండ్ మహేంద్ర, చకాన్‌లోని బజాజ్ ఆటో ఫ్యాక్టరీలో కార్మికుల పోరాటాలు పెల్లుబికాయి. బెంగుళూరులోని బోష్ ఇండియా ఫ్యాక్టరీలోనూ, చెన్నైలోని నోకియా సీమెన్స్‌లోనూ, హరిద్వార్, గుర్‌గాంలోని హీరో మోటార్ కార్పొరేషన్లలోనూ, చెన్నైలోని ఎం.ఆర్.ఎఫ్.లోనూ, కోయంబత్తూర్‌లోని ప్రైకో కంపెనీలోనూ, గుజరాత్‌లోని జనరల్ మోటార్స్ ఫ్యాక్టరీలోనూ, అంబత్తూరులోని డన్‌లప్, శ్రీపెరంబదూర్‌లోని కపారోలోనూ, కర్నాటకలోని హోస్‌కోటేలోని హుండయ్ కంపెనీలోనూ మరియు ఇతర ప్రాంతాల్లోనూ 2009-2012 మధ్య మిలిటెంట్ కార్మికుల పోరాటాలు జరిగాయి.

బొగ్గు, సిమెంట్ మరియు ఇతర మైనింగ్ రంగాల్లోని కార్మికులు, పేపర్ మిల్లుల్లోని కాంట్రాక్టు కార్మికులు, వేతన ఒప్పందాల కోసం పర్మినెంట్ కార్మికుల పోరాటాలు, బ్యాంకు ఉద్యోగుల ఆందోళనలు, విమానాశ్రయాల కార్మికుల, పైలెట్ల పోరాటాలు, మూడవ, నాల్గవ తరగతి ఉద్యోగుల పోరాటాలు మొదలైనవి ఇదే కాలంలో జరిగాయి. నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా మావోయిస్టుల నాయకత్వంలో బీడీ ఆకు కార్మికుల, వెదురు కూలీల పోరాటాలు నిరంతరం కొనసాగాయి. దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు ఐదు లక్షల పోలీసు, పారా మిలటరీ బలగాలను మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో మోహరించారు. దేశంలో కార్మికుల హక్కుల కోసం కార్మిక సంఘాల నాయకులు ఎక్కడైతే పోరాడారో వారి మీద వేధింపులు, పని నుండి తొలగింపు, గూండాలతో హత్యలు, ఎన్‌కౌంటర్లలో హత్యలు చేయటం మరియు తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో బంధించటం కొనసాగుతోంది.

క్యాజువల్ కార్మికుల, కాంట్రాక్టు కార్మికుల జీతాలు వారు జీవించటానికి కూడా సరిపోనంతగా ఉంటున్నాయి. వేగంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి డి.ఎ.లు ఇవ్వటం లేదు. ఇటీవలి కాలంలో ఆటోమొబైల్ పరిశ్రమ నుండి 15వేల మంది కార్మికులను తొలగించారు. నామమాత్రపు కార్మికుల జీతాల పెంపుదలను కూడా పారిశ్రామిక వేత్తలు ఏమాత్రం సహించటం లేదు. ద్రవ్యోల్బణానికి, ధరల పెరుగుదలకు కార్మికుల జీతాలకు ముడిపెడుతున్నారు. ఇది అసంబద్ధమైన వాదన. సరుకుల ధరలలో జీతాల వాటా 2007-2008లలో 10.6%గా ఉండి ఆ తర్వాత 11.3% నుండి 12.2%కు పెరిగింది. ఆటోమొబైల్ పరిశ్రమలో జీతాల వాటా 2011-12లలో 16%గా ఉండింది. ఇది 2001 నాటి కంటే తక్కువే. జీతాలు కొద్దిమేరకు పెరిగినప్పటికీ ద్రవ్యోల్బణానికి, ధరల పెరుగుదలకు పెద్దగా సంబంధం లేదు. ఫ్యాక్టరీ యజమానుల లాభాల వాటాయే సరుకుల ధరలలో ఎక్కువగా ఉంటుంది. ఇది 2001లో 24.9%గా ఉండి 2007-2008లో 61.3%కు దూసుకుపోయి, 2011-12లో 54%కు చేరుకుంది. ఈ తరుగుదలకు కారణం జీతాల పెరుగుదల కాదు. వడ్డీ చెల్లింపుల్లో కొనసాగిన ఎగుడుదిగుడులే ధరల పెరుగుదలలో భాగమయ్యాయి. పరిపాలనా సంబంధిత, గుమస్తాల, మేనేజర్ల జీతాలు (సి.ఇ.ఓ.ల జీతాలతో సహా) కార్మికుల జీతాల

వాటాకు జత కలిపి దాని పెరుగుదలకు కారణంగా చూపిస్తున్నారు. మేనేజర్ల, సి.ఇ.ఓ.ల జీతాలు విడిగా లెక్కించటం లేదు. 1991-92లో మొత్తం జీతాలలో కార్మికుల వాటా 64.8%. ఇది 1980 నుండి 1990 వరకు స్థిరంగా కొనసాగింది. నూతన ఆర్థిక విధానాల అమలు నుండి ఇది క్రమంగా క్షీణించటం మొదలుపెట్టింది. 1997-98లో ఇది 56.9%గానూ, 2007-08లో 48.4%గా ఉండి 2011-12లో 46.5%నికి పడిపోయింది. అదే సమయంలో పైస్థాయి మేనేజర్లకిచ్చే జీతాల వాటా నికర ధరలలో 7%కి పెరిగి అది 60వేల కోట్ల రూపాయలుగా ఉంది. నూతన ఆర్థిక విధానాలలో కార్మికుల జీతాలలో తీవ్రమైన కోతను, మేనేజర్ల, సి.ఇ.ఓ.ల జీతాల్లో పెరుగుదల వేగాన్ని చూడవచ్చు. మరొక విషయమేమంటే సి.ఇ.ఓ.లకు ఆయా కంపెనీల షేర్ల మీద వచ్చే లాభాలకు తోడు అదనంగా జీతాలు కూడా ఇస్తున్నారు.

కార్మికుల జీతాల కోతతో పాటు వారి మీద భౌతిక దాడులు కూడా పెరుగుతున్నాయి. కార్మిక ఉద్యమాల మీద పోలీసు దాడులు సహజమైతే ప్రస్తుతం ఫ్యాక్టరీ గూండాలను అధికారికంగా కార్మికుల మీదికి ఉసిగొల్పుతున్నారు. కార్మిక పోరాటాలను కుట్రలుగా అభివర్ణించి వారి మీద చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాన్ని (యు.ఏ.పి.ఏ.-ఉపా) ఉపయోగించి జైళ్లలో పెడుతున్నారు. ఫ్యాక్టరీలలో జరిగే నష్టాలకు కార్మిక నాయకుల మీద కేసులు పెట్టి నష్టపరిహారాల కోసం సివిల్ కోర్టులకు తిప్పుతున్నారు. వారిని జైళ్లలో పెట్టి వారి సామాజిక జీవితాన్ని ధ్వంసం చేస్తున్నారు. కార్మికుల హక్కుల కోసం ఏమాత్రం మిలిటెంట్ పోరాటాలు జరిగినా, విప్లవకారులున్నా ఫ్యాక్టరీలను పోలీసు క్యాంపులుగా మార్చి వారిని నిరంతరం వేధిస్తున్నారు. నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత పెట్టుబడిదార్ల చట్టవ్యతిరేక చర్యలను చట్టబద్ధం గావించేందుకు కార్మిక చట్టాలను మారుస్తున్నారు. కార్మికులను సంఘాలు పెట్టుకోకుండా ఇంతకు ముందు నుండే నిరోధిస్తున్నారు. ప్రస్తుతం కార్మిక సంఘాన్ని ఏర్పరచాలంటే ఆ పారిశ్రామిక యూనిట్లో గల 30% మంది కార్మికుల అనుమతిని తప్పనిసరి చేశారు. ఇది మరింత కష్టసాధ్యమవుతుంది. ఈ పరిస్థితి మూలంగా కార్మికవర్గ ప్రయోజనాల కోసం నూతన దృక్పథాన్ని, నినాదాలను, నూతన పోరాట, నిర్మాణ రూపాలను ఎంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

**ప్రభుత్వ నూతన యువజన పాలసీనా? మత్తుమందా? :** వినోదాలతో మెదడును మత్తుబార్చి వారి కర్తవ్యాన్నుండి దారి తప్పించటమే దీని లక్ష్యం. విద్యా విధానంలోనూ, సంస్కృతిలోనూ పాశ్చాత్యీకరణను, కాషాయీకరణను మేళవించి ప్రతీఘాతుక విలువలను ప్రోత్సహించి విద్యార్థులలో బానిస మనస్తత్వాన్ని తయారు చేయటానికి పాలకవర్గాలు కంకణం కట్టుకున్నాయి. ఈ పాటికే ఈ విధానంలో తయారైన కొంతమంది రాజకీయాల్లోనూ, ఆర్థిక వ్యవస్థలోనూ, సామాజిక-సాహిత్య రంగాల్లో దళారీ బ్రోకర్లుగానూ, కిరాయి ఏజెంట్లుగానూ ఈపాటికే పనిని మొదలుపెట్టారు. కొనసాగుతున్న దళారీల పరిపాలనలో ఈ రకమైన ప్రతిభకు ఎక్కువ డిమాండే ఉంది. ఒక కుట్రపూరితమైన పథకంలో భాగంగా భారత సమాజంలోని అన్ని రంగాలను ఉన్నతమైన ఆలోచనల వైపు పోనివ్వకుండా చేస్తోంది. సమాజాన్ని మరుగుజ్జుగా మార్చేందుకే ప్రయత్నం చేస్తోంది. యువతరం నిజమైన వాస్తవాలను

గ్రహించినప్పుడు కోపోద్రిక్తులై విప్లవతరంగంగా మారతారని పాలకవర్గాలు నిరంతరం భయపడుతుంటాయి. అందుకే నిరంతరం కొత్తకొత్త పథకాలను ప్రవేశపెట్టి యువతను సంతృప్తిపర్చేందుకు ప్రయత్నిస్తారు. వారిని దారి మళ్లించేందుకే ఈ పథకాలు ప్రవేశ పెడుతున్నారు. వారి కర్తవ్యాల నుండి దూరంగా ఉంచేందుకు వినోదాల క్లబ్బులు, సాంస్కృతిక, క్రీడల సమూహాలు, రంగు రంగుల వినోదాల పార్టీల వంటి కార్యక్రమాలను ఈ దేశ పాలకవర్గాలు ఒక రాజకీయ విధానంగా ప్రవేశపెట్టి కొనసాగిస్తున్నాయి.

పనికిమాలిన విద్య ద్వారా సామాజిక, సాంస్కృతిక విలువలను పతనం చేస్తున్నారు. లంపెనీకరణను ప్రోత్సహిస్తున్నారు. వ్యక్తి స్వార్థపు ఆలోచనను, వస్తు వినియోగతత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు. అవినీతి పద్ధతులకు, వ్యక్తిగత ప్రతిభలకు పెద్దపీట వేస్తున్నారు. దాని ద్వారా యువతలో కెరీరిజాన్ని పెంచటానికి ప్రయత్నిస్తున్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కులాన్ని రూపం మార్చి చూపిస్తున్నారు. అగ్రవర్ణాల నిరుద్యోగ యువత వారి నిరుద్యోగానికి వెనుకబడిన వర్గాలే కారణమని, దానికి వ్యతిరేకంగా ఆందోళన చేసే విధంగా ప్రేరేపిస్తున్నారు. వారి తక్షణ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలను తీర్చుకునేందుకు వారిని రెచ్చగొడుతున్నారు. సినిమాలు, టి.వి. సీరియల్స్, మీడియా ద్వారా వస్తు వ్యామోహపిచ్చిని, బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు విలువలను ప్రచారం చేస్తూ అణచివేతలో ముందున్న పోలీసు, అవినీతికర అధికారులను హీరోలుగా చూపిస్తున్నారు. పాలకవర్గ ప్రజావ్యతిరేక ఫాసిస్టు పద్ధతులను యువతకు అర్థం కాకుండా వాటికి మద్దతిచ్చే విధంగా వీరిని మలచుకొనేందుకు ప్రయత్నం చేస్తూ ప్రజల మీద యుద్ధానికి వారినే తూటాలుగా మలుచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

అత్యాచారాన్ని ఏదో చిన్న సంఘటనగా కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ అభివర్ణించటం, చిన్న పిల్లలు ఏదో పొరపాటు చేశారన్న ములాయం సింగ్ మాటలు నోరుజారిన మాటలు కాదు. జల్సా జీవితాలకు ప్రతీకలైన శశిథరూర్, జైరాం రమేష్‌లను బూర్జువా మీడియా ఆకాశానికెత్తి చూపెట్టింది. ఒక పథకం ప్రకారం వస్తు వ్యామోహపిచ్చిని రెచ్చగొట్టే దానిలో భాగమే ఈ చర్యలన్నీ. వారిని యువతకు ప్రతిబింబాలుగా నిలబెట్టి ప్రజలను అమాయకుల్ని చేయటానికి ప్రయత్నిస్తున్నారు. యువజన ఉత్సవాలు, మత సంబంధమైన విందులు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళల పోటీలు, క్రీడాపోటీలు, వివిధ రకాల యువ సమ్మేళనాలను ఒక పథకం ప్రకారమే ప్రచారం చేస్తూ ఇటువంటి కార్యక్రమాలన్నింటిలో రాజకీయ నాయకుల ప్రవేశం పెరుగుతూ ఉంది. యువతను చక్కగా పక్కదారి పట్టించేందుకు క్రికెట్ ఆట మెరుగైన సాధనంగా ఉంది. మొబైల్ ఇంటర్నెట్ ప్రజల ఉపయోగంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల అసభ్యతలతో కూడిన పోర్నోగ్రఫీని భాగా వ్యాప్తి చేశారు. దాని ఫలితంగా కూడా మహిళలపై హింసాత్మక సంఘటనలు పెరిగాయి. మద్యపానంతో పాటు ఇతర రకాల మత్తులిచ్చే హుక్కా సెంటర్లు, మత్తుమందుల వినియోగం పెద్దయెత్తున విస్తరించే అవకాశాలు కల్పించారు. కొద్దోగొప్పో ఆలోచించే వారిని ఎన్.జి.ఓ.ల విషవలయం ఉచ్చులో బిగించటానికి ప్రయత్నం చేస్తోంది. ఈ రకంగా యువత మానసిక స్థైర్యాన్ని, శక్తిసమర్థతలను సామూహిక జీవితం, శ్రమను గౌరవించే తత్వం, నిజాయితీ వంటి విలువల

వైపు పోకుండా పతనం వైపు మరల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విధంగా కెరీరిజానికీ, వ్యక్తిగత ప్రయోజనాలవైపు, వ్యక్తిగత ఆనందాలవైపు యువతను బలిచేస్తున్నారు. ఈ రకంగా పాలకవర్గాలు ఒకే దెబ్బకు మూడు పిట్టలను కొట్టాలని ప్రయత్నం చేస్తున్నాయి. మొదటిది యువతను మత్తులో ముంచి వారిని సమాజం గురించి, దేశం గురించి, భవిష్యత్తు గురించి ఆలోచించనివ్వకుండా చేయటం, రెండవది వస్తు వినియోగ సంస్కృతికి అనువైన వాతావరణాన్ని కల్పించి మార్కెట్లను సృష్టించుకోవటం, మూడవది రాజకీయ పార్టీలు యువత మీద కంట్రోల్‌ను కలిగి ఉండి లంపెనీకరణ వ్యాప్తిలో భాగంగా వారిని కార్యకర్తలుగా ఉపయోగించుకోవటం. ఈ దేశ దళారీలు, సామ్రాజ్యవాదులు కలిసి కుట్రతో దేశ యువతను మత్తులో ముంచి గాఢనిద్రలో ఉంచేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇది. ఇది దేశ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న పెద్ద నేరం.

## ముగింపు

భారతదేశం యువదేశం అనటంలో సందేహం లేదు. అదే సందర్భంలో యువత శక్తిని దేశాభివృద్ధికి కాకుండా పెట్టుబడిదార్లకు లాభాలు పెంపొందించేందుకు రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటున్నాయి. పెట్టుబడిదారీ విధానంలో నిరుద్యోగం ఒక సాధారణ లక్షణం. యజమానులు చౌకగా శ్రమను కొనుక్కోవటం ద్వారా లేబర్ మార్కెట్‌ను ఒత్తిడిలో ఉంచుతారు. వారి లాభాల వాటాను పెంచుకునేందుకు ఈ విధంగా చేస్తారు. కొనసాగుతున్న వ్యవస్థకు ఇదే అనివార్యమైన నియమం. నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి పెట్టుబడిదార్లకు అవసరం. అందువల్ల 'స్కిల్ డెవలప్‌మెంట్' అనేది యువతకు ఉద్యోగాల కల్పన కోసం కాదు. దేశ దళారీ బూర్జువా వర్గానికీ, విదేశీ సామ్రాజ్యవాదులకు మరింత చౌకగా నైపుణ్యం కలిగిన కార్మికులను అందుబాటులో ఉంచేందుకు మాత్రమే. అందువల్ల అందరికీ ఉద్యోగాలు అనేది ఈ వ్యవస్థలో ఎండమావి మాత్రమే. కాని యువతకు ఏదో మేలు జరుగుతోందనే భావన వారిలో కలుగుతోంది. కానీ వారి జీవితాల మీదే వ్యాపారం చేస్తున్నారు. పెట్టుబడిదారులు ఉత్పత్తి కారకాల ఖర్చును తగ్గించుకునేందుకు ఎక్కువ లాభాలను పొందేందుకు మెజారిటీ కార్మికుల మీద నైపుణ్యంలేని ముద్రవేసి తక్కువ వేతనాలతో ఎక్కువ నైపుణ్యం కలిగిన కార్మికులను పనిలో పెట్టుకుంటారు. దుర్భరమైన పని పరిస్థితులను కల్పిస్తారు. ఈ ప్రత్యేకత ఇండియాలోని అర్ధభూస్వామ్య లక్షణాన్ని సూచిస్తుంది. పెద్దయెత్తున నిరుద్యోగం కొనసాగుతోంది. ఇన్‌ఫార్మల్ రంగంలోనే పదింట తొమ్మిదో వంతుగా దొరుకుతున్న ఉద్యోగాలు సూచిస్తున్నదేమంటే రానున్న కాలంలో నిరుద్యోగం పెరిగే ప్రమాదాన్ని సూచిస్తోంది. ఏవైనా ఉద్యోగాలు దొరికాయంటే అసంఘటిత రంగం మరియు ఇన్‌ఫార్మల్ రంగంలోనే. ఈ రంగాలలో వివక్షత, సంఘాలు ఏర్పరచటం చాలా కష్టంగానూ, పోరాటాలు నిర్వహించటానికి వీలులేని పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎందుకంటే, ఒక ఫ్యాక్టరీలోని వివిధ యూనిట్లు వివిధ ప్రదేశాల్లో ఉంటాయి. ఈ ఉద్యోగాల పోటీలో వేతనాల మీద మరింత కోత పడుతుంది. లభ్యమయ్యే ఉద్యోగాల్లో కార్మికుల మీద దోపిడీ అణచివేతలు తీవ్రంగా ఉంటాయి. ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత ఉండవు. ప్రస్తుత స్థితి కంటే పని పరిస్థితులు మరింత దారుణంగా ఉండబోతాయి.

మరోవైపున ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని విధ్వంసం

చేస్తున్నారు. ఇదే సందర్భంలో వ్యవసాయం మీద ఆధారపడిన కార్మికులను క్యాజువల్ కార్మికులు గానూ, కాంట్రాక్టు కార్మికులు గానూ తక్కువ జీతాలతో దుర్భరమైన పని పరిస్థితుల్లో ఎటువంటి ఉద్యోగ భద్రతా లేని పరిస్థితుల్లో పనిచేసేందుకు నెట్టివేయబడుతున్నారు. యువత సామాజికంగా, సాంస్కృతికంగా క్షీణించి పోతున్నారు. ఫాసిస్టు శక్తులు వారిని లంపెన్లుగా మారుస్తూ ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా వారిని ఉపయోగిస్తున్నారు. దీని ఫలితంగా యువత భవిష్యత్తు శూన్యం కాబోయే పరిస్థితి ఉంది.

విదేశీ పెట్టుబడి మీద ఆధారపడి ఇండియాను మరో 'చతికిలబడిన ఆసియా పులి'గా మార్చాలని పాలకవర్గాలు ఒక పథకాన్ని ముందుకు నెడుతున్నాయి. దేశంలో ఉన్న యువత శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోవటం చేతకాని పాలకవర్గాలు మనదేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా మారుస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారు. ఈ విధంగా పెద్దయెత్తున విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి దేశం మీద పూర్తి కంట్రోలు విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టటానికే. ప్రస్తుతం కొనసాగుతున్న సంస్కరణల విధానాల ద్వారా వ్యవసాయ రంగంలో కొనసాగుతోన్న సంక్షోభం పరిష్కరించబడకపోగా పెద్దయెత్తున ప్రజల జీవితాలు ధ్వంసానికి గురై నిరుద్యోగం మరియు అల్ప ఉద్యోగిత మాత్రమే కొనసాగుతాయి.

గత దశాబ్ది పోరాటాల దశాబ్దిగా పేర్కొనవచ్చు. కార్మికుల సమ్మెలు, మిలిటెంట్ రైతాంగ పోరాటాలు, ఆదివాసీల పోరాటాలు, ఉపాధి కోసం యువత చేసిన పోరాటాలు, ప్రస్తుత వ్యవస్థకు వ్యతిరేకంగా వివిధ రూపాలలో జరిగిన సాంఘిక ఉద్యమాలు మున్నగునవి ఇందులో ఉన్నాయి. ఈ దశాబ్దం ఉద్యమాల మీద పోలీసులను, గూండాలను ఉపయోగించి ప్రభుత్వ అణచివేతను కొనసాగించటం, ఉద్యమకారుల మీద బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తుల దాడులు, కోర్టుల ద్వారా ఆందోళనకారులను శిక్షింపజేయటం మొదలైన విషయాలను చూస్తే ఈ దశాబ్దం నిర్బంధపు దశాబ్దంగా కూడా గమనించవచ్చు. మరోవైపున ప్రస్తుత వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సాయుధ ప్రతిఘటనతో ప్రత్యామ్నాయ రాజకీయ సంస్థలను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గమనించవచ్చు.

నయా ఉదారవాద విధానాలకు ప్రతిగా పెద్దయెత్తున నిరుద్యోగం, రాజ్యహింస, నిరక్షరాస్యత, వ్యాధులు, పోషకాహార లోపం, సామాజిక విధ్వంసం మొదలగునవి బహుమతులుగా లభించాయి. ఈ విధానాలు మూడు విశేషణాలను కలిగి ఉన్నాయి. మొదట వారు ప్రతి దానిని సరుకుగా మారుస్తారు. ప్రతిదీ మార్కెట్ కోసమే తయారు చేస్తారు. రెండవది, వ్యక్తివాద ఉన్మాదాన్ని తీవ్రస్థాయికి రెచ్చగొట్టి దాని ద్వారా వస్తు వ్యామోహాన్ని పెంచుతారు. మూడవది, వారు అన్ని రకాల ప్రజాస్వామిక హక్కులను, విలువలను ధ్వంసం చేస్తారు. కనీస ప్రజాస్వామిక నామమాత్రపు అవకాశాలు కూడా లేకుండా చేస్తారు. దీని ఫలితం మొదట కార్మికుల మీద, రైతాంగం, దళితులు, ఆదివాసీలు మరియు మహిళల మీద ఉంటుంది. కుంచించుకుపోతున్న ప్రజాస్వామిక విలువల ప్రభావమూ, పెరుగుతున్న వ్యక్తివాదతత్వమూ, మార్కెట్ లాభాపేక్ష, విలువలు మరియు సంస్కరణవాదాల ఫలితంగా ముఖ్యంగా యువత చైతన్యంలోనూ, ప్రజల ఆలోచనలోనూ మార్పును గమనించవచ్చు. దీనికి తోడు సామ్రాజ్యవాద బంటులైన పాలకవర్గాలు కులతత్వాన్ని ప్రోత్సహిస్తూ కుల అణచివేతను, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని మరియు అయోమయాన్ని, లింగవివక్షతను, హింసను, జాతీయ దురహంకారాన్ని, ప్రాంతీయతత్వాన్ని మరియు విభిన్న రకాల పాలకవర్గ భావజాలాన్ని రెచ్చగొట్టి యువతను,

కార్మిక ప్రజలను విప్లవ ప్రతీఘాతుక సాంఘిక పునాదిగా చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. దారితప్పిన యువతకు ఈ విషయాన్ని మనం అర్థం చేయించాలి. వారి చైతన్యాన్ని మనం పెంపొందించి, వారి నిస్పృహను, ఆగ్రహాన్ని భూస్వామ్య దళారీ సామ్రాజ్యవాద నాయకత్వంలో కొనసాగుతున్న నేటి వ్యవస్థకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాలి.

2030 నాటికి భారతదేశ శ్రామిక శక్తి చైనా శ్రామిక శక్తిని అధిగమిస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్న నిరుద్యోగ సైన్యానికే ఉపాధి కల్పించలేని నేటి వ్యవస్థను ధ్వంసం చేసేందుకు నిరుద్యోగులు తయారు కావాలి. యువత ఉపాధి కోసం సరైన విద్య, శిక్షణ లేని కారణంగా సామాజిక అసంతృప్తి పెరుగుతోంది. ప్రస్తుత పరిస్థితి దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ అనివార్యతను తెలియజేస్తుంది. సామ్రాజ్యవాదులు, భూస్వామ్య, దళారీ శక్తులతో కలిసి దేశాన్ని మరింత దోపిడీ చేయటానికి ఉవ్విళ్లూరుతున్నారు. భూస్వామ్య వర్గానికీ-అశేష ప్రజలకూ, సామ్రాజ్యవాదానికీ-భారత ప్రజలకూ మధ్య వైరుధ్యం రోజురోజుకూ తీవ్రతరమౌతోంది. కార్మికుల పోరాటాలతో పాటు భూమికోసం, విస్థాపన వ్యతిరేకంగానూ జరిగిన మిలిటెంట్ పోరాటాలు దాని ఫలితమే. ఈ సందర్భంలో సీ.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ ఆవిర్భావమూ, దేశంలో ప్రజాయుద్ధం అభివృద్ధి కావటమూ, దాని నాయకత్వంలో అనేక పోరాటాలు జరగటమూ, ప్రజల ప్రత్యామ్నాయ రాజకీయ అధికార అంగాలను ఏర్పరచటమూ గత దశాబ్దపు విశేషతగా చూడవచ్చు. దోపిడీ జరుగుతున్నది వాస్తవం, క్రూర అణచివేత కూడా వాస్తవమే. దానికి వ్యతిరేకంగా భారతదేశ ఉజ్వల భవిష్యత్తు కోసం సామర్థ్యం కలిగిన మావోయిస్టు నాయకత్వం, పరీక్షించబడిన రాజకీయ పంథా, విప్లవ కార్యక్రమాలు ఉన్నాయి. అందువల్ల అశేష కార్మిక శక్తులనూ, యువతరాన్నీ ప్రజాయుద్ధంలో పెద్దయెత్తున సమీకరించాల్సిన సమయం ఆసన్నమైంది.

## ఏం చేయాలి ?

అశేషమైన త్యాగాల ద్వారా భారత ప్రజల గొప్ప తిరుగులేని విప్లవ అగ్రగామి దళంగా మావోయిస్టు పార్టీ నిరూపించబడింది. సమాజంలో కొనసాగుతున్న వైరుధ్యాలను పరిష్కరించేందుకు ఈ పదేళ్ల ప్రజాయుద్ధంలో సరైన వ్యూహం-ఎత్తుగడలను అనుసరించటం ద్వారా నిరూపించబడింది. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న భూస్వామ్య అణచివేత, దోపిడీ, నిరుద్యోగం, ఉపాధి అభద్రత, జీవిత అభద్రత, రాజ్య అణచివేత, బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తుల దాడులు, సామ్రాజ్యవాద, భూస్వామ్య సాంస్కృతిక దాడి, విద్య వైద్యం లేమి మొదలైన సమస్యలను తీసుకొని ముందుకు పోవాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యల పరిష్కారం కోసం యువతను, కార్మికవర్గాన్ని పెద్దయెత్తున ప్రజాయుద్ధంలోకి సమీకరించాలి.

ప్రజల మీద ప్రభుత్వదాడి మారిన పరిస్థితులలో దానికి అనుగుణంగా పార్టీ పని విధానంలో పోరాట నిర్మాణ రూపాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఫాసిస్టు అణచివేతను ఎదుర్కోవటం కార్మికవర్గానికి కొత్త కాదు. కార్మికవర్గ సంస్థ ఏర్పడినప్పటి నుండీ క్రూర అణచివేతను ఎదుర్కొంటూనే ఉంది. చారిత్రక చికాగో పోరాట కాలంలోనే 7 లక్షల మంది సభ్యత్వంతో రహస్య నిర్మాణాన్ని కలిగి ఉన్నారు. పారిస్ కమ్యూన్, రష్యా, చైనా మరియు వియత్నాం పోరాటాల అనుభవాలు మరియు మన పార్టీ అనుభవాలు తెలియజేస్తున్నదేమంటే

ఎటువంటి శత్రుదాడినైనా ఎదుర్కొని పనిచేసేందుకు వీలుగా రహస్య, ఉక్కు క్రమశిక్షణ కలిగిన యూనిట్లను నిర్మించి ఏ స్థాయిలోనైనా, ఏ పనిలోనైనా రహస్య, బహిరంగ, చట్టబద్ధ కార్మిక సంఘాలు లేదా ప్రజాసంఘాలు, టెక్నికల్ యూనిట్లు నిర్మించి పనిచేయటం ద్వారానే అంతర్జాతీయ, దేశీయ విప్లవ పరిస్థితిని, పట్టణ ప్రాంతాల అనుకూలతలను ఉపయోగించుకొని అనేక మలుపులతో కూడిన భారత విప్లవోద్యమంలో బలమైన పట్టణోద్యమాన్ని నిర్మించాలి. మన పార్టీ వ్యూహం, ఎత్తుగడలను మరియు పట్టణ పర్‌స్పెక్టివ్ డాక్యుమెంట్లను ఆచరణలో సృజనాత్మకంగా అన్వయించటం ద్వారానే పైన చెప్పబడిన బలమైన పార్టీ నిర్మాణం జరుగుతుంది. ఈ విధమైన పార్టీ మాత్రమే కార్మికవర్గ ఉద్యమాన్ని పట్టణ ఉద్యమాన్ని నిర్మించి పోరాడే తన శక్తులను కాపాడుకొని ప్రజాపునాదిని విస్తృతపర్చుకొని అంతిమ విజయాన్ని సాధిస్తుంది. నేడు మనం ప్రజాయుద్ధపు వ్యూహాత్మక పథకాన్ని సరిగ్గా అమలుజరపగల్గితే పట్టణ కేంద్రాల్లో ప్రజాయుద్ధాన్ని నిర్మించగలం. మన పనిలోని సరైన అంశాలను గ్రహించి తప్పుడు పద్ధతులను తిరస్కరించాలి. ఉత్పత్తి చేసే యంత్రానికి చెందిన చక్రంలోని బేరింగులు పాడైపోతే వెంటనే వాటిని మార్చాల్సి ఉంటుంది. కాని ఎద్దుల బండి చక్రాలలోని కొన్ని సువ్వలు పోయినా అది కిర్రు కిర్రున శబ్దం చేస్తూ తిరుగుతూనే ఉంటుంది. కాని ఉత్పత్తి ఎటువంటి పరిస్థితులలోనూ ఆగిపోరాదు. కాబట్టి మనం విరిగిపోయిన బేరింగులను తీసివేయాలి. లేదా కిర్రు కిర్రున శబ్దం చేసే వాటిని తొలగించాలి. మరోమాటలో చెప్పాలంటే పార్టీని బోల్షివీకరించాలి. పెరుగుతున్న నిరుద్యోగం, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు భరించలేని స్థాయికి చేరాయి. ఉద్యోగాలు లేక ఆగ్రహంతో ఉన్న నిరుద్యోగ సైన్యాన్నీ, రిట్రెంచ్‌మెంట్ కత్తి వేలాడే కార్మికవర్గాన్నంతటినీ ప్రజాయుద్ధంలో సమీకరించాలి. దేశంలో కొనసాగుతున్న మిలిటెంట్ ఉద్యమాలన్నింటినీ ఒక్క త్రాటి మీదకు తీసుకురావాలి. రాజకీయ పంథా, పర్‌స్పెక్టివ్, త్యాగగుణం, ప్రజల విముక్తి కోసం కట్టుబడి ఉండే తత్వం, కావలసిన నాయకత్వ లక్షణాలు అన్నీ మావోయిస్టు పార్టీకి మరియు నిజమైన విప్లవకారులకు ఉన్నాయి. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో సాయుధ పోరాటమే పోరాట రూపంగా ఉంటూ నూతన ప్రజాస్వామిక సమాజ నిర్మాణ లక్ష్యంతో కూడిన నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయటమే కర్తవ్యం.

కాబట్టి మంచి భవిష్యత్తు కోరుకునే యువత ప్రస్తుతం కొనసాగుతున్న దోపిడీ వ్యవస్థ గురించి తెలుసుకొని దీనిని తొలగించి కొత్త వ్యవస్థను నిర్మాణం చేయవలసిన అవసరం ఉన్నదని గుర్తించకపోతే వారు భ్రమల్లో ఉన్నట్లే లెక్క. సోషలిజం మాత్రమే పనిచేసే చేతులన్నిటికీ పని కల్పిస్తుంది. అన్ని రకాల సమగ్రాభివృద్ధిని సాధించి ప్రతి ఒక్కరి జీవితంలోనూ వెలుగును నింపుతుంది. దానిని సాధించటం కోసం దీర్ఘకాలిక ప్రజాయుద్ధం తప్ప మరో మార్గం లేదు. *

ఈ ప్రపంచం మీదీ, మాది కూడా, కానీ అంతిమ విశ్లేషణలో మీదే. వేడెక్కుతున్న ఉదయపుటెండ లాంటి తీక్షణ నవోన్మేషపు జవసత్వాలతో తొణికిసలాడుతున్న యువకులు మీరు. మా ఆశలు మీమీదే.... ప్రపంచం మీదే....

**- మావో (మాస్కోలో చదివే చైనా విద్యార్థులతో సంభాషణ, 1957)**

# విప్లవ ప్రచారయుద్ధానికి సంబంధించి గుర్తుంచుకోవలసిన కొన్ని అంశాలు

- వింధ్య

"ఒక విప్లవం చేసేముందు, మనం ముందుగా ప్రజాభిప్రాయాన్ని సృష్టించాలి," అన్నాడు మావో 1967లో కేంద్ర సాంస్కృతిక విప్లవ గ్రూపుతో మాట్లాడుతూ.

విప్లవానికనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం, మలచడం అనేది విప్లవానికి ముందూ, విప్లవ క్రమంలో కూడా నిరంతరంగా కొనసాగించాల్సిన క్రియ. విప్లవం ఎందుకు అవసరం, విప్లవం ద్వారా తప్ప మన సమస్యలు ఎందుకు పరిష్కారం కావు అనే విషయంలో సందేహాలు లేకుండా విశ్వాసం కల్గినప్పుడే ప్రజలు విప్లవిస్తారు. అంతేకాక, విప్లవిస్తున్న ప్రజలు విప్లవించడం ఎందుకు అనివార్యం, అది ఎందుకు సమర్థించదగినది అనే అంశంలో కూడా సమాజం అభిప్రాయాన్ని మలచాల్సి ఉంటుంది. విప్లవం శత్రుదాడిని తట్టుకుని నిలవడంలో దీనికి చాలా ప్రాముఖ్యత ఉంటుంది.

ప్రజాభిప్రాయాన్ని సృష్టించడంలో, మలచడంలో ప్రధానమైన అంశం మన ఆచరణ. మన దేశంలో ఇందుకు నక్సల్బరీ పోరాటాన్ని మించిన ఉదాహరణ మరొకటి లేదు. కోట్లకొలది పుస్తకాలు/మాటలు వేయలేని ఒక ప్రభావాన్ని అది దేశప్రజలపై వేసింది. నేటి మన ఉద్యమాన్ని చూసినా దాని పట్ల ప్రజాభిప్రాయాన్ని మలచడం అనేది దాని ప్రజాయుద్ధ ఆచరణ ఫలితమే. ఇది ప్రధాన అంశం. ఈ విషయాన్ని స్పష్టం చేసుకుని ప్రజాయుద్ధంలో విప్లవ ప్రచారానికి సంబంధించి గుర్తుంచుకోవలసిన కొన్ని అంశాల్ని తడుముదాం.

'శత్రువును తెలుసుకో, నిన్ను నీవు తెలుసుకో' అన్న సున్-జు సూత్రానికి అనుగుణంగా ప్రచారరంగంలోనూ రెండు పక్షాల గురించీ కొన్ని పార్శ్వాలను తెలుసుకుందాం. ఎల్ఐసీ వ్యూహంలో భాగంగా నేడు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు, వారి తైనాతీ అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య దేశాల పాలకవర్గాలూ విప్లవ యుద్ధాన్నీ, జాతీయ పోరాటాల్ని, ప్రతిఘటనా యుద్ధాలనూ అణచివేయడానికి 'మానసిక యుద్ధాని'కి అత్యంత ప్రాముఖ్యతనిస్తున్నారు. అది వారికి వ్యూహాత్మక ప్రాధాన్యత కల్గిన అంశం. వారు దానిని ఆ విధంగానే వినియోగిస్తున్నారు. ఆయా నిర్దిష్ట పరిస్థితులను బట్టి సాపేక్షికంగా ప్రజల్ని పక్కదోవ పట్టించడంలో సఫలమవుతున్నారు కూడా.

ఈ ఎల్ఐసీ యుగంలో నేడు మన ఉద్యమానికి వ్యతిరేకంగా శత్రువు చేస్తున్న ప్రచారాన్నంతటినీ మనం 'మానసిక యుద్ధం' అనే మాట ద్వారా సూచించవచ్చు. దీనికి

వ్యతిరేకంగా మనం చేస్తున్న ప్రచారాన్నంతా విప్లవ ప్రచారయుద్ధంగా చెప్పవచ్చు.

మనం మొట్టమొదటగా అర్థం చేసుకోవల్సిన విషయం ఏంటంటే వ్యూహాత్మకంగా శత్రు మానసిక యుద్ధం ఎన్నటికీ విజయం సాధించలేదు. ఎందుకంటే దాని స్వభావం దోపిడీవర్గ అనుకూలం, ప్రజావ్యతిరేకం, అభివృద్ధి నిరోధకం. విప్లవ ప్రచార యుద్ధం విశాల పీడిత ప్రజానీకం ప్రయోజనాలను నెరవేర్చేది. అది దోపిడీకీ, పీడనకూ వ్యతిరేకంగా, దాన్ని కూలదోయడానికీ, దాని ప్రతీఘాతుక మానసిక యుద్ధానికీ వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినది. అందుకని వ్యూహాత్మకంగా ఇది తప్పనిసరిగా గెలిచే స్వభావాన్ని కలిగి ఉంటుంది.

శత్రు మానసిక యుద్ధాన్ని అబద్ధాల మీద, అభూత కల్పనల మీద ఆధారపడి ప్రజలను పక్కదోవ పట్టించే ఉద్దేశంతో నిర్వహిస్తారు. అది ప్రజలను దోపిడీ, పీడన, అణచివేతల కిందనే ఉంచేయడానికి ఉద్దేశించబడి గుప్పెడుమంది నీచమైన స్వార్థ ప్రయోజనాల కోసం జరుగుతుంది. ఇది అత్యంత అశాస్త్రీయంగా కూడా ఉంటుంది, ఎందుకంటే ఇది సమాజ పురోగమనానికి వ్యతిరేక దిశలో కొనసాగుతుంటుంది. వర్తులాకారంలో ముందుకే పోయే సమాజ చలన సూత్రాలకు విరుద్ధంగా ఇది వెనక్కు ప్రయాణించే, క్షీణించే దిశను కలిగి ఉంటుంది. విప్లవ ప్రచార యుద్ధం నిజాలు, వాస్తవాలు, రుజువులు, సత్యాల మీద ఆధారపడి జరుగుతుంది. ఇది ప్రజలను విముక్తం చేసే నిస్వార్థ ప్రయోజనాలతో జరుగుతుంది. ఇది అత్యంత శాస్త్రీయమైనది ఎందుకంటే ఇది సమాజ పురోగమన సూత్రాలకు అనుగుణంగా పురోగమించే దిశలో జరుగుతుంది.

శత్రు మానసిక ప్రచారం ప్రజలను బుద్ధిహీనులుగా, తెలివిలేనివారిగా, తామేం చెప్పినా నమ్మే మూర్ఖులుగా పరిగణించడం దాని ప్రధాన బలహీనతల్లో ఒకటి. ప్రజలను శాశ్వతంగా భ్రమల్లో ముంచెత్తగలుగుతాం అని వారు భావించి చేసే తప్పుడు ప్రచారాలన్నీ అంతిమంగా వారిని ప్రజల తీవ్ర అసహ్యానికి గురి చేసి వారికి వ్యతిరేకంగా నిలబెడ్తాయి. అయితే తాత్కాలికంగానే అయినప్పటికీ వారు ప్రజలను మోసం చేయగల్గుతారనే విషయాన్ని మనం గుర్తించకుంటే మన విప్లవ ప్రచారాన్ని అంత పదునుగా కొనసాగించకుండా అలసత్వానికి గురయ్యే ప్రమాదానికి గురవుతాం అనేది తప్పక గుర్తుంచుకోవాలి.

విప్లవ ప్రచారం మార్క్సిస్టు సూత్రాలకు అనుగుణంగా ప్రజలే నిజంగా తెలివైనవారు, చెడునూ, మంచినీ వేరు చేయగల వివేకం వారి స్వంతం అనీ భావించి కొనసాగుతుంది. అది వారిని భ్రమల్లో ముంచడం కోసం కాక వారి వివేచనను పెంపొందించే ఉద్దేశ్యంతో కొనసాగుతుంది. అందుకని తాత్కాలికంగా కొన్ని శత్రు దుష్ప్రచారాలు పైచేయి సాధించినా ప్రజలు త్వరలోనే లేదా ఆలస్యంగానైనా వారి జీవితానుభవం నుండి వాస్తవాలను గ్రహిస్తారనే గొప్ప ఆత్మవిశ్వాసంతో ఇది కొనసాగుతుంది. పదేపదే అబద్ధాలను చెప్పి వాటిని నిజంగా

చెలామణీ చేయగల్గుతాం అనే గోబెల్స్ తరహా ప్రచారం శత్రువుది అయితే, పదేపదే నిజాలను చెప్పడం ద్వారా అబద్ధాలను, నిజాలను ప్రజలు గుర్తెరుగుతారని, ప్రజలు కేవలం మాటలను కాక ఆచరణను చూస్తారనే విశ్వాసంతో విప్లవ ప్రచారం కొనసాగుతుంది.

శత్రు మానసిక యుద్ధ లక్ష్యం ప్రజల పోరాట చేవను నీరుకార్చి వారిని విభజించడం కాగా, విప్లవ ప్రచారం లక్ష్యం విప్లవ భావాలను భౌతికశక్తిగా మార్చి ప్రజలను ఐక్యం చేయడం.

వ్యూహాత్మకంగా ఈ రెండు శిబిరాలకు సంబంధించిన ప్రచార రంగాలకు ఉన్న అత్యంత ముఖ్యమైన లక్షణాలు ఇవి. ఇవే అంతిమంగా వాటి జయాపజయాలను నిర్ణయిస్తాయి.

అయితే ఎత్తుగడలపరంగా చూసినప్పుడు శత్రు ప్రచార యంత్రాంగం బ్రహ్మాండమైనది, అపారమైనది. దీనికి వనరులు, నిధులు, పని చేసే ఉద్యోగులు, సాధనాలు అన్నీ మనకున్నవాటితో పోలిస్తే అనేకానేక రెట్లు అధికం. అసలు రెంటికీ పోలికే లేదు. శత్రు ప్రచార యంత్రాంగంలో మనుషులు చాలా పెద్ద సంఖ్యలో పని చేస్తూ ఉన్నప్పటికీ అది టెక్నాలజీ ప్రాధాన్యతతో సాగుతుంటుంది. అలాగే కిరాయి మేధావులు దాని ఆలోచనపరుల బృందంగా పని చేస్తుంటారు.

విప్లవ ప్రచార యుద్ధం కూడా టెక్నాలజీని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తుంది, ఇప్పటికంటే మరింత ఎక్కువగా చేయాలి కూడా. అయితే ప్రజలపై ఆధారపడి ప్రచారం చేయడం దాని ప్రధాన లక్షణం. అది మనుషికీ, మనిషికీ మధ్య సంవాదాన్నీ, ప్రతి ఇంటికీ ప్రచారాన్ని తీసుకుని వెళ్లడాన్నీ ప్రోత్సహిస్తుంది. కిరాయి మేధావులు కాక మార్క్సిజం-లెనినిజం-మావోయిజం (మా-లె-మా) ని విశ్వసించి దాని కోసం త్యాగాలకు కూడా సిద్ధపడగల్గిన నిబద్ధత కలిగిన మేధావులు దీనివైపు ఉంటారు. జీతాలు తీసుకునే మనుషులు కాక విప్లవ పార్టీ, ప్రజా సైన్యం, విప్లవ కార్యకర్తలు (పూర్తికాలం, పార్ట్‌టైం), సానుభూతిపరుల ద్వారా ఇది కొనసాగుతుంది. సాహిత్య, సాంస్కృతిక కళా రంగాలు, అన్ని ప్రజాసంఘాలు, నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

బ్రహ్మాండమైన శత్రు ప్రచార యంత్రాంగాన్ని అడ్డుకునేది యేదీ లేదు. దీనిపై ఎటువంటి ఆంక్షలూ, నిషేధాలూ వుండవు. మన విప్లవ ప్రచారం మాత్రం నిరంతరం శత్రు నిర్బంధాన్ని, ఆంక్షలు, నిషేధాల మధ్యనే, వాటిని ఎదుర్కొంటూనే కొనసాగాల్సి ఉంటుంది. శత్రు మానసిక యుద్ధం ఏకకాలంలో మొత్తం సమాజం అంతటిలోకీ దూసుకుపోగలిగే అవకాశాల్ని కలిగి ఉండగా, మన ప్రచారం సాధారణంగా ఒక పరిమితమైన పరిధిలో కొనసాగుతుంటుంది.

అంతే కాదు, శత్రు మానసిక యుద్ధం కేవలం మన దేశ పాలకవర్గాలకు చెందినది కాదు. అది మొత్తం ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు, విప్లవ ప్రతీఘాతకులు ఒక్కుమ్మడిగా ప్రజలపై ఎక్కుపెట్టిన ఒక యుద్ధం. అందుకని వారందరి మద్దతుతో, క్రియాశీల భాగస్వామ్యంతో అది కొనసాగుతోంది. నిజానికి మన విప్లవ ప్రచారం కూడా ప్రపంచవ్యాప్తంగా బూర్జువావర్గానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేసే మొత్తం విప్లవ ప్రచార యుద్ధంలో ఒక భాగమే.

నేడు ప్రపంచం కుగ్రామంగా మారింది అని చెబుతున్న ప్రపంచీకరణ కాలంలో మీడియా యంత్రాంగం వూహకందని స్థాయికి పెరిగిపోయి, అది వేళ్ల మీద లెక్కగట్టగలిగిన బహుళజాతి కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయింది. అందుకని అది పాలకవర్గాల ప్రయోజనాలను నెరవేర్చే సాధనమే కాదు కార్పొరేట్ మీడియా యజమాన్యం స్వయంగా పాలకవర్గాల్లోనే భాగం. అంతేకాక ప్రభుత్వానికి సంబంధించిన మూడు అంగాలైన చట్టసభలు (లెజిస్లేటివ్), కార్యనిర్వాహకవర్గం (ఎగ్జిక్యూటివ్), న్యాయవ్యవస్థ (జ్యుడిసియరీ)లు కూడా తమ వంతుగా శత్రు మానసిక యుద్ధంలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో పాలుపంచుకోవడం నేటి ఎల్‌పీసీ వ్యూహం అమలు జరిగే, ప్రపంచీకరణ కాలానికి సంబంధించిన ఒక ప్రత్యేకత. మరోలక్షణం ఏంటంటే మీడియా ఈ మూడింటి పాత్రలనూ కూడా సమయాసమయాల్లో పోషించడం. ఉదా:కు ఇంకా కోర్టుల్లో ఎటువంటి విచారణ జరగక ముందే మీడియా నేరస్థులను నిర్ధారించడం, సాక్ష్యాలతో ఇష్టమొచ్చినట్టుగా ఆడుకోవడం, చివరికి తీర్పులను కూడా ఇచ్చేయడం సర్వసామాన్యంగా జరిగిపోతూ ఉన్నా, వారిపై ఎటువంటి చట్టపరమైన ఆంక్షలు, శిక్షలు ఉండకపోవడం పాలకవర్గాల ఒక కుట్రపూరితమైన నిర్ణయమే.

శత్రు మానసిక యుద్ధంతో మన విప్లవ ప్రచార యుద్ధం ఉపరితలంలో కొనసాగుతుంది. అయితే దాన్ని ఓడించడం కేవలం దీనితోనే సాధ్యం కాదు అందుకు పోరాటం యుద్ధరంగంలో కొనసాగుతుంది. ఉపరితలంలో దాని భావజలం, భావనలు, భావాలు, ప్రతిపాదనలు, సిద్ధాంతాలు, సంస్కృతితో మనం కొట్లాడుతాం. మరోవైపు మొత్తంగా శత్రు ప్రచార యంత్రాంగాన్ని, ఆ వ్యవస్థనే నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా ధ్వంసం చేసి నాలుగు వర్గాల జనతా ప్రజాతంత్ర రాజ్యం చేతుల్లోకి మొత్తం ప్రచార యంత్రాంగం స్వాధీనం అయ్యేలా చేస్తాం. అప్పుడు మాత్రమే ప్రజా ప్రచార యంత్రాంగాన్ని నెలకొల్పడానికి బాట సుగమం అవుతుంది.

అప్పుడు మాత్రమే ప్రజలకు అబద్ధాలతో, కుతర్కాలతో, కుట్రలు, కుహకాలతో ప్రజావ్యతిరేకతతో కూడిన నేటి తప్పుడు, అశాస్త్రీయ ప్రచారాల స్థానంలో ప్రజానుకూలమైన, ఉత్పత్తిశక్తుల వికాసానికి తోడ్పడే, ప్రజల విద్యా, సాంస్కృతిక స్థాయిల పెరుగుదలకు

దోహదపడే, శ్రమను గౌరవించే, శాస్త్రీయమైన, సమాజ పురోగమనానికి ఉపయోగపడే ప్రచార, ప్రసార మాధ్యమాల స్థాపనకు దారి సుగమం అవుతుంది.

నూతన ప్రజాస్వామిక వ్యవస్థలోనూ, సోషలిజంలోనూ కూడా వర్గాలుంటాయి కనుక భావజాలపరంగా చేసే వర్గపోరాటం అనేక సాంస్కృతిక విప్లవాల రూపంలో కొనసాగుతుంది. ఈ భావజాలరంగంలో వర్గపోరాటం సోషలిస్టు వ్యవస్థలోనూ, తర్వాత కమ్యూనిజం స్థాపన వరకూ కొనసాగుతుంది.

ప్రస్తుతం మన విప్లవ ప్రచారానికి సంబంధించిన కొన్ని ఆచరణపరమైన (ప్రాక్టికల్) పార్శ్వాలను గురించి చెప్పుకుందాం.

మన పార్టీ విప్లవ ప్రచార రంగంలో చాలా అనుభవాలనే గడించింది. విశాలంగా చెప్పుకోవాలంటే పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనల ద్వారా పార్టీ దీన్ని కొనసాగించింది. ప్రత్యేకమైన కొన్ని యంత్రాంగాలను ఏర్పరచి చేసిన కృషి కూడా పార్టీ కృషిలో భాగంగానే కొనసాగింది. విప్లవాలకు ముందూ, తర్వాతా రష్యా, చైనా వంటి దేశాల్లో మన పార్టీలు కొనసాగించిన కృషికి సంబంధించిన అనుభవాలు కూడా మనకు ఉన్నాయి. వాటిని విశ్లేషించి చేసే సంశ్లేషణల ద్వారా తీసుకోవాల్సిన పాఠాలను, అనుభవాలను మరింత సమగ్రంగా తీసుకోగల్గుతాం అనడంలో సందేహం లేదు. ప్రచారరంగంలో దీనినే ఒక కర్తవ్యంగా స్వీకరించవచ్చు కూడా.

ఇక్కడ ప్రధానంగా మనం అధిగమించాల్సిన కొన్ని ముఖ్యమైన సమస్యలను, అంటే వేటిని అధిగమించడం ద్వారా ఈ రంగంలో ఒక గెంతును సాధించగల్గే అవకాశం వుంది అనేది స్థూలంగా చెప్పుకుందాం.

సైద్ధాంతిక స్థాయిలో మరింత లోతుగా గ్రహించాల్సిన విషయం విప్లవ ప్రచారం మనకు వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన అంశం అనేది. దానితో ఆ విధంగానే మనం వ్యవహరించాలి. ఇది సైద్ధాంతిక, రాజకీయ, భావజాల రంగాలకు సంబంధించినది కనుక దీనికి ఇవ్వాల్సిన మొదటి, ప్రధాన ప్రాముఖ్యతను ఇచ్చి, తగిన సమయాన్నీ, శక్తులనూ ఈ కృషికి కేటాయించుకోవాలి. ఈ రంగంలో క్రియాశీలంగా, సృజనాత్మకంగా, అలుపెరుగకుండా పని చేయగలిగిన శక్తులను అన్ని స్థాయిల్లో ప్రత్యేక శ్రద్ధతో ఏర్చికూర్చాలి.

అన్నిటికంటే ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం శత్రు ప్రచారానికి దీటైన సమాధానం చెప్పగలిగినది మొట్టమొదటగా మన విప్లవాచరణ. మనం చెప్పేదానికీ, చేసేదానికీ ఆచరణలో ఎక్కువ తేడా లేకుండా ఉన్నప్పుడు శత్రు అబద్ధాలన్నీ అనతికాలంలోనే ఊకలాగ గాలికెగిరిపోతాయి. నేడు కొన్ని సందర్భాల్లో శత్రువు మనల్ని

ప్రచారంలో ఆత్మరక్షణలోకి నెట్టగల్గడం లేదా మనం పదే, పదే జరిగిన తప్పులే జరుగుతున్నప్పుడు మొదట్లో చెప్పినంత ఆత్మవిశ్వాసంతో ముఖం మీద గుద్దినట్టుగా సమాధానం చెప్పలేకపోవడం విప్లవాచరణ సరిగా ఉన్నప్పుడే మనం దీనిలో గెలవగల్గుతాం అనే విషయాన్నే సూచిస్తోంది. మన విప్లవాచరణ తక్కువ తప్పులతో సాగినప్పుడు మనం ప్రచార రంగంలో ప్రధానమైన విజయాన్ని సాధించినట్టే. మిగతా అంతా ఆ కృషిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే సమస్యగా మాత్రమే మిగులుతుంది.

రెండవ అంశం - విప్లవ ప్రచారంలో విప్లవ క్యాంపులోని ప్రతి ఒక్కరూ పాల్గోవాలి అనే విషయాన్ని బలంగా అర్థం చేయించడం. ఒక కమ్యూనిస్టు అంటేనే వారికి విప్లవ ప్రచారం ఒక ముఖ్యమైన కర్తవ్యంగా ఉంటుంది, అది వారి విప్లవాచరణలో ఒక భాగం అనే విషయాన్ని మనం ఇంకా తగినంత బలంగా మన పార్టీలో నాటలేకపోతున్నాం. పై నుండి కింది వరకూ కూడా ఈ విషయంలో ఉండాల్సిన అవగాహన తగినంతగా ఉండడం లేదు. పార్టీనే కాక, సైన్యం, ప్రజాసంఘాలు, ప్రజాప్రభుత్వాలు, సానుభూతిపరులు కూడా ఈ కర్తవ్యాన్ని తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోకుండా ఈ రంగంలో మనం ఒక గెంతును సాధించడం అసాధ్యం.

ఇది స్వయంగా విప్లవ ప్రచార సామగ్రికి తమ వంతును అందించడం, అందిన ప్రచార సామగ్రిని అత్యంత ప్రతిభావంతంగా, ప్రభావయుతంగా క్యాడర్లలోకి, ప్రజల్లోకి సకాలంలో సాధ్యమైనంత విస్తృతంగా తీసుకువెళ్లడం అనే రెండు రూపాల్లో ప్రధానంగా కొనసాగించాలి. ముందుగా తామూ, అలాగే తాము మార్గదర్శకత్వం వహిస్తున్న క్షేత్రాల్లో ప్రతి ఒక్కరినీ ఈ రెండు పనులూ చేసేలా ప్లాను చేయడం, ప్రేరేపించడం నాయకత్వ రోజువారీ విప్లవ కార్యాచరణలో భాగం కావాలి. ప్రచారం ఒక యంత్రాంగమో, ఒక ప్రజాసంఘమో ప్రధానంగా చేపట్టే కర్తవ్యంగా ఉండడం దానికదే సమస్య కాదు. తప్పక కొన్నిటికి ఈ కృషి ప్రధాన కర్తవ్యంగా ఉంటుంది పని విభజనలో భాగంగా. కానీ అది కేవలం వారి కర్తవ్యంగా చూడడం మొదలుపెట్టినప్పుడు సమస్య మొదలవుతుంది. నేడు మనం ఈ సమస్యను వేర్వేరు రూపాల్లో ఎదుర్కొంటున్నాం. ఇది జరుగుతున్న మన పరిమిత ప్రచార కృషి నుండి కూడా తగిన ఫలితాలను అందుకోకుండా అడ్డుకుంటోంది. అందుకని ముందుగా ఆలోచనల స్థాయిలోనే ఈ తప్పును మనం సరిదిద్దుకోవాలి.

మనం విడిగా ప్రచారానికి ఏర్పరుచుకున్న యంత్రాంగం పట్ల, ప్రజాసంఘాల పట్ల పార్టీలోని ప్రతి ఒక్కరూ (ఏ విషయంలోనైనా ఉన్నట్లే ముందుగా నాయకత్వం నుండి మొదలుపెట్టి ఆ తర్వాత కింది స్థాయిల వరకూ), తమకొక బాధ్యత ఉందనేది ముందుగా గుర్తించాలి. మన పార్టీ వేర్వేరు స్థాయిల్లో ఏర్పరుస్తున్న ప్రచార యంత్రాంగాలకు, ప్రజా

సంఘాలకు తగిన సహాయ సహకారాలు (ప్రచారానికుపయోగపడే సమాచారం, సామగ్రి అందించడం నుండి మొదలుకొని జరుగుతున్న ప్రచారం విషయంలో తమ అభిప్రాయాలను చెప్పి దాన్ని మరింత పరిపుష్టం చేయడం దాకా అంటే ఉన్నత, నిమ్న స్థాయిల్లో అందించాల్సిన అనేక రకాల వివిధ సహాయ సహకారాల రూపాల్లో) అందించాల్సి వుంటుంది.

అలాగే అందిన ప్రచార సామగ్రిని తాము చదవడం, ఆకళింపు చేసుకోవడం, దానిని తమ పరిధిలోని వారికందరికీ అందేలా హామీ పడడం, వారికి అర్థం చేయించడం, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం (విద్యార్థి యువజనుల్లోకి, మేధావుల్లోకి తీసుకెళ్లడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ) కూడా మరింత మెరుగ్గా కొనసాగాల్సిన అవసరం వుంది. ఎప్పటికప్పుడు ఇందులో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి. నిజానికి ఇది ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేనంత రోజువారీ విప్లవ కార్యాచరణే. అయితే యిందులో లోపాలు జరుగుతూ అందుబాటులో ఉన్న ప్రచార వనరులను, అవకాశాలను కూడా వినియోగించుకోకపోవడం వల్ల శత్రువు మానసిక యుద్ధాన్ని ఎదుర్కోవడంలో మనం సమస్యను ఎదుర్కొంటున్నాం.

ముందే చెప్పినట్టుగా మన ప్రచారంలో ఇంటింటికీ చేరడం, మనిషి నుండి మనిషికి అందడం అనేది ప్రధానంగా ఉంటుంది. అందుకని మన ప్రచార సామగ్రి, మన ప్రచార కార్యకలాపాలు ప్రజల వద్దకు నేరుగా వెళ్లడం అనేదే కాకుండా, ప్రతి ఒక్కరం, ముఖ్యంగా నిర్మాణకృషిలో, ప్రజల్లోని వివిధ రంగాల పనిలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తాము ప్రచార సైనికులం కూడా అనే విషయాన్ని మరింత లోతుగా గుర్తించాలి. శత్రు మానసిక యుద్ధంలో ముందుకొస్తున్న అంశాలను శ్రద్ధగా పరిశోధించడం, తెలుసుకోవడం, ప్రజల్లో చర్చకు పెట్టడం, వాటిని తిప్పికొట్టడం, ఓడించడం అనేది మరింత ఎక్కువగా మన కార్యాచరణలో భాగం కావాలి. ఇందులో మన వైఖరి ఎప్పుడైనా గానీ ప్రజల్లో ఉన్న అన్ని భావాలనూ వెలికి తీయడం, తర్వాత వాటిలో వారి ప్రయోజనాలకు వ్యతిరేకమైనవాటిని ఒక్కొక్కటిగా తీసుకుని ఓపిగ్గా, తగిన వాదనలు, సత్యాలు, రుజువులతో వారిని అర్థం చేయించడం, వారిని ఒప్పించడంగా ఉండాలి. ఈ విషయంలో ఎట్టి పరిస్థితిలోనూ మనం ముందే మనం సరైనవి అనుకునే భావాలన్నిటినీ వారి ముందు కుప్పేసి, మనం చెప్పేవారుగా, వారు వినేవారుగా మిగిలిపోయేలా చేయకూడదు. దీనివల్ల మనకు పెద్దగా ఒరిగేదేమీ వుండదు.

తర్వాతి అంశం ఈ రంగంలో మన ఐక్యసంఘటన అవగాహనకు సంబంధించినది. శత్రువును గానీ, వాడి మానసిక యుద్ధాన్ని గానీ ఓడించగలిగేది మన విప్లవమే, మన పార్టీనే. అయితే ఈ విప్లవ ప్రచార యుద్ధాన్ని చేసేది మాత్రం మనం ఒక్కరమే కాదు. ఇది విప్లవాన్ని కోరుకునే, అది అవసరమైన ప్రజలందరి విస్తృత భాగస్వామ్యంతో జరగాల్సిన యుద్ధం. మన విప్లవం భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం కనుక

ముందుగా మనం గుర్తించాల్సింది ఈ రెంటికీ వ్యతిరేకంగా జరిగే ఎటువంటి ప్రచారం అయినా మొత్తంగా మన సమాజాన్ని నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థగా రూపొందించడంలో తమ వంతు పాత్ర నిర్వహిస్తాయనేది. అందుకని ఈ దేశంలో నిజమైన ప్రజాస్వామ్యం నెలకొనాలనే ఆకాంక్షలతో వేర్వేరు రంగాల్లో జరగాల్సిన ప్రజాస్వామికీకరణకు సంబంధించి ప్రచారం చేసే ఏ శక్తులనైనా మనం కలుపుకొచ్చుకోవాలి. మన విప్లవ ప్రచారం మా-లె-మా, నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాల ప్రాతిపదికగా కొనసాగిస్తూనే, దాన్ని కేంద్రంలో ఉంచి భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రచారం చేసే శక్తులను ఒక విశాలమైన ప్రజాప్రచార రంగంలోకి తీసుకురావడానికి (వివిధ రూపాల్లో, వివిధ స్థాయిల్లో) మనం తీవ్రంగా కృషి చేయాలి.

''మంచి కమ్యూనిస్టులు పరిస్థితిని మొత్తంగా పరిగణించడంలో, మెజారిటీని దృష్టిలో పెట్టుకుని ఆలోచించడంలో, మిత్రులతో కలిసి పని చేయడంలో దిట్టలుగా ఉండాలి. ఈ విషయాలను ఉల్లంఘించేవారు మంచి పార్టీ సభ్యులు కాలేరు,'' అని మావో అనడం వెనుక ఉన్న వుద్దేశాల్ని మనం దృష్టిలో ఉంచుకోవాలి. *(మావో, నూతన దశ గురించి, అక్టోబర్ 12-14, 1938)*

మన శక్తి ఎప్పుడైనాగానీ విప్లవ విజయం సాధించేవరకూ, ప్రత్యేకించి వ్యూహాత్మక ఎదురుదాడి వరకూ, శత్రు శక్తికంటే తక్కువే ఉంటుంది. ప్రచార రంగంలో ఇది మరింత వాస్తవం. అందుకని మన శక్తిని ఎన్నో రెట్లు పెంచుకోవాలంటే దానికి ఈ రంగంలో కృషి చేసేవారిలో అత్యధికులను మనవైపుకు గెలుచుకోవడం అత్యవసరం. భారీ యంత్రాంగంతో శత్రువు సాధించిన ఆధిక్యతను, ఈ దేశంలో భూస్వామ్యాన్నీ, సామ్రాజ్యవాదాన్నీ ఎదిరించే అన్ని శక్తులనూ కలుపుకోవడం ద్వారానే మనం అధిగమించగల్గుతాం. అందుకు ముందుగా మనం వీరంతా కూడా శత్రు మానసిక యుద్ధాన్ని ఓడించడంలో కృషి చేయగల్గిన సైనికులు అనే భావనను మరింతగా ఒంటబట్టించుకోవడం అవసరం.

వివిధ ప్రజాస్వామిక శక్తులు, ఈ వ్యవస్థ వల్ల బాధితులవుతున్న వివిధ సామాజిక సెక్షన్లు, జాతి విముక్తి పోరాట శక్తులు, ఉదారవాద శక్తులను మనం ఇందులో కలుపుకొచ్చుకోవాలి. అయితే వీరు చేసే ప్రచార కృషిలో మార్క్సిజానికి పొసగనివి, ఒకోసారి వ్యతిరేకమైనవి అయిన భావాలు కూడా ఉంటాయి. వారు మార్క్సిస్టులు కారు కనుక ఇది అనివార్యం. అందుకని పాలకవర్గాలతో ప్రచార పోరాటంలో మనం వీరితో ఐక్యసంఘటనను కట్టినప్పటికీ మన విప్లవ ప్రచారం ద్వారా మిత్రపూర్వకమైన వైఖరితోనే వారి భావాలలోని లోపాలను మనం చైతన్యయుతంగా ఎత్తిచూపుతూ ఉండాలి. లేకుంటే వారి మాట, శైలి శక్తివంతంగా ఉంటుంది కనుక మార్క్సిస్టు వ్యతిరేక భావాలు ప్రజల్లో బలంగా ప్రచారం అవుతాయి.

వీరందరినీ ప్రచార రంగంలో కలుపుకొచ్చుకోవడం అనేది వారితో కూడిన ప్రత్యేక నిర్మాణాల ఏర్పాటు, మన ప్రచార కృషిలో వారి నుండి సేవలను కోరడం అనే రెండు రూపాల్లో చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక నిర్మాణాలు అన్నప్పుడు అవి సంఘాలు, వేదికల రూపంలోనూ, ప్రత్యేక ప్రచార నిర్మాణాల రూపంలోనూ (ఉదా:కు కొన్ని పత్రికలు, రేడియో, టివి ఛానెళ్ల స్థాపన) కూడా ఉంటుంది.

ప్రజాయుద్ధం ప్రజల విస్తృత భాగస్వామ్యంతోనే నిజమైన ప్రజాస్వభావాన్ని సంతరించుకున్నట్టే, నూతన ప్రజాస్వామిక విప్లవం అవసరమైన అన్ని వర్గాలనూ, సెక్షన్లనూ విప్లవ ప్రచారయుద్ధంలో భాగస్వాములను చేయడం ద్వారానే అది కూడా ప్రజాస్వభావాన్ని సంతరించుకుంటుంది.

మనం పూర్తిగా విప్లవ క్యాంపు నుండి చేపట్టే విప్లవ ప్రచారంలో గానీ, ఇతర భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద శక్తులు చేపట్టే ప్రచారంలో గానీ ప్రతి ఒక్క ప్రచారకృషిలో అంత:సూత్రంగా పని చేయాల్సిన అత్యంత ముఖ్యమైన సూత్రం 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అనేది. ఇది సాధారణంగా మనం పాటిస్తున్నప్పటికీ ఇందులో చాలా లోపాలు కొనసాగుతున్నాయి. దీనిని పార్టీలో 'క్యాడర్ల నుండి క్యాడర్ల వద్దకు', ప్రజాసైన్యంలో 'సైనికుల నుండి సైనికుల వద్దకు' అనే రూపాల్లో కూడా మనం పాటించాల్సి ఉంటుంది. అప్పుడే మన ప్రచారం అత్యధికులను కూడగట్టి నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా, సజీవంగా, వాస్తవాలతో కూడుకుని ఉంటుంది. ఇతరుల మనసులను కూడా గెలుచుకోగల్గుతుంది. ప్రచారంలో రొడ్డగొట్టుడు విధానం అనేది మనకు అంతర్గత శత్రువు వంటిది. వర్గశత్రువులు ప్రజావ్యతిరేకులు కాబట్టి మనం ఓడించగలమేమో గానీ రొడ్డగొట్టుడు ప్రచారం అనేదాన్ని వదిలించుకోకపోతే మనం ప్రజలను గెలుచుకోలేం. దాన్ని అధిగమించడానికి ఏకైక మార్గం 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అనేదాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే. ప్రచార కార్యకర్తలే కాక ప్రతి ఒక్కరూ మన ప్రచారాన్ని సజీవంగా, సమర్థవంతంగా కొనసాగించాలి అనే ప్రేరణను కలిగి ఉంటేనే అందరి శక్తియుక్తులూ కలగలసి శత్రు మానసిక యుద్ధాన్ని మనం ప్రభావవంతంగా తిప్పికొట్టగల్గుతాం.

మన సిద్ధాంతం, మన పంథా, మన రాజకీయాలు, మన ఉద్యమం, మన ప్రజాయుద్ధం అన్నీ న్యాయమైనవి, ప్రజానుకూలమైనవి, శాస్త్రీయమైనవి. కనుక మనం మన భావాలను, వాదనలను బలంగా, ఎటువంటి అస్పష్టత, శషభిషలూ, నీళ్లు నమలడాలు లేకుండా సూటిగా, స్పష్టంగా ప్రజల ముందుంచాలి. ఇందుకోసం మా-లె-మా మీద, మన పార్టీ డాక్యుమెంట్లు, పాలసీలలో ఉన్న మన పార్టీ పంథా, రాజకీయాల మీదా మనకు మంచి

పట్టు ఉండడంతోపాటు సమకాలీన దేశీయ, ప్రపంచ రాజకీయార్థిక పరిణామాలపై, చరిత్రపై కూడా పట్టు ఉండాలి. ఇది లేకుండా మన ప్రచారం అత్యంత పేలవంగా తయారవుతుంది. ప్రజాయుద్ధం చేయడానికే కాదు, అందులో భాగంగా ప్రచార యుద్ధాన్ని చేయాలన్నా ఇది ఒక ముందుషరతు. ఈ విషయంలో మన కార్యకర్తలకు తగినంత పట్టు లేకపోవడం అనేది కూడా రోజువారీ నిర్మాణ కృషిలో గానీ, మన ప్రచార సామగ్రిలో గానీ ఒకోసారి పసలేకపోవడానికి దారి తీసి ప్రజలను మనం ఎంతగా ఒప్పించాలో అంతగా ఒప్పించలేకపోతున్నాం.

ఇంకా అనేక లోపాలు మన విప్లవ ప్రచార కృషిలో జరుగుతుండచ్చు గానీ ప్రధానంగా పై విషయాలను దృష్టిలో పెట్టుకుని వాటిని అధిగమించగలిగితే మన ప్రచార కృషిలో ఒక గెంతును సాధించడం సాధ్యం కావచ్చు.

ఇందుకు

ముందుగా అసలు మనం ఈ గెంతును సాధించాలి, లేకుంటే శత్రు మానసిక యుద్ధాన్ని ఎదుర్కోలేం అనే గుర్తింపు ఉండాలి.

అమరులు ఎంతో రక్తాన్ని చిందించడం ద్వారా, మన ప్రజలు ఎన్నో త్యాగాలను రోజువారీగా చేస్తుండడం వల్ల మనం సాధించిన విజయాలను, నిర్మించిన ఉద్యమాన్ని ప్రజాశత్రువులు తమ మానసిక యుద్ధం ద్వారా దారుణంగా చిత్రీకరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారనీ, దీన్ని ఓడించి తీరాలనే ఒక దృఢసంకల్పం, వర్గకసి ఉండాలి.

దీనిని ఓడించి తీరతామనీ, ఓడించి తీరడం అత్యంత శాస్త్రీయమైన మా-లె-మా ను చేబూనిన మనకే సాధ్యం అనే గొప్ప ఆత్మవిశ్వాసం ఉండాలి.

ప్రజల సృజనాత్మకతను పెద్దెత్తున వెలికి తీసే, విప్లవ ప్రచార యుద్ధంలో వారిని భాగస్వాములను చేసే పని పద్ధతులు ఉండాలి.

మావో వలే వ్యూహాత్మకంగా శత్రువును కాగితపు పులిగా గేలి చేస్తూ ప్రజలను ఉత్సాహపరిచే సాహసం ఉండాలి.

ఎత్తుగడలపరంగా శత్రువు పులి స్వభావాన్ని గుర్తెరిగి ప్రతి రోజూ దాని కోరలు పీకేందుకు ఒకరికి వ్యతిరేకంగా పదిమందిని సన్నద్ధపరచి ఈ గొప్ప కార్యాచరణలోకి వారిని దింపే అకుంఠిత దీక్ష ఉండాలి.

ఇవీ విప్లవ ప్రచారయుద్ధంలో నేడు మనకు అవసరమైన ఆయుధాలు. *

‘‘దేశంలోని అన్ని ప్రాంతాలకూ పార్టీ ప్రచారాన్ని విస్తరించడం పట్ల శ్రద్ధ పెట్టాలి. ఏ సంఘటనలైనా, అవి చిన్నవి గానీ, పెద్దవి గానీ, గ్రామాలు, క్సియాన్‌లు, ప్రావిన్సులు, వాణిజ్య నగరాలు లేదా పట్టణాల్లో ఎక్కడ జరిగినా గానీ, పార్టీ దృష్టిని దాటిపోకూడదు. కేంద్ర ప్రచార విభాగం, అన్ని ప్రావిన్సు ప్రచార విభాగాలు ఇటువంటి విషయాలతో వ్యవహరించడంలో ఎత్తుగడలను నిర్ణయించుకోవడానికి మన పార్టీ ఏజెంట్లుగా (ప్రతినిధులుగా) పని చేస్తాయి. అందుకని ఒక ఘటన జరిగిన ప్రతిసారీ అన్ని విభాగాలు ముందుగా పార్టీలో ప్రతి ఒక్కరికీ, అలాగే దేశంలోని ప్రజలందరికీ ఒక సరి అయిన నివేదికను సమర్పించాలి - అందులో ఆ ఘటనకు కారణాలను, జాతీయ విప్లవంపై దాని ప్రభావాలను వివరించాలి, తర్వాత పార్టీ విధానాలను ముందుకు తీసుకుపోవడానికి దాన్ని ఏ విధంగా వినియోగించుకోవాలనే విషయంలో సూచనలు చేయాలి.

‘‘సైన్యంలో, మిలటరీ సప్లైల విభాగం అన్ని యూనిట్లకు యూనిఫాంలు, ఆయుధాలు సప్లై చేస్తుంది. పార్టీలోని ప్రచార విభాగం కూడా సైన్యంలో సప్లైల విభాగం చేసేలాంటి పనినే చేస్తుంది. అది పార్టీ సభ్యులకూ, ప్రజలకూ కూడా రాజకీయ జ్ఞానాన్నీ, ఆచరణకు వ్యూహాన్నీ అందిస్తుంది. తద్వారా కష్టతరమైన జాతీయ విప్లవ క్రమంలో కఠోరమైన పోరాటం చేసేలా, ఘర్షించే భావాలు, భావోద్వేగాల మధ్య పార్టీ వైఖరిని ఎత్తిపట్టేలా వారిని తయారు చేస్తుంది. ప్రచార విభాగం సామ్రాజ్యవాదుల, విప్లవ ప్రతీఘాతుల దుష్టశక్తులను ఎలా ఓడించాలనే విషయంలో పార్టీ సభ్యులందరికీ బోధన చేయాలి. అంతకంటే ముఖ్యంగా, అది భావోద్వేగాలకు కొట్టుకుపోయే, నిరాశకు గురయ్యే లేదా ఆత్మవిశ్వాసం కొరవడిన పార్టీ సభ్యులను గట్టి, దృఢమైన విప్లవశక్తిగా తయారు చేయాలి.

‘‘ప్రచార విభాగం పార్టీ యూనిట్లన్నిటిలోకెల్లా అత్యంత సజీవమైన, తక్షణం అత్యంత తెలివిగా సృజనాత్మకంగా స్పందించే విభాగంగా ఉండాలి. పుస్తకాలు, కరపత్రాలు రాయగలిగేవారు, వ్యాసాలను, వ్యాఖ్యానాలను ఎడిట్ చేయగలవారు, తీర్మానాలను, నినాదాలను రాయగలిగేవారు ప్రచార విభాగం పనిలో పాలుపంచుకోవాలి. స్వయంగా ఈ పని చేయలేని రచయితలు, విలేకరులు తమ సమయం, శక్తులలో కొంత భాగాన్ని ప్రచార విభాగం పనికి కేటాయించాలి. ఆ దృష్టికోణంతో చూసినప్పుడు పార్టీ విధానాలను అమలు చేయడం కోసం పార్టీలో

ఉన్న మానసిక శ్రమనంతా ఒకచోటకు చేర్చి, దాన్ని వినియోగంలో పెట్టి దానికి దిశానిర్దేశం చేసే పార్టీ సాధారణ యూనిట్టే ప్రచార విభాగం అంటే.

''ప్రచార విభాగానికీ, పార్టీ సభ్యులకూ మధ్య, అలాగే ప్రజలతోనూ వారి ఇచ్చిపుచ్చుకునే సంబంధాలకు (కమ్యూనికేషన్‌కు) అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ప్రచార విభాగం విడుదల చేసే డాక్యుమెంట్లూ, ఆదేశాలూ పార్టీ సభ్యులు అమలు చేసే విధంగా లేకపోతే లేదా అమలు చేసే విధంగా ఉన్నా గానీ, ప్రజల అవసరాలను తీర్చేలా లేకుంటే, ఎటువంటి ప్రచార కార్యక్రమాలైనా గానీ చేయడంలో ఏమీ అర్థం లేదు, ప్రచార విభాగం ఎందుకూ కొరగానిదిగా మిగిలిపోతుంది. ప్రచార విభాగంలో వేగవంతమైన రవాణా, లోపరహితమైన నిర్మాణ వ్యవస్థ ఉండడం అనేదే ప్రచార సామగ్రిని (అందరికీ) సకాలంలో అందించేందుకు హామీగా నిలుస్తుంది. కేంద్ర ప్రచార విభాగం నిర్ణీత కాలవ్యవధి ప్రకారం రాష్ట్రాల ప్రచార విభాగాలతో, పార్టీలోని వేర్వేరు విభాగాలతో, వేర్వేరు ప్రజాసంస్థలతో ఉత్తరాలు, టెలిగ్రాములు, ప్రత్యేక కొరియర్ల ద్వారా దగ్గరి సంబంధాలను నెరపాలి.

''మన పార్టీ అధీన ప్రాంతాల్లోని భూభాగాల్లో ఉన్న ప్రచార విభాగాలన్నీ జెనరల్ ప్రచారపనికి తమను తాము మనస్ఫూర్తిగా అంకితం చేసుకుని, మన పార్టీ ప్రభుత్వం పట్ల ప్రజారాశుల మద్దతునూ, సానుభూతినీ గెలుచుకోవాలి.''

- చైనీస్ కొమింటాంగ్ రెండవ జాతీయ కాంగ్రెస్‌లో ప్రచారం మీద ఆమోదించిన తీర్మానం (జనవరి 16, 1926)

''ఎర్రసైన్య ప్రచార కృషిలో ఎర్రసైన్యానికి చెందిన ప్రచార బృందాలు ముఖ్యమైన సాధనాలు. ప్రచార బృందాలను మంచిగా సంఘటితం చేయకపోతే, ఎర్రసైన్యానికి చెందిన ప్రచార కృషిలో ఒక పెద్దభాగం వృధా అవుతుంది. అందుకని, ప్రచార బృందాలను పున:సంఘటితం చేయడం, వాటికి శిక్షణనివ్వడం అనేది ప్రస్తుతం పార్టీ తన శక్తియుక్తులను మరింతగా అంకితం చేయాల్సిన కర్తవ్యాల్లో ఒకటిగా వున్నది. సైద్ధాంతిక దృష్టికోణంతో చూసినప్పుడు, ఈ కృషిలో మొదటి అడుగు, ఆఫీసర్లలోనూ, సైనికులలోనూ విస్తారంగా నెలకొని ఉన్న ఒక వైఖరిని, అంటే ప్రచార కృషినీ, ప్రచార బృందాలనూ తక్కువ చేసి చూసే వైఖరిని సరిచేసుకోవడం.''

- చైనా కమ్యూనిస్టు పార్టీ ముసాయిదా తీర్మానం, 1929

# సెంట్రల్ రీజియన్‌లో పార్టీ విద్య - ఒక నివేదిక

**- గౌతమ్**

పార్టీలో కేడర్‌ను సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా అభివృద్ధి చేయడం కోసం విశేషంగా కృషి చేసి విలువైన అనుభవాలు అందించే క్రమంలో అమరులైన విద్యారంగానికి చెందిన ఏ.పి. కామ్రేడ్స్ బాబూరావు, మాధవి, కొమ్మ (ఏ.ఓ.బి.), మహిత (రీపోస్), డి.కె. కామ్రేడ్స్ చందన, గజ్జెల సరోజ, దర్బార్‌సింగ్‌లకు వినమ్రంగా జోహార్లు చెబుదాం. వారి ఆశయసాధనకు పార్టీలో సైద్ధాంతిక రాజకీయ కృషిని పెంపొందిద్దాం.

మన పార్టీ నాయకత్వం మొదటి నుండి పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసి నిర్మాణపరంగా పటిష్టం చేయడానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేసింది. మన పార్టీ తీవ్ర నిర్బంధం, కష్టనష్టాల మధ్యనే ఉద్యమ మలుపులను దృష్టిలో పెట్టుకొని లక్ష్యసాధనకు కేడర్‌ను ఎడ్యుకేట్ చేసుకోవడానికి కృషి చేసింది.

మన ఉద్యమం గ్రామీణ, అటవీ ప్రాంతాలకు విస్తరించే క్రమంలో పార్టీ పొందికలో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని రైతాంగ, ఆదివాసీ కామ్రేడ్స్ కోసం ప్రాథమిక విద్యను నేర్పడానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేసింది. కొన్ని ప్రాంతాలలో దానికి అవసరమైన నిర్మాణాలు కూడా ఏర్పరచింది. పార్టీ అన్ని పి.ఎల్.జి.ఏ. యూనిట్లలో దైనందిన జీవితంలో రెగ్యులర్‌గా విద్యాకృషి నడిపించింది. వివిధ రంగాలలో శిక్షణా తరగతులు, వర్క్‌షాపులు నిర్వహించింది. ప్రజలను ఎడ్యుకేట్ చేయడానికి విశేషంగా కృషి చేసింది. గెరిల్లా బేసుల్లోనూ, కొన్ని బలమైన ఉద్యమ ప్రాంతాల్లో నూ పిల్లల చదువుకు ప్రాథమిక స్కూల్స్ నిర్వహిస్తోంది.

నూతన పార్టీ ఏర్పడిన తర్వాత ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ (దీనిలో భాగంగా రాష్ట్ర స్థాయి నుండి జిల్లా/ఏరియా స్థాయి వరకు జరిగిన పార్టీ కాన్ఫరెన్స్‌లు) సన్నాహాలు-నిర్వహణలో భాగంగా యావత్తు పార్టీలో అతి పెద్ద దేశవ్యాప్త సైద్ధాంతిక, రాజకీయ క్యాంపెయిన్ నిర్వహించాము. సెంట్రల్ రీజియన్ అంతటా కూడా ఈ క్యాంపెయిన్ కొనసాగింది. 2011-12లలో సెంట్రల్ రీజియన్‌లోని అన్ని స్పెషల్ జోన్లలో, డివిజన్లలో జరిగిన పార్టీ ప్లీనాలు మరో పెద్ద ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌లా నిర్వహించుకున్నాం. 2009-10 నాటి రెక్టిఫికేషన్-ఎడ్యుకేషన్ మరియు 2013-14 నాటి బోల్షివైజేషన్ క్యాంపెయిన్లు పార్టీని విద్యావంతం చేశాయి. మార్క్సిజం-లెనినిజం-మావోయిజంతో పాటు మార్క్సిస్టు బేసిక్స్‌పై క్లాసులు చెప్పడం ద్వారా కేడర్ అవగాహన పెంచడం జరిగింది.

పార్టీలోకి, పి.ఎల్.జి.ఏ.లోకి చేర్చుకున్న నూతన రిక్రూట్లకు నిర్వహించే రాజకీయ, సైనిక శిక్షణా క్యాంపులు, మిలటరీ శిక్షణా క్యాంపులు, సాంస్కృతిక వర్క్‌షాపులు, వివిధ విభాగాల శిక్షణ, ఫీల్డ్ ట్రైనింగ్, ఆర్పీసీల/జనతన సర్కార్ల ఎన్నికల సభలు-వర్క్‌షాపులు, ప్రజాసంఘాల మహాసభలు, పార్టీ పిలుపులు - ఇలా ఎన్నో రకాలుగా కేడర్‌ను, ప్రజలను ఎడ్యుకేట్ చేయడం జరుగుతోంది.

పార్టీ, పి.ఎల్.జి.ఏ., ప్రజాసంఘాల పత్రికలు, అవి ప్రచురించే పుస్తకాలు, రాజకీయ ప్రచారం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిత్యం జరుగుతున్న కృషి, పార్టీ, పి.ఎల్.జి.ఏ.

యూనిట్లలో రోజువారీ సమిష్టి అధ్యయనం, అధ్యయనానికై వ్యక్తిగతంగా చేసే కృషి కూడా పార్టీ ఎడ్యుకేషన్‌లో భాగమే.

పార్టీ కమిటీల, పి.ఎల్.జి.ఏ. కమాండ్ల, వివిధ ప్రజాసంఘాల, ఐక్యసంఘటనా వేదికల సమావేశాలతో పాటు అవి సజీవంగా పనిచేయడం ద్వారా నిరంతరం విద్యావంతం అవుతున్నాయి.

## దండకారణ్య (డి.కె.) స్పెషల్ జోన్‌లో విద్యా కృషి

దండకారణ్యంలో అత్యధిక సంఖ్యలో (లక్షన్నర) శత్రు బలగాలు, కార్పెట్ సెక్యూరిటీ, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, ఎన్‌కౌంటర్లు, హత్యలు, అత్యాచారాలు, అరెస్టులు, కాల్పులు, విధ్వంసం మధ్యనే మన కామ్రేడ్స్ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో జనతన సర్కార్ స్కూళ్లు శత్రుదాడులకు కేంద్రంగా మారాయి. శత్రు బలగాలు ఇప్పటికే దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, మాడ్, తూర్పు బస్తర్, ఉత్తర బస్తర్‌లలో ఆశ్రమ పాఠశాలలపై దాడిచేసి కాల్చి బూడిద చేయడమే గాకుండా ప్రతిదానిని ధ్వంసం చేశారు. ఆదివాసీ ప్రజలు విద్య, వ్యవసాయం, వైద్యం తదితర విషయాల్లో సాధిస్తున్న పురోగతిని శత్రువు సహించలేక పోతున్నాడు. ఇక్కడ ఎదుగుతున్న  ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థ నిర్మాణాన్ని శత్రువు సహించలేక పోతున్నాడు. పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఏ., ప్రజలు సాహసోపేతంగా శత్రుబలగాల దాడులను తిప్పికొడుతూనే అన్ని రంగాల్లో వలెనే విద్యారంగంలో కొన్ని మంచి ఫలితాలు సంపాదిస్తున్నారు. పార్టీ, సైన్యంలో ప్రాథమిక విద్యకై 'మాస్', రాజకీయ విద్యకై 'మోపోస్', ప్రత్యేక విద్యకై 'బిసిటిఎస్', మిలటరీ శిక్షణకై 'మొబైల్ పొలిటికో-మిలటరీ స్కూల్'ని ఏర్పరచుకొని ప్రణాళికాబద్ధంగా శిక్షణనందిస్తున్నారు.

**మొబైల్ అకడమిక్ స్కూల్ (MAS) :** ఈ స్కూలు 2001లో ఏర్పడింది.

మొదటి దశ పుస్తకాలు [(1) భాష; (2) గణితం; (3) రాజ్యాంగ యంత్రం; (4) మానవ విజ్ఞానం] రాసి, ఆ సబ్జెక్టులపై MAS టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అప్పటి నుండి MAS రెగ్యులర్‌గా పనిచేస్తున్నది. మొదట డి.కె. అంతటికీ ఒకే యూనిట్ ఉండేది. తర్వాతి కాలంలో 2005-08 మధ్య మూడు రీజియన్లలోనూ మాస్ యూనిట్స్ ఏర్పడ్డాయి. క్లాసుల్లో ప్రతి బ్యాచ్‌లోను 25-30 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. మొదట 20 రోజులు క్లాసులు నిర్వహించారు. పెరిగిన నిర్బంధం కారణంగా క్లాసులు 18 రోజులకూ, ఆ తర్వాత 15 రోజులకూ  తగ్గించాల్సి వచ్చింది.

రెండవ రౌండు కోర్సు పుస్తకాలు [(1) సామాజిక విజ్ఞానం; (2) ఆదివాసీ సంస్కృతి; (3) డి.కె. చరిత్ర; (4) మానవ శరీర నిర్మాణం] 2007లో కొన్ని, తర్వాత కొన్ని తయారు చేసి క్లాసులు చెప్పారు. డి.కె.లో జరిగిన మొత్తం మాస్ క్లాసుల్లో.....మంది కామ్రేడ్స్ శిక్షణ పొందారు. ఈ శిక్షణ చాలా మంచి ఫలితాన్నిచ్చింది.

**మొబైల్ పొలిటికల్ స్కూల్ (మోపోస్) :** 2000 సంవత్సరంలో డి.కె.లో మోపోస్

యూనిట్ ఏర్పడింది. నోట్సులు తయారు చేశారు. మొదట మార్క్సిస్టు ఫండమెంటల్స్, పార్టీ డాక్యుమెంట్లపై, పార్టీ పాలసీ డాక్యుమెంట్లపై క్లాసులు చెప్పారు. డి.కె. కామ్రేడ్స్‌లో అత్యధికులు సామాజికంగా బాగా వెనుకబడిన ప్రాంతాలలో పుట్టి పెరగడం వలన వారిని సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సాంస్కృతిక విషయాల్లో ఎదిగించుకోవడానికి స్టడీ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపులలో పై సబ్జెక్టులతో పాటు పార్టీ చరిత్ర, బస్తర్ పోరాట చరిత్ర, పార్టీ నిర్మాణంపై క్లాసులు జరిగాయి. ఒక ఎస్.జడ్.సి.ఎం. తప్పనిసరిగా ప్రతి క్యాంపులో ఉండాలనీ, పార్టీ అనుభవాలను, అప్పటి దేశీయ-అంతర్జాతీయ పరిణామాలను జోడించి చెప్పాలని నిర్ణయించుకొని అమలు చేశారు. ఇది ఆ కామ్రేడ్స్ ఎదుగుదలకు తోడ్పడి మంచి ఫలితాలను ఇచ్చింది.

క్లాసుల నిర్వహణలో ఎదురైన పలు సమస్యలను పరిష్కరించుకున్నారు. క్లాసులు, స్టడీక్యాంపుల రూపంలో అన్ని స్థాయిల కామ్రేడ్స్‌కు రాజకీయాలు అందించారు. ఇంతవరకు జరిగిన ఈ క్లాసుల్లో మొత్తం .... మంది కామ్రేడ్స్ శిక్షణ పొందారు. డి.కె.లో పెరుగుతున్న ఉద్యమ అవసరాలకు ఈ రాజకీయ కృషి ఇతోధికంగా తోడ్పడింది.

**బేసిక్ కమ్యూనిస్ట్ ట్రైనింగ్ స్కూల్ (బి.సి.టి.ఎస్.) :** పార్టీ విప్లవోద్యమ అవసరాలకు అనుగుణంగా కొద్దిమందిని ఎంపిక చేసి సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా, టెక్నికల్‌గా, సాంస్కృతికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ స్కూలును నిర్వహిస్తున్నారు. ఇది 2009లో ప్రారంభమయ్యింది. ప్రతి సంవత్సరం ఒక్కో బ్యాచ్ (20-25 మంది) విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. మొదటి రెండు బ్యాచీల ఎంపిక తదితర విషయాలలో జరిగిన లోపాలను సమీక్షించి వాటిని సరిదిద్దుకొని తర్వాత కాలంలో తర్ఫీదును మెరుగుపర్చారు. సెలక్షన్ ప్రమాణాల నుండి, వారికి చెప్పే విషయాల వరకు తగిన శ్రద్ధ చూపడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. పెరిగిన నిర్బంధం రీత్యా సమయాన్ని ఆరు నెలల నుండి నాలుగు నెలలకు తగ్గించారు. గతంలో అనేక సబ్జెక్టులు చెప్పడం, స్థాయికి మించి చెప్పడం జరిగిందని సమీక్షించారు. ఇప్పుడు వారికి సిలబస్ తయారు కావడం, కోయలోకి అనువాదం అయిన ప్రింటెడ్ బుక్స్ ఇవ్వడం వలన చాలా ఉపయోగకరంగా ఉంది. ఇందులో అకడమిక్ (మాస్ స్కూల్ పుస్తకాల లాంటి) సబ్జెక్టులు, రాజకీయ (మోపోస్ పుస్తకాల లాంటి) సబ్జెక్టులు బోధిస్తున్నారు. స్కూల్ ముగింపుకు ముందు ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రజలతో కలిసి ఉత్పత్తిలో పాల్గొనడం, ప్రజలతో మమేకం కావడం చేస్తున్నారు. ప్రజలు వీరిని ఎంతో ఉత్సాహంతో ఆహ్వానిస్తున్నారు. డి.కె.లో ఇదొక విజయవంతమవుతున్న ప్రయోగం.

**క్రాంతికారీ జనతన సర్కార్ స్కూళ్లు (KJSS) :** ఈ స్కూళ్లకు MAS కోసం తయారు చేసిన పాఠ్య పుస్తకాలు అందించారు. ఈ స్కూళ్ల టీచర్లకు శిక్షణనందించారు. అక్షరాస్యత ఆవశ్యకతను, ప్రజాస్వామికమైన, శాస్త్రీయమైన అవగాహనను పెంపొందించాల్సిన అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాఠ్యాంశాలను పార్టీయే నిర్ణయిస్తోంది. విద్యార్థుల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బోధనా పద్ధతులను రూపొందిస్తున్నారు. హిందీని మూడవ తరగతి నుండి, ఇంగ్లీషును 4వ తరగతి నుండి నేర్పిస్తున్నారు. కె.జె.ఎస్. స్కూళ్లలో బోధనా మాధ్యమం

కోయభాషగా ఉంది. స్కూలు వేళలు, సెలవు దినాలు, తదితర విషయాలు ప్రజల, విద్యార్థుల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని రూంపొందించి అమలు చేస్తున్నారు. ఉత్పాదక, సాంస్కృతిక (పండుగలు) కార్యకలాపాలకు అనుగుణంగా వీటిలో మార్పులు చేసుకుంటున్నారు. ఈ స్కూళ్లను ప్రజలే నడిపించుకోవడంతో ఇవి వారి పిల్లలకు పూర్తిగా అందుబాటులో ఉన్నాయి. దీనివల్ల ఈ స్కూళ్లు బాగా నడుస్తూ మంచి ఫలితాలు సాధించాయి. ఇవి ప్రజలపై మంచి ప్రభావాన్ని కలుగజేశాయి. బయట స్కూల్స్‌లో విద్యా ప్రమాణాల కన్నా మన స్కూల్స్‌లో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని, మరిన్ని స్కూల్స్ నిర్వహించి ప్రతి ఒక్క బాలిక/బాలుడు స్కూలులో చదువుకునే విధంగా కృషి చేయాలని ప్రజలు ప్రతిపాదించారు. వీటి నిర్వహణ, ఖర్చులు, రక్షణ తదితర బాధ్యతలను ప్రధానంగా జనతన సర్కార్లే నిర్వహిస్తున్నాయి. వీటికి చాలావరకు ప్రజల నుండి అన్ని రకాల సహకారం లభిస్తున్నది. మొత్తం జోన్‌లో 50కి పైగా స్కూళ్లు స్థానిక జనతన సర్కార్ల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటిలో 100కు పైగా టీచర్లు పనిచేస్తున్నారు. అందరూ పార్టీ సభ్యులే. వీరిలో ఎక్కువ మంది పార్ట్‌టైం పార్టీ సభ్యులే. దక్షిణ్ రీజియన్‌లో 9 ఏరియా స్థాయి ఆశ్రమ పాఠశాలలు నడుస్తున్నాయి. మాడ్‌లో ఉన్న స్కూల్స్ అన్నీ ఆశ్రమ పాఠశాలలే. ఇతర డివిజన్‌లలో కూడా కొన్ని ఆశ్రమ పాఠశాలలుగా నడుపుతున్నారు. శత్రు నిర్బంధం కారణంగా స్కూల్సు నిర్వహించే ప్రాంతాలను తరచుగా మార్చాల్సి వస్తున్నది. 2011నుండి ఈ స్కూళ్లను టార్గెట్ చేసి శత్రువు కొనసాగించిన దాడుల మూలంగా వీటిలో కొన్ని మూసివేసుకోవలసి వచ్చింది. నడుస్తున్న స్కూళ్లకు కూడా పనిచేసే రోజుల్ని తగ్గించారు. అవసరమైన చోట్ల వాటిని మొబైల్ పాఠశాలలుగా నడుపుతున్నారు. ఈ స్కూళ్లలో చదివే పిల్లల విద్యార్హతలను (స్కూల్ సర్టిఫికెట్లు), ప్రభుత్వ పాఠశాలల్లో గుర్తించరనీ, వీటిలో హిందీ, ఇంగ్లీషు భాషలు నేర్పరనీ, పైచదువులకు అవకాశం ఉండదనీ ఇలా వివిధ రకాలుగా శత్రువు ప్రచారదాడి చేస్తున్నాడు. అయితే వాస్తవం మరో విధంగా ఉంది. బైటి స్కూళ్ల విద్యా ప్రమాణాల కంటే మన స్కూళ్ల విద్యా ప్రమాణాలు ఉన్నతంగా ఉన్నాయి కనుక మనం మరిన్ని స్కూళ్లను నడపాలనీ, ప్రతి ఒక్క బాలిక/బాలుడు అందులో చేరేలా చూడాలనీ ప్రజలు ప్రతిపాదించారు. అంతేకాక, ఎటువంటి స్కూలు/విద్య ఎవరి ప్రయోజనాలను నెరవేరుస్తున్నవనేది అసలు విషయం. మన స్కూళ్లలో తమ పిల్లలకు ఉన్నత ప్రమాణాల్లో విద్య అందుతోందనే కాక, జీవితం పట్ల, సమాజం పట్ల వారికి సరైన దృక్పథం కూడా ఏర్పడుతోందని కూడా ప్రజలకు విశ్వాసం ఉన్నది. అయితే, పాఠశాలల విధ్వంసం, ఇతర నిర్బంధ చర్యలు, శత్రు మానసిక యుద్ధం, బూర్జువా పాఠశాలల ప్రభావం కొంతమంది ప్రజల మీద ఉందనేది మనకర్థమవుతోంది.

**ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంటల్ కమిటీ (ఇ.డి.సి.) :** 2006 నుండి ఒక ఎస్.జడ్.సి.ఎం. పూర్తిగా విద్యారంగంపై కేంద్రీకరించి పనిచేస్తున్నారు. 2007లో ఈ ఎస్.జడ్.సి.ఎం.తో పాటు విద్యను అందించగలిగే మరో ఇద్దరు డివిసి స్థాయి కామ్రేడ్స్‌తో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంటల్ కమిటీని ఏర్పరచారు. ఇ.డి.సి.కి 1) పై నాలుగు రకాల స్కూళ్లకు సిలబస్ తయారు చేయడం; 2) టీచర్లకు శిక్షణ ఇవ్వడం; 3) క్లాసులు చెప్పడం అనే మూడు ముఖ్యమైన కర్తవ్యాలు ఉన్నాయి. 2009 వరకు ఇ.డి.సి. డి.కె. లోని వివిధ స్థాయిల కామ్రేడ్స్‌కు

మార్క్సిజం ఫండమెంటల్స్, పార్టీ మౌలిక డాక్యుమెంట్స్, పార్టీ పాలసీ డాక్యుమెంట్లపై క్లాసులు చెప్పారు. 2009లో సి.ఆర్.బి. రీపోస్‌ని ఏర్పరచి రెండు రౌండ్ల సబ్జెక్టులను నిర్ణయించింది. అన్ని క్లాసులు రీపోస్ వారే చెప్పడం సాధ్యం కాదు గనుక ఇ.డి.సి. కామ్రేడ్స్ రీపోస్ టీచర్లతో కలిసి డి.కె., ఏ.ఓ.బి., ఎన్.టి. స్పెషల్ జోన్స్‌లో డివిసిఎంలకు అనేక బ్యాచ్‌లుగా క్లాసులు చెప్పారు. అలాగే రీజనల్ పి.ఎల్.జి.ఏ. కంపెనీలకు, ఎన్.టి., ఏ.ఓ.బి.లలో కింది స్థాయి కామ్రేడ్స్‌కి కూడా క్లాసులు చెప్పారు. దీనితో క్లాసుల విషయంలో డి.కె.లో కొంత గ్యాప్ వచ్చింది. 2013 నుండి మరలా డి.కె. మీదనే కేంద్రీకరించి క్లాసులు, టీచర్ ట్రైనింగ్ నిర్వహించారు.

సిలబస్ పుస్తకాల తయారీ (బిసిటిఎస్ పాఠ్యపుస్తకాలు తదితరమైన)లో రీపోస్ కామ్రేడ్స్ ఇ.డి.సి. కామ్రేడ్స్‌కు సహాయాన్ని అందిస్తున్నారు. విద్యాసంబంధిత విషయాల్లో ఈ రెండు కమిటీలు భావాలను, అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకుంటున్నాయి. తమ తమ కర్తవ్యాలను నెరవేర్చడంలో ఒకరికొకరు సహాయ, సహకారాలను అందించుకుంటున్నారు. ఇప్పుడు దరిదాపుగా అన్ని సబ్జెక్టులపై పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రింట్ చేసి ఇస్తున్నారు. ఇవే పుస్తకాలను జనతన సర్కార్ స్కూల్స్ టీచర్లకు, దళాలకు (ఎల్.ఓ.ఎస్., ఎల్.జి.ఎస్.) ఇస్తే మంచిదని అక్కడి నాయకత్వం ఆలోచిస్తున్నది.

డి.కె.లో విద్యావిభాగం మాస్, మోపోస్, బి.సి.టి.ఎస్., క్రాంతికారీ జనతన సర్కార్ స్కూళ్లు సహ-ఆశ్రమ పాఠశాలలు సమన్వయించి నిర్వహించడం వలన ఒక మంచి అనుభవాన్ని సంపాదించడంతో పాటు పార్టీ, ఉద్యమ ప్రయోజనాలు బాగా నెరవేరుతున్నాయి. మాస్, మోపోస్, ఇ.డి.సి.ల కృషి వలన వివిధ స్థాయిల్లోని పార్టీ కేడర్‌కు, బి.సి.టి.ఎస్., క్రాంతికారీ జనతన సర్కార్ స్కూల్స్‌లోని విద్యార్థులకు సిలబస్ పుస్తకాలు అందాయి. అనేక క్లాసులు జరిగాయి. స్కూల్స్ విజయవంతంగా నడిచాయి. వీటిని ఆయా నిర్మాణాలు సరిగా నిర్వహించే విధంగా డి.కె.ఎస్.జడ్.సి. ప్రోత్సహించి గైడ్ చేసింది. అలాగే డి.కె.లో ఉద్యమ స్థాయికి అనుగుణంగా ఆయా నిర్మాణాల స్థాయినీ, సమర్థతలను మెరుగుపర్చడానికి అన్ని పార్టీ కమిటీల నుండి ఇడిసికి ఇంకా తగినంత సహకారం అందాల్సి ఉంది. నేటికీ అధిగమించాల్సిన అంశాలు :

1. ఇ.డి.సి.ని లక్ష్యానికనుగుణంగా నూతన సిలబస్ తయారు చేయడానికి, పాత సిలబస్‌లను మెరుగుపర్చి, అప్‌డేట్ చేయడానికి, తగినన్ని క్లాసులు చెప్పడానికి మరింత బలోపేతం చేయాలి.
2. క్లాసులు చెప్పడం ప్రధానం కావడంతో ఇతర పనులు అనుకున్న విధంగా సకాలంలో జరగడం లేదు. అలాగే టీచర్లు తక్కువగా ఉండడంతో ఒక స్థాయికి క్లాసులు జరిగితే మరో స్థాయికి క్లాసులు సకాలంలో జరగడం లేదు. అన్ని స్థాయిలకు రెగ్యులర్‌గా రాజకీయ శిక్షణ అందడం అవసరం.
3. టీచర్స్‌ను రాజకీయంగానూ, వివిధ సబ్జెక్టుల పైననూ, టీచింగ్ మెథడ్స్ విషయంలోనూ అభివృద్ధి చేయడం కోసం మరింత కృషి చేయడం అవసరం.
4. టీచర్స్‌కు ఉద్యమ అనుభవం పెరగడానికి, ఫీల్డ్ స్టడీ చేయడానికి అనుగుణంగా

కనీస సమయం కేటాయించడం అవసరం.

5. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లు, టీచర్లు, యంత్రాంగం, బడ్జెట్ కేటాయింపులు ఒక క్రమంలో పెంచడం ద్వారా మాత్రమే విద్య విషయంలో ఉద్యమావసరాలను తీర్చగలగడం సాధ్యమవుతుంది. మన స్కూల్స్‌లో పైస్థాయి తరగతులను ఆరంభించాల్సి ఉంది.
6. మనకున్న పరిమిత అనుభవం, జ్ఞానంతోనే స్కూల్స్ నడుపుతున్నాం. బయట చాలా రకాల విజ్ఞానం, టీచింగ్ మెథడ్స్, టీచింగ్ ఎయిడ్స్ అభివృద్ధి చెందాయి. ఇడిసికి, టీచర్స్‌కు వాటిని అందించగలగాలి.
7. మాస్, మోపోస్ నిర్మాణాలు అన్ని డివిజన్స్, ఏరియాల్లోనూ, కంపెనీ, బెటాలియన్ ఫార్మేషన్స్‌లోనూ ఏర్పాటు చేసి వికేంద్రీకృత రూపంలో శిక్షణ ఇవ్వాల్సి ఉంది. లేకుంటే తీవ్ర నిర్బంధం మధ్య అవసరాలను అందుకోలేం. ఇప్పుడున్న సంఖ్య(టీచర్ల) చాలా పరిమితమైంది.
8. పార్టీ డివిసిలు ప్రత్యేక శ్రద్ధతో ఎడ్యుకేషన్‌పై కేంద్రీకరించకపోతే వందల బలగాలున్న డివిజన్స్‌లో ప్రాథమిక విద్య, రాజకీయ విద్య అరకొరగానే కొనసాగే అవకాశం ఉంది.
9. టీచింగ్‌కు సహకరించే పరికరాలు, విజువల్ (దృశ్య) సౌకర్యాలు అందించాలి. జనతన సర్కార్ స్కూల్ టీచర్స్‌కు శిక్షణా తరగతులు రెగ్యులర్‌గా జరపడంతోపాటు వర్క్‌షాపులు నిర్వహించాలి.
10. రాష్ట్ర, కేంద్ర కమిటీలు విద్యాబోధన, నిర్వహణ విషయాలను తనిఖీ చేయడం, మెరుగుపర్చడం కోసం కృషి చేయడం అవసరం. వీటితో పాటు నిర్బంధం తీవ్రం కావడం దృష్ట్యా భద్రత విషయాలను శ్రద్ధగా పట్టించుకోవాలి. నిర్బంధం వలన అకడమిక్, పొలిటికల్ విద్యాశిక్షణకు ఆటంకం కాకుండా జాగ్రత్తపడాలి.

## రీజినల్ పొలిటికల్ స్కూల్ (రీపోస్)

2009లో సెంట్రల్ రీజినల్ బ్యూరో (సి.ఆర్.బి.) పరిధిలో రీపోస్ ఏర్పడింది. సి.ఆర్.బి. పరిధిలో ఎంచుకున్న రెండు రౌండ్ల సబ్జెక్టులు అన్ని స్థాయిల్లోనూ చెప్పగలిగారు. డి.కె.లో, సెంట్రల్ రీజనల్ కమాండ్ గెరిల్లా బలగాల్లో డి.కె.ఇ.డి.సి. సహకారంతో రీపోస్ క్లాసులు విజయవంతం అయ్యాయి.

సి.ఆర్.బి. నిర్ణయించిన ఫస్ట్ రౌండ్ సబ్జెక్టులపై (మార్క్సిస్టు తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, భారత ఆర్థిక వ్యవస్థ, ఎత్తుగడలు) రీజియన్ వ్యాప్తంగా CC, Repos, DKEDC కామ్రేడ్స్ ఎస్.జడ్.సి.ల నుండి మొదలుకొని ఏ.సి.లలోని సీనియర్ సభ్యుల వరకు క్లాసులు నిర్వహించారు. ఈ క్లాసుల్లో సెంట్రల్ రీజియన్ బలగాల్లోని డివిసి స్థాయి కామ్రేడ్స్‌తో పాటు వివిధ రంగాలలోని ఎస్.జడ్.సి., డి.వి.సి. స్థాయి కామ్రేడ్స్ పాల్గొన్నారు.

2013లో దేశవ్యాప్తంగా చేపట్టిన బోల్షివీకరణ కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ రీజియన్ వ్యాప్తంగా అన్ని స్థాయిల్లో సైద్ధాంతిక, రాజకీయ, పార్టీ చరిత్ర, నిర్మాణ, సైనిక

సబ్జెక్టులపై అధ్యయనం, క్లాసులు ఆరంభమై ఒక క్యాంపెయిన్‌లా కొనసాగుతున్నాయి.

రీపోస్ కామ్రేడ్స్ నిర్వహించిన ఫీల్డు సర్వేలు తమ అవగాహన పెంచుకోవడానికి తోడ్పడ్డాయి.

1. A ప్రాంతంలోని జనతన సర్కార్లు నాలుగింటిని ఎంచుకొని స్థానిక నాయకత్వ సహకారంతో ఒక నెల రోజులు ఫీల్డ్ స్టడీ చేశారు. ప్రజలకు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వివరించడంతో పాటు సర్వేకు సంబంధించిన వివరాలు సేకరించారు. వారితో ఉన్న నాయకత్వానికి, టీం క్విజ్ పద్ధతుల్లో రోజూ రెండు గంటలు రాజకీయాలు చర్చించారు. సర్వే తర్వాత అక్కడ రాజకీయ కేంద్రీకరణలో కొనసాగుతున్న లోపంతో పాటు వర్గపోరాట అవసరాన్ని, విప్లవ భూసంస్కరణల అవసరాన్ని గుర్తు చేశారు. ఇది 2010లో చేశారు. ఈ సర్వేలో ఇ.డి.సి. కామ్రేడ్స్ కూడా ఉన్నారు.
2. B ఏరియాలో వారం రోజులు ఒక ఆర్.పి.సి. పని విధానాన్ని పరిశీలించటానికి ఫీల్డ్ సర్వే నిర్వహించి సంబంధిత కమిటీకి సూచనలు చేశారు.
3. C ఏరియాలో ఒక వారం రోజులు వర్గవిశ్లేషణ చేసి రాసిన రిపోర్టును ఎర్రజెండా పత్రికలో ప్రచురించారు. ఈ ఫీల్డు సర్వేలో సి.ఆర్.బి. ప్రెస్, క్రాంతి పత్రిక ఇ.బి. కామ్రేడ్స్ కూడా పాల్గొన్నారు.
4. D, E ఏరియాల్లో సర్వే చేసి రిపోర్టు రాశారు.
5. సూర్జాగఢ్ గనుల తవ్వకం (గడ్‌చిరోలి), రావుఘాట్ (ఉత్తర బస్తర్), బోధ్‌ఘాట్ (తూర్పు బస్తర్) సమస్యలను స్టడీ చేసి "ప్రస్తుత పరిస్థితి - ప్రజల ఆకాంక్ష - మన కృషి" అనే నివేదిక రాశారు. రీపోస్ సభ్యురాలు కామ్రేడ్ మహిత విడిగా చేసిన తూర్పు, పశ్చిమ బస్తర్ సర్వే రిపోర్టులలో ఉత్పత్తి, నిర్మాణ విషయాలు కూడా రాసింది.

రీపోస్ కామ్రేడ్స్ అవకాశం దొరికినప్పుడు కొన్ని స్పెషల్ జోన్ స్థాయి నుండి ఏరియా పార్టీ ప్లీనాలలో, ప్రజాసంఘాల, జనతన సర్కార్ల సభలలో అబ్జర్వర్స్‌గా పాల్గొనడం ద్వారా ఉద్యమాన్ని అర్థం చేసుకోవటానికి కృషి చేయడంతో పాటు తమ అబ్జర్వేషన్స్ కూడా చెప్పారు. వివిధ ప్రాంతాలలో ఉన్నప్పుడు పార్టీ, పి.ఎల్.జి.ఎ. బలగాల కామ్రేడ్స్‌తో అధ్యయనం, శిక్షణపై చర్చించి వారి అభిప్రాయాలను తీసుకోవడంతో పాటు వారికి సూచనలు కూడా చేశారు. ఈ సందర్భంగా రీపోస్ కామ్రేడ్స్‌తో ఆ కామ్రేడ్స్ తాము నిర్వహిస్తున్న బాధ్యతల రీత్యా రాజకీయ అవగాహన ఇంకా పెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ మాట్లాడారు. తమ లోపాలు చెప్పారు. మరింత అధ్యయనం, రాజకీయ శిక్షణ అవసరాన్ని బలంగా గుర్తిస్తూ మాట్లాడారు.

మన ఉద్యమ ప్రాంతాల సామాజిక, సాంస్కృతిక వెనుకబాటుతనాన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక నిర్మాణాలను, ప్రజలను విద్యావంతం చేయడానికి పార్టీ కమిటీలు ఈ కింది విషయాల పట్ల శ్రద్ధ చూపాలని రీపోస్ ప్రతిపాదించింది.

1. రోజూ రేడియో వార్తలు వినడం, దినపత్రికలు దొరికినచోట వార్తలు చదవడం, వాటిపై చర్చించడం చేస్తూ ప్రజల అవగాహనను పెంచాలి.

2. గ్రామ స్థాయిలో యువతీయువకులకు ప్రాథమిక విద్య నేర్పే ఏర్పాటు చేపట్టాలి. ఉదాహరణకు గతంలో చేపట్టిన రాత్రి పాఠశాలల పద్ధతి తిరిగి ప్రారంభించాలి.
3. మిలీషియాకు చాలా ప్రాథమిక స్థాయిలో MAS, MOPOS క్లాసులు చెప్పించాలి. వారికోసం ప్రత్యేక సిలబస్ తయారు చేయడం, అధ్యాపక బృందాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్య గరపడం తప్పనిసరి చేయాలి.
4. మహిళలకు ప్రత్యేక శ్రద్ధతో విద్యగరపాలి.
5. మన ప్రజాసంఘాలు, ఆర్.పి.సి.లు విద్యావంతం కావడానికి స్వయంకృషి చేస్తూనే ప్రజల్ని విద్యావంతుల్ని చేయడానికి శ్రద్ధపెట్టి కృషి చేసేలా గైడ్ చేయాలి.

## పార్టీ కమిటీలు/మిలటరీ కమిషన్లు చేపట్టిన రాజకీయ, మిలటరీ విద్య/శిక్షణ

కేంద్రకమిటీ మొదలుకొని ఏరియా కమిటీల వరకు అన్ని స్థాయిల పార్టీ కమిటీలు, కేంద్ర, రాష్ట్రస్థాయి మిలటరీ కమిషన్లు, కేంద్ర, స్పెషల్ జోనల్ స్థాయి మిలటరీ ఇన్‌స్ట్రక్టర్ టీములు పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనల్లోని పార్టీ కార్యకర్తలకు రాజకీయ మిలటరీ విద్యను, శిక్షణను నిర్ణీత వ్యవధుల్లో అందిస్తూ వచ్చాయి. ఆ నిర్దిష్ట తరుణంలో ఉద్యమ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సబ్జెక్టులను, చర్చనీయాంశాలను నిర్ణయించడం జరిగింది. ఈ విద్య ప్రధానంగా ఈ కింది రూపాల్లో కొనసాగింది. (1) కమిటీ సమావేశాల సందర్భంగా సమిష్టి అధ్యయనం లేదా చర్చ; (2) రాజకీయ తరగతులు; (3) మిలటరీ క్యాంపులు; (4) నూతన మిలటరీ ఫార్మేషన్ల ఏర్పాటు సందర్భంగా మోటివేషన్; (5) టి.సి.ఓ.సి.లు చేపట్టడానికి ముందు మోటివేషన్; (6) స్టడీ క్యాంపులు; (7) వర్క్‌షాపులు. పార్టీ కమిటీ సభ్యులు, ప్రత్యేకించి కేంద్రకమిటీ, రాష్ట్ర, జిల్లా కమిటీ స్థాయి సభ్యులు వీటిని నిర్వహించారు. రాజకీయ తరగతుల నిర్వహణలో అవసరమైన దగ్గర ఇ.డి.సి., రీపోస్ సభ్యుల సహాయాన్ని తీసుకోవడం జరిగింది.

ఇటీవల బోల్షివీకరణలో భాగంగా ఒడిశాలోని డివిసిఎంలకు ఒక రౌండ్ రాజకీయ తరగతులు నిర్వహించారు. దీనికి ముందు వ్యూహం-ఎత్తుగడలపై ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అలాగే డి.కె., ఏ.ఓ.బి., ఉత్తర తెలంగాణాల్లో జోన్, డివిజన్ స్థాయిల్లో వివిధ సబ్జెక్టులు, అంశాలపై అనేక రౌండ్ల క్లాసులు గత పదేళ్ల కాలంలో నిర్వహించడం జరిగింది. సామ్రాజ్యవాద ప్రాయోజిత ఎల్.ఐ.సి. వ్యూహాన్ని భారత పాలకవర్గాలు మనదేశంలో అమలు చేస్తున్న తీరుపై మొత్తం పార్టీకి అవగాహన పెంచడంలో భాగంగా, ఎస్.జడ్.సి. నుండి ఏరియా స్థాయి వరకు, అలాగే పి.ఎల్.జి.ఏ.లోనూ ఒక రౌండ్ క్లాసులు, చర్చ 2011-12లలో సెంట్రల్ రీజియన్‌లో నడిచాయి.

"పార్టీ నిర్మాణం కార్మికవర్గ అగ్రగామి శక్తులతో కూడి ఉండాలి. ఒక సజీవమైన అగ్రగామి సంస్థగా అది కార్మిక విప్లవ ప్రజానీకానికి వర్గశత్రువులపై చేసే పోరాటంలో నాయకత్వం వహించే శక్తిని కలిగి ఉండాలి" అన్నాడు మావో. ఆయనింకా ఇలా అన్నాడు,

"ఒక మహత్తర విప్లవోద్యమాన్ని విజయం సాధించే దిశగా నేతృత్వం వహించి నడపాలంటే విప్లవ సిద్ధాంతం, చరిత్ర పట్ల జ్ఞానం, ఉద్యమ ఆచరణ పట్ల అవగాహన లేకుండా సాధ్యం కాదు."

2013లో మన కేంద్రకమిటీ ఉద్యమ స్వీయాత్మక పరిస్థితిని విశ్లేషించి అది దేశవ్యాప్తంగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని అంచనా వేసింది. ఏకకాలంలో పార్టీలోనూ, పి.ఎల్.జి.ఏ.లోనూ ఒక బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను కూడా మనం చేపట్టాం. ఈ తరుణంలో మన రాజకీయ విద్య దిశ కూడా దీనిని అనుసరించే ఉండాలి. 'విప్లవ సిద్ధాంతం, చరిత్ర పట్ల జ్ఞానం, ఉద్యమ ఆచరణ పట్ల అవగాహన'ను పెంపొందించే రాజకీయ విద్యను అందించడం ద్వారా మనం 'సజీవమైన అగ్రగామి సంస్థ'గా మన పార్టీని మరింతగా మలచడానికి కృషి చేయాలి. తద్వారా అది 'కార్మిక విప్లవ ప్రజానీకానికి వర్గశత్రువులపై చేసే పోరాటంలో నాయకత్వం వహించ' గలదు. ఇటువంటి రాజకీయ విద్య మనం ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించడంలో దోహదం చేస్తుంది. అలాగే మన దేశంలోనూ, ప్రపంచంలోనూ విప్లవానికి అనుకూలంగా పెంపొందుతున్న అద్భుతమైన వస్తుగత పరిస్థితిని వినియోగించుకోవడంలోనూ తోడ్పడుతుంది. పార్టీని బోల్షివీకరించడంలో రాజకీయ విద్యకున్న కీలకమైన పాత్ర ఆకళింపు చేసుకొని, దానిని అడ్డుకోవడానికి సంబంధించిన తృష్ణ మన క్యాడర్లలోనూ, విప్లవ ప్రజానీకంలోనూ అపారంగా ఉంది. దానిని మనం తీర్చినప్పుడు అది ఒక మహత్తర శక్తిగా రూపాంతరం చెందుతుంది. అప్పుడిక ఈ శక్తిని అడ్డుకోవడం ప్రపంచంలోని ఏ శక్తికీ సాధ్యం కాదు. *

సాధారణంగా చెప్పాలంటే, చదవగలిగిన కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరూ మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల సిద్ధాంతాన్నీ, మన జాతీయ చరిత్రనూ, వర్తమాన ఉద్యమాలు, ధోరణులనూ తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. అంతేగాక, వారు తక్కువ చదువుగల సభ్యులు చదువుకోవడానికి సాయపడాలి. ముఖ్యంగా కేడర్లు ఈ విషయాలను మరింత జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. కేంద్రకమిటీ సభ్యులు, సీనియర్ కేడర్లూ తప్పనిసరిగా వీటిపట్ల మరింత ఎక్కువగా శ్రద్ధ వహించాలి. విప్లవ సిద్ధాంతమూ, చరిత్ర జ్ఞానమూ, రాజకీయ ఉద్యమం గురించి లోతైన అవగాహనా లేనిదే ఏ రాజకీయ పార్టీ కూడా గొప్ప విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడపడం సాధ్యం కాదు.

మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల సిద్ధాంతం విశ్వవ్యాప్తంగా వర్తిస్తుంది. మనం దానిని పిడివాదంగా కాక, ఆచరణకు మార్గదర్శకంగా పరిగణించాలి. దానిని అధ్యయనం చేయడమంటే కేవలం పదాలు నేర్చుకోవడం కాదు. విప్లవ శాస్త్రంగా మార్క్సిజం-లెనినిజంను నేర్చుకోవాలి. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు తమ విస్తృత అధ్యయనం, నిజజీవితం, విప్లవానుభవాల నుండి రాబట్టిన సాధారణ సూత్రాలను అర్థం చేసుకోవడం మట్టుకే కాదు, సమస్యలను పరీక్షించి పరిష్కరించడంలో వారి దృక్పథాన్నీ, పద్ధతినీ అధ్యయనం చేయాలి.

***- (చైనా.క.పా. సి.సి. 6వ విస్తృత ప్లీనంలో మావో రిపోర్టు, అక్టోబర్, 1938)***

# దండకారణ్య సాంస్కృతిక రంగంలో మన కృషి - ఒక నివేదిక

- లేంగ్

"విముక్తి పోరాటంలో అనేక రంగాలున్నాయి. వాటిలో కలము, కత్తి(తుపాకి)కి సంబంధించిన రంగాలు, సాంస్కృతిక సమర రంగాలు ఉన్నాయి. శత్రువును జయించడానికి మనం ప్రధానంగా తుపాకులు పట్టిన సేన మీదనే ఆధారపడాలి కానీ సేన ఒక్కటే చాలదు. మన శ్రేణులను ఐక్యం చేసి శత్రువును ఓడించడానికి సాంస్కృతిక సేన కూడా అత్యావశ్యకం."

మావో చెప్పిన పై అవగాహనతోనే మనం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్నాం. నూతన ప్రజాస్వామిక రాజ్య స్థాపన కోసం పాలకవర్గాలకు వ్యతిరేకంగా సాయుధ రంగాననే కాకుండా సాంస్కృతిక రంగాన కూడా పోరాడుతున్నాం. రాజ్యాధికార స్వాధీనానికి విశాల ప్రజాబాహుళ్యాన్ని భావజాలపరంగా మలిచి వారు పెను విప్లవశక్తిగా మారి కదనరంగాన దూకేలా చేయడానికి సాంస్కృతిక సేనను నిర్మించుకొని శత్రువుకు వ్యతిరేకంగా సాంస్కృతిక రంగాన పోరాడుతున్నాం. ఈ అవగాహనతోనే మనం దండకారణ్యం(డి.కె.)లో కూడా నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నెలకొల్పడానికి, సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతిని ఎండగట్టి, ఎదుర్కొని, దానిని నిర్మూలించడానికి పోరాడుతున్నాం. డి.కె.లో సాంస్కృతిక రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం మార్గదర్శకంగా ఒక ప్రణాళిక రాసుకొని చేతనా నాట్యమంచ్ (సి.ఎన్.ఎం.)ని ఏర్పరచుకొని పనిచేస్తున్నాం. ఈ కృషిలో భాగంగానే శత్రుదాడుల మధ్యనే గత పదేండ్లలో అరవై మందికి పైగా సాంస్కృతిక యోధులు తమ నులి వెచ్చని నెత్తుర్లను ధారపోశారు. ఈ సందర్భంగా ఆ సాంస్కృతిక వీరయోధులకు వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం. వారి ఆశయ సాధనకు సాంస్కృతిక సైన్యాన్ని బలోపేతం చేద్దామని శపథం చేద్దాం.

పశ్చిమ బస్తర్ సి.ఎన్.ఎం. పిల్లల టీం 16 మంది పైన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'జన సురక్షా చట్టం' కేసు పెట్టి జైల్లో తోసింది. వారిప్పటివరకు జైలులోనే ఉన్నారు. గత పదేండ్లలో ఎంతోమంది సి.ఎన్.ఎం. కామ్రేడ్స్ శత్రు దమనకాండకు గురైనారు. చాలామంది సి.ఎన్.ఎం. కామ్రేడ్స్ వివిధ జైళ్లలో మగ్గుతున్నారు. డి.కె.లో సి.ఎన్.ఎం. ఏర్పాటు, మన నూతన పార్టీ [సి.పి.ఐ.(మావోయిస్టు)] ఆవిర్భావం దాదాపు ఒకేసారి జరిగాయి. ఒక ప్రజాసంఘంగా సి.ఎన్.ఎం. క్రమంగా అభివృద్ధి చెందింది. ఈ పది సంవత్సరాల సి.ఎన్.ఎం. అభివృద్ధి సంక్షిప్త రిపోర్టు ఇది.

సి.ఎన్.ఎం. వందలాది గ్రామాలలో యూనిట్లు కలిగి ఉంది. వాటిలో వేలాది మంది కళాకారులు సభ్యులుగా ఉన్నారు. సి.ఎన్.ఎం. వందలాది పాటలను సృష్టించింది. ఎన్నో కళారూపాలను తయారు చేసింది. నూతన ప్రజాస్వామ్య సంస్కృతిపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసం కృషి చేసింది. సమిష్టి సాహిత్యాన్ని సృష్టించింది. సమిష్టి కళలను రక్షించడం

కోసం పాటుపడింది, ప్రజల నుండి ప్రజల వద్దకు అనే ప్రజాపంథాలో పనిచేస్తూ ప్రజాకళా కర్సడ్‌లు (పెద్దల పండుగ వంటివి)ఏర్పాటు చేసి వందలాది మంది స్థానిక ప్రజాకళాకారులను కదిలించింది.

ప్రస్తుతం ఏరియాకు ఒక సి.ఎన్.ఎం. సాంస్కృతిక బృందం ఉంది. అన్ని డివిజన్లకు సి.ఎన్.ఎం. బృందాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ముగ్గురి నుండి ఐదుగురు సభ్యులతో పనిచేస్తున్నాయి. స్పెషల్ జోన్ స్థాయిలో ఒక బృందం ఉంది.

పి.ఎల్.జి.ఎ. కంపెనీలలో, బెటాలియన్లలో సాంస్కృతిక టీంలు ఏర్పడి పనిచేస్తున్నాయి. మావో చెప్పినట్టు ప్రజాసైన్యానికి యుద్ధం చేయడంతో పాటు రాజకీయ ప్రచారం, ఉత్పత్తిలో పాల్గొనడం ముఖ్యం. పి.ఎల్.జి.ఎ.లోని సాంస్కృతిక టీములు యుద్ధం చేస్తూనే పి.ఎల్.జి.ఎ.లో, ప్రజల్లో సాంస్కృతిక కృషి చేస్తున్నాయి. ఈ సాంస్కృతిక బృందాలకు రెండు, మూడు దఫాలు శిక్షణ ఇవ్వడం జరిగింది.

ముఖ్యంగా ఈ రంగంలో మహిళల పాత్ర బలంగా ఉంది. ఈ రోజుకు కూడా నిర్మాణాల్లో, ప్రదర్శనలు ఇచ్చేదాంట్లో మెజార్టీగా మహిళలే ముఖ్య భూమిక వహిస్తున్నారు. పాటలు రాయడంలో, సమిష్టిగా నృత్యాలు రూపొందించడంలో, గ్రామాల నృత్యాలను తొందరగా పట్టుకోవడంలో (అంటే నేర్చుకోవడం) ముందు ఉన్నారు. ఈ రంగంలో ఇప్పటికి ముగ్గురు డివిజన్ అధ్యక్షులుగా, నలుగురైదుగురు ఏరియా అధ్యక్షులుగా మహిళా కామ్రేడ్స్ నాయకత్వం వహిస్తున్నారు. సి.ఎన్.ఎం. బృందాలలో మెజార్టీగా మహిళలే ఉన్నారు.

సి.ఎన్.ఎం. మూడు స్పెషల్ జోన్ స్థాయి మహాసభలను జయప్రదంగా జరుపుకొంది. వీటిలో భాగంగా ముందు గ్రామ, ఏరియా, డివిజన్ల మహాసభలు జరిగాయి. వీటిలో సాంస్కృతికరంగ అనుభవాలను సమీక్షించుకొని, పాఠాలు నేర్చుకోవడం, ఈ రంగంలో వస్తున్న సమస్యల పరిష్కారం కోసం, ఉద్యమాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కర్తవ్యాలు రూపొందించుకోవడం జరిగింది.

కళా ప్రమాణాలు పెంచడం, వాయిద్యాలను ఉపయోగించడం, పాటలు రాయడం, పాడడం, నృత్యాలు చేయడం, నాటికలు వేయడం, విప్లవ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం తదితర విషయాలపైన రీజియన్, డివిజన్‌ల స్థాయిలో వర్క్‌షాప్‌ల నిర్వహణ జరిగింది. అలాగే ఈ రంగంలో పనిచేస్తున్న కోర్ కామ్రేడ్స్‌కు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో వందకు పైగానే కామ్రేడ్స్ పాల్గొన్నారు. ఇక్కడ సృష్టించబడ్డ సాహిత్యాన్ని, దండకారణ్య వ్యాప్తంగా వచ్చిన పాటలను రెండు పుస్తకాలుగా తెచ్చాం. ఇక డివిజన్లలో పెద్దసంఖ్యలో వచ్చిన అనేక పాటలు ఎక్కడివి అక్కడ ప్రింట్ చేసుకున్నారు.

సి.పి.ఐ. (మావోయిస్టు) ఏర్పడక ముందు ఏ.పి., ఎన్.టి., ఏ.ఓ.బి., మహారాష్ట్ర సాంస్కృతిక సంస్థల అనుభవాల నుండీ, ఏర్పడ్డ తర్వాత బీహార్-ఝార్ఖండ్ సాంస్కృతిక సంఘాల అనుభవాల నుండీ దండకారణ్య సాంస్కృతిక ఉద్యమానికి నిర్మాణపరంగా, సాంస్కృతికంగా ఉపయోగపడే వాటిని తీసుకొని ఈ రంగంలో అభివృద్ధికై కృషి చేయటం జరిగింది. అలాగే ఏ.ఓ.బి. సాంస్కృతిక సంస్థ 'పితూరీ ఏందన దళం'(పి.ఏ.డి.)తో, మహారాష్ట్రలో సి.ఎన్.ఎం.తో కలిసి వర్క్‌షాప్‌లు నిర్వహించడం జరిగింది. వారి అనుభవాలు ఇచ్చిపుచ్చుకోవడం జరిగింది.

ఏ.ఓ.బి.లో జరిగిన వర్క్‌షాప్‌లో 25 పాటలు, 7 నాటికలు తయారు చేయడం జరిగింది. పార్టీ కలయిక సందర్భంగా "ఆయారే ఆయారే లాల్‌పవన్ ఆయారే" అని మావోయిస్టు పార్టీ పైన పాట రాయడం జరిగింది. ఉత్తర రీజియన్‌లో ఒక వర్క్‌షాప్ "భారత్ సేనా వాపస్ జావో", ఎన్నికల బహిష్కరణ పైన దక్షిణ్ రీజియన్‌లో, డివిజన్లలో వర్క్‌షాప్‌లు జరిగాయి.

అయితే, పి.ఎల్.జి.ఏ., నూతన ప్రజాస్వామిక అధికారంతో పాటు అభివృద్ధి అవుతున్న నూతన ప్రజాస్వామిక సంస్కృతిని దెబ్బతీసి, తమ అభివృద్ధి నిరోధక వ్యవస్థనీ, సంస్కృతిని నిలుపుకోవడం కోసం భూస్వామ్య దుష్ట పెత్తందారీ శక్తులు, ఫాసిస్టు రాజ్యం ప్రజలపై, ప్రజాసంస్కృతిపై హింసాత్మకమైన క్రూరదాడులు కొనసాగిస్తున్నాయి. ఈ దాడులలో వందలాది గ్రామాలు ధ్వంసం చేయబడినాయి. మహిళలపై అత్యాచారాలు, హత్యలు లెక్కలేకుండా జరిగాయి. గ్రామాల్లో కనబడ్డ యువతీ యువకులు, రైతులు ఘోరాతిఘోరంగా నరికివేయబడ్డారు లేదా కాల్చివేయబడ్డారు. సల్వాజుడుం గూండాలు, పోలీసు, పారా మిలటరీ బలగాలు వందల కొలది డోల్లు, తదితర వాయిద్యాలనూ, చేపలు పట్టే వలలు, గుజ్జిడిలను కత్తులతో కోసి, గొడ్డండ్లతో నరికివేశారు. మంటల్లో వేసి బూడిద చేశారు. ఈ దాడిని ఎదుర్కొని ఓడించాలనే మన పార్టీ సందేశానుసారం మన సాంస్కృతిక రంగ కళాకారులు రకరకాల సాహిత్యకళా రూపాలు సృష్టించి ప్రజల్లో పెద్దయెత్తున ప్రచారం చేసి వారిని సమాయత్తం చేసి సల్వాజుడుంను ఓడించేందుకు కృషి చేశారు. కేంద్ర, రాష్ట్ర బలగాలకు వ్యతిరేకంగా పి.ఎల్.జి.ఏ. గెరిల్లా యుద్ధం కొనసాగించి సాధించిన విజయాలపై వచ్చిన పాటలు ప్రజలను, పి.ఎల్.జి.ఏ.ను ఉర్రూతలూగించాయి. అమరవీరులపై అసంఖ్యాకంగా పాటలు రాశారు. ఇవన్నీ అమరుల సాహసగాథల, గొప్ప ఆదర్శాల సమాహారాలే. ఇవి పార్టీ, పి.ఎల్.జి.ఏ., ప్రజలలో త్యాగనిరతినీ, పోరాటచేవనీ పెంపొందింపజేశాయి. మరొక వైపున లొంగుబాట్లపై కూడా పాటలు, స్కిట్స్ తయారు చేశారు. ఇవన్నీ గెరిల్లా యుద్ధ అభివృద్ధికీ, ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీల పాత్ర పెంపొందడానికి ఎంతో తోడ్పడినాయి.

సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతిని ఎండగడుతూ, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగానూ, ప్రజల్లో ఉండే రకరకాల సమస్యలను తీసుకొని, జల్-జంగల్-జమీన్‌పై మాదే హక్కంటూ విస్థాపనకు వ్యతిరేకంగానూ, నిత్యావసర సరుకుల అధిక ధరలకు వ్యతిరేకంగానూ, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగానూ, నిరుద్యోగ సమస్య, రైతుల ఆత్మహత్యలు, దోపిడీ ప్రభుత్వాల బూటకపు అభివృద్ధి విధానాలకు వ్యతిరేకంగానూ, బూటకపు ఎన్నికలు, హిందూ ఫాసిజం మైనార్టీలపై చేస్తున్న దాడులకు వ్యతిరేకంగానూ, జనతన సర్కార్లు చేపట్టిన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ విధానాలపై, అభివృద్ధి పథకాలపై ప్రజల్లో మన సాంస్కృతిక బృందాలు పెద్దయెత్తున ప్రచారం చేశాయి.

జనతన సర్కార్లపై ఎన్నో పాటలు, నాటికలు వచ్చాయి. ఇవి ప్రజలు తమ అధికారాన్ని సృష్టించుకోవడానికీ, విస్తరింపజేసుకోవడానికీ బాగా తోడ్పడినాయి. భూమి పంపిణీ, సాగునీటి కల్పన, వ్యవసాయోత్పత్తిని పెంచడం, భూమి చదును తదితర కార్యక్రమాల్లో ఎక్కువ మంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొనే విధంగా, దాని ప్రాముఖ్యతను ఎత్తిపడుతూ ప్రజా కళాకారులు వారితో పాటు శ్రమలో పాల్గొంటూ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్న సామ్రాజ్యవాద, భూస్వామ్య విష సంస్కృతిని ఎండగడుతూ, సమిష్టి

కళలను, కళారూపాలను రక్షించడంపై కేంద్రీకరిస్తూ సమిష్టిగా సాహిత్యాన్ని సృష్టించారు. కార్పెట్ సెక్యూరిటీ మధ్యనే, నిరంతర శత్రు బలగాల ఆపరేషన్ల మధ్యనే, క్రూరమైన దాడుల మధ్యనే మన సాంస్కృతిక బృందాలు ప్రజల్లో ప్రదర్శనలు ఇచ్చాయి. పారిశుధ్యం, ఆరోగ్య పరిరక్షణ, చదువు ప్రాముఖ్యతను గుర్తింపజేస్తూ కళాకారులు ప్రచారం చేశారు. ఇవన్నీ ప్రజలలో మంచి ప్రభావాన్ని వేశాయి.

ప్రజలపై విప్లవ ప్రతీఘాతుక సల్వాజుడుం మూకలు, ప్రభుత్వ బలగాలు కలిసి దాడులు కొనసాగిస్తున్న సమయంలో వాటిని ఎండగడుతూ దేశవ్యాప్తంగా ప్రచార క్యాంపెయిన్ నిర్వహించి వాటికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం కోసం ఆదివాసీ సాంస్కృతిక కళామంచ్ మంచి కృషి చేసింది. ఈ కళామంచ్ 14 రాష్ట్రాల్లో 65 ప్రదర్శనలు ఇచ్చి ఈ ప్రభుత్వ ప్రాయోజిత ఫాసిస్టు దాడిని ఎండగడుతూ ప్రచారం చేసింది. సల్వాజుడుం సమయంలో 2007లో జరిగిన డి.కె. స్పెషల్ జోన్ సి.ఎస్.ఎం. రెండవ మహాసభలో కళాకృతులతో మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా దక్షిణ్ రీజియన్‌లో జుడుం దాడిలో ధ్వంసం అవుతున్న కళాకృతులను కాపాడుకోవాలనేది ఈ మ్యూజియం ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశ్యం.

దేశవ్యాప్తంగా మన ఉద్యమంపై ఎక్కుపెట్టిన గ్రీన్‌హంట్ దాడిని ఎండగడుతూ ప్రచారం చేసేందుకు ఒక సాంస్కృతిక బృందాన్ని పంపడం జరిగింది. అది కొన్ని ప్రదర్శనలు ఇవ్వగానే హైదరాబాద్‌లో ఆ బృందం కళాకారులను అరెస్టు చేసి బూటకపు కేసు పెట్టి నెల రోజులు జైల్లో పెట్టారు. దండకారణ్యంపై దాడి చేయటానికి ట్రైనింగ్ పేరుతో వచ్చిన 'భారత సేన తిరిగి వెళ్లిపో' ('భారత్ సేనా - వాపస్ జావో') అనే నినాదంతో ప్రజల్లో పెద్దయెత్తున ప్రచారం చేసింది.

స్పెషల్‌జోన్ స్థాయి బృందాలు గత పదేండ్లలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎన్నికల బహిష్కరణపై వర్క్‌షాప్‌లు నిర్వహించి ఎన్నో పాటలు, నాటికలు సృష్టించడం జరిగింది. 2009లో కూడా ఛత్తీస్‌గఢ్ ఎన్నికల బహిష్కరణ వర్క్‌షాప్ జరిపి 'భూత్' అనే నాటకం తయారుచేసి జనంలో ప్రచారం చేయడం జరిగింది. ఈ నాటకం ప్రజల్లో మంచి ప్రభావం వేసింది. ఎన్నికల బహిష్కరణపైన 'చెప్పు' అనే నాటకం కూడా ప్రజల్లో మంచి ప్రభావం వేసింది. అలాగే 'గోంగ్లామెట్ట' అనే నాటకం కూడా తయారుచేసి ప్రజల్లో ప్రదర్శించడం జరిగింది. 'సామ్రాజ్యవాది గద్ద', 'సామ్రాజ్యవాది కుక్క' నాటకాలు ప్రజల్లో బాగా ప్రచారం అయినాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పైన 'కొర్రుదొంగ నమ్మోయ్', 'చెడు వినవద్దు', 'మూడు కోతులు' వంటి నాటకాలు సృష్టించారు. 2013-14లో జరిగిన ఎన్నికల సందర్భంగా పార్టీ వైఖరిని తెలుపుతూ 15-20 పాటలు రాసి ఆడియో రికార్డింగ్ చేసి అన్ని డివిజన్లకు పంపిణీ చేయడం జరిగింది. నెట్‌లో కూడా పెట్టడం జరిగింది.

విప్లవ దినాల్లో ముఖ్యంగా వంద సంవత్సరాల 'భూంకాల్ దివస్' సందర్భంగా భూంకాల్ పోరాటాన్ని ఎత్తిపడుతూ గుండాదూర్ నృత్యనాటకం వేలాది ప్రజలను బాగా ఆకట్టుకొంది. గుండాదూర్ చరిత్రను ఈ నాటకం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం జరిగింది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10 భూంకాల్ దివస్, మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా

దివస్, జులై 28 అమరవీరుల దివస్, సెప్టెంబర్ 21 పార్టీ స్థాపనా దివస్, డిసెంబర్ 2 పి.ఎల్.జి.ఏ. స్థాపనా దివస్ సందర్భంగా మన సాంస్కృతిక బృందాలు అభినందనీయమైన కృషి చేస్తాయి. 2010లో 10 సంవత్సరాల పి.ఎల్.జి.ఏ. వార్షికోత్సవాల సందర్భంగా ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేసి పాటలు, సాహిత్యం తయారుచేసి పెద్దమొత్తంలో ప్రచారం చేయడం జరిగింది. మార్చి 8 సందర్భంగా కూడా ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేశాం. అందులో మహిళల పైన పెద్దమొత్తంలో పాటలు రాయడం జరిగింది. అలాగే మహిళా విముక్తి కోసం ప్రత్యేకంగా ఒక పీటో (ఒగ్గుకథ వంటిది) రాసి రికార్డ్ చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాం. గత పది సంవత్సరాలలో విప్లవ దినాలు, నిరసన దినాల (కాలాదివస్) సందర్భంగా వేలాది ప్రదర్శనలు ఇచ్చి మన సందేశాన్ని లక్షలాది ప్రజల్లోకి తీసుకెళ్లడం జరిగింది.

నృత్యంలో బాగా ప్రజల్లోకి పోయినవి, ప్రజలు బాగా కోరేటివి - 'భూంకాల్ భూంకాల్ మహాన్ భూంకాల్', 'ఓ ఊడటు దాదా', ఎన్నికల బహిష్కరణపై 'అవల్ అవేగా ఓటు మాంగనే బోర్‌మం' నృత్యాలు. సి.ఎస్.ఎం. తయారుచేసిన నృత్యాలలో ఛత్తీస్‌గఢ్ నృత్యరూపాలను మనం ఎక్కువగా వినియోగించుకున్నప్పటికీ వాటిల్లో మన కృషి తక్కువగానే ఉంది. మనం సల్వాజుడుంకు వ్యతిరేకంగా ఒక గంట నాటకం తయారు చేశాం. దీంట్లో మహేంద్రకర్మ పాత్రను ప్రజల కళ్లకు కట్టినట్టు ప్రదర్శించడం జరిగింది. తర్వాత విస్థాపన పైననే పది పాటలు, వీడియో కంపోజ్ చేసి తయారు చేయడం జరిగింది. వీటిలో చాలా రకాల నృత్య రూపాలను మిళితం చేయడం జరిగింది. రమణ్‌సింగ్ పైన వీడియో నృత్యరూపకం తయారుచేశాం. ఇందులో కూడా చాలా రకాల నృత్యరూపాలను మిళితం చేశాం. పిల్లలకు చదువు ప్రాముఖ్యతను గుర్తింపజేస్తూ 'పశులగాసే పిల్లవాడా.. చదువుకొనుటకు రావా' ('కోందా మెహక్‌నా పిల్లో పేకోర్ వరటు') అనే పాట చిన్న పిల్లల్లో చాలా ప్రచారం పొందింది. గ్రామాలలో బాలల సంఘాన్ని సాంస్కృతిక సంఘ కమిటీలే గైడ్ చేస్తున్నాయి కాబట్టి వీళ్లు ఆటపాటలలో ముందే ఉన్నారు.

పార్టీ మహాసభలలో, ప్లీనాలలో; పార్టీ, ప్రజాసంఘాల మహాసభలలో; జనతన సర్కార్ల ఎన్నికల సభలలో; పార్టీ, పి.ఎల్.జి.ఏ., ప్రజాసంఘాల, వివిధ రంగాల విభాగాల, జనతన సర్కార్ల శిక్షణా శిబిరాల్లో సంబంధిత విషయాలపై, ఆ రోజు జరిగిన చర్చలపై అప్పటికి అప్పుడే స్క్రిప్ట్ తయారుచేసి ప్రదర్శించడం జరిగింది, పాటలు రాసి పాడడం జరిగింది. భగత్‌సింగ్ పైన ఉన్న స్కిట్, ఇక్కడి పరిస్థితుల కనుగుణంగా గుండాదూర్ పైన తయారుచేసి వేయడం జరిగింది. ఇలా డి.కె. స్పెషల్ జోన్ వ్యాప్తంగా వేలలో ప్రదర్శనలు జరిగాయి.

ఈరోజు కార్పొరేట్ శక్తుల, ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా ప్రజలపై ఎంత ప్రభావం చూపుతున్నదో మనకు విదితమే. ఎలక్ట్రానిక్ మీడియా ప్రజల జీవితంలో ఒక విడదీయలేని భాగంగా మారిపోతున్నది. ఎలక్ట్రానిక్ సాధనాలను కొంతమేరకు ఉపయోగించుకొని 200-300 పాటలు ఆడియోలో రికార్డు చేసి ప్రజల్లోకి పెద్దయెత్తున తీసుకుపోవటం జరిగింది. వివిధ సమస్యలపై 10-15 వీడియో చిత్రీకరణలు కూడా చేసి విప్లవ ప్రచారం చేయటం జరిగింది. మన పార్టీ శ్రేణుల, పి.ఎల్.జి.ఏ. యోధుల, ప్రజల చైతన్యం పెంచడానికి చాలానే సాహిత్యాన్ని సృష్టించడం జరిగింది.

నేడు మన ఉద్యమం గడ్డు పరిస్థితిలో ఉందని పార్టీ అంచనా వేసిన విషయం మనకు తెలిసిందే. ఉద్యమ గడ్డు పరిస్థితి ప్రభావం సాంస్కృతిక రంగంపైన కూడా పడింది. మనం నేటి గడ్డు పరిస్థితిని అధిగమించి తిరిగి ఉద్యమాన్ని పురోగమింపజేయాలి. ఈ కర్తవ్య సాధనకు మన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక కృషిలో జరిగిన లోపాలను సరిదిద్దుకొని పార్టీని పటిష్టం చేయడానికి బోల్షివైజేషన్ క్యాంపెయిన్‌ని విజయవంతం చేయాలి; శత్రు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను సాహసోపేతంగా తిప్పికొట్టి ఓడించాలి; ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీల పాత్ర పెంపొందించాలి. ఇందుకు మనం రూపొందించుకున్న కార్యక్రమాన్ని సాంస్కృతిక రంగంలో కూడా సృజనాత్మకంగా అమలు చేయాలి. ఇందులో భాగంగా శత్రు మానసిక యుద్ధానికి వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద, భూస్వామ్య విష సంస్కృతికి వ్యతిరేకంగా సాహిత్యం, కళలు సృష్టించాల్సిన, ప్రచారం విస్తృతం చేయాల్సిన అవసరం నేడు మరింతగా ఉంది. మనం ఈ గడ్డు పరిస్థితిని ఎలా అధిగమించవచ్చో వివరిస్తూ, నూతన ప్రజాస్వామిక విప్లవం ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎలా ముందుకు సాగుతుందో, ప్రపంచ ఉద్యమాల చరిత్ర ఎలా ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ముందుకు సాగిందో ప్రజలకు వివరిస్తూ, ఈరోజు విప్లవ వస్తుగత పరిస్థితి ఎంత అనుకూలంగా ఉందో తెలియజేస్తూ, పార్టీపై, పి.ఎల్.జి.ఎ.పై, ప్రజాసంఘాలపై, విప్లవంపై విశ్వాసం పెంచే విధంగా మన సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలి. పది సంవత్సరాల పార్టీ స్థాపనా వార్షికోత్సవాలను పురస్కరించుకొని రకరకాల కళారూపాల ద్వారా మన విజయాలను ఎత్తిపడుతూ, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయంపై విశ్వాసం పెంచే విధంగా మనం ప్రచారం కొనసాగించాలి. దీర్ఘకాలిక ప్రజాయుద్ధం అజేయమైనది, ప్రజలే చరిత్ర నిర్మాతలు, అంతిమ విజయం ప్రజలదే అనే సత్యాన్ని మనం చాటి చెప్పాలి.

**సామ్రాజ్యవాద-భూస్వామ్య సంస్కృతి నశించాలి!**

**నూతన ప్రజాస్వామిక సంస్కృతి వర్ధిల్లాలి !**

"ఆధునిక చరిత్ర అనుభవమంతా, ప్రత్యేకంగా కమ్యూనిస్టు ప్రణాళిక అవతరించినప్పటి నుండి జరిగిన సకల దేశాల శ్రామికవర్గపు అర్ధ శతాబ్దికి పైబడిన విప్లవ పోరాటం, మార్క్సిస్టు ప్రపంచ దృక్పథం ఒక్కటే విప్లవ శ్రామికవర్గపు ప్రయోజనాలకూ, దృక్కోణానికీ, సంస్కృతికీ అసలైన వ్యక్తీకరణ అని నిస్సందేహంగా నిరూపించింది.

మార్క్సిజం విప్లవ శ్రామికవర్గపు భావజాలంగా తన ప్రపంచ చరిత్రాత్మక ప్రాముఖ్యాన్ని ఎలా పొందిందంటే, అది బూర్జువా యుగపు అత్యంత విలువైన విజయాలను తోసిపుచ్చడమేగాక, తద్వ్యతిరేకంగా, రెండు వేల సంవత్సరాల మానవ ఆలోచన, సంస్కృతుల అభివృద్ధిలో విలువైన ప్రతిదానినీ జీర్ణం చేసుకొని, దానికి కొత్త రూపు ఇచ్చింది. దోపిడి యొక్క ప్రతి రూపంతోనూ చేసే పోరాటంలో అంతిమ దశగా శ్రామికవర్గ నియంతృత్వపు ఆచరణాత్మక అనుభవం చేత ఉత్తేజం పొంది, ఈ ప్రాతిపదిక మీద, ఈ దిశలో చేసే ఇతోధిక కృషి మాత్రమే అచ్చమైన శ్రామికవర్గ సంస్కృతి అభివృద్ధిగా గుర్తింపబడగలదు."

**- లెనిన్ (శ్రామికవర్గ సంస్కృతిపై, అక్టోబర్ 8, 1920)**

# ప్రజావైద్యరంగంలో చారిత్రాత్మక తొలి అడుగులు

- రఫీక్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతం మావోయిస్టు విప్లవోద్యమం దృష్ట్యా ఎప్పుడూ వార్తల్లో ఉంటూ వుంటుంది. కానీ 2013 ఆగస్టులో అది వందలాదిగా జరిగిన కలరా మరణాల వల్ల వార్తల్లోకెక్కింది. ఒక వారం రోజుల వ్యవధిలోనే 150 మందికి పైగా ప్రజలు గ్యాస్ట్రో-ఎంటెరైటిస్ సంబంధిత ఘటనల వల్ల ప్రాణాలను కోల్పోయారు. ఇంద్రావతి ఏరియా ఇంద్రావతి నదికి ఉత్తర దిక్కున ఉంటుంది. భైరంగఢ్ ఏరియా జగ్దల్‌పూర్, భూపాలపట్నాలను కలిపే జాతీయ రహదారి వెంబడి నదికి దక్షిణ దిక్కున ఉంటుంది.

గ్యాస్ట్రో-ఎంటిరైటిస్‌కు కారణం కలరా. ఇది నీళ్ల ద్వారా సంక్రమించే పెద్ద అంటువ్యాధి. దీనివల్ల విపరీతంగా వాంతులు, నీళ్ల విరేచనాలు అవుతాయి. కొన్నిసార్లు అది పేషెంట్ శరీరంలోని నీటినంతా కొద్దిగంటల్లోనే హరించివేస్తుంది (డీహైడ్రేట్). ఎక్కువ శాతం మరణాలు విపరీతంగా నీటిని, లవణాలను కోల్పోవడం వల్ల సంభవిస్తాయి. ఒక్క ఇంద్రావతి ఏరియాలోనే వందకు పైగా ప్రజలు కొద్ది రోజుల వ్యవధిలోనే తమ ప్రాణాలను కోల్పోయారు. బాగా ప్రభావితం అయిన గ్రామాలు డుంగ, జాడ్క, పోదాడ్. దాదాపు 50 మంది ప్రజలు ఒక్క జాడ్క గ్రామంలోనే మరణించారు. భైరంగఢ్, దల్లేర్, ఎంగుం, జాపూర్, మిర్తుల్, పోమర గ్రామాలు అత్యధిక ప్రభావానికి గురైనవి. దల్లేర్‌లో ఒక ముసలాయన తన మొత్తం కుటుంబాన్ని కోల్పోయాక తట్టుకోలేక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఈ గ్రామాల్లో ప్రజలు చిన్న చిన్న వాగుల వెంబడి తీసిన చెలిమల నుండి నీటిని వాడతారు. వానాకాలంలో ఈ చెలిమలలోకి తరచుగా వాననీరు వచ్చి చేరతుంటుంది. అవి అంటువ్యాధులకు వనరులుగా మారి డయేరియా రోగాల మహమ్మారులకు దారి తీస్తాయి. 2013 ఆగస్టులో కూడా అదే జరిగింది. కలరా మహమ్మారి ఈ గ్రామాల్లో విస్తరించి వందలాదిమందిని పొట్టన పెట్టుకుంది. తక్కువ రోగనిరోధక శక్తి వుండడం వల్ల చిన్నపిల్లలూ, ముసలివారూ దీనికి అతి ఎక్కువగా గురవుతారు. అందుకనే చనిపోయినవారిలో ఎక్కువమంది చిన్నపిల్లలూ, ముసలివారే అతి ఎక్కువగా వున్నారు. నారాయణపూర్ జిల్లాలోని ఓర్ఛా, బిజాపూర్ జిల్లాలోని భైరంగఢ్‌లే ఈ ప్రాంతాల్లోని ఏకైక ఆరోగ్య కేంద్రాలు. రెండిటిలోనూ వైద్య పరికరాలు సరిగా లేవు, స్టాఫ్ సరిపడా లేరు. అడవి లోపల డిస్పెన్సరీలు (మందుల దుకాణాలు) గానీ, ప్రజారోగ్య కేంద్రాలు గానీ లేవు. ఏ డాక్టరూ లేదా ఆరోగ్య కార్యకర్తా ఈ గ్రామాలను సందర్శించిన పాపాన పోలేదు. అవును. పోలీసులూ, పారామిలటరీ బలగాలు ఈ గ్రామాల్లో తరచుగా గస్తీ తిరుగుతుంటాయి. ప్రజలకు ఆరోగ్య సేవలు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులు అవసరం. వారు ఈ గ్రామాలను సందర్శిస్తే వారు

పరమానందభరితులవుతారు. కానీ ఎవ్వరూ ఈ గ్రామాలను సందర్శించరు. ఇక్కడి ప్రజలకు చాలా ఆరోగ్య సమస్యలు వున్నాయి. వారికి భద్రతా సమస్యలు లేవు. వారు ఎటువంటి శాంతి భద్రతల సమస్యలనూ ఎదుర్కోవడం లేదు. వారికి పోలీసు గస్తీలు అవసరం లేదు. వారికి పోలీసులంటే ఇష్టం లేదు. వారికి వైద్యులు, పారామెడిక్ సిబ్బంది, మందులు అవసరం. వారికి ఆస్పత్రులు అవసరం. వారికి పోలీస్ స్టేషన్లు, సిఆర్‌పిఎఫ్ క్యాంపులు అవసరం లేదు. ఈ పోలీసు పార్టీలు బస్తర్ ప్రజలకు భద్రతా ముప్పును కలిగిస్తున్నాయి. ఈ గస్తీలు శాంతి భద్రతల సమస్యలను సృష్టిస్తున్నాయి. ఇవీ ఈ ప్రాంతాల్లో నెలకొన్న స్థితిగతులు. భారత పాలనావ్యవస్థ స్వచ్ఛమైన తాగునీరు, ఆరోగ్య సేవలు మొదలైన మౌలిక సదుపాయాలను కూడా వీరికి ఇవ్వడం లేదు. బదులుగా అది ఈ శ్రమజీవులను టెర్రరైజ్ చేస్తున్నది.

జాపూర్ గ్రామం నుండి ఒక అమ్మాయి ....వద్ద ఉన్న ఒక ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటోంది. ఆమెకు పాఠశాలలో వుండగా కలరా సోకింది. ఆమె తల్లి ఆమెకు సహాయం చేయడానికి వెళ్లింది. తల్లికి కూడా ఆ రోగం సోకి, తీవ్రమైన డీహైడ్రేషన్ వల్ల చనిపోయింది. గ్రామస్తులు ఆ రోగంతో ఉన్న పిల్లనూ, చనిపోయిన తల్లి శవాన్నీ తీసుకుని గ్రామానికి తిరిగి వెళ్లారు. తల్లి అంత్యక్రియల తర్వాత పిల్ల కూడా చనిపోయింది. కానీ ఈలోపు ఇంకొంతమందికి ఆ రోగం సోకింది. ఆ తర్వాత రెండు రోజుల వ్యవధిలో మొత్తం ఎనిమిదిమంది ప్రజలు ఆ రోగంతో చనిపోయారు. ఈ మహమ్మారి సందర్భంగా భారత పాలనావ్యవస్థ చాలా ఆలస్యంగా మేల్కొన్నది. వందలాది విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోయాక వారు ఆ ప్రాంతాలకు వచ్చారు. అక్కడ మొత్తం వ్యవస్థ అసమర్థంగా, పరిస్థితిని చక్కదిద్దడంలో ఎటువంటి ఆసక్తీ లేకుండా ఉండింది. జాపూర్‌లో మావోయిస్టు దళాలు మిగిలిన గ్రామస్తుల ప్రాణాలను కాపాడాయి. వారు వారికి మందులు, సెలైన్‌లు ఇచ్చారు. ఆ పరిస్థితిలో వారిని కాపాడడానికి మరే శక్తీ అక్కడకు రాలేదు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశ ఆరోగ్య వ్యవస్థ ఈ పరిస్థితిలో ఎందుకు విఫలమయ్యిందనే ప్రశ్న తలెత్తుతుంది. వారిని అడవి అడ్డుకుందా? లేదే, అదెలా సాధ్యం? ప్రతిరోజూ బలగాలు ఈ అడవుల్లో గస్తీ తిరుగుతుంటాయి. టెలికమ్యూనికేషన్ సౌకర్యాలు లేకపోవడం వారికి అడ్డంకిగా నిలిచిందా? లేదే, అదెలా సాధ్యం? జాపూర్ బాలిక ఆశ్రమ పాఠశాలలో అంటురోగానికి గురైంది. అది రోడ్డు మీద, మంచి కమ్యూనికేషన్ సౌకర్యాలున్న ప్రాంతంలో ఉంది. ఆమెకు సరైన వైద్యం అందలేదు, అందుకని ఆమె పరిస్థితి దిగజారుతూ పోయింది. అన్నిటికంటే ముఖ్యంగా, ఆమె తల్లి ఈ ఆశ్రమ పాఠశాలలో మరణించింది. ఆమెను వారెందుకు కాపాడలేకపోయారు? ఆ బాలికను చావడం కోసం ఆమె గ్రామానికి ఎందుకు తిప్పి పంపారు అనే ప్రశ్న తలెత్తుతుంది. వాగులు వారినేమైనా అడ్డుకున్నాయా? లేదే, అదెలా సాధ్యం? అలా అనుకుంటే పారామిలటరీ క్యాంపులకు రేషన్లు ఎలా సప్లై చేస్తున్నారు?

వారి ఉన్నతాధికారులు ఈ ఏరియాలోని క్యాంపులను ఎలా సందర్శిస్తున్నారు? వారు తమ బలగాలకు రేషన్లు సప్లై చేయగల్గుతున్నప్పుడు, ఏడాదిలో ఏ సమయంలోనైనా ఈ క్యాంపులను సందర్శించగల్గుతున్నప్పుడు, మహమ్మారి సోకిన సమయంలో ఈ ప్రాంతాలకు వైద్య బృందాలను, మందులను పంపకుండా భారత పాలనావ్యవస్థను అడ్డుకున్నదెవరు? బస్తర్ కచ్చితంగా యుద్ధక్షేత్రమే. కానీ మరి రాయ్‌పూర్, దుర్గ్‌లలో వందలాది ప్రజలు హెపటైటిస్ మహమ్మారితో ఎందుకు చనిపోయినట్టు? ఒడిషా, మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో అదే కాలంలో వందలాది ప్రజలు డయేరియాతో ఎందుకు మరణించినట్టు? పశ్చిమ బీహార్‌లో, తూర్పు యూపిలో పిల్లలు టపానిక్స్ ఎన్‌సెఫలైటిస్‌తో ఎందుకు మరణిస్తున్నారు? ఈ ప్రాంతాలన్నీ మైదాన ప్రాంతాలు, రోడ్లు, కమ్యూనికేషన్ సౌకర్యాలు ఉన్న ప్రాంతాలు. అక్కడ మావోయిస్టులు లేరు. అక్కడకి వెళ్లకుండా భారత పాలనావ్యవస్థను అడ్డుకున్నదెవరు? భారత రాజ్య దోపిడీ, అమానవీయ స్వభావమే దానిని అత్యధిక శ్రామిక ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా అడ్డుకుంటున్నది.

ప్రజారోగ్య సేవలు భారతదేశంలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన సేవలలో ఒకటి. 'స్వాతంత్ర్యం' వచ్చాక భారత రాజ్యం తన ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి చాలా తక్కువ ఖర్చు పెట్టింది. రోగి-డాక్టర్ నిష్పత్తి ఇప్పటికీ చాలా ఎక్కువగా వుంది. ప్రాథమిక ఆరోగ్య చికిత్స చేసే ఆరోగ్య కేంద్రాలు అతి తక్కువగా ఉన్నాయి. ఉన్న చోట కూడా వాటిలో పరికరాలు లేవు, సిబ్బంది కొరత, అవినీతి నెలకొన్నాయి. భారతదేశంలోని మొత్తం ఆరోగ్య వ్యవస్థను పట్టణ ధనికుల అవసరాల కోసమే నిర్మించారు. గ్రామాలు, సుదూర ప్రాంతాలు అత్యంత నిర్లక్ష్యానికి గురైనాయి. అత్యధిక ప్రజలు తమ ఆరోగ్య సమస్యల కోసం నకిలీ వైద్యుల మీదో, మంత్రగాళ్ల మీదో ఆధారపడతారు.

1990లలో భారతదేశం నయా ఉదారవాద ఆర్థిక విధానాల్ని వ్యవస్థాగత మార్పుల పేరిట అమలు చేయడం మొదలుపెట్టినప్పుడు, మొత్తం ప్రజారోగ్య, వైద్యవిద్యారంగాన్ని పెద్ద ఫార్మసూటికల్ (మందుల తయారీ) కంపెనీలకు అనుకూలంగా పునర్ వ్యవస్థీకరించారు. ఆరోగ్య వైద్యవిద్య రంగాన్ని సంపూర్ణంగా వ్యాపారీకరించారు. ప్రజలకు అందుబాటులో వుండిన అతి తక్కువ ఆరోగ్య సేవలను కూడా ఒక్కొక్క మెట్టుగా వారి నుండి లాగేసుకున్నారు. ప్రజారోగ్య కేంద్రాలను మూసివేశారు. వైద్యులను, పారామెడిక్ సిబ్బందిని నూతనంగా భర్తీ చేసుకోవడం మానివేశారు. జిల్లాస్థాయి, మూడవ శ్రేణి (టెర్షియరీ లెవల్) ఆసుపత్రులలో, మెడికల్ కాలేజిలకు అనుబంధంగా వుండే ఆసుపత్రులలో కూడా ఇప్పుడిక సరైన పరికరాలు, తగిన సిబ్బంది లేకుండా పోయారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు ఇప్పుడు కేవలం మూడవ శ్రేణి ఆసుపత్రులకు రిఫర్ చేసే కేంద్రాలుగా మారిపోయాయి. పరిస్థితులు ఎంత దారుణంగా తయారయ్యాయంటే

కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం చేయగలిగిన కేసులను కూడా పెద్ద నగరాలకు, మూడవ శ్రేణి ఆసుపత్రులకు పరిశోధన కోసం, వైద్యం కోసం రిఫర్ చేసేస్తున్నారు. ఆ ఆసుపత్రుల్లో పేషెంట్లకు స్లిప్పుల మీద మందులు రాసి ఇస్తారు. ఎవరికీ కొద్దిపాటి దూది కూడా ఈ ఆసుపత్రుల్లో దొరకడం లేదిక. ప్రతీదీ అమ్మకానికి పెట్టిన దగ్గర పేదవాడికి ఏం దక్కుతుంది? రోగగ్రస్థమై, చావుకు దగ్గరైన ఒక ఆరోగ్య వ్యవస్థ కోట్లాది ప్రజల జీవితాలను ఎలా కాపాడగలదు?

భారత దేశ ప్రజారోగ్య వ్యవస్థ నిధులు, సిబ్బంది కొరత వల్ల చావుకు దగ్గరవుతుండగా, చిన్న, పెద్ద ప్రైవేటు నర్సింగ్‌హోంలు, ఆసుపత్రులు పట్టణాల్లో, నగరాల్లో పెరగసాగాయి. అనేక పెద్ద ఫార్మాసూటికల్ కంపెనీలు ఆరోగ్య రంగంలోకి ప్రవేశించాయి. ఫోర్టిస్, ఎస్కార్ట్స్, ఆపోలోస్, మాక్స్‌స్ - ఈ ఆసుపత్రులన్నీ ఈ కంపెనీల యాజమాన్యంలో వున్నాయి. ఈ కంపెనీల యాజమాన్యంలోని ఐదు నక్షత్రాల ఆసుపత్రులకు లేదా డబ్బున్న వైద్యుల యాజమాన్యంలోని రెండు లేదా మూడు నక్షత్రాల ఆసుపత్రులకు భారతదేశంలోని అత్యధిక ప్రజల ఆరోగ్య సమస్యలతో ఎటువంటి సంబంధం ఉండదు. అవి కేవలం పట్టణ ధనికులకు లేదా భారతదేశ పట్టణాల్లో పెరుగుతున్న నూతన సంపన్న (నియోరిచ్) సెక్షన్‌ల అవసరాలను మాత్రం తీరుస్తాయి. ఈ ఆసుపత్రులు డబ్బును తయారు చేసే యంత్రాలు. యువ వైద్యులు, పారామెడిక్ సిబ్బంది కూడా మరింత ధనవంతులు కావడానికి, తమ వృత్తుల్లో అత్యున్నత సామర్థ్యాన్ని సాధించడానికి ఈ ఆసుపత్రులకేసే చూస్తారు. ఒకవైపు ఈ ఆసుపత్రులు, ఈ వృత్తి నిపుణులు అత్యంత పురోగామి టెక్నాలజీలను, టెక్నిక్‌లనూ వాడుతూ, వాటిపై పట్టు సంపాదిస్తున్నారు. అయితే అవి అత్యధిక శాతం ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడ్డం లేదు. ప్రజలకు వారి సమస్యలు వారికున్నాయి, వారు పోషకాహార లేమితో, అంటురోగాలతో కునారిల్లుతున్నారు. సామాజిక-ఆర్థిక పరిస్థితులను మార్చడం ద్వారా, ఆధునిక వైద్య శాస్త్రం సహాయంతో వీటికి నివారించవచ్చు. కానీ ఎవ్వరూ దీని పట్ల ఎటువంటి శ్రద్ధ చూపడం లేదు. బస్తర్ కూడా దీనికి మినహాయింపు కాదు. రాజనాంద్‌గాం, కాంకేర్, జగ్దల్‌పూర్, రాయ్‌పూర్ లేదా భద్రాచలం వంటి పట్టణాలలో మనకు పెద్ద ప్రైవేటు ఆసుపత్రులు కనిపిస్తాయి. కానీ బస్తర్ ప్రజలు వీటి సేవలను ఉపయోగించుకోగల్గుతాం అని కలలో కూడా అనుకోలేని స్థితి.

బస్తర్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఏడు జిల్లాలతో కూడిన ఒక రీజియన్ (సుక్మా, బీజాపూర్, దంతేవాడ, బస్తర్, కొండగాం, నారాయణ్‌పూర్, కాంకేర్). ఇక్కడ కొంత కొండప్రాంతం ఉండగా, కొంత ప్రాంతం సమశీతోష్ణ అడవులతో నిండిన మైదాన ప్రాంతంగా వుంది. ఈ అడవులు ప్రపంచంలోనే అతి పెద్ద ఫార్మసీలలో ఒకటి. ఇక్కడ వందలాది ఔషధ మొక్కలు ఉన్నాయి. ఇవి అనేక ఆయుర్వేద, అల్లోపతి ఫార్మాసూటికల్ కంపెనీలకు సహజసిద్ధమైన ముడిసరుకును సప్లై చేస్తాయి. కానీ ప్రజలు సులభంగా వైద్యం చేయగలిగే రోగాలతో

చనిపోతున్నారు. ఈ ప్రాంతంలోని ఆరోగ్య సేవలు నామమాత్రంగా వున్నాయి. ప్రజారోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు అతి తక్కువ సంఖ్యలో ఉన్నాయి. వాటిలో సిబ్బంది కొరత, పరికరాల కొరత, అవినీతి సమస్య ఉండడం వల్ల ప్రజలకు సరైన వైద్య సేవలు దొరకడం లేదు.

బస్తర్ ప్రజలకు అతి పెద్ద సమస్యలు మలేరియా, నీళ్ల ద్వారా సంక్రమించే అమీబియాసిస్, బాక్టీరియల్ డిసెంట్రీ, కలరా, హెపటైటిస్ వంటి రోగాలు, వానాకాలంలో వచ్చే ఎంటెరిక్ జ్వరం వంటివి. రుతువులను బట్టి వచ్చే ఫారింజైటిస్, బ్రాంకైటిస్, కమ్యూనిటీ అక్వైర్డ్ న్యుమోనియా, వైరల్ ఫీవర్ వంటివి కూడా వస్తుంటాయి. ఇవి కాక, స్కాబీస్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్, హెర్పిస్ వంటి చర్మరోగాలు కూడా ప్రజలకు బాగా పీడిస్తుంటాయి. అంటురోగాలు కాని ఎపిలెప్సీ (మూర్ఛ), పెప్టిక్ అల్సర్‌లు, సికిల్ సెల్ అనీమియా (వార్తాపత్రికలను బట్టి), రీనల్ స్టోన్స్, రుమాటిక్ గుండె జబ్బులు కూడా ఇక్కడ కనిపిస్తాయి. కానీ రోగనిర్ధారణ చేసి, వైద్యం చేసేవారెవరూ లేరు. పొలాల్లో పని చేసే సమయంలో ప్రజలు తరచూ ఎలుగుబంట్లు, అడవి పందుల దాడుల వల్ల గాయాలపాలవుతుంటారు. (మన ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం-పిఎల్‌జిఎ దళ డాక్టర్లు ఇలాంటి వందలాది రోగులకు వైద్యం అందించారు). ఇటువంటి సమయాల్లో మన ఆర్పీసీ (ప్రజాప్రభుత్వం) డాక్టర్లు లేదా దళం డాక్టర్లు ప్రజలకు సేవ చేస్తున్నారు. వీరు అందుబాటులో లేని చోట్ల ప్రజలు తమ కుటుంబ సభ్యులను స్ట్రెచర్ల మీద రోడ్డు పక్కనున్న ప్రజారోగ్య కేంద్రాలకు లేదా డిస్పెన్సరీలకు మోసుకువెళ్తారు. కొన్నిసార్లు (అత్యధిక సందర్భాల్లో అనడం సరిగా ఉంటుందేమో) కాలినడకన ఈ ఆరోగ్య కేంద్రాలను చేరడానికి ఎన్నో గంటల సమయం పడుతుంది. అక్కడకు చేరాక కూడా ప్రజలకు సరైన వైద్యం అందదు. ప్రాథమిక చికిత్స తర్వాత వారిని అత్యధిక సందర్భాల్లో ఉన్నత కేంద్రాలకు సరైన వైద్యం కోసం రిఫర్ చేస్తారు. ఈ ప్రజారోగ్య కేంద్రాలన్నీ రోడ్డు పక్కనున్న గ్రామాల్లో లేదా పట్టణాల్లో సిఆర్‌పిఎఫ్ క్యాంపులు, పోలీస్ స్టేషన్లు ఉన్నకాడ ఉంటాయి. ఈ బలగాలు ప్రజలను చాలా వేధిస్తుంటాయి. అందుకని చాలామంది ప్రజలు ఈ వైద్య కేంద్రాలకు వెళ్లడానికి వెనకాముందాడుతారు.

మనకు బస్తర్‌లోని ప్రతి ఒక్క గ్రామంలో ఇటువంటి పరిస్థితులే కనిపిస్తాయి. పిఎల్‌జిఎ (ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం) దళం ఏదైనా గ్రామాన్ని సందర్శించినప్పుడు ప్రజలు ఎప్పుడైనా గానీ డాక్టర్ గురించి అడుగుతారు. పట్టణ ప్రాంతం నుండి వచ్చిన చదువుకున్న వ్యక్తిలా కనిపిస్తే, వాళ్లు తప్పక ఆ వ్యక్తి వద్దకు వెళ్లి రోగాల గురించి చెప్పుకుని మందులడుగుతారు. మన దళం డాక్టర్ల అందరికంటే ప్రసిద్ధి చెందినవారు, ఆ ప్రాంతాల ప్రజలు వారిని ప్రాణాధికంగా ప్రేమిస్తారు. వారు ప్రజల రోగాలను నయం చేయడానికి తాము చేయగల్గినదంతా చేస్తారు. వారు ఆధునిక వైద్యాన్ని మనస్ఫూర్తిగా నేర్చుకోవడానికి

ప్రయత్నిస్తుంటారు. వారు ఈ ప్రాంతాల్లో సాధారణంగా వచ్చే రోగాలను నయం చేయడంలో ఎంతో సమర్థులు. వారు నకిలీ వైద్యుల వలే హిట్ అండ్ ట్రయల్ (ప్రజల మీద ప్రయోగాలు చేసే) పద్ధతులను వినియోగించారు. వారు రోగనిర్ధారణ చేయడానికి సంచిత జ్ఞానాన్ని అన్వయించడానికి శాయశక్తులా కృషి చేసి తగిన, అవసరమైన వైద్యాన్ని ఈ రోగులకు అందించడానికి ప్రయత్నిస్తుంటారు. వారు ఆధునిక వైద్యాన్నీ, కొంత శస్త్రచికిత్సనూ నేర్చుకోవాలని ఎంతో తృష్ణను కలిగి ఉన్నారు. వారు మలేరియా, గ్యాస్ట్రో-ఎంటిరైటిస్, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, టైఫాయిడ్, న్యుమోనియా, చర్మరోగాలు వంటివాటికి వైద్యం చేయగల్గుతారు. వారు ఎముకలు విరిగిన కేసుల్లో వైద్యం చేయగల్గుతారు, ఒక మేరకు మల్టిపుల్ ట్రామా కేసులకు చికిత్స చేయగల్గుతారు. రోజురోజుకూ వారు నూతన అంశాలను నేర్చుకుంటున్నారు, చికిత్స చేస్తూ అనుభవాన్ని పొందుతున్నారు. వారీ పనులన్నీ ఎందుకు చేస్తున్నారంటే తమ సోదరీ సోదరులకు రోగాలు వచ్చినప్పుడు, ఎమర్జెన్సీ పరిస్థితుల్లోనూ ఎవరూ దగ్గర ఉండరని వారికి తెలుసు. వారు కన్నతల్లుల్లా ప్రజలకు సేవ చేస్తున్నారు. ప్రజలు కూడా వారిని కన్నబిడ్డల్లా చూసుకుంటారు. కాబట్టి కొన్ని సందర్భాల్లో వాళ్లు రోగులకు తల్లుల్లాగ వ్యవహరిస్తే, కొన్ని సందర్భాల్లో రోగులు తల్లుల పాత్రను వహిస్తున్నారు. మన వైద్యులకూ, ప్రజలకూ మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధం ఇలాంటిది. వృత్తి వైద్య నిపుణులు రోగులకు ఎలా సేవ చేయాలనే విషయంలో వారి నుండి ఎంతో నేర్చుకోవచ్చు. అయితే మన దళం డాక్టర్లు చాలా సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారు. వారికి ఆధునిక వైద్యం గురించి, శస్త్రచికిత్స గురించి నేర్పించగలిగే టీచర్లు అవసరం. వైద్య లేబరేటరీ టెక్నిక్‌లు, కొంత దంతవైద్యం నేర్పించగలిగే టీచర్లు అవసరం. అడవి బైటి నుండి మన ఏరియాలకు వచ్చి మన కార్యకలాపాలకు హాజరయ్యేవారి ముందు వీరు తప్పనిసరిగా ఈ

తన స్వంతంకోసం ఏమీ చేసుకోకుండా ప్రతిపనీ ఇతరుల ప్రయోజనం కొరకు చేసే కామ్రేడ్ బెతూన్ దీక్ష, తన పనిలో బాధ్యతపట్ల చాలా గొప్ప గుర్తింపు, తన కామ్రేడ్స్, ప్రజల పట్ల చాలా గొప్ప ఆప్యాయతల ద్వారా వ్యక్తమైంది. ప్రతి కమ్యూనిస్టు ఆయన నుండి నేర్చుకోవాలి.

స్వార్థం నుండి అంత పూర్తిగా విముక్తి చెందిన ఆ దీక్షను ఆయన నుండి మనమంతా నేర్చుకోవాలి. ఈ అంశం నుండి ప్రారంభించినపుడు ప్రజలకు గొప్ప ప్రయోజనకరమైన వ్యక్తిగా ఎవరైనా తయారుకాగలరు. ఒక మనిషి యొక్క సామర్థ్యం అధికమైనది కావచ్చు లేదా అమూల్యమైనది కావచ్చు. అతను ఈ దీక్షమాత్రం కలిగి వున్నట్లయితే అతను అప్పటికే ఉన్నత ఆదర్శాలు గల మనిషిగాను, నిర్మలమైన మనిషిగాను, నైతికస్థాయి గల మనిషిగాను, తుచ్ఛమైన కోర్కెలను అధిగమించిన మనిషిగాను, ప్రజలకు ప్రయోజనకరమైన మనిషిగాను ఎదిగినట్లే.

- మావో (డా. నార్మన్ బెథూన్ జ్ఞాపకార్థం)

డిమాండ్లను పెడుతుంటారు. తమ ప్రజల విషయంలో బైటి వైద్య, శస్త్ర చికిత్స నిపుణులు ప్రదర్శించే నిర్లక్ష్యాన్ని గురించి కూడా వారు ఫిర్యాదు చేస్తుంటారు.

ఇదంతా కాసేపు పక్కన పెట్టి, తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న వైద్య సమస్యల వద్దకు వద్దాం. 2014 ఫిబ్రవరిలో మేం తూర్పు బస్తర్ డివిజన్‌లోని ఇ...గ్రామంలో ఉన్నాం. మేం అక్కడి గ్రామస్తులకు వైద్యం చేస్తుండినాం. అనేకమంది మహిళలు తమ పిల్లలను తీసుకుని వైద్యం కోసం వచ్చారు. చాలామంది ఒళ్లునెప్పులు, పనులు చేసినప్పుడు ఊపిరి ఆడకపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి సమస్యలు చెప్తున్నారు. వారందరికీ రక్తహీనత ఉన్నది. పదే పదే మలేరియా రావడం, అత్యధిక జననాల రేటు, అత్యధిక మరణాల రేటు వారి జీవితాలపై ఎంతో ప్రతికూల ప్రభావాన్ని వేస్తున్నాయి. బస్తర్‌లో మరణాల రేటు చాలా ఎక్కువ. అత్యధిక మరణాలు ఐదు సంవత్సరాల లోపు వయసులో సంభవిస్తున్నాయి. ఈ అత్యధిక మరణాల రేటును అత్యధిక జననాల రేటు పూరిస్తుంటుంది. పదే పదే గర్భం దాల్చడం, పిల్లల్ని కనడం అనేవి స్త్రీల శరీరాల్ని పూర్తిగా పీల్చి పిప్పి చేస్తున్నాయి. అత్యధిక శాతం మహిళలు తమ వయసుకంటే 10, 15 ఏండ్లు ఎక్కువ వయసున్న వారిలా కనిపిస్తుంటారు. కానీ వారంతా ఎంతో కష్టజీవులు. వారు రోజూ ఇంటిపనంతా చేస్తారు, పొలాల్లో పని చేస్తారు, అడవి నుండి వంటచెరుకు ఏరుకొస్తారు, అటవీ ఉత్పత్తులను సేకరించి సంతలలో అమ్మకానికి తీసుకెళ్తారు. వారు బస్తర్ సామాజిక-ఆర్థిక జీవనానికి వెన్నెముక వంటివారు. కానీ వారు అతి తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలతో (రక్తహీనత) పోరాడుతుంటారు. అనేకమంది పిల్లలు కూడా పోషకాహారలేమితో ఉన్నారు. వారి పొట్టలు ఉబ్బిపోయి వుంటాయి. అత్యధిక శాతం పిల్లలు స్ప్లీనోమెగాలీతో (ప్లీహం పరిమాణం అసాధారణంగా పెరగడం) బాధపడుతున్నారు. ఇది మలేరియా చాలా ఎక్కువగా వస్తోందనే విషయాన్ని, ఈ ప్రాంతాల్లో వైద్య సేవల లేమిని సూచిస్తుంది. ఇక్కడ మేం మూడు టిబి కేసులను గుర్తించాం. వారిలో ఒకరు నాలుగు నెలల మగబిడ్డ. ఆ బిడ్డకు ఈ రోగం తన తాత నుండి సంక్రమించింది. ఆయనకు టిబి ఉందనేది గుర్తించారు, దానికి చోటేడోంగర్ ఆరోగ్య కేంద్రంలో చికిత్స కూడా నడుస్తుండింది. కానీ చోటేడోంగర్ తమ గ్రామానికి చాలా దూరంలో వుంది కనుక ఆయన చికిత్సను మధ్యలోనే ఆపేశాడు. ఇ... గ్రామం నుండి చోటేడోంగర్‌కు వెళ్లడానికి కాలినడకన మూడు గంటలు పడుతుంది. చోటేడోంగర్‌లో ఒక సిఆర్‌పిఎఫ్ క్యాంపు, పోలీసు స్టేషన్ కూడా వున్నాయి. అందుకని చాలామంది మగవాళ్లు చోటేడోంగర్‌కు వెళ్లరు కూడా. ఆ తల్లికి తన బిడ్డను ప్రజారోగ్య కేంద్రానికి తీసుకెళ్లమని సలహా ఇచ్చాం. ఆ బిడ్డకు మందులు రాసిచ్చి, ఆ ఏరియాలోని మన కామ్రేడ్స్‌కు ఆ బిడ్డకు మందులు ఇప్పించమని చెప్పి ఆ చిట్టీని వారి చేతిలో పెట్టాం.

వి....గ్రామంలో పరిస్థితి కూడా తేడాగా ఏం లేదు. రక్తహీనత గల మహిళలు, పోషకాహార లేమితో బాధపడుతున్న పిల్లలు, వేర్వేరు స్థాయిల్లో గల స్ప్లీనోమెగాలీలు కనిపించాయి. ఇక్కడ

అత్యధిక శాతం ప్రజలు విపరీతంగా దురదలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. వారికి స్కాబీస్ వుంది. ఇది పెద్ద అంటురోగం, చాలా చికాకును కలిగించే చర్మరోగం. దానికి వైద్యం చాలా సాదాసీదాగా చేయవచ్చు. రెండుసార్లు గామా బెంజీన్ హెక్సాక్లోరైడ్ పూస్తే చాలు దీన్ని నయం చేయవచ్చు. ఒక లీటర్ జిబిహెచ్‌సితో ఈ రోగులందర్నీ నయం చేయవచ్చు. ఒక 500 ఎంఎల్ జిబిహెచ్‌సిని హోల్‌సేల్ మార్కెట్‌లో కొంటే కేవలం 20 లేదా 30 రూపాయలు పడుతుంది. అంటే ఆ గ్రామం నుండి ఈ రోగాన్ని పారదోలడానికి కేవలం 50 లేదా 60 రూపాయలు పడుతుంది. కానీ సమస్య ఏంటంటే ప్రజలకు ఈ రోగాలకు కారణాలు గానీ, వాటికి చికిత్స ఏంటి అనేది గానీ తెలీవు. ప్రభుత్వ ఆరోగ్య కార్యకర్తలు ఈ గ్రామాలకు ఎన్నడూ రారు. ఆరోగ్య కేంద్రాలు ఈ గ్రామాలకు ఎంతో దూరంలో ఉంటాయి. భారత ప్రభుత్వం వారి మానాన వారిని వదిలేసింది. మన ఏరియా డాక్టర్లకు ఒక లీటర్ జిబిహెచ్‌సిని తెచ్చి రోగులందరికీ వైద్యం చేయమని సలహా ఇచ్చి వచ్చాం.

బార్సూర్ ఏరియాలో రెండు మూర్ఛ కేసులు కనిపించాయి. ఇద్దరూ మహిళలే. ఒకామె ఒక క్రిస్టియన్ చర్చిలోని ఫాదర్‌తో వైద్యం చేయించుకుంటోంది. ఆమె పరిస్థితి రోజురోజుకూ దిగజారుతూ పోతోంది. వివరమైన రోగ చరిత్ర తెలుసుకున్నాక, మేం ఆమెకు మూర్ఛను తగ్గించే మందులు ఇచ్చి, మన స్థానిక దళం డాక్టర్లకు రోగిని నిరంతరం కలిసి పరిస్థితి తెలుసుకుంటూ ఉండమనీ, ఏదైనా సమస్య వస్తే మాకు తెలియజేయమని చెప్పాం. మన బార్సూర్ కామ్రేడ్స్ ఆ ఏరియాలో చురుగ్గా పని చేస్తున్న వివిధ మత సంస్థల గురించి చెప్పారు. బస్తర్‌లో అనేక హిందూ, క్రిస్టియన్ సంస్థలు చురుగ్గా ఉన్నాయి. వీటిలో అత్యధి˘ం హిందూ మత సంస్థలు. వీటికున్న ఏకైక ఎజెండా ఆదివాసులను హిందూ మతంలోకి మార్చడం. కొందరు క్రిస్టియన్ మిషనరీలు వారిని క్రిస్టియన్ మతంలోకి మార్చే ప్రయత్నం చేస్తున్నారు. బాబా బిహారీదాస్ సంస్థ ఇక్కడ అన్ని సంస్థలకంటే బలమైన ఉనికిని కలిగి ఉంది. వారికి జగ్దల్‌పూర్, చప్కా (వారి ప్రధాన కేంద్రం), ముత్తైన్‌పాల్ మొదలైన పట్టణాల్లో కేంద్రాలు ఉన్నాయి. సత్‌గురు సంస్థ, శివశంకర్‌వాలా సంస్థలకు నారాయణపూర్, కిల్లేపాల్, గుమర్ గుండల్లో కేంద్రాలు ఉన్నాయి. గాయత్రి మంత్రం సంస్థకు గీదంలో కేంద్రం ఉంది. ఇవన్నీ ఆదివాసీ ప్రాంతాల్లో హిందూ మతాన్ని ప్రచారం చేస్తూ విస్తరిస్తున్నాయి. ఇవి ప్రజలకు చికిత్స పేరిట మంత్రాలు, ప్రసాదాలు ఇస్తాయి. గతంలో లాంజోడలో వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ (ఆర్ఎస్ఎస్ నడిపే సంస్థ) వారికి ఒక డిస్పెన్సరీ వుండేది. కానీ దాన్ని 2009లో మూసివేశారు. ఇప్పుడు ఇటువంటి నామమాత్రమైన వైద్య సదుపాయాలను కూడా ఈ హిందూ మత సంస్థలు కల్పించడం లేదు. వారి దృష్టిలో ఆదివాసులు కేవలం సంఖ్యలు మాత్రమే, వారి మతానికి చేర్చుకోవల్సిన సంఖ్యలు. వారు ఆదివాసీ యువతీ

యువకులను రాయ్‌పూర్, జగ్దల్‌పూర్‌లకు తీసుకువెళ్లి వారిని తమ మతపరమైన నృత్య పార్టీల్లో ప్రదర్శనా వస్తువుల్లాగ చూపిస్తారు. ఈ సంస్థలకు వారి రోజువారీ సమస్యలతో ఎటువంటి సంబంధం ఉండదు, వారి ఆరోగ్యం పట్ల ఎటువంటి అక్కరా వుండదు. క్రిస్టియన్ సంస్థలకు కూడా ఇదే వర్తిస్తుంది. వారి కేంద్రాలు బార్సూర్‌లోని బింటా, బెల్లార్‌లలో ఉన్నాయి. వారు రోగుల కోసం కేవలం ప్రార్థనలు చేస్తారు. భారత రాజ్యం తన లక్షకు పైగా బలగాలను బస్తర్‌లో మోహరించింది. హిందూ మత, క్రిస్టియన్ సంస్థలు కూడా బస్తర్‌లో చురుగ్గా ఉన్నాయి. కానీ బస్తర్ ప్రజల పట్ల నిజమైన అక్కర వున్నది మాత్రం ఒక్క మావోయిస్టులకే.

ప్రజలు రోగాలపాలైనప్పుడు లేదా గాయాలపాలైనప్పుడు మావోయిస్టు డాక్టర్లే అందరికంటే ముందుగా వారి సేవకై ముందుకొస్తారు. మన వైద్య బృందాలు కచ్చితంగా బలహీనంగానే వున్నాయి, కానీ అవి అభివృద్ధి చెందుతున్నాయి. విప్లవోద్యమ నిర్మూలనలో భాగంగా వీటిని దెబ్బ తీయాలని నిరంతరం ప్రభుత్వ బలగాలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ప్రజావైద్య కేంద్రాలకు మందులు కొనుక్కు వచ్చేవారిని, అమ్మేవారిని పోలీసులు వదిలిపెట్టడం లేదు. అయినా మన వైద్య బృందాలు ఇటువంటి దుర్మార్గ దాడుల మధ్యనే ప్రజల సహకారంతో, పిఎల్‌జిఎ రక్షణలో ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాయి. మావోయిస్టు ఉద్యమం వల్ల ప్రజల ఆర్థిక జీవనంలో కలిగిన మార్పులు ప్రజల ఆరోగ్యంపై కచ్చితమైన ప్రభావాన్ని కలిగించాయి. భూముల పంపకం తర్వాత, ప్రజలు మరింతగా ధాన్యాలను, తృణధాన్యాలను, కూరగాయలను పండిస్తున్నారు. మన క్రాంతికారి జనతన సర్కార్ గ్రామాల్లో చెరువులు నిర్మించడంతో ప్రజలు చేపలు తినగల్గుతున్నారు, ఆ నీటిని సాగు కోసం వినియోగించుకుంటున్నారు. ప్రజలు సంఘటితం కావడం వల్ల అడవి నుండి తినగలిగే ఆకులు, అలములు అన్నిటినీ వారు స్వేచ్ఛగా సేకరించుకోగల్గుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరిగింది. ఇప్పుడు అత్యధిక ప్రాంతాల్లో వారు ఎంతోకొంత వంటనూనెలను ఉపయోగిస్తున్నారు. చక్కెర, కొన్నిసార్లు పాలు కూడా కొంతవరకు వినియోగిస్తున్నారు. వారి క్రాంతికారి జనతన సర్కార్లు కొంతవరకు మందులు కొనగల్గుతాయి, రోగాలు వచ్చినవారికి సహాయం అందించగల్గుతాయి. నేను బస్తర్‌ను తప్ప మరే ఆదివాసీ ప్రాంతాన్నీ సందర్శించలేదు. కానీ ఇతర ప్రాంతాల్లో పని చేసిన మన కామ్రేడ్స్ మాకు చెప్పినదేంటంటే ఇతర అనేక ఆదివాసీ ప్రాంతాల్లో కంటే బస్తర్ ప్రజల పోషకాహార స్థాయి మెరుగ్గా ఉందనేది.

ఏప్రిల్‌లో మేం దర్భ డివిజన్‌లోని కాంగేర్‌ఘాటీ ఏరియాలోని జి...గ్రామంలో ఉండినాం. అక్కడి ప్రజలు కూడా జ్వరానికీ, ఒళ్లునెప్పులకు, చర్మరోగాలకు మందులు కావాలని కోరుతుండినారు. గ్రామస్తులు 17 ఏండ్ల ఒక యువకుడిని తీసుకొచ్చారు. అతనికి రుమాటిక్

గుండె జబ్బు ఉండింది. అతని గుండెలోని రెండు వాల్వులూ లీక్ అవుతున్నాయి. అతని గుండె పాడైపోతూ ఉంది. అతను కొన్ని అడుగులు కూడా వేయలేకపోతున్నాడు. అతనికి ఛాతీ ఎక్స్-రే, ఇసిజి, ఇకో-కార్డియోగ్రఫీ చేయడం అవసరం. మేం రోగాలను చాలావరకూ క్లినికల్‌గా గుర్తించగల్గుతాం, వాటికి చికిత్స చేయగల్గుతాం. కానీ ఇటువంటి రోగాలకు మరిన్ని పరీక్షలు అవసరమౌతాయి. మేం అతనికి కొన్ని డైౖబెటీస్, లానోక్సిన్ గోలీలు ఇచ్చి, అతన్ని జగ్దల్‌పూర్‌లోని మెడికల్ కాలేజీకి తీసుకెళ్లమని అతని తల్లిదండ్రులకు సలహా ఇచ్చాం. అయితే జగ్దల్‌పూర్ మెడికల్ కాలేజిలో ఇకో-కార్డియోగ్రఫీ వుందో లేదో ఎవరికి ఎరుక? భారతదేశంలోని అనేక మెడికల్ కాలేజీలు ఇకో, సిటి, ఎంఆర్ఐ వంటి సౌకర్యాలను కలిగి ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల పరిస్థితులు  చాలా అధ్వాన్నం. దంతేవాడలోని జిల్లా ఆసుపత్రి ఎలా వుందో ఒకసారి చూద్దాం. ఇది దక్షిణ బస్తర్ జిల్లాలోని మూడు జిల్లాలైన సుక్మా, బిజాపూర్, దంతేవాడ ప్రజల అవసరాలను తీర్చాలి. అది వంద పడకల ఆసుపత్రి. దాని ఓపిడికి రోజూ 200కు పైగా రోగులు వస్తుంటారు. కుంట, సుక్మా, బీజాపూర్, భైరంగఢ్ వంటి సుదూర ప్రాంతాల నుండి కూడా ఇక్కడకు చికిత్స కోసం రోగులు వస్తుంటారు. ఆ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ ఒక్కడే ఏకైక స్పెషలిస్టు డాక్టర్. మిగతా పదకొండు పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. అక్కడ గైనకాలజిస్టు (స్త్రీల), పీడియాట్రిషియన్ (పిల్లల), కన్ను, చెవి, ముక్కు, గొంతు, ఆర్థోపెడిక్ (ఎముకల) స్పెషలిస్టులు ఎవ్వరూ లేరు. ఉన్న కొద్ది సౌకర్యాలను కూడా అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న పారామిలటరీ బలగాలే వినియోగించుకోవడంతో ప్రజలకు అవి కూడా దక్కడం లేదు. ప్రతి నెలా ముప్పైకి పైగా రోగులను ఇక్కడి నుండి రాయ్‌పూర్ లేదా జగ్దల్‌పూర్ మెడికల్ కాలేజికి రిఫర్ చేస్తారు. బీజాపూర్, సుక్మా ఆసుపత్రులలోని పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉన్నది. నారాయణపూర్‌లో కూడా  ప్రజలకు చికిత్స చేయడానికి గైనకాలజిస్టు గానీ, కంటి స్పెషలిస్టులు గానీ ఎవరూ లేరు. రోగులను కొండగాంకు గానీ జగ్దల్‌పూర్‌కు గానీ రిఫర్ చేస్తారు లేదా చికిత్స ఏం పొందకుండానే రోగులు గ్రామాలకు మరలిపోతారు. అందుకని రోగులు ఈ జిల్లా ఆసుపత్రులకు వెళ్లినప్పటికీ వారికి సరైన చికిత్స అందుతుందనే హామీ ఏమీ లేదు.

వైద్య సదుపాయాలు లేని, తగినంత అందుబాటులో లేని కోటానుకోట్ల ప్రజానీకం రోగగ్రస్థమైన, చావుకు దగ్గరైన ప్రజావ్యతిరేక ఆరోగ్య వ్యవస్థ స్థానంలో ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన ప్రజారోగ్య వ్యవస్థను నెలకొల్పడానికి కొనసాగిస్తున్న ప్రజాయుద్ధ విజయమే ఈ మౌలిక సమస్య శాశ్వత పరిష్కారానికి సానుకూల పరిస్థితిని సృష్టిస్తుంది, పరిష్కరిస్తుంది. చరిత్ర నిర్మాతలైన ప్రజలు తప్పక తమదైన నూతన రాజ్య వ్యవస్థతో పాటు తమదైన నూతన ఆరోగ్య వ్యవస్థను నిర్మించుకుని తీరుతారు. ప్రజలు అజేయులు! *

# ఎల్ఐసీలో భాగంగా శత్రువు కొనసాగిస్తున్న మానసిక యుద్ధాన్ని ప్రజాయుద్ధంలోని అన్ని రంగాల ద్వారా పోరాడి ఓడిద్దాం !

ప్రపంచంలోని వలస-అర్ధవలస దేశాల పీడిత ప్రజలు, పీడిత జాతులు కొనసాగిస్తున్న న్యాయమైన విప్లవోద్యమాలను, విముక్తి పోరాటాలను అత్యంత క్రూరంగా అణిచివేయడం కోసం సామ్రాజ్యవాదులు రూపొందించిన విప్లవ ప్రతీఘాతుక సిద్ధాంతమే ఎల్ఐసీ వ్యూహం. తిరుగుబాట్లను అణిచివేయడానికి కేవలం మిలటరీ పద్ధతులనే అనుసరించడం లేదు. బహుముఖదాడి పద్ధతులను ఉపయోగిస్తున్నారు. రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక, మానసిక, పౌర చర్యలు చేపడుతున్నారు.

సైనికచర్యలకు, సైకలాజికల్‌వార్ (మానసికయుద్ధం)ను జోడించి ఎల్ఐసీ వ్యూహాన్ని రూపొందించారు. విప్లవాల పుట్టుకకు కారణాలు సైనికపరమైనవి కావు. వాటిని సైనికంగా మాత్రమే పరిష్కరించడం సాధ్యం కాదు. ఏ యుద్ధంలోనైనా అంతిమంగా గెలుపును నిర్ణయించేది ఆ యుద్ధంలో వ్యూహాత్మక బలమే. అందుకే సామ్రాజ్యవాదులు ఎల్ఐసీ వ్యూహంలో సైనిక బలగాలపై ప్రధానంగా ఆధారపడుతూనే మారిన దీర్ఘకాల యుద్ధ పరిస్థితులకు తగిన విధంగా దాన్ని మలచడానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారు.

**ఎల్ఐసీ వ్యూహంలోని నాలుగు ప్రధానాంశాలు :**

1. సైనిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, మానసిక యుద్ధాన్ని సమన్వయంతో కొనసాగించడం.
2. ప్రజల హృదయాలను, మనస్సులను గెలుచుకోవడం.
3. ఇంటెలిజెన్స్‌ని వ్యూహాత్మక ఆయుధంగా వాడుకోవడం.
4. ప్రత్యేక బలగాలను తయారు చేసుకుని యుద్ధంలో విజయం సాధించడం.

ఎల్ఐసీ వ్యూహంలోని ప్రతి అంశాన్ని నిర్దిష్ట పరిస్థితులకు సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకులు ఎలా అన్వయించి అమలు చేస్తున్నారో సకాలంలో పరిష్కరించాలి. వాటి ప్రభావాన్ని లోతుగా విశ్లేషించాలి. సరిగ్గా దానికి ప్రతిగా ప్రతిఘటనా వ్యూహాన్ని రూపొందించి అమలు చేయాలి. జాగరూకత లేకుంటే విప్లవోద్యమం నష్టాలకు, తాత్కాలిక ఓటములకు గురవుతుంది.

సామ్రాజ్యవాదులు, వారి దళారీ దోపిడీ పాలకులు పైకి ఎంతో బలంగా కనబడినా వ్యూహాత్మకంగా కాగితపు పులులే. ఎందుకంటే వారు నూటికి 95% మంది ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకులు. ఎత్తుగడలరీత్యా వారిని నిజమైన పులులుగా పరిగణిస్తూనే

ఎత్తుగడలపరంగా కూడా వారికున్న ఎన్నో బలహీనతలను కూడా అధ్యయనం చేస్తూ పోరాడాలి. వారి యుద్ధలక్ష్యం తమ పాత దోపిడీ వ్యవస్థను నిలిపి కాపాడుకోవడం కోసం ప్రజల న్యాయమైన పోరాటాలను అణిచివేయడం. దేశంలో మెజారిటీ ప్రజలను దోచుకునే దోపిడీ వర్గాలు పిడికెడు మందే. దోపిడీ వర్గాల బలహీనతలే పీడిత ప్రజల బలమైన అంశాలు. దేశంలోని నూటికి 95% మంది పీడిత ప్రజలను ఆర్థిక, రాజకీయ దోపిడీ పీడనల నుండి విముక్తి చేయడానికి జరుగుతున్న న్యాయపోరాటం మన బలం. అది తప్పనిసరిగా అంతిమంగా విజయం సాధిస్తుందని ప్రపంచ మానవ చరిత్ర రుజువు పరిచిన పరమ సత్యం. పై విషయాలను దృష్టిలో పెట్టుకుంటూనే ఎప్పటికప్పుడు శత్రువు అనుసరిస్తున్న ఎత్తుగడలను తిప్పికొట్టే ప్రతిఎత్తుగడలను రూపొందించుకోవాలి.

ఎల్ఐసీలో భాగంగా శత్రువు మన సెంట్రల్ బ్యూరో పరిధిలో సైనిక దాడిని, రాజకీయ దాడిని సమ్మిళితం చేసి మానసిక యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేశాడు. ఇది ప్రజలను భావజాలపరంగా గెలువడం అనే ఎత్తుగడలో భాగంగా సాగుతున్నది. ఈ మానసికయుద్ధం ద్వారా పార్టీపై ప్రజలకు విశ్వాసం లేకుండా, కార్యకర్తలకు నాయకత్వం పైన విశ్వాసం లేకుండా, ప్రజలకు, సాధారణ కార్యకర్తలకు విప్లవోద్యమ విజయం పట్ల విశ్వాసం లేకుండా చేయడం వారి లక్ష్యం.

అందులో భాగంగా మన పార్టీపై జరుగుతున్న సైద్ధాంతిక దాడిలో-మార్క్సిజానికి కాలం చెల్లింది, ఒకనాటి సోషలిస్టు దేశాలైన రష్యా, చైనాలు సైతం ఇప్పుడు పెట్టుబడిదారీ మార్గంలోకి వచ్చాయి, నేపాల్‌లో మావోయిస్టులు మావోయిస్టు ప్రజాయుద్ధ మార్గాన్ని వదిలి ఎన్నికల ప్రజాస్వామ్య మార్గం ఎంచుకున్నారు, భారతదేశ నేటి నిర్దిష్ట పరిస్థితులకు మావోయిస్టు దీర్ఘకాల ప్రజాయుద్ధం వర్తించదు, విప్లవం గెలువదు, ప్రపంచమంతా పెట్టుబడిదారీ విధానమే శాశ్వతమైంది, అభివృద్ధికరమైందని ప్రచారం చేస్తున్నారు.

మార్క్సిజానికి పోటీగా పోస్టు మాడర్నిస్టు సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ వర్గపోరాటానికి వ్యతిరేకంగా దళితవాదం, స్త్రీవాదం తదితర అస్థిత్వవాద సిద్ధాంతాలను ముందుకు తెచ్చి ప్రజలను సెక్షన్లవారీగా చిన్నచిన్న గ్రూపులుగా చీలదీసి మౌలిక సమస్యల మీద కేంద్రీకరించకుండా భావజాలపరంగా గందరగోళపరుస్తున్నారు.

బూర్జువా శాంతివాదం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, బూర్జువా సంస్కరణవాదాన్ని ముందుకు తెస్తున్నారు. సైద్ధాంతిక దాడితో, భావజాలపరంగా గందరగోళపరుస్తున్న కారణంగా విప్లవోద్యమం నుండి కొన్ని సెక్షన్లను శత్రువు తాత్కాలికంగా దూరం చేయగలుగుతున్నాడు.

తమ ఆధీనంలోని పత్రికలు, రేడియోలు, టీవీ, ఇంటర్నెట్, సినిమాలాంటి ప్రచార

మాధ్యమాల ద్వారా, రాజకీయంగా బలహీనపడి విప్లవంపై విశ్వాసం సడలి లొంగిపోయిన వారి ద్వారా, కిరాయి మేధావుల ద్వారా పాలకులు విప్లవోద్యమంపైన పెద్దఎత్తున దుష్ప్రచార దాడిని ఎక్కుపెట్టారు. పై సైద్ధాంతిక దాడితోపాటు విప్లవకారులు టెర్రరిస్టులనీ, హింసావాదులనీ, అభివృద్ధి నిరోధకులుగా మారి వక్రమార్గంలో ప్రయాణం సాగిస్తూ విధ్వంసాలకు పాల్పడుతున్నారని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. మన ఎత్తుగడల్లో లోపాల మూలంగా మన ఆచరణలో జరుగుతున్న చిన్నచిన్న లోపాలను పెద్దఎత్తున ప్రచారం చేస్తూ ప్రజలను మనకు వ్యతిరేకంగా ర్యాలీలు చేయించడానికి ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. నాయకత్వం, పార్టీ విప్లవాన్ని నడపలేరనే అవిశ్వాసాన్ని క్యాడర్లలో, ప్రజల్లో కలిగించడానికి అన్ని రకాల అబద్ధ ప్రచారానికి లంకించుకున్నారు. పార్టీ ఆంతరంగిక సంబంధాలపై, ప్రజలకూ-పార్టీకీ మధ్య సంబంధాలపై కూడా దుష్ప్రచారం కొనసాగుతోంది. లొంగిపోయిన వారి ద్వారా మహిళలపై లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయని తప్పుడు ప్రకటనలు ఇప్పిస్తున్నారు. ప్రజలు, క్యాడర్ మధ్య ప్రాంతీయ విభేదాలను ముందుకు తెస్తూ తెలుగు, కోయ, కువ్వి, భగత, ఒడియా ప్రజల మధ్య సమస్యలు తలెత్తే సందర్భాలను ఉపయోగించుకుని ప్రచారం చేస్తున్నారు. ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని నిలబెడుతూ తప్పుడు ప్రచారం గావిస్తున్నారు. ప్రజా శత్రువులను, శత్రు ఏజెంట్లను పార్టీ శిక్షించినప్పుడు వారి సంబంధిత కులం, తెగ, సెక్షన్ల ఆధారంగా అందులో కొందరిని ఆర్గనైజ్ చేసి పార్టీకి వ్యతిరేకంగా ర్యాలీలు చేయిస్తూ, పత్రికా ప్రకటనలు ఇప్పిస్తున్నారు. పోలీసులు కొన్ని సంస్థల పేర్లను సృష్టించి ఆ పేర్లతో కరపత్రాలు, పోస్టర్లు వేస్తున్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను ప్రభుత్వ సాయుధ బలగాలు విముక్తి చేస్తున్నాయని, ప్రతిరోజు ఎవరినో ఒకరిని అరెస్టుగానో, సరెండర్‌గానో చూపడం, డంపులు, ఆయుధాలు స్వాధీనం చేసుకుని వరుసగా విజయాలు సాధిస్తున్నట్లుగా చెప్పుకోవడం ద్వారా ప్రజల్లో మావోయిస్టుల పట్ల విశ్వాసం సడలిపోయే విధంగా నిరాశా, నిస్పృహలను పెంచే విధంగా ప్రచారం చేస్తున్నారు. కొద్దిమంది మేధావుల బృందాలను ఆర్గనైజ్ చేసి వారికి ప్రజాస్వామిక, అభ్యుదయ భావాల ముసుగు తొడిగి మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలోకి పంపి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతూ ఆ కిరాయి మేధావుల ద్వారా పోలీసులకు, మావోయిస్టులకు మధ్య సామాన్య ప్రజలు బలవుతున్నారని, అంతిమంగా ప్రజల మద్దతు మావోయిస్టులకు కరువవుతుందని ప్రకటనలు ఇప్పిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న నామమాత్రపు సంస్కరణలను గోరంతలు కొండంతలు చేసి గొప్ప అభివృద్ధిగా ప్రచారాన్ని చేస్తున్నారు. సరెండరయిన వారిని విప్లవ ప్రతీఘాతకులుగా నిలబెట్టి వారిని ఉపయోగించుకుని విప్లవ వ్యతిరేక శిబిరాన్ని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉద్యమ ప్రాంతాలలోని పిల్లలు మన విప్లవ భావజాల ప్రభావానికి గురికాకుండా చేయడంలో భాగంగా మోడల్ స్కూల్స్, శిశు మందిరాలకు తరలించడం, విహార యాత్రలకు తిప్పడం, బట్టలు, పుస్తకాలు పంపిణీ చేయడం వగైరా రూపాలతో మనకు దూరం చేయడానికి ఒక పథకం ప్రకారం కార్యక్రమాలు చేపడుతున్నారు.

పార్టీ, పీఎల్‌జీఏ కార్యకర్తల కుటుంబ సభ్యులను కౌన్సిలింగు ద్వారా, భయపెట్టడం ద్వారా పార్టీ శ్రేణులను లొంగుబాటులోకి తెచ్చి, లొంగిపోయిన వారిని చూపి పెద్దఎత్తున ప్రచారం చేయడం, బహిరంగ లేఖలు రాయడం, ప్రకటనలు, పోస్టర్లు, కరపత్రాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర అనేక రూపాలలో లొంగిపోతే కేసులు మాఫీ చేస్తామనీ, ఉపాధి చూపి నూతన జీవితం కల్పిస్తామనీ విస్తృత ప్రచారం గావిస్తున్నారు. శతృవు తనకుతాను ఆధునిక ఆయుధాలు, సుశిక్షితులైన సైన్యంగల బలసంపన్నునిగా చూపుకుంటూ మావోయిస్టులు ఆయుధాలు, తూటాలు, సప్లై కొరతలు ఎదుర్కొంటున్నారనీ, యుద్ధం గెలువలేరనీ ఇలా ఎన్నో రూపాలలో మానసిక యుద్ధాన్ని కొనసాగిస్తున్నాడు. విప్లవ వ్యతిరేక శిబిరాన్ని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు.

నాయకులు ఆస్తులు కూడబెడుతూ కుటుంబాలకు పంపుతున్నారనీ ఒకవైపు ప్రచారం చేస్తూనే పూర్తికాలం కార్యకర్తల, నాయకుల కుటుంబ సభ్యులు, అమరుల కుటుంబ సభ్యులు హీనస్థితిలో జీవనం సాగిస్తున్నారని, వారిని పార్టీ పట్టించుకోవడం లేదని, ఈ కుటుంబాలను పోలీసులే దత్తత తీసుకుని ఆదుకుంటున్నట్లుగా వైరుధ్యపూరిత ప్రచారం చేస్తున్నారు. ఈ మానసికయుద్ధ దాడి వివిధ రూపాలలో మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది.

ఈ మానసికయుద్ధాన్ని, దాని లక్ష్యాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి? సామ్రాజ్యవాదం నేడు గతంలో మునుపెన్నటికంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభంలో కూరుకుపోయింది. దాని నుండి బయటపడడానికి వారి వద్ద ఎలాంటి పరిష్కార మార్గాలు లేవు. అది మరింత కుళ్ళి కృశించి చావు మూడిన అంతిమ దశలో ఉంది. ప్రపంచ మౌలిక వైరుధ్యాలు పదునెక్కుతున్నాయి. ఈ తరుణంలో ప్రజలు ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారిస్తూ, మార్గాలను అన్వేషిస్తున్నారు. మావోయిస్టుల నాయకత్వంలో జరుగుతున్న ప్రజాయుద్ధానికి రాజకీయ సాధికారత పెరుగుతున్నది. ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ అధికారంగా బీజరూపంలో అయినా ఏర్పడి పనిచేస్తున్న క్రాంతికారీ జనతన సర్కారులు ప్రజల భాగస్వామ్యంతో స్వావలంబనతో కూడిన ప్రత్యామ్నాయ ఆర్థిక అభివృద్ధి, ప్రజాస్వామిక సంస్కృతి అభివృద్ధి ఒక నమూనాగా ముందుకు రావడంతో విప్లవంలో ప్రజల భాగస్వామ్యం, విశాల ప్రజల మద్దతు పెరుగుతున్నది. ఇది సామ్రాజ్యవాదులను, వారి దళారీ భారత పాలకవర్గాలను

కలవరపరుస్తున్నది. తమ అధికారం, దోపిడీ పాత వ్యవస్థను కాపాడి పరిరక్షించుకోవడానికి ప్రజలపై ఎంతటి దుర్మార్గానికైనా, నీచానికైనా, రక్తపాతానికైనా, మానవ హననానికైనా పాల్పడుతుంది. అయితే సామ్రాజ్యవాదులు ప్రపంచంలో ప్రజల విప్లవ, జాతి విముక్తి పోరాటాల్లో, వర్గపోరాటాల్లో పొందిన ఓటమి నుండి గుణపాఠాలు తీసుకుని రూపొందించుకున్న ఎల్ఐసీ వ్యూహం బహుముఖమైందని మనం గమనంలో ఉంచుకుంటూ దానితో సరిగా వ్యవహరించాలి.

శత్రువు కొనసాగిస్తున్న మానసికయుద్ధం విప్లవోద్యమంపై చూపుతున్న ప్రభావాన్ని అంచనావేస్తూ సరైన విధంగా ఎదుర్కోవాలి. విప్లవోద్యమానికి ఎదురవుతున్న సమస్యలలో –

1. సిద్ధాంతపరమైన దాడి, పోస్టు మాడర్నిజం ప్రభావాలతో విప్లవ శిబిరంలోని కొద్దిమంది సెక్షన్ ఉద్యమాలు, ఎన్‌జీఓల వైపు మరలుతున్నారు.

2. మధ్యతరగతిలోని ఊగిసలాటను వినియోగించుకుని విప్లవోద్యమం పట్ల అవిశ్వాసాన్ని పెంచుతున్నారు.

3. నేడు విప్లవోద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించగలుగుతామనే విశ్వాసం సడలిన కార్యకర్తల లొంగుబాటులు పెరిగాయి. ఈ లొంగుబాట్ల ద్వారా మన పార్టీ, పీఎల్‌జీఏ పోరాట సామర్థ్యాన్ని దెబ్బదీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**శత్రువు కొనసాగిస్తున్న సైద్ధాంతికదాడి, మానసికయుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఈ కింది విధంగా మన కార్యక్రమం అమలు చేయాలి.**

1. శత్రువు రాజకీయాధికారాన్ని కూలదోయాలంటే భావజాలరంగంలో పనిచేసి ప్రజాభిప్రాయాన్ని విప్లవానుకూలంగా మార్చేందుకు నిరంతరం సైద్ధాంతిక పోరాటం చేయాలి.

2. పోస్టు మాడర్నిస్టు సిద్ధాంతంపై నిశితంగా పోరాడుతూ సెక్షనల్ ఉద్యమాలను, అస్థిత్వవాద సిద్ధాంతాలను ఎండగట్టాలి. ప్రజల మధ్య వర్గ ఐక్యతను పెంపొందించాలి.

3. మన శ్రేణులకు మన సిద్ధాంతం, పార్టీ కార్యక్రమం పట్ల స్పష్టతను, వర్గపోరాట సారాన్ని అందించే వర్గచైతన్యం పెంచాలి. దీర్ఘకాల ప్రజాయుద్ధం తప్పక విజయం సాధిస్తుందనీ, కష్టాలు–నష్టాలు, గెలుపు–ఓటముల గుండా సాగుతూనే అంతిమ విజయం వరకు పోరాడాలనే మానసిక స్థైర్యాన్ని అందించాలి.

4. మన విప్లవోద్యమం ద్వారా ప్రజల జీవితాలలో వచ్చిన మార్పులను వివరంగా అర్థం చేయించి మనవైపు నిలబెట్టుకోవాలి.

5. శత్రువు మానసికయుద్ధంలో భాగంగా చేస్తున్న దుష్ప్రచారంలోని ఒక్కొక్క అంశాన్ని

తీసుకుని ప్రజలతో మరియు పార్టీ, పీఎల్‌జీఏ యూనిట్లలో చర్చించి వాటిలోని మోసాలను బహిర్గతం చేయడం ద్వారా చైతన్యవంతులను చేయాలి.

6. పార్టీ, పీఎల్‌జీఏ కుటుంబ సభ్యులు శతృవు కౌన్సిలింగుల పేర్లతో చేస్తున్న మోసాలకు బలికాకుండా ఉండడం కోసం వారిని పార్టీ రెగ్యులర్‌గా కలవడం, ఉత్తరాలు రాయడం ద్వారా శతృవు కుట్రలను ఎండగట్టాలి.

7. పూర్తికాలం కార్యకర్తల, అమరుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ ప్రజల సహకారంతో పరిష్కరించడంపై శ్రద్ధ వహించాలి.

8. శతృవు దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవాలను వెల్లడించే విధంగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ సభలు, సమావేశాలు, ఇంటర్వ్యూల ద్వారా ప్రచారం చేసే విధంగా కార్యక్రమం చేపట్టాలి. ఇతర సృజనాత్మక రూపాలను ఎన్నుకోవాలి.

9. మన ఆచరణలో అక్కడక్కడ జరుగుతున్న పొరపాట్ల వల్ల ప్రజలకు నష్టం జరిగినప్పుడు శతృవు వాటిని మనకు వ్యతిరేకంగా ఉపయోగించుకుని ప్రజలలో ఒక సెక్షన్‌ను మనకు దూరం చేయాలని చూస్తున్నాడు. సరైన వర్గపంథా-ప్రజాపంథాను అనుసరిస్తూ ప్రజలకు హాని జరుగకుండా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా మన శ్రేణులకు విద్య గరపాలి. పొరపాటు జరిగినప్పుడు వెంటనే మనం, వాటికి దారితీసిన కారణాలను తెలియజేస్తూ నిజాయితీగా, పారదర్శకంగా మన తప్పులను అంగీకరించాలి.

10. శతృ దుష్ప్రచార దాడిని తిప్పికొట్టే విధంగా మనం అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. పోస్టర్లు, కరపత్రాలు, పత్రికా ప్రకటనలు, సాంస్కృతిక రంగ నాటకాలు, పాటల ద్వారా మౌలికంగా మన ప్రచారం రాజకీయంగా అఫెన్సివ్‌గా ఉండాలి.

శతృవు తాను రాసుకున్న రాజ్యాంగాన్ని సైతం ఖాతరు చేయకుండా చట్టవ్యతిరేకంగా చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలు, ప్రజలను సామూహికంగా హత్యలు చేయడం, మహిళలపై అత్యాచారాలు చేయడం, నిర్బంధం, చిత్రహింసలు, గృహదహనాలు, ప్రజల ఆస్తులకు కలిగిస్తున్న నష్టాలు, ప్రజలు జీవించే హక్కును కాలరాస్తూ తెల్లబీభత్సాన్ని సృష్టిస్తూ, నెంబర్‌వన్ టెర్రరిస్టుగా వ్యవహరిస్తున్న విధానాన్ని విశాల ప్రజల వరకు తీసుకెళ్ళి ఎండగట్టాలి. ఉద్యమ ప్రాంతాలకు బయట ఉండి విప్లవోద్యమానికి అనుకూలంగా కలిసివచ్చే, స్పందించే ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులను కూడగట్టాలి. విశాల ప్రజారాశుల మధ్య నిరంతరం చీలికలు, అనైక్యతను పెంచే కుట్రలకు శతృవు పాల్పడుతుంటాడు. వీటిని ఎదుర్కొనే విధంగా, శతృవును ఒంటరి చేసే విధంగా మన రాజకీయ, నిర్మాణకృషి ఉండాలి.

*ప్రియమైన కామ్రేడ్స్,*

ఒక రాజకీయ అధికారాన్ని కూలదోయడం కోసం ముందుగా ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం అవసరం. ఇందుకు మనం సైద్ధాంతిక, రాజకీయ రంగంలో కృషి చేయాలి. అధికారం కలిగి ఉన్న మన శత్రువు (సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం) చేతిలో నుండి అధికారాన్ని ప్రజలు హస్తగతం చేసుకునే వర్గయుద్ధం సాదాసీదాగా, నల్లేరుపై బండి నడకలా ఆషామాషీగా సాగదు. శత్రువు తన అధికారాన్ని కాపాడుకోవడానికి అన్ని హంగులను ఉపయోగించుకొని అత్యంత క్రూరమైన, పాశవికమైన, జుగుప్సాకరమైన, అమానవీయ పద్ధతులకు పాల్పడుతూనే మరోవైపు విప్లవంపై విశ్వాసాన్ని సడలింపజేసే మానసికయుద్ధాన్ని కొనసాగిస్తూ తన అధికారాన్ని పొడిగించుకునే ప్రయత్నం చేస్తాడు. అయితే వాళ్ళు ఎన్నటికీ ప్రజలను గెలుచుకోలేరు. అభివృద్ధి నిరోధకులుగా, విప్లవ ప్రతీఘాతకులుగా, ప్రజాద్రోహులుగా దినదినం మరింతగా బహిర్గతం అవుతూ ఉంటారు. ప్రజల ఆగ్రహానికి, వ్యతిరేకతకు గురవుతుంటారు. పతనం వైపు ప్రయాణం చేస్తూ ఉంటారు. అంతిమంగా ప్రజలే వారి గోరీ కడతారు.

ప్రజలు మొదట ఏమీలేని స్థితినుండే (ఆయుధాలు, సైన్యం) ప్రారంభమై సైన్యాన్ని నిర్మించుకుంటారు. ఆధునిక ఆయుధాలు సంపాదించుకుంటారు. అధికారంలేని స్థితి నుండి ప్రజారాజ్యాధికారాన్ని నిర్మించుకుంటారు. ఇది మన ఉద్యమ చరిత్రను పరిశీలించినా అర్థం చేసుకోవచ్చు. కమ్యూనిజం స్థాపన కోసం జీవితాంతం పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేసిన కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరూ విజయం కోసం ఎలాంటి ఊగిసలాట లేకుండా దృఢమైన నిశ్చయంతో, ఎటువంటి త్యాగానికైనా వెనుదీయకుండా ప్రతి కష్టాన్ని, నష్టాన్ని అధిగమించాలి.

కమ్యూనిజం స్థాపన అనే ఉన్నత ఆశయాన్ని వ్యక్తి మెదడులో లోతుగా వేళ్ళూనుకునేటట్లు చేయాలి. అలా అయితేనే తమను తాము గొప్ప విప్లవ వెల్లువలోను, గడ్డు పరిస్థితులలోను అగ్రశ్రేణిలో ఉంచుకోగలుగుతారు. తమ జీవితాన్ని మరణించే వరకు పార్టీకి, ప్రజలకు అంకితం చేస్తారు. మన జీవితమంతా పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేయాలి. శత్రువు తూటాలు శరీరాన్ని ఛిద్రం చేసినా మన విప్లవస్ఫూర్తికి మరణం ఉండదు. మన మనస్సులను ఎల్లప్పుడు ఎర్రగా ఉంచుకోవాలి.

శత్రువు చేసే మోసపూరిత మానసికయుద్ధ కుట్రలను తిప్పికొట్టాలి. "ప్రజలే చరిత్ర నిర్మాతలు" అనే సత్యాన్ని దృఢంగా ఎలుగెత్తి చాటాలి.

విప్లవాభినందనలతో

*తేది : ఆగస్టు 25, 2014.* ***సెంట్రల్ రీజియన్ కమాండ్***